


# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



## ప్రారంభం

**దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రి గారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.**

# 1. ఇలా మీరడిగితే...

**ఏవిటిదీ? ఎందుకూ?** నువు సినీమాల్లో పాటలు రాసావు. రాస్తున్నావు...బానే రాసావు. బానే రాస్తున్నావు. అందుకే గదా నీ పాటల్ని విన్నాం, ఔనన్నాం, ఆదరించాం, కాస్తో కూస్తో కూడా కట్టబెట్టాం.

మేమెప్పుడో వినేసిన పాటల్ని మళ్ళీ పిలకట్టుకు లాక్కోచ్చి ఇలా అచ్చేసి మా ముందు పెట్టడం ఎందుకూ?

పెన్నుచ్చుకు రాసే ప్రతివాడూ తన రాతల్ని 'అచ్చు'గా చూసుకోవాలని ముచ్చటపడతాడు. తప్పేం లేదు. కానీ, తన రాతలకి, మళ్ళీ , ముందో మాటా, వెనకో మాటా తగిలించడం దేనికట?

రాసేసిందేదో రాసేసి, మా మొహన పారేస్తే, మాకింత తీరికా, ఓపికా, దొరికినప్పుడు అటూ యిటూ తిరగేసి మాకు తోచిన అభిప్రాయం మేఁవేర్పాటు చేసుకుంటాం కదా?

అలా మేఁవు ఏదో ఒకటి అనుకునేలోపునే, ఏఁవనుకోవాలో, ఎలా అనుకోవాలో ముందే సూచించేటట్టు ఈ పీఠికలూ, ఆముఖాలూ పెట్టి మమ్మల్ని ఇంటలెక్చువల్ బ్లాక్ మెయిల్ చెయ్యడం దేనికట?

'అబ్బెబ్బే అదేం కాదూ, నా పాటల పాటవం మీకు పూర్తిగా అర్ధం అయిందో లేదో, నా 'కవిహృదయం' వివరించడమే నా ఉద్దేశమూ' అని వినయాలు పోయావనుకో!

'రాసిందాంట్లో ఏముందో పోల్చుకోలేనివాళ్ళం అని నువు మా స్థాయిని కించబరిచినట్లవుతుంది. పోనీ అలాక్కాకపోతే, నువు టీకా టిప్పణీ చెబితే తప్ప అర్ధం కానట్టు ఎందుకు రాయాలి' అని అడగబుద్దేస్తుంది.

భాషా భోధపడక, భావమూ కోరుకుడు పడక, నిఘంటువుల్ని, విమర్శకుల్ని, వ్యాఖ్యాతల్ని పట్టుకుని దేవులాడవలసినంత అగత్యం మాక్కలిగించడానికి నువ్వేమన్నా వేదాలు విరచిస్తున్నావా, ఉపనిషత్తులు ఉల్లేఖీస్తున్నావా, బ్రహ్మసూత్రాలు సృష్టిస్తున్నావా?

ఆఫ్టరాల్ సినిమాపాటలు! ఓ మూణ్ణిమిషాలపాటు ఇలా విని, అలా చూసి, ఓహో! అనో, ఓర్నాయనో! అనో ఒక్కముక్కలో మా యిష్టాయిష్టాలు తేల్చేసుకుని ఒదిలించేసుకోవలసిన ఈ లలితగీతాల్లో ఏమంత నిగుఢ రహస్యాలు నిక్షిప్తమై ఉన్నాయట?

'అయో, మరీ అంత సీనేం లేదూ, ఊరికే ఈ పాటలు ఏయే సినిమాలకి రాసానో, ఎవరు మ్యూజిక్కు చేసారో, ఎవరు పాడేరో, ఎవరు ఆడేరో, ఎవరు, ఎక్కడ, ఎలా చిత్రీకరించారో, ఈ పాటలు రాసిన నేపథ్యంలో ఉన్న కష్టనష్టాలేమిటీ, వగైరా డేటా అంతా మీకు చెబితే, కాస్తా థ్రిల్లింగా ఉంటుందేమో" అనే ఊహతో గానీ ఇలా అచ్చున పడ్డావా?

డబ్బులిచ్చుకుని సినిమా చూసి, డబ్బులిచ్చుకుని కాసెట్టుకొని, విన్నది చాలక, మళ్ళీ డబ్బులిచ్చుకుని అవే పాటల్ని ఇలా పుస్తకంగా కూడా కొని చదవాలని మాకేమంత ఉబలాటం ఉంటుంది నువ్వే చెప్పూ- మరీ అంత మొహమాటం పెట్టడం తప్పు?

# 2.ఇలా బదులిచ్చుకుంటాను

బిడ్డకి పెళ్ళి చేసి, అత్తారింటికి సాగనంపేటప్పుడు, అమ్మా నాన్నా చేతనయిన మేరకి చీరాసారే పెట్టుకుంటారు.అక్కడితో ఆగక,కళ్ళంట నీళ్ళు కూడా పెట్టుకుంటారు, పిల్లకి పెళ్ళి చేయడం అనేది, చేయక తప్పని తప్పుపని కాదు కాబట్టి. అది మంచిపనే. సంతోషించదగ్గ పనే.కానీ ఇన్నాళ్లూ పెంచుకున్న పేగు బంధం, ఇంటి పేరు మార్చుకుని మరో ఇంటికి వెళ్ళిపోతూ కలిగించిన అనుభూతిలోని తియ్యని చేదు అది. ఈ అంపకాల సన్నివేశంలో ఓ కంట పన్నీరు ఓ కంట కన్నీరూను.

పాట రాయడం నా వృత్తి మత్రమే కాదు, ప్రవృత్తి కూడా.

"గాలి పల్లకీలోన తరలి నా పాట పాప ఊరేగి వెడలె!

గొంతు వాకిలిని మూసి మరలి తను మూగబోయి నా గుండె మిగిలె!

నా హృదయమే నా పాటకి తల్లి

నా హృదయమే నాకు ఆలి

నా హృదయములో ఇది సినీవాలి!

అని ఎప్పుడో పాతికేళ్ళ క్రితం రాసుకున్నాను.

పాటరాసి, అడిగిన అయ్యచేతిలో పెట్టేసి పనైపోయిందనుకోమంటే, నా మనసూరుకోదు. ఆ పాటకి ఎంత మేరకి ఎలాంటి ఆదరణ లభించింది, ఆశించిన మేరకి, ఆదరణ లభించక ఏ మూల మూగపోయిందో అన్న ఆరటం నన్ను కుదురుగా ఉండనివ్వక, 'మూవీమేనా' లో సాగనంపేసిన తర్వాత కూడా, అప్పుడప్పుడు నా పాటని మోసుకువెళ్ళిన గాలిని కుశలం కనుక్కుంటూ వుంటాను.

ఆ గాలి, కొన్ని సార్లు, 'నీ ఫలానా పాట బానే ఉందటయ్యా! వాళ్ళూ వీళ్ళూ అంటుంటే, అనుకుంటుంటే చెవిని వేసుకొచ్చాను' అని, శుభవార్తల సుమగంధాలు చల్లుతూ ఉంటుంది.

ఆ గాలి మరికొన్నిసార్లు, అబ్బే! నీ ఫలానా పాట తాలూకు చడీ చప్పుడూ వినబడ్డం లేదయ్యా! ఏఁవైపోయిందో పాపం!"అంటూ మౌనపు ముళ్ళతో గిల్లుతూ ఉంటుంది.

ఆ మరికొన్నిసార్లు మనసు చిన్నబోతుంది.

అలా చిన్నబోయిన మనస్సు, తనలో తనే ఆరాటంగా అనుకునే 'అయ్యో!లూ, 'అరెరే'లూ మీతో పంచుకోవడం అనేది ఈ పుస్తకంలో పొందుపరిచిన పాటల మొదటి ఉద్దేశ్యం.

పాట అనేది, ముఖ్యంగా 'సినిమాపాట' అనేది, కాగితపు పొత్తిళ్ళలో, కలం ప్రసవించిన నాడున్న రూపంతోనే 'అక్షరాలా' అలాగే ' అత్తింటికీ వెళ్ళదు.

పుట్టింతర్వాత, దర్శక నిర్మాతల పౌరోహిత్యంతో, బారసాల జరుపుకుని 'ఒకే!' అని నామకరణం పొందుతుంది.

అటుపైన మ్యూజిక్ డైరెక్టర్ కట్టబెట్టే 'బాణీ' వేసుకుని ఈడేరుతుంది.

ఆ తర్వాత రికార్డింగ్ థియేటర్లో 'గౌరీపూజ' చేసుకుని ఆర్కెస్ట్రా మేళ తాలాల్ని, 'కోరస్' చెలికత్తెల్ని వెంటబెట్టుకుని, గాయనీ గాయకుల స్వరాలు సింగారిచుకుని, కెమెరా సాక్షిగా, వెండితెర మంటపాన వధువుగా ఒదుగుతుంది.

ఈ ప్రయాణం అనేక ప్రయాసలు, మజిలీలు. ఆ కాశీ మజిలీ కథలన్ని టినీ ఏకరవు పెట్టడంకూడా నా ఉద్దేశం కాదు.

సర్వాంగసుందరమై, గాన యోగ్యమైన గేయ రూపంలో ఉన్న పాటల్లోని, ''రచన'' మాత్రమే విడిగా తీసి, పుస్తకంగా వేసి, శ్రోతని, ''పఠిత'గా' మారి, 'నా పాటని, వినకుండా, చూడకుండా, పాడాకుండా, కేవలం చదవండీ!'' అని అడగడం ఎందుకూ? అంటే కాస్త వివరంగా మనవి చేసుకుంటాను. మీరు...

# 3. సరే కానీ అంటే.....

సినిమా పాటకి ప్రజల్లో ఎంత పలుకుబడి ఉందో, అంతకంతా ఒక విధమైన 'తేలిక" భావం కూడా ఉంది.

కవిత్వం వేరు. సినీ కవిత్వం వేరు. సినిమా పాటల్లో సాహిత్య విలువలు వెతకడం అంటే 'నేతి బీరకాయలో నెయ్యిని వెతకడంలాంటిది' అని సారస్వతలోకంలో ఒక చిన్నచూపు.

'పాతకాలం పాటల్లో ఉన్న మాధుర్యం, భావము, మృదుత్వం ఈ కాలం పాటల్లో లేవు. ఒకటే మోత. ఒకటే హోరు. ఒక్క ముక్క వినిపించదు. ఒకవేళ వినిపించినా, వినాల్సినంత విలువైన ముక్కలు లేవు. ఏవో అవకతవక పలుకులూ, అసభ్య కూతలూ తప్ప' అని చాలా మందిలో నిరసన భావం.

'బీట్. రిధిమ్, కిక్కు ఉండాలి గాని, బుర్ర తినేసే పొయెట్రీ ఎవడిగ్గావాలి' అని యువతరంలో పాటలోని 'మాట' పట్ల ఒక అవహేళన.

ఇవన్ని గమనిస్తూ ఉంటే ఒక పాటల రచయితగా మాత్రమే కాక, ఒక తెలుగువాడిగా, స్పందించే మనసున్నవాడిగా నాకు ఒక రకమైన కలవరం కలుగుతూ ఉంటుంది.

సినిమా పాట పట్ల సమాజంలో ఉన్న, ఈ నిరసనలో ఎంతో కొంత నిజం లేకపోలేదు. కానీ కొంత అసహనం, ఉపేక్ష కూడా ఉన్నాయి.

పిల్లలూ, పెద్దలూ, పామరులూ పండితులూ అంటూ ఏ భేధాలు లేకుండా, ఆబాలగోపాలాన్ని అల్లుకుంటూ అలరించే సకల కళల సమన్వయవేదిక అయిన చలన చిత్ర మాధ్యమం ఎంత శక్తిమంతమైందో, సమాజంమీద, దాని ప్రభావం, ఎలాంటిదో, ఎంతటిదో గుర్తిస్తే సినిమా పట్ల మన దృక్పధంలోనూ, ఆలోచనల్లోనూ కొంత సీరియస్ నెస్ చోటు చేసుకుంటే.

ఈ రకమైన అసహనం ఉపేక్ష కాస్త తగ్గుతాయి.

సినిమాలోని, కథ కధనం, ఆహార్యం, వస్త్రధారణ, సంగీతం, నాట్యం, ఇత్యాది అంశాలన్ని ఈ పుస్తకం వరకు అంశాలన్నీ ఈ పుస్తకం వరకు అప్రస్తుతం గనుక, నా కలవరాన్ని నా కలం వరకే పరిమితం చెయ్యదలుచుకున్నాను.

పాట అనేది ఏఁవిటి, దాని పుట్టు పుర్వోత్తరాలేఁవిటి, అన్నంత పెద్ద కాన్వాసుకి ఇక్కడ అవకాశం లేదు.

ప్రపంచ సినిమా, భారతదేశపు ఇతరభాషల సినిమా అంటూ అంత దూరం నేను వెళ్ళనూ లేను., మిమ్మల్ని తీసుకువెళ్ళనూలేను. నా ప్రజ్ఞకాని, అనుభవం కాని, బహుస్వల్పం. కనుక, నా గోడేదో తెలుగు సినిమా పాట వరకే.

ఇంక, సాహిత్యము, కవిత్వము అంటే ఏఁవిటి అనే ప్రశ్నకి సర్వజనామోదమైన ఏకాభిప్రాయన్ని సాధించడం అంటే, కుందేటికొమ్ము వెతకడం లాంటిదే గనక అది కూడా వదిలేద్దాం.

కవిత్వం అనేది ఒక బ్రహ్మ పదార్థంలాంటిది. ఎవరి ప్రమాణా లను బట్టి వారు, ఎవరి అభిరుచినివారు, వారికి తోచిన రీతిలో నిర్వచించుకుంటారు కనుక, సినిమా పాటల్లో కవిత్వం ఉంటుందా, ఉంటే ఎంత ఎలాంటిది లాంటి కసరత్తు వల్ల కాళ్ళపీకు తప్ప మరే ప్రయోజనం లేదు.

సినిమా పాట అనేది ఓ ప్రత్యేకమైన కోవకి చెందినది.ఇది వినబడ్డం మాత్రమే కాకుండా, కనబడ్డం అనే పని కూడా,ఒకానొక చిత్ర కధనం నాటకం ఆడుతుండగా, సందర్భంగానో, మధ్యలో వెళ్ళి , అలా కాస్సేపు ఆడి పాడి వెళిపోతూ ఉండడం అన్నమాట.

సినిమా పాటని రసజ్ఞుడు, చెవులారా వింటూ, కళ్ళారా చూస్తూ కధారా భరిస్తూ త్రిపాత్రాభినయం  చెయ్యాలి.

ఈ త్రివేణీ సంగమంలో, గీత "రచన" స్వర గంగ, చిత్ర యమునల అడుగున అంతర్వాహిని అయిన 'సరస్వతి' ప్రవాహంలా ఉంటుంది.

భాషపట్ల, సంస్కృతి పట్ల, విలువల పట్ల, కళావికాసం పట్ల అక్కర వున్న ప్రతిఒక్కరూ...

ఎప్పటికప్పుడు ఎంతో కొంత ప్రయాసపడి, ఆ అంతర్వాహినిలోని సరస్వతిని సమీక్షిస్తూ ఉండాలి. లేకపోతే, క్రమంగా, ఆ 'అంతర్వాహిని' సారస్వత లక్షణాలు అంతరించిపోయి, స్వరగంగ, చిత్రయమునల ద్వివేణీ సంగమ చలన 'చిత్ర'కేళికి నేపధ్య సంగీతం వినిపించే గులకరాళ్ళ  గలగల సవ్వడి మాత్రం మిగులుతుంది.

ఈ గోలకీ నీ పుస్తకనికి ఎలా లింకు పెట్టదలచుకున్నావు శాస్త్రులూ?!' అని....

# 4. మీరు కనుబొమలెగరేస్తే...

సినిమా పాటలద్వారా ఆనుపమానమైన కవనశక్తిని కదం తొక్కించి, తమిళప్రజల హృదయాల్లో పట్టభిషిక్తుడై, తమిళరాష్ట్ర ఆస్థాన కవిగా మన్నన పొందిన కణ్ణదాసన్  గారికి  కైమోడ్పుగావొస్తూ,

"సినిమా పాటల కవిగానే నోబేల్ ప్రైజే పొందడం నా ఆశయం" అని స్పష్టంగా ప్రకటించిన వైరముత్తుగారి సంకల్పస్థైర్యానికి జేజేలు పలుకుతూ,

సినిమా పాటల ద్వారానే, మనిషి మనిషినీ మనసు మనసునీ తడిమి, తడిపి, నిలువెల్లా కరిగించి, అల్పక్షరాల్లోని అనల్పార్థ నిస్సృ తిని, అతి సామాన్యుడి క్కూడా పరిచయం చేసి, మన'సుకవి'గా, తెలుగువారి నీరాజనాలందుకున్న ఆత్రేయగారి స్మృతికి అంజలి ఘటిస్తూ

సారస్వతసీమలో సంపాదించుకున్న ఆధిపత్యానికి, అగ్రపీఠానికి ఏ మాత్రం తగ్గని స్థాయిని, సినీ కవిగా కూడా సాధించుకున్న పింగళి, సముద్రాల, మల్లాది రామకృష్ణశాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, దాశరధి, ఆరుద్ర, కొసరాజు, డా.సినారె, ఆదిగా గల సినీ కవి కుల ఆచార్య వరులకు అభివాదం చేస్తూ,

సినిమా పాటని సంపూర్ణమైన వాణీ విలాసంతో, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన కవితా శిల్పంగా మలచే ప్రక్రియలో, తెలుగు సినిమాపాటని 'శారదనీరద రాగచంద్రికా విలసితమైన విహాయస వీధుల్లో, భారతీ సామ్రాజ్యపు బావుటాగా ఎగరేసిన వేటూరి సుందరరామ్మూర్తిగార్కి  వినమ్రంగా ప్రణమిల్లుతూ..

'సినిమా కవి కేవలం, మాటల్ని పోగు చేసి మూటలు గట్టడం మాత్రమే చెయ్యడని, అవసరమైన చోట అవకాశం వున్నచోట, వెన్నెల కిరణాల సత్యాన్ని సహృదయులు గమనించాలనీ, గుర్తించాలనీ, విన్నవించుకోవడానికి, ఈ విధంగా మీ సమక్షానికొచ్చాను' అని సవినయంగా మనవి చేస్తాను.

"శ్రీశైలం మల్లన్న శిరసొంచేనా, చేనంతా గంగమ్మ వాన" -శ్రీ దేవులపల్లి

"కనుపాప కరువైన కనులెందుకు-తనవారె పరులైన బ్రతుకెందుకు"- శ్రీ మల్లాది

"కలలోనే ఒక మెలకువగా - ఆమెలకువలోనే ఒక కలగా" -శ్రీ పింగళి

" బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్"  -శ్రీ సముద్రాల

" అగాధమౌ జలనిధిలోన ఆణిముత్యమున్నటులే శోకాల మడుగున దాగి సుఖమున్నదిలే " - శ్రీ శ్రీ

" రాయినైన కాకపోతిని రామపాదము సోకగా"- శ్రీ ఆరుద్ర

"పోయినోళ్ళు అందరూ మంచోళ్ళు ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపిగురుతులు" - శ్రీ ఆత్రేయ

"పిట్ట మనసు పిసరంతైనా ప్రపంచమంతా దాగుంది"  - శ్రీ దాశరధి

ప్రాణమున్న మనిషి కన్న శిలలే నయమనిపించును"  -డా . సినారె

"ఏతవేసి తోడినా ఏరు ఎండదు పొగిలిపొగిలు ఏడ్చినా పుంత నిండదు"  -శ్రీ జాలాది.

ఇలా, ఇలాంటివే, ఇంతకు మించినవే, తెలుగు సినీ కవులె ప్రతి ఒకరి కలం నుంచీ జాలువారిన అమృత శిఖరాలు ఎన్నో ఉదాహరణలు ఇవ్వచ్చు. సమయానికి గుర్తుకు రాక స్థలం సరిపోక, ఇంకా ఎందరో మహానుభావుల పేర్లు, వారి సృజనాత్మక శబ్దచిత్రాలు వివరించలేకపోతున్నాను.

పై ఉదాహరణలనూ, అలాంటివాటిని, పరిశీలిస్తే....

ఆ వాక్యాలు చదువుతూనే  అవి మాములు పొడి పొడి మాటలు కావనీ, వాటిల్లో అంతర్లీనంగా, 'ఇది ఇంతే' అని చెప్పడానికి వీల్లేనంత విషయం దాగి ఉందని తెలుస్తుంది

మాములు కంటికి కనిపించని ఏవో ఎన్నో దృశ్యాలు , ఆ వాక్యాలు చదువుతుంటే మనో నేత్రానికి కనిపిస్తాయి.

ఫలానా రాగమో,ఫలానా విధానమో చెప్పకపోయినా, ఆ వాక్యాలు, ఊరికే ఉత్తి వచనంలాగా కాకుండా, ఏదో పైకి వినిపించని నిశ్శబ్ద సంగీతంలో స్వరాల ఊయలలూగుతున్నట్టు గుండెకి వినిపిస్తుంది.

అంటే, కథో, సన్నివేశమో, పాత్రలో, బాణీయో, గాత్రమో,వాద్యాలో, ఏవో సహాయం చెయ్యకుండానే, ఏమీ చెప్పనక్కరలేకుండానే ఈ వాక్యాలు భావాన్నీ, చిత్రాన్ని, సంగీతాన్ని తమలో నిసర్గంగా పొదుపుకుని స్వతంత్రంగా మనగలుగుతున్నాయి అని అర్థం అవుతోంది.

ఈ లక్షణాన్నే లిరికల్ స్టైల్ అంటారు. పాటలోని పదాలు 'లిరిక్' అవునా కాదా తేల్చడానికి ఒకే పద్ధతి.

కాగితం మీద రాసుకుని, మౌనంగా కళ్ళతో చదువుతూ ఉంటే, ఆ పాటని విన్నప్పుడు కలిగే అనుభూతిని మించిన రసానందాన్ని కలిగిస్తే అది పాట మాత్రమే కాదు, లిరిక్ కూడా అవుతుంది.

ఛందస్సులో గణాలు సరిపెడితే "అన్నిమందులు ఇచ్చట అమ్మబడును" 'అప్పికట్లకు ఆలూరు ఆరుమైళ్ళు ' లాంటి మాటలు ఏ విధంగా పద్యలు కావో,

సంగీతపు బాణీకి సరిగ్గా అతికేటట్టు మాటలు పోదిగినంతలో అది పరిపూర్ణమైన అర్థంలో పాట అవదు.

సంగీతపు పాట గుఱించి రెండు వేరు వేరు అభిప్రాయాలున్నాయి. రెండూ స్పష్టమైనవే. ఒకదానికొకటి వ్యతిరేకమైనా, దేని దృష్టినుంచి చూస్తే అది నూటికి నూరుపాళ్ళు సమర్ధనీయమే.

ఒక్కటి సినిమాలో పాట అనేది ఒక మ్యూజికల్ రిలీఫ్. అంతే అంతకుమించి సినిమా పాట ఎక్కువ "చోటు", గౌరవమూ కోరకూడదు.

సినిమా పాట ఆ కథని, పాత్రలనీ ఆధారం చేసుకుని ఉంటుంది కనుక, భాషలోనూ, భావంలోనూ ఆ పరిమితుల్ని అతిక్రమించి, సినిమా 'కవి' తన సొంత భావాలు చొప్పించకూడదు.

సెకెనుకి ౨౪ ఫ్రేముల్తో పరిగెత్తే చిత్రాన్ని చూస్తున్న ప్రేక్షకుడి చెవిలో పడే ఈ పాటల్లోని 'పదాలు", మెదడు మీదక్కి కవాతు చేస్తూ ఉంటే, ప్రేక్షకుడు పాటల వెనుక దృశ్యాన్ని చూడాలా, పాటాడే వాళ్ళ ఆట చూడాలా, లేక , పాటల్లో ఏముందో, ఎంత ఉందో అని కళ్ళూ మూసుకుని ఆలోచనలో పడాలా?

ఆ మాట కొస్తే శ్రీశ్రీ గారైనా, విశ్వనాధ సత్యనారాయణగారైనా సరే సినిమాకి వెళ్ళేటప్పుడు సినిమాకి వెళుతున్నామనే అనుకుంటారు గానీ, 'కవితా సమావేశానికి' వెళుతన్నామనుకోరు కదా!

పైగా, సినిమా చూసే ప్రేక్షకులందరూ కవులో, ఫిలాసఫర్లో కారు. సినిమాలో కథైనా, సన్నివేశమైనా, మాటైనా, పాటైనా, తమకి అర్థం అయేటట్టు అందుబాటులో ఉండేటట్టూగానే ఉండాలి గాని, "దిగిరాను దిగిరాను భువికి" అని చెట్టెక్కి కూచోకూడదు.

ప్రేమ, కోపం, బాధ, సంతోషం, భయం, ఉత్సాహం, ఇలాంటి భావాల్ని మామూలు ప్రజలు ఏ విధంగా వ్యక్తీకరిస్తారో, పాటల్లో ఉన్న పదాలు కూడా అలాగే వ్యక్తీకరించాలి.

"నువు బావున్నావు!" "నిన్ను చూస్తే ఏదో చెయ్యాలనిపిస్తోంది!" "నిన్ను తంతాను" ఓరి దేవుడా ఈ బాధలన్నీ ఎలా పడను?" "అయ్యో అలా ఏడవకు" "పాపం! వాడికెంత కష్టం వచ్చిందో!"... ఇలాంటి మాటలే స్వరాలు తొడుక్కుని, వాద్యాలు తగిలించుకుని, 'చప్పుడు'- చేస్తే పాటలవుతాయి ఆ స్వరాలు అవీ తీసేస్తే మాములు మాటలే అవుతాయి. అవాలి కూడా అంతేగాని, ఒక మాటంటే దాని వెనకాల బోల్డు అర్థాలు వుండి, అవి కొంచం బోధపడి, కొంచం బాధపడక, బాధపెట్టే 'పెద్ద పెద్ద కవిత్వాలురా బాబూ!' అనిపించేలా ఉండకూడదు.

అదన్నమాట సంగతి. మరీ అభిప్రాయం శుద్ధతప్పు అనగలమా? అందువల్ల సాధారణంగా ఈ అభిప్రాయాన్ని అనుసరిస్తూ పల్లవించే సినిమా పాటకి సంగీతం ప్రాణవాయువు. అది వుంటే మాట-పాటగా బతుకుతుంది. ఆ బాణీ, ఆ కమ్మని గొంతులు 'చేయూత ఇవ్వం' అని తప్పుకుంటే, ఆ పాటని రాసేవాడు వచ్చి, 'ఇదగో వినండి' అని అనడానిగ్గాని, వినడానిగ్గాని, అనుకోవడానిగ్గాని, చదవడానిగ్గాని, చెప్పడానిగ్గానీ ఏమీ ఉండదు.

ఇంక రెండో రకం అభిప్రాయం

మాట ఎక్కడైతే మూగబోతుందో, పాట అక్కడ మొదలవుతుంది. మామూలు భాష సరిపోనంత, సున్నితమైన, లోతైన, విశాలమైన భావాలు వ్యక్తం అవుతాయో ఆ పద్ధతిలో ఉంటేనే పాటకి, "గీతం" అని చెప్పుకునే పరపతి ఉంటుంది.

సినీకవి కూడా, ప్రాధమికంగా కవే గనుక అయితే (ఓసారి శ్రీశ్రీగారో ఎవరో చమత్కరించారు.... మనకి వర్డ్స్వర్త్లూ లేరు, గోల్డ్ స్మిత్ లూ లేరు, "వర్డ్స్ స్మిత్"లు తప్ప! అని)

సినిమా పరిధుల్ని అతిక్రమించకుండానే పాత్రల ఔచిత్యాన్ని భంగపరచకుండానే, తన పాట, సాహితీలోకం, పౌరసత్వాన్ని పొందగలిగేలా రాయగలడు. రాయవచ్చు. రాయాలి.

ఈ అభిప్రాయంలో కొద్దిగా 'అత్యాశ' ఉందేమోగాని, ఏ మాత్రం అంగీకరించడానికి వీల్లేని 'అనర్హత' లేదేమో కదా!

"నా ఉచ్ఛ్వాసం కవనం! నా నిశ్వాసం గానం" అంటూ, కళాతపస్వి శ్రీ కాశీనాధుని విశ్వనాధ్ గారి ఆశీస్సులతో 'సినీ కవి' గా నా నడత మలుపు తిరగడానికి ముందు నుంచే నేను రెండో అభిప్రాయం వైపు మొగ్గు చూపేవాణ్ణి.

పాత హిందీపాటలు మన సినీ కవులు, అనేక సందర్భాల్లో అనేకసార్లు సృష్టించిన, మచ్చలేని అచ్చమైన 'కవితలు'గా చెలామణి కాగలిగే సత్త ఉన్న పాటలు వింటూ, నా అభిప్రాయం బొత్తిగా నేల విడిచిన సాము కాదని-కాస్త మనసు పెడితే లొల్లాయి పదాలకి, అన్నమాచార్య, త్యాగయ్యాదుల గురుకులంలో 'అక్షరాభ్యాసం' చేయించి, 'విద్యాబుద్ధులు" ఒంటబట్టెలా చేయించవచ్చునీ అనిపించేది.

క్రమక్రమంగా తెలుగు పలుకుబడి, తెలుగులోని తేనెతేటల తియ్యదనం, చిక్కిపోతున్న ఈ రోజుల్లో, కంప్యూటర్, ఇంటర్నెట్ ఇత్యాది హిరణ్యాక్షుల చేతుల్లో, భూగోళం చాపచుట్టలా చుట్టుకుపోతూ, గ్లోబలైజ్ అయిపోతూ ఉండడం వల్ల కాస్త ఓపిగ్గా, తీరిగ్గా, కూచుని చదివే అలవాటు, నిలబడి 'మాట్లడుకునే' సరదా, అన్ని పోయి, పరుగులు పెడుతున్న కాలంలో, పుస్తకాలు, సభలు,

చర్చలు, సమాలోచనలూ అన్నీ 'అవుటాఫ్ ఫేషన్' అయిపోతున్న నాగరికతలో, ఇంకా ప్రజలందర్నీ అకట్టుకోగలుగుతున్న ఈ 'చలనచిత్ర' వేదిక ద్వారా అయినా, భాష, భావం, ఆలోచన, స్పందన, లాంటి విలువల్నికాపుకాసే ప్రయత్నం ఎందుకు చెయ్యకూడదు?

ఇలాంటి నా కలవరం అంతా పైకి వెళ్ళబోసుకోవడానికి నాకు దొరికిన సువర్ణావకాశం, సినిమాల్లో పాటలు రాయగలిగే పని దొరకడం.

ఏ కవికి అయినా సినీ కవి కాగలగడం గొప్ప అదృష్టం అని నేను భావిస్తాను. ఎందుకంటే, బైట కవిగా ఉంటే ఎప్పుడో ఏదో స్పందన కలిగి రాసేందుకు ప్రేరణనిస్తుంది. సినీ కవిగా ఉంటే, స్పందన కలిగేదాకా ఎదురు చూసే వీల్లేదు. "స్పందన" కలిగించుకోవడమే. ప్రతిపాటా ఒక సవాల్. ఇన్ని రకాలుగా ప్రేరేపించి, ఇన్ని రకాలుగా వ్యక్తీకరించమని నిరంతరం వెంట తరిమే అవకాశం ఇక్కడ, ఈ పనిలో తప్ప బైట దొరకదు.

అలా రాయవలసి వచ్చిన ప్రతిపాటని, నా అభిరుచికి తెరలు వెయ్యకుండా, అలాగని సినిమా పాట పరిధిని దాటకుండా, రాయడానికి ప్రయత్నిస్తున్నాను.

అలా రాసిన పాటల్లో కొన్నిటిని ఏరి, పుస్తకంగా తేవడంలో, అందమైన శిల్పాన్ని ఏ కీలుకా కీలు విరిచి "ఇదిగో ఈ చెయ్యి చూడండి, ఈ కాలు చూడండి!" అని చూపించే కోణంగితనం లేదు.

స్వరమైత్రి వల్ల, గాత్ర బాంధవ్యం వల్లా పదము అందగిస్తుంది అన్న మాట ఎంత సత్యమో మిత్రులో బంధువులో చేయూత నిచ్చి నడిపిస్తే తప్ప తన చరణాల మీద తాను నిలదొక్కుకోలేనివాడు, అప్రయోజకుడు, అసమర్థుడు, పరాధీనుడూ, ఊతకర్ర లేనిదే నడవలేని వికలాంగుడు అవుతాడన్నది కూడా అంతే సత్యం కనుక,

తమ స్వరలయతో నా పాటను నర్తింపచేసిన సంగీత దర్శకులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటూ, తమ తియ్యని గొంతు గూటిలో నా పదాలని పొదివి, పొదిగి, గాన పక్షాలను తొడిగి గాలిలోకి ఎగరేసిన గాయనీ గాయక బంధువుల ఆత్మీయతకు ఆదరణకు ఋణగ్రస్తుడినౌతూ, తమ కథని, కథనాన్ని, సన్నివేశాలని, చిత్రవర్ణనని ఊరేగించేందుకు, పాటల పల్లకిని మోసే బోయిగా నన్ను నియోగించిన నిర్మాత దర్శకులందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటూ.....

గత పదిహేనేళ్ళుగా పల్లవిస్తున్న నా గీతాలు తమ చరణాల మీద తాము, తడబడకుండా, సక్రమంగా, స్వతంత్రంగా నిలబడగలిగాయా లేదా అని నిగ్గు తేల్చమని- -మీ ముందు పరీక్షకి నిల్చున్నాను.

ఆకాశాన్ని అందుకోవాలని అలా ఆశ పడుతుంది. ఎగురుతుంది.పడిపోతుంది ఎప్పటికైనా అందుకుంటుందా లేదా అన్న ప్రశ్న కాలం వున్నంత కాలం వుంటుంది.

"పాట యిలా వుండాలి" అనే నా ఆశ ఆకాశం అయితే, నా ప్రతి పాట ఆ నింగిని అందుకోవటానికి ఎగసే తరంగం. అంబరం అందలేదే అని కృంగిపోయి ఆగిపోవటానికి, అలిసిపోవటానికి అవకాశం లేనంత సంబరంగా ఆ తరంగాల మీద నేనూగుతున్న ఈ తారంగం చూడండి.

నా ఈ మాటల్లో నేనేదో పరమార్ధన్ని సాధించేసాను, సాధించేస్తున్నాను అని చాటుకుంటున్న దురహంకారం మీకు ధ్వనిస్తే, ఆ దురహంకారాన్ని మీరు నిగ్గదీసి అడుగనూ వచ్చు. కవిత్వమూ, కాకరకాయ అంటూ నేను కళ్ళగంతలు కట్టుకుని దోబూచులు ఆడుతున్నానని అనిపిస్తే, ఆ నా ఈ అజ్ఞానపు చీకటిని మీరు అగ్గితోటి కడగనూ వచ్చు.

అలా కాక, అటు పదహారు కళల పౌర్ణమి వైపు పెరుగుతూ, ఇటు కటిక నలుపు అమావాస్య వైపు ఒరుగుతూ, ఆటు పోటులు ఆడుతున్న చలనచిత్ర 'సిరివెన్నెల' సంద్రంలో చిందులేస్తున్న కొన్ని తరంగాల్ని బంధించి గ్రంథస్తం చెయ్యడం ద్వారా, సినీ కవిగా, నా కలలూ కలవరింతలూ, తడబాట్లు పొరబాట్లు, ఆశలూ ఆరాటాలూ దాయి దాయీ అంటే జాబిల్లి వచ్చి అరచేతిలో కూచుంటుందని, ఏ మాత్రం అనుమానం లేని నమ్మకంతో, పిలిచే అమ్మ ఒడిలోని పసివాణ్ణి. స్వాగతాలు, ఆకాంక్షల స్వగతాలు ఉన్నాయని మీకనిపిస్తే మీక్కనిపిస్తే మీరు "అవును సుమా!" అని తల పంకించనూ వచ్చు. నా ప్రయత్నానికి భుజం తట్టి కొత్తఊపునివ్వనూ వచ్చు.

మరి నా పాటల తారంగానికి వస్తారా!

**సిరివెన్నెల సీతారామశాస్త్రి.**

(కొనసాగింపు వచ్చే సంచికలో)

●●●

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



**దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రి గారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.**

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 2

నా ప్రతిభ సంగతి ఎలా వున్నా, అదృష్టమూ, దైవానుగ్రహమూ నాకు ఎక్కువగా అనుకూలించడం వల్ల, తెలుగుసినిమారంగం, చాలా సందర్భాల్లో నాపట్ల, చాలా ఉదారంగా వ్యవహరించి తన నిబంధనలు సడలించి, ఈ "భావతరంగాల" ద్వారా నా 'సొంతగొంతుక' వినిపించ గలిగేలా "స్వీయభావావిష్కరణ" చేసే అవకాశాలు అందించింది.

సినిమాల్లో రోటీన్ గా వచ్చే పాటలు కాక, కొన్ని ప్రత్యేక సందర్భాలు వస్తూ వుంటాయి. వీటిని మా భాషలో సిచ్యుయేషన్‌సాంగ్స్ అని బేక్‌గ్రౌండ్‌సాంగ్స్ అనీ రకరకాలుగా వ్యవహరిస్తారు. ఒక్కముక్కలో చెప్పాలంటే ఇవి డ్యుయెట్స్ కానివన్నమాట. అలాగే, మామూలు కథలకి కాస్త విభిన్నమైన ఇతివృత్తాలతో వచ్చే సిరివెన్నెల, శృతిలయలు, రుద్రవీణ, స్వర్ణకమలం, స్వాతిముత్యం ఇలాంటి సినిమాల్లో పాత్రలూ, సన్నివేశాలూ కూడా మాములుతనం కన్నా కొంచెం పై మెట్టులోనే ప్రవర్తిస్తాయి. అలాంటప్పుడు రాసే పాటలు, భష, భావం, శిల్పం ఇలాంటి అంశాల్లో కొంచం ఎక్కువ లిబర్టీ తీసుకోవచ్చు.

ఉదాహరణలు ఆయా సందర్భాల్లో వివరిస్తాను. నాకు ఆంధ్రప్రభుత్వం ద్వారా ఉత్తమ గేయరచయితగా లభించిన నంది అవార్డులు ఇతరేతరమైన అవార్డులు అవీ ఎక్కువ భాగం ఈ భావతరంగాల ద్వారాగానే వచ్చాయి.

హీరో హీరోయిన్ల ఇంట్రడక్షన్ సాంగ్‌లు, టీనేజ్‌సాంగ్‌లు, క్లబ్‌సాంగ్‌లు. గ్రూప్ సాంగ్‌లు, డ్యూయెట్లు.... ఇలాంటివి రాసేటప్పుడు నేను ఆయా సన్నివేశాల్లోని పాత్రల్లోకి వెళ్ళి వాటి వేషం వేసుకుని వాటిభాష పలుకుతూ రాయాలి.

ఈ భావతరంగాల్లో ఆయా సందర్భాలు నా వైపు తెచ్చుకుని నేను నేనుగా ఎలా స్పందిస్తానో అలా రాస్తాను, మౌలికంగా కూడా ఇదీ తేడా. మిగతా పాటల్లో సినీ కవి ఎక్కువగా కనిపిస్తాడు. ఈ భావతరంగాల్లో కవి పోలికలు కనిపిస్తాయి.

పల్లవి:

**అతడు: విధాత తలపున ప్రభవించినది అనాది జీవన వేదం ఓం...**
**ప్రాణనాడులకు స్పందన నొసగిన ఆది ప్రణవనాదం ఓం...**
**కనుల కొలనులో ప్రతిబింబించిన విశ్వరూప విన్యాసం**
**ఎద కనుమలలో ప్రతిధ్వనించిన విరించి విపంచి గానం**

**సరస స్వర సుర ఝురీ గమనమౌ సామవేద సారమిది**
**నేపాడిన జీవన గీతం ఈ గీతం**

**ఆమె: విరించినై విరచించితిని ఈ కవనం**
**విపంచినై వినిపించితిని ఈ గీతం**

**ఆమె: ప్రాగ్దిశ వీణియపైన దినకర మయూఖ తంత్రులపైన**
**జాగృత విహంగ తతులే వినీల గగనపు వేదికపైన**
**పలికిన కిలకిల స్వరముల స్వరజతి జగతికి శ్రీకారము కాగా**
**విశ్వకావ్యమునకిది భాష్యముగా....** ||విరించినై||

**జనించు ప్రతి శిశు గళమున పలికిన జీవననాద తరంగం**

**చేతన పొందిన స్పందన ధ్వనించు హృదయ మృదంగ ధ్వానం**

**అనాది రాగం ఆది తాళమున అనంత జీవన వాహినిగా**

**సాగిన సృష్టి విలాసములే....** **||విరించినై||**

**అతడు: నా ఉఛ్వాసం కవనం - నా నిశ్వాసం గానం** **||సరస||**

(సిరివెన్నెల చిత్రంలో కెవి మహదేవన్ సంగీత సారథ్యంలో బాలు, సుశీల పాడినది)

ఇది నేను సినిమారంగంలోకి ప్రవేశించటానికి రాసిన మొట్టమొదటి పాట. సిరివెన్నెల చిత్రం కోసం రాసింది. 1985 అక్టోబర్ 4 న రికార్డయ్యింది. సంగీతం శ్రీ కె.వి. మహదేవన్‌గారు కూర్చారు. జగద్విఖ్యాత వేణునాద విద్వాంసులు శ్రీ హరిప్రసాద్ చౌరసియా ఈ పాటతో సహా, చిత్రం అంతటినీ తన వంశీనాదంతో అలంకరించారు. శ్రీ ఎస్.పి. బాలసుబ్రమణ్యంగారు, శ్రీమతి పి.సుశీలగారు పాడారు. ఈ పాట ద్వారా శ్రీ ఎస్.పి.బి. గారికి 1986 వ సంవత్సరంలో ఉత్తమ నేపథ్య గాయకుడిగా నంది అవార్డు వచ్చింది.

ఈ నా మొట్ట మొదటి పాట నాకు 1986 వ సంవత్సరంలో ఉత్తమ నేపథ్య గాయకుడిగా నంది అవార్డు వచ్చింది.

ఈ పాట రాయటానికి ముందు నన్ను చలనచిత్రసీమకి గీతరచయితగా పరిచయం చేయదలచిన కళతపస్వి డా. కాశీనాధుని విశ్వనాథ్‌గారు నాతో అన్న మాటలివి "శాస్త్రిగారు! మీరు సినిమా రంగనికి, సినిమాపాటకి కూడా కొత్త. ఇదివరకు మీరు భరణి అన్న కలం పేరుతో పాటలు గట్రా రాని వున్నా సినిమాలో రాయటానికి, కొన్ని పద్ధతులూ నియమాలు అవీ వుంటాయి. అవి తెలుసుకోవటానికి వాటికి అలవాటు పడటానికి మీకు కొంత టైమ్ పడుతుంది. అందువల్ల ఈ మొదటి పాటని మీకు తోచిన పద్ధతిలో రాయండి. మీకు ఆకాశమే హద్దు. కథ వివరంగా విన్నారు కదా.ఈ పాటని కథానాయకుడి మీద చిత్రీకరిస్తారు. అతని చెల్లెలు కూడా పాడుతుంది. అయితే మీరు ఆ పాత్రల్ని దృష్టిలో పెట్టుకోనవసరంలేదు. అతడు గుడ్డివాడు. అక్షరజ్ఞానం లేనివాడు. అయినా గొప్ప వేణునాద విద్వాంసుడు. ఈ పాటని అతనెక్కడో విని తన వేణువు ద్వారా వినిపిస్తాడు.

ఎవరైనా అతన్ని ఈ రాగానికి నాదానికి ఉన్న సాహిత్యం ఏమిటి అని అడిగితే ఫలానా అని చెబుతాడు. ఆ సాహిత్యం వినగానే అబ్బా! ఆ సాహిత్యం అంత గొప్పగా వుంది కనకే అది ఈ వేణువులో అంత గొప్పగా వినిపించింది అనుకోవాలి. అలా అనుకునేటట్టు మీరు ఏ వస్తువు ఎంచుకుంటారో, ఏ భాష వాడుకుంటారో అది మీ స్వేచ్ఛకే వదిలేస్తున్నాను". ఎంత గొప్పాఅవకాశం? ఆ కథని, ఆ

కధలోని ఆత్మని ఆవాహన చేసుకున్నాను. ఈ ప్రపంచం అంతా ప్రణవనాదం నుంచి ఆవిర్భవించింది అన్న వేద ప్రమాణాన్ని ఆలంబనగా అందుకున్నాను. ఈ జగత్తు మొత్తం నిండి వున్న నాదం పునికిని ఎలా ఆవిష్కరించాలా అన్నది వస్తువుగా ఎంచుకున్నాను.

చూసేవి కళ్ళు కాదు. కళ్ళవెనుక వున్న ప్రాణచైతన్యం. అది నాదం కనులకొలనులో ప్రతిబింబించిన విశ్వరూప విన్యాసం, ఎద కన్నులలో గుండెసవ్వడులలో ప్రతిధ్వనించిన విరించి(సృష్టిహేతువు) విపంచి(వీణ) గానం. విపంచి మరేదో కాదు- విధాత తలపున ప్రభవించిన (బ్రహ్మదేవునికి స్ఫురించిన) అనాది జీవన(చైతన్య) వేదమే. వేదం అంటే తెలుసుకోవలసింది అని అర్థం.

ఆ నాదం చెవులతో వినేది కాదు. ఆ నాదం ఉద్భవించే చోటు కళ్ళతో చూసేది కాదు. అలా భావించగల హృదయం, ఆ హృదయానికి కళ్ళూ చెవులూ వుంటే ఈ సృష్టిలో అడుగడునా ఆ నాదం ఉనికి కనిపిస్తుంది,వినిపిస్తుంది.

తూరుపు దిక్కు అనే వీణకి (ప్రాగ్దిశ వీణియపైన), అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడి కిరణాలు తీగలుగా బిగించి (దినకర మయూఖ తంత్రులపైన) గూళ్ళ లోంచి మేలుకుని ఆకాశానిక ఏగి వున్న పిట్టలు, నీ గగన వేదిక మీద బారులు తీరి తమ రెక్కలనే వేళ్ళతో పాటు కిలకిలారావాలు సృష్టించి, ఆ వేకువ నాదాలతో అప్పటి వరకూ మృత్యు సమానమైన, నిద్రలో వున్న జగతికి చైతన్యవంతం కావడానికి శ్రీకారం చుదుతూండడం అర్థం చేసుకోగలిగితే, ఈ విశ్వం అనే కావ్యానికి భాష్యం చెప్పగలగడం చేతనవుతుంది.

రాత్రి, నిద్ర, ఉదయం కావడం, కోడికూత నుంచి, తొలి పొద్దులోని పిట్టల రెక్కల చప్పుళ్ళు, కువకువలు, ఉదయపు నీరెండలోని నులివెచ్చని కిరణాల స్పర్శ, వీటిని పోల్చుకోడానికి 'కళ్ళు' అక్కర్లేదు. ఈ ప్రతి అంశాన్ని గుండెతో స్పర్శించగలిగితే చాలు. కళ్ళు లేకపోయినా, అలాంటి హృదయ వికాసం ఉన్న కధానాయకుడి పాత్ర లక్షణాలను దృష్టిలో ఉంచుకుంటూ, మరి కొంత ముందుకు వెళితే, అలాంటి సున్నితమైన, ఉన్నతమైన మానసిక వికాసం ఉన్నవాడి చెవులకి, అప్పుడే పుట్టిన బిడ్డ కెవ్వున ఏడవడం "ఏడుపు"గా కాక, ఈ నాదమయ జగత్తులో మొట్టమొదటిసారిగా చైతన్యవంతమైన ప్రాణం తాలుకు తొలి జీవన నాద తరంగంలా వినిపిస్తుంది. ఆ తొలి జీవననాద తరంగమే 'అనాది' రాగం. జన్మ ఎప్పుడు పాత అవదు. కనుక ఎప్పుడూ ఆ అనాది రాగం ఆదితాళమున అనంత జీవనవాహినిగా నర్తిస్తూ, సాగుతున్న ఈ సృష్టివిలాసాన్ని గమనించగలిగే చైతన్యం ఉన్నవాడి ఉచ్ఛ్వాసం ఈ విశ్వరహస్యాన్ని లోపలికి పీల్చుకుని, అక్కడి ప్రాణచైతన్యాన్ని స్పందింపజేసి, నిట్టూర్పులు గాక గానంలా తరంగించే నిశ్వాసం అవుతుంది.

ఇంత భావాన్ని, పాటలో, అందునా సినిమా పాటలో, పైగా తొలి సినిమా పాటలో పొదిగి, దానికి బరువైన భాషను వాడి, ఔననిపించుకోగలగడం ఎంత గొప్పవరం! అంత గొప్ప వరాన్నందించిన ఆ విశ్వనాధుడి వాత్సల్యాన్ని వర్ణించడానికి భాష చాలకపోవడం ఈ పాట రాసిన వాడికి ఎదురైన గొప్ప మూగ అనుభూతి!

-----------------------------------------ఈ గాలి ఈ నేల

పల్లవి:

అతడు: ఈ గాలీ ఈ నేల ఈ ఊరు సెలయేరు

నను గన్న నా వాళ్ళు నా కళ్ళ లోగిళ్ళు ||ఈ గాలి||

చిన్నారి గొరవంక కూసేను ఆవంక

నా రాక తెలిసేక వచ్చేను నా వంక

ఎన్నాళ్ళో గడిచాకా ఇన్నాళ్ళకు కలిశాక

ఉప్పొంగిన గుండెల కేక ఎగసేను నింగిదాక ||ఈ గాలి||

ఏనాడో ఏ శిల్పి కన్నాడో ఈ కలను

ఏ ఉలితో ఈ శిలపై నిలిపాడో ఈ కళను

ఏ వలపుల తలపులతో తెలిపాడో ఈ కథను

ఈ రాళ్ళే జవరాళ్ళై ఇక నాట్యాలాడేను ||ఈ గాలి||

ఆమె: కన్నె మూగమనసు కన్న స్వర్ణస్వప్నమై

తళుకుమన్న తార చిలుకు కాంతి చినుకులై

గగనగళము నుండి అమర గానవాహిని

జాలువారుతోంది ఇలా అమృతవర్షిణి

ఈ స్వాతివానలో నా ఆత్మ స్నానమాడె

నీ మురళిలో నా హృదయమే స్వరములుగా మారె

ఈ గాలి ఈ నేల ఈ ఊరు సెలయేరు

ననుగన్న నా వాళ్ళు నాకళ్ళ లోగిళ్ళు ||ఈ గాలి||

(సిరివెన్నెల చిత్రంలో కెవి మహదేవన్ సంగీత సారథ్యంలో బాలు, సుశీల పాడినది)

ఆదిభిక్షువు----------------------------------------

పల్లవి: ఆదిభిక్షువు వాడి నేది కోరెది
బూడిదిచ్చే వాడి నేది అడిగేది

తీపిరాగాల ఆ కోకిలమ్మకు- నల్ల
రంగునలమిన వాడి నేది కోరేది
కరకు గర్జనల మేఘముల మేనికి మెరుపు
హంగు కూర్చిన వాడి నేది అడిగేది ||ఆదిభిక్షువు||

తేనెలొలికే పూల బాలలకు మూన్నాళ్ళ
ఆయువిచ్చిన వాడి నేది కోరేది
బండరాలను చిరాయువుగ జీవించమని
ఆనతిచ్చిన వాడి నేది అడిగేది ||ఆదిభిక్షువు||

గిరిబాలతో తాకు కళ్యణమొనరింప
దరిజేరు మన్మధుని మసిజేసినాడు

**పరగర్వమున మూడులోకాలు పీడింప**

**తలపోయు దనుజులను కరుణించినాడు**

**ముఖప్రీతి కోరేటి ఉబ్బు శంకరుడు**

**ముక్కంటి ముక్కోపి తిక్క శంకరుడు** **||ఆదిభిక్షువు||**

(సిరివెన్నెల చిత్రంలో కెవి మహదేవన్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

(కొనసాగింపు వచ్చే సంచికలో)

●●●

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రి గారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 3

పల్లవి:

అ: పాటల్లో పాడలేనిదీ- నోటి మాటల్లో చెప్పలేనిదీ
నీ గుండెల్లో నిండి వున్నదీ- ఈ బండల్లో పలుకుతున్నది
ఈ ఆర్టు చూసి హార్టుబీటు రూటు మార్చి కొట్టుకుంటూ
అహో ఓహో అంటున్నది- అది అహో ఓహో అంటున్నది

★★★★ ★★★★★

అతడు: ఈ ఇలలోన శిలపైన కొలువైన వాణి

వరవీణా మృదుపాణి వనరుహలోచను రాణి

ఆమె : నల్లనయ్యా పిల్లనగ్రోవినూద- వెల్లువై ఎద పొంగిపోదా

పాటవింటూ లోకమంతా- రాతిబొమ్మై నిలిచిపోదా

★★★★ ★★★★★

అతడు: అందమైన సుందరాంగులూ

ఎందరికో నెలవైన రాణివాసము

ఈ కోటలోన దాగివున్నది

నాటి ప్రేమగాధలెన్నో కన్నది

హిస్టరీల మిస్టులోని మిస్టరీని చాటి చెప్పి

అహో ఓహో అంటున్నది- అది అహో ఓహో అంటున్నది

★★★★ ★★★★★

ఆమె: రాసలీలా-రాగహేలా - రసమయమై సాగువేళా

తరుణుల తనువులు వెన్నెల తరగలుగా ఊగువేళా

నురుగల పరుగులుగా సాగే యమునా నది ఆగువేళ

నింగీనేలా - వాగువంకా చిత్రంగా చిత్తరువయె

(సిరివెన్నెల చిత్రానికి కె.వి.. మహదేవన్ సంగీత సారథ్యంలో సుశీలా, ప్రకాశరావు పాడినది)

పల్లవి : ప్రకృతి కాంతకు ఎన్నెన్ని హొయలో

పదము కదిపితే ఎన్నెన్ని లయలో

ఎన్నెన్ని హొయలో - ఎన్నెన్ని లయలో

అతడు : సిరివెన్నెల నిండిన ఎదపై

సిరిమువ్వల సవ్వడి నీవై

నర్తించగ రావేలా- నినునే

కీర్తించేవేళ

అలల పెదవులతో- శిలల చెక్కిలిపై

కడలి ముద్దిడువేళ

పుడమి హృదయంలో

ఉప్పొంగి సాగింది అనురాగము

ఉప్పెనగ దూకింది ఈ రాగము

||ప్రకృతి||

కొండల బండల దారులలో

తిరిగేటి సెలయేటి గుండెలలో

రా రా రా రమ్మని పిలిచిన

కోన పిలుపు వినిపించగనే

ఓ కొత్త వలపు వికసించగనే

ఎన్నెన్ని హొయలో ఎన్నెన్ని లయలో ||ప్రకృతి||

(సిరివెన్నెల చిత్రానికి కె.వి. మహదేవన్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

పల్లవి:

ఆమె : చందమామ రావె జాబిల్లి రావె

కొండెక్కి రావె గొగుపూలు తేవె

★★★★ ★★★★

చలువ చందనములు పూయ చందమామ రావె

జాజిపూల తావినీయ జాబిల్లి రావె

అతడు: కలువ చెలువ కలలు విరియ కొండనెక్కి రావె

గగనపు విరితోటలోని గోగుపూలు తేవే

||చందమామ||

ఆమె : నందనందనుని వంశీ నాదము విన్నావట

సుందర బృందావన నందనమును కన్నావట

రాసలీలనాటి ఊసు తెలియజేయ రావే

నాటి స్మృతుల వెన్నెలనిటు నేడు విరియనీవే ||చందమామ||

ఆమె : మునిజన మానస మోహిని యోగిని బృందావనం

మురళీ రవళికి ఆడిన నాగిని బృందావనం

అతడు: రాధా మాధవ గాధల రంజిలు బృందావనం

గోపాలుని మృదు పద మంజీరము బృందావనం

బృందావనం బృందావనం ||చందమామ||

(సిరివెన్నెల చిత్రానికి కె.వి. మహదేవన్ సంగీత సారథ్యంలో బాలు,సుశీలా, బి.వసంత పాడినది)

చినుకు చినుకు చినుకు చినుకు

తొలి తొలి తొలకరి చిలికిన చినుకు

పిలుపు పిలుపు పిలుపు పిలుపు

పుడమికి పులకలు మొలకల పిలుపు

ఆషాఢ మాసాన ఆ నీలి గగనాన

మేఘాల రాగాల ఆలాపన

★★★★★★★

పొలిమేరలు దాటిపోతున్నా  ఓ గువ్వల చెన్నా

పొరుగూరికి చేరిపోతున్న  ఓ గువ్వల చెన్నా

కత మారే రోజులు కోరేను  ఓ గువ్వల చెన్నా

కల తీరే దారులు వెతికేను  ఓ గువ్వల చెన్నా

గుళ్ళో నిను చూడలేకున్నా  ఓ గువ్వల చెన్నా

గుండెల్లో దాచుకొన్నాలే  ఓ గువ్వల చెన్నా

ఏ సీమల తిరుగాడినా  ఓ గువ్వల చెన్నా

నీ దీవనలందించాలన్నా  ఓ గువ్వల చెన్నా

*******

(సిరివెన్నెల చిత్రానికి కె.వి. మహదేవన్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

పల్లవి : మెరిసే తారలదేరూపం విరిసే పూవులదేరూపం?

అది నా కంటికి శూన్యం

మనసున కొలువై మమతల నెలవై వెలసిన దేవిది ఏ రూపం?

నా కన్నులు చూడని రూపం గుడిలో దేవత ప్రతిరూపం

నీ రూపం అపురూపం||

******

ఎవరి రాకతో గళమున పాటల ఏరువాక సాగేనో

ఆ వసంత మాసపు కుల గోత్రాలను ఎల కోయిల అడిగేనా?

ఎవరి పిలుపుతో పులకరించి పురివిప్పి తనువు ఊగేనో

ఆ తొలకరి మేఘపు గుణగణాలకై నెమలి వెదుకులాడేనా

నా కన్నులు చూడని రూపం గుడిలో దేవత ప్రతిరూపం

నీ రూపం అపురూపం ||

*******

ప్రాణం పుట్టుక ప్రాణికి తెలియాలా

గానం పుట్టుక గాత్రం చూడాలా

వెదురును మురళిగ మలచి

నాలో జీవన నాదం పలికిన నీవే నా పాణ స్పందన

నీకే నా హృదయ నివేదన

మనసున కొలువై మమతల నెలవై వెలసిన దేవిది ఏ రూపం?

నా కన్నులు చూడని రూపం గుడిలో దేవత ప్రతిరూపం

నీ రూపం అపురూపం ||

(సిరివెన్నెల చిత్రానికి కె.వి. మహదేవన్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

సిరివెన్నెల సినిమా నిర్మాణంలో ఉన్నంత కాలం విశ్వనాథ్‌గారితోనే వున్నాను. ప్రతి నిత్యం కథా చర్చ. గొప్ప సంగీతకళాకారుడైన గుడ్డి వాడు, గొప్ప చిత్రకారిణి, అయిన మూగ యువతి, తనకు తెలియకుండానే మట్టిలో మాణిక్యంలాంటి ఆ కళాకారుడు, సంగీత గగనతలాన స్వరభాస్కరిడై ప్రకాశించడానికి ప్రేరణ కలిగించిన ఒక విశృంఖల జీవి అయిన మరో యువతి.

ఈ పాత్రల మధ్య ఎన్నో సంక్లిష్టమైన సన్నివేశాలు! అనుక్షణం కె. విశ్వనాధ్ గారి తపన, ఆరాటం గమనిస్తుండేవాణ్ణి. అప్పటికప్పుడు స్ఫురించిన భావాన్ని రాసి ఆయనకు చూపిస్తూ ఉండేవాణ్ణి. అలా, ఆ కథా చర్చలు జరిగినంతకాలం దాదాపు ఇరవై అయిదు, ముప్పై పాటలు రాశాను.

"ఈ గాలి..., మెరిసే తారలదేరూపం.. చినుకు,చినుకు...., పొలిమేరలు దాటిపోతున్నా... పాటల్లో ఆ కథానాయకుడీ పాత్రని దృష్టిలో ఉంచుకుని, భావాన్ని కవితాత్మకంగానూ, భాషని సరళంగానూ వాడాను. కన్నెమనసు... అంటూ సుహాసిని పాత్రకి పాట రాసినప్పుడు ఆమె విద్యావతి కనుక కొంత పై స్థాయి వాడాను.

"చందమామ రావే!" పాట రాసేటప్పుడు ఆ పాట, చిన్నపిల్లపరంగా వస్తుంది కనగ భాషలోనూ, భావంలోనూ ఆ లాలిత్యం. ఈ పాటలో ఇంకో విశేషం ఉంది. ఆ పాప కూడా చూపు లేనిదే. వెన్నెల్లో బృందావనం చూపించమని మారాం చేస్తుంది. ఎలా చూపించడం? నే చూపిస్తాను అని ఆ పాపకి హామీ ఇచ్చిన హరిప్రసాద్ తను కబోది కానీ, అతను మనో నేత్రంతో మామూలు మనుషులు చూడలేనివి కూడా చూడగలడు. ఆ అనుభూతిని పిల్లంగ్రోవిలో పోసి, ఇతరులకు కూడా చూపించగలడు.

విశ్వనాధ్‌గారు కె.వి.మహదేవన్‌గారితో అన్నారు. "మామా! (కె.వి.మహదేవన్ గార్ని సినిమా పరిశ్రమ ఆత్మీయంగా మామా! అని పిలుస్తుంది) బెథోవిన్ మూన్ లైట్ సింఫనీ గురించి మీరు వినే వుంటారు! నాకు వెన్నెల ఎలా వుంటుందో చూడలని ఉంది అని అడిగిన ఒక పుట్టు గుడ్డి వాడికి వెన్నెలను చూసిన అనుభూతి కలిగించాడట ఆయన ఆ సింఫనీతో. ఆ పాప, నాకిప్పుడే వెన్నెల్లో బృందావనం చూడాలని వుంది అని మారాం చేస్తోంది. అదింకా సూర్యుడు అస్తమించని వేళ. సరిగ్గ ఇప్పుడే అలాంటి సమయం. బైట ఎండ కాస్తోంది. మేమంతా కళ్ళు మూసుకుంటాం. మీరు ఏదేనా ఒక బాణి ఆలపించండి. అది వింటూ ఉంటే మాకు వెన్నెల్లో విహరిస్తున్న అనుభూతి కావాలి!" అని

ఓ పావుగంటలో శ్రీ కె.వి.మహదేవన్‌గారు, (చంద్రకౌశ్ రాగంలో అనుకుంటా నాకు రాగాలసంగతి అట్టే తెలీదు) ఓ ట్యూను అన్నారు. ఆ గదిలో కూర్చున్న మా అందరికీ (దాదాపు ఓ పదిమంది వున్నాం) ఆ ట్యూన్ వింటూ కళ్ళు మూసుకుంటే నిజంగా విశ్వనాధ్‌గారు అడిగిన అనుభుతే కలిగింది.

అప్పుడూ విశ్వనాధ్‌గారు నాతో "శాస్త్రిగారూ! మనందరికీ ఎలాంటి అనుభూతి కలిగిందో అలాంటిదే ఆ పాపకి కూడా కలుగుతుంది. వెన్నెల్లో ఉన్నట్టు. సో, చిన్నపిల్ల కనుక, మనలా పెద్దపెద్ద మాటలేవి అనదు కనక, మీరు పల్లవి ఏమీ రాయకండి.వెన్నెల అనగానే చిన్న పిల్లలకి, అమ్మపాడే చందమామరావే! అదే మన పల్లవి"

"ఇక చరణానికి రండి. చ....చందమామరావే! జా..... జాబిల్లిరావే! కొ.....కొండనెక్కి రావే! గో.....గోగుపూలు తేవే! ఆ గ్యాప్స్ లో ఏం రాస్తారో రాయండి!"

రాసాను.

"ఇప్పుడు వెన్నెల్లో బృందావనం చూస్తున్న ఫీలింగ్ వున్న ఆ పాపకి, ఎవరైనా 'బృందావనం గురించి ఎలా చెబుతారో ఏంచెబుతారో అద్ రెండో చరణంగా రాయండి! ఆ చరణం వినగానే ఆ పాపకి 'కృష్ణా ముకుందా మురారే!' అని తాను విన్న పాట అనాలనిపిస్తుంది. అంటుంది" అన్నారు.

"మునిజన మానస...." అంటూ చరణం రాసేసాను. పాట అయిపోయింది. కానీ నాకు చిన్న అసంతృప్తి మిగిలిపోయింది. హరిప్రసాద్ వంశీనాదంతో ఆ పాపకి వెన్నెల ఫీలింగైతే వచ్చిందిగాని, వెన్నెలకీ బృందావనానికి లింకు ఎలా పెట్టడం? అలా లింకు పెట్టే చరణం ఈ రెండు చరణాల మధ్య పెడితే పాటకి పరిపూర్ణత వస్తుంది అనిపిచింది.

ఓ వెన్నెలా! నువు "నందనందనుడి వంశీనాదము విన్నవటగా" అంటూ చరణం రాసి విశ్వనాథ్ గార్కి చూపించాను. ఆయన సంతోషించారు. కానీ, చిత్రం నిడివి సమస్య వల్ల ఆ రెండో చరణం వాడలేదు, అది కూడా ఇక్కడ రాస్తున్నాను.

ఇక "ఆదిభిక్షువు" మరో అనుభవం. నంది హిల్స్ లో "సిరివెన్నెల" షూటింగవుతోంది. పగలంతా విశ్వనాథ్ గారు షూటింగ్ లో వుండేవారు. సాయంత్రం నేను, సంభాషణా రచయిత ఆకెళ్ళ, సాయినాధ్ ఇతరులతో మర్నాటి కథాంశాల గురించి రాత్రి పది గం. వరకు చర్చ. ఆ చర్చలకనుగుణంగా ఆ మర్నాడు పగలంతా నేను ఏవేవో పాటలు రాస్తూ వుండడం.

నందిహిల్స్ మీద ఓ శివాలయం వుంది. ఎవరూ వుండరు. ఓ రోజు ఉదయం పదిగంటలు వేళ యూనిట్ అందరూ దూరంగా షూటింగ్ లో వుండగా, ఒక్కణ్ణే శివాలయంలో నందీశ్వరుడీ పక్కన మఠం వేసుకుని శివయ్యని చూస్తూ కూర్చున్నాను. లోపల్నుంచి పాతాళగంగ పొంగుకొచ్చినట్టు ఆదిభిక్షువు పాట ఓ ఆరేడు చరణాల్తో వచ్చింది.

సాయంత్రం ఆ పాట విని విశ్వనాధ్ గారు బోళా శంకరుళ్ళా ఉప్పొంగి పోయి, " ఈ పాట కోసం సన్నివేశం సృష్టిస్తాను" అన్నారు.

ఇక "ప్రకృతికాంతకు" అన్న పాటకి ఎంత యాతనకి గురయ్యామో మాటల్లో చెప్పడం కుదరదు.

" సిరివెన్నెల" కథాంశం అంతా ఆ పాటలో చెప్పాలి. " నువ్వు నాతో పాటు వస్తే, నీకు ఈ సృష్టిలోని ప్రకృతిలోని ఎన్నెన్నో రహస్యాలు సౌందర్యాలు పరిచయం చేస్తాను. అవి నువ్వు "చూడ" గలవు. అప్పుడు నీ కళ మరింత పరిణితి చెందుతుంది." అని హరిప్రసాద్ ని తనతో తీసుకువెళ్ళిన మూన్ మూన్ సేన్ పాత్ర, అతనికి ఏయే అంశాలు ఎలా "చూపించింది"? "దేహస్పర్శ" ద్వారా అతని "చర్మానికి" ఎలాంటి "కళ్ళు" అతికించింది" ? తనలోని ప్రకృతి తత్త్వమైన "స్త్రీత్వం" ద్వారా అతనిలోని "పురుషు"నికి ఎలాంటి "మెలకువ" ఎలాంటి "కదలిక" కలిగించింది? తద్వారా అతను ఇన్నేళ్ళుగా రోజూ పరిచయమైన ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం,

గాలి, ఎండ, వాన, చలి, అలల చప్పుడు, జలపాతం హోరు, సెలయేటి పరుగు, బండరాల కరుకుతనం వీటన్నిటిలోనూ ఇంత వరకూ తెలియని ఏ "కొత్తదనం""చూస్తాడు?" ఎలా చూస్తాడు?"

ఇదే ఆ పాటలో చెప్పాల్సిన అంశం. అది సవ్యంగా చెప్పగలిగితే, అలాంటి "చూపు" ద్వారా అతను పొందిన అనుభూతిని తన కళలోకి మలుచుకొని గొప్ప విద్వాంసుడు అయిపోయేడు అని చెప్పడం కన్విన్సింగ్ గా వుంటుంది.

దాదాపు పదిహేనూ ఇరవై రోజులపాటు ఉదయము మధ్యాహ్నము శ్రీ కె.వి.మహదేవన్ గారు, పుహళేంది గారు, విశ్వనాథ్ గారు, నిర్మాతలు, ఇతరులు కూర్చోవడం నేను వివిధరకాలుగా రాస్తూ ఉండడం... మళ్ళీ మర్నాడు దాదాపు నలభై, ఏభై విధాలుగా రాశాను.

పదిహేను రోజుల తర్వాత... "ప్రకృతికాంతకు ఎన్నెన్ని హోయలూ.." అన్న ఊహ తగిలింది. సరిగ్గ అరగంటలో పాట పూర్తిగా రాయడం, విశ్వనాథ్ గారు ఓకే చెయ్యడం, మామ ట్యూన్ చెయ్యడం అన్నీ అయిపోయాయి.

"ప్రాణం పుట్టుక ప్రాణికి తెలియాలా?" (మనసున కొలువై) "ఎవరి రాకతో గళమున పాటల ఏరువాక సాగేనో.." లాంటి భావాలు, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారికి ఎంత ప్రియమైనవో!

ఇంకో విచిత్రం ఏఁవిటంటే, సరిగ్గ 14 సంవత్సరాల తర్వాత "పెళ్ళి పందిరి" అనే సినిమాలో. డైరెక్టర్ కోడి రామకృష్ణగారు సరిగ్గా "ప్రకృతికాంతకు" లాంటి సన్నివేశాన్ని వివరించి, ఒక అంధురాలికి ఆమె ప్రియుడు, ఈ ప్రపంచాన్ని రంగుల్ని, సమయాన్ని, ఎలా "చూపించేడో" రాయమన్నారు. వందేమాతరం శ్రీనివాస్ స్వరపరచిన ఆ పాట "నేస్తమా! ఇద్దరి లోకం ఒకటే లేవమ్మ" ఈ భావతరంగాల్లో మరో చోట మీకు ఎదురవుతుంది.

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

### 4

పల్లవి: దివిదారుల తిరిగే తెలి మొయిలై
మది గగనములో ఎగిరే కలలే
చలువ వెన్నెలల వలువను కట్టి
అలల మువ్వలను పదముల చుట్టి
ఇలకు దిగిన పండుగ నేడు
ఇక చెదరని పున్నమి నా కన్నులు ఆడు||

★★★★ ★★★★

నా ఊహల ఊలులే మలచిన రూపం

నా కైతల గళమున పలికిన గీతం

ఎదురై నిలిచిన ఈ వేళ

ఇక నా బ్రతుకే తన నర్తనశాల ||మాట||

**** ****

(సంకీర్తన చిత్రానికి ఇళయరాజా సంగీత సారథ్యంలో బాలు పాడినది)

పల్లవి: వేవేల వర్ణాల ఈ నేల కావ్యాన

అలలు శిలలు తెలిపే కథలు

పలికే నాలో గీతాలై

★★★★★ ★★★★★

ఓ గంగమ్మో! పొద్దెక్కిపోతోంది త్వరగా రాయే

తల్లి గోదారి తుళ్ళి తుళ్ళి పారేటి

పల్లె పల్లే పచ్చని పందిరి

నిండు నూరేళ్ళు వుండు ముత్తైదువల్లె పండు

పంటలకేమి సందడి

★★★★★ ★★★★★

వాన వేలితోటి నేల వీణమీటే

నీలి నింగి పాటే ఈ చేనట

కాళిదాసు లాటి ఈ తోటరాసుకున్న

కమ్మనైన కవితలె ఈ పూలట

ప్రతి కదలికలో నాట్యమె కాదా

**ప్రతి ఋతువూ ఒక చిత్రమె కాదా**

**ఎదకే కనులుంటే**

(సంకీర్తన చిత్రానికి ఇళయరాజా సంగీత సారథ్యంలో బాలు పాడినది)

సంకీర్తన చిత్రానికి దర్శకులు గీతాకృష్ణ. ఇళయరాజా గారిచ్చిన అత్యద్భుతమైన ట్యూన్. నాగార్జున పాత్ర సహజంగా కవిహృదయం గల పాత్ర.. పెద్దగా విద్యాగంథం అబ్బకపోయినా, పెదవి విప్పితే కవిత్వం పలుకుతుంది. అలాంటి వ్యక్తులు మన జీవితంలోనూ తారసపడతారు. కవిత్వం అనేది ఒక యూనివర్శిటీలో ట్రైనింగ్ ఇచ్చి బోధపరిచే వస్తువు కాదు. చదువు మూలన, ఇతరేతర సంస్కారాల మూలాన నగిషీ పెట్టబడితే పెట్టబడవచ్చు. కానీ బంగారం, వజ్రలు, మణులు, మాణిక్యాలు- వాటి సహజ స్థలం మట్టే. మట్టిలో పుట్టినంతమాత్రాన వీటి విలువేం పోదు. ఇలాంటి మట్టిలో మాణిక్యంలాంటి ఆ యువకునిలో ప్రకృతి పట్ల గలిగే స్పందనే ఈ పాట రాయడం జరిగింది. ఇందులో ఒక రకమైన లోపం కూడా వుంటుంది. భాషా సంయమనం, అప్పట్లో ఎవరన్న పోయెట్రీ రాయమన్నా దొరికిందే అవకాశం అని నేనేలా చెబుతానో అలా చెప్పడమే తప్ప పాత్ర, దాని పరిమితులు, దాని ఔచిత్యాలు వగైరాలు పట్టించుకోవడం అనేవి క్రమక్రమంగా అనుభవం మీద పట్టుబడ్డాయి. అందువల్లనే నా మొదటి రోజు పాటల్లో తూకం తప్పడం అవీ కనిపిస్తాయి. అలాగే డ్యూయెట్లు రాసేటప్పుడు కూడా విషయం చాలా చిన్నది గనక భావాలు కూడా రిపీట్ అవుతుంటాయి. ఐతే భావం, పదజాలం యొక్క సొగసు బట్టి, ఇళయరాజాగారిచ్చిన అద్భుతమైన సంగీతం మూలాన దీన్ని భావతరంగంలో చేర్చడం జరిగింది.

***

**పల్లవి: పాత్రల వెనుక ముఖాలు ఇవా**

**నటనల వెనుక నిజాలు ఇవా**

**చితిమంటల వెలుగులో**

**ప్రకాశించు నిజము ఇదా**

**బ్రతుకంటే ఒక కలయని**

**నిరూపించు ఋజువు ఇదా**

**నరులకు చివరకు మిగిలే**

**ఆస్తులు ఈ అస్తికలా**

**చేరదీసి సేదతీర్చు నేస్తులు ఈ మృత్తికలా**

★★★★ ★★★★

**ఆశల ఆరాటాలు ఈసుల పోరాటాలు**

**ప్రతిక్షణం ఊహలు ప్రతీక్షించు ఈహాలు**

**ఆకాశం తాకాలని ఎగసే తరంగాలా**

**అహర్నిశం ఎదలయలో మరణమృదంగాలా**

★★★★ ★★★★

**పాలుగారు పసిపాపల చిరునవ్వుల కాంతులు**

**తేనెలూరు యవ్వనాల వసంతాల పువ్వుల**

**నడిమి వయసు చల్లుకొన్న అనుబంధవు విత్తులు**

**ముదిమిలోన కోసుకున్న అనుభవాల పంటలు**

**అన్నీ ఇట చేరేనా**

**మన్నై ఇటు మారేనా**

**** ****

(శ్రీవేమన చరిత్రము చిత్రనికి సత్యం సంగీత సారథ్యంలో రామకృష్ణ పాడినది)

శ్రీ వేమన చరిత్రలో సత్యంగారి సంగీత దర్శకత్వంలో వేమన భోగి నుంచి యోగిగా మారే ట్రాన్సిషన్ పిరియడ్‌లో ఒక సన్నివేశం చిత్రీకరించారు. ఆయన నడుస్తూ వుండగా కాలికో కపాలం తగిలింది. ఆ కపాలాన్ని చేతుల్లోకి తీసుకుని దానివేపు చూస్తూ వుంటే, జీవితం తాలూకు నశ్వరత్వం పట్ల, స్వస్వరూపం పట్ల, అంటే ఏదైతే మనం రంగుల జలతారు పరదాలు తగిలించుకుని మురిసిపోతుంటామో ఇవన్నీ తొలగిస్తే, జీవితం తాలూకు ఆ సహజమైన నిజం-పుట్టుక, చావు. ఈ రెండింటి మధ్య ఎటో, ఎందుకో, ఎలాగో తెలియనటువంటి ఒకానొక పరుగు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని, ఆయన గుండెలో ఏ రకమైనటువంటి అలజడి చెలరేగి వుంటుంది అని ఉహించిన ఫిలసాఫికల్ ఎక్స్‌ప్రెషన్.

***

ఒంటరిగా దిగులు బరువు మోయబోకు నేస్తం
మౌనం చూపిస్తుందా సమస్యలకు మార్గం
కష్టం వస్తేనే గద గుండెబలం తెలిసేది
దుఃఖనికి తలవంచితే తెలివికింక విలువేది
మంచైనా చెడైనా పంచుకోను నే లేనా
ఆ మాత్రం ఆత్మీయతకైన పనికిరానా
ఎవ్వరితో ఏ మాత్రం పంచుకోను వీలులేని
అంతటి ఏకాంతమైన చింతలేమిటేండీ

అతడు: చెప్పాలని ఉంది గొంతు విప్పాలని ఉంది
చెప్పాలని ఉంది గొంతు విప్పాలని ఉంది
గుండెల్లో సుడి తిరిగే కలత కధలు
చెప్పాలని ఉంది...

★★★★ ★★★★

కోకిల కుటుంబంలో చెడబుట్టిన కాకిని అని
అయినవాళ్ళు వెలివేస్తే అయినా నేనేకాకిని
చెప్పాలని ఉంది....

పాట మారాలని చెప్పడమే నా నేరం
గూడు విడిచి పోమ్మన్నది నన్ను కన్న మమకారం
వసంతాల అందం విరబూసే ఆనందం
తేటి తేనె పాట పంచె వెన్నెల విరితోట
బతుకు పుస్తకంలో ఇది ఒకటేనా పుట
మనిషిగ నడుచు దారుల్లో లేదా ఏ ముళ్ళబాట
చెప్పాలని ఉంది...

★★★★ ★★★★

ఏటి పొడుగునా వసంతమొకటేనా కాలం

ఏదీ మరి మిగతా కాలాలకు తాళం

నిట్టూర్పుల వడగాలుల శ్రుతిలో ఒకడు

కంటి నీటి కుంభవృష్టి జడిలో ఇంకొకడు

మంచు వంచనకు మోడై గోడు పెట్టువాడొకడు

వీరి గొంతులోని కేక వెనుక ఉన్నదే రాగం!

అనుక్షణం వెంటాడే ఆవేదన ఏ రాగం

అని అడిగిన నా ప్రశ్నకు అలిగే మత్తకోకిల

కళ్ళు ఉన్న కబోదిలా, చెవులు ఉన్న బధిరుడిలా

నూతిలోని కప్పలా బ్రతకమన్న శాసనం

కాదన్నందుకు అక్కడ కరువాయెను నా స్థానం

చెప్పాలని వుంది

★★★★ ★★★★

అసహాయతలో దడదడలాడే హృదయ మృదంగ ధ్వానం

నాడుల నడకల తడబడి సాగే ఆర్తుల ఆరని శోకం

దిక్కు మొక్కూ తెలియని దీనుల వ్యధార్త జీవన స్వరాలు

నిలువునా నన్ను కమ్ముతున్నాయి శాంతితో నిలువనీయకున్నాయి

ఈ తీగలు సవరించాలి ఈ అపశృతి సరిచెయ్యాలి

జనగీతిని వద్దనుకుంటూ నాకు నేనే పెద్ద అనుకుంటూ

కలలో జీవించను నేను - కలవరింత కోరను నేను

నేను సైతం విశ్వవీణకు తంత్రినై మూర్ఛనలు పోతాను

నేను సైతం భువన ఘోషకు వెర్రి గొంతుకు విచ్చి మ్రోస్తాను

నేను సైతం ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవిస్తాను

నేను సైతం నేను సైతం బ్రతుకు పాటకు గొంతు కలిపేను

**సకల జగతిని శాశ్వతంగా వసంతం వరించు దాకా**

**ప్రతి మనిషికి జీవితంలో నందనం వికసించు దాకా**

**పాత పాటను పాడలేను - కొత్త బాటను వీడిపోను**

**** ****

(అంజనా ప్రొడక్షన్స్ రుద్రవీణ చిత్రానికి ఇళయరాజా సంగీత సారథ్యంలో బాలు పాడినది)

గీతరచయితగా ప్రారంభమైన తొలిరోజుల్లోనే శ్రీ కె. బాలచందర్‌లాంటి మహామహులతో పని చెయ్యగలగడం ఒక అరుదైన యోగం.

"రుద్రవీణ" చిత్రం సామ్యవాదసిద్ధాంతాన్ని మరో కోణంలోంచి అవిష్కరించిన చిత్రం. సంగీతం కానీ, కవిత్వం గానీ, మరే కళైనా గానీ, మానవుడిలో మానసిక వికాసం గానీ, మేధోవికాసం గానీ ఏవీ కూడా నేల విడిచి సాము చెయ్యకూడదు. మబ్బులు తాకేలా ఎదిగిన చెట్టు చిగురు, మట్టిలో వున్న తన వేరును మర్చిపోకూడదు. మనం విద్వాంసులమైనా, కళాకారులమైనా, కోటీశ్వరులమైనా, మహారాజులమైనా మరేదైనా అలా ఏదో ఒకటి అవటానికి ముందు మనం మనుషులం. ఈ సంగతి మరిచిపోయి, సాటి మనిషిని పేదవాడనో, అనాగరికుడనో, అజ్ఞాని అనో, తక్కువస్థాయికి చెందినవాడనో, నిరసన చూపిస్తే మన "ఎదుగుదలకి" అర్థం ఉండదు. ఇదే ఈ చిత్రంలోని సారాంశం.

ఈ రుద్రవీణలోని పాటలు పుస్తకంలో వివిధ 'తరంగాలు'గా పరుచుకున్నాయి.

ఉదా: చుట్టుపక్కల చూడరా! అన్న పాట మనిషి వుండవలసిన పోజిటివ్ ఏస్పెక్ట్ గురించి మాట్లాడేది. కనుక "అశాంతరంగం"లో కనిపిస్తుంది. "నీతోనే ఆగేనా సంగీతం" అన్న పాట కూడా జీవితం కన్నా ఏవీ గొప్పవి కావనీ, అలల్లో సంగీతాన్ని, పిట్టల కూతల్లోని గానకళని గుర్తించలేని ఏ శాస్త్రజ్ఞానం కూడా అహంకారాన్ని తప్ప మరేం కలిగించదని, వెదురు తోటల్లోంచి, చెట్ల గుబురుల్లోంచి, ఎడారి ఇసుకల్లోంచి, ప్రయాణిస్తూ వివిధ శృతుల్లో, లయల్లో, ఆలపిస్తున్న గాలి ఏ
గాన శాస్త్ర గ్రంధాన్ని చాదువుకోలేదని, కాబట్టి మనిషి తాను నేర్చుకున్న విలువలకి ఇచ్చే గౌరవం కన్నా, తను పుట్టుకతో తెచ్చుకున్నవి, తన పరిసరాల్లో ఉన్నవి అయిన విలువల్ని గుర్తించి గౌరవించడం నేర్చుకోవాలని చెబుతుంది.

"వసంతం" ఎంత గొప్పదైనా, వాడిపోయి, మోడైపోయి వున్న వనాల వైపు తానే వెళ్తుంది గాని, మట్టినీ మట్టిలో వున్న వేళ్ళని వదిలి చెట్లు తనవైపు రాకపోతే చులకన చేయ్యదు. ఎంత ఎత్తు ఆకాశంలో ఉన్నా, మేఘాల రాగం తానే వర్షంలా దిగివస్తుంది కానీ, నేల కెరటాల పాడడం మానేస్తే కాలం, భూగోళం ఆగిపోవు. మూగపోవు. కుహూ కుహూ అన్న రాగం లేకపోతే, సెలయేళ్ళు పాడే గలగల రాగంతో వానకాళ్ళ తో ముందుకెళ్ళి పోతూనే ఉంటూంది.

ఇలా బ్రతుకు గురించి, రేపటి గిరించి ఆశావాది ధృక్పధంతో సాగే "ఆశాంతరంగం" లో "తరలిరాదా తనే వసంతం", "నీతోనే ఆగేనా సంగీతం" కనిపిస్తాయి.

"లలిత ప్రియకమలం" అన్నపాటని 'సరాగపరాగం' అన్న విభాగంలో యుగళగీతాల కోవలో చేర్చాను.

ఈ "భావతరంగం"లో చేరిన రుద్రవీణ పాట "చెప్పాలని వుంది గొంతు విప్పాలని వుంది" అన్నది.

ఈ పాటలో నా చేత ఒక విభిన్నమైన ప్రయోగం చేయించారు శ్రీ బాలచందర్‌గారు. ఈ పాట వచనగేయ రూపంలో సాగుతుంది. ఇళయరాజాగారు ఈ "కవిత" లోని వివిధమైన మూడ్స్‌కి తన సంగీతంతో ప్రాణప్రతిష్ఠ చేశారు. బాలూ గారు భావయుక్తంగా ఆలపించారు.

"రుద్రవీణ"లో మబ్బులు స్థాయికి ఎదిగిన చిటారుకొమ్మలాంటి బిళహరిగణపతి శాస్త్రి పాత్రని జెమిని గణేశన్‌గారు, మట్టిలో ఉన్న వేరులా మానవత్వానికి ప్రాతినిధ్యం వహించే సూర్యం పాత్రని చిరంజీవిగారు పోషించారు.

తను చేస్తున్న తప్పేమిటో తెలియక, తను ఎంతో అబిమానించి గౌరవించే తండ్రి, తనలోని "మానవీయ" దృక్పధాన్ని ద్వేషించడం తట్టుకోలేక రగులుతున్న అగ్నిపర్వతంలా అంతఃసంఘర్షణకి గురైన సూర్యం గుండేల్లోంచి లావాలా తన్నుకొస్తున్న ఆక్రోశం, ఆవేదన, ఆగ్రహం, తన ఆశయాలపట్ల స్థిరనిర్ణయం, ఇన్ని భావాలను కలబోసుకుని వచ్చే ఈ గేయాంలో కావాలని చివరి పంక్తుల్లో శ్రీశ్రీగారి శైలిని అనుకరించాను "నేను సైతం..." అంటూ ఆయన మహా ప్రస్థానంలోని మూడు నాలుగు లైన్లు తీసుకుని తర్వాత వచ్చే వాక్యాలు కూడా అవే గేయంలోవా అనిపించేలా మలుచుకొచ్చాను.

ఈ రుద్రవీణకి నాకు 1988వ సం.లో "సౌత్ ఇండియన్ **ట**క్నీషియన్స్ అసోసియేషన్- మద్రాసు" వారు కరుణానిధిగారి పేరుతో ఇచ్చిన అవార్డు ఇచ్చారు. ఈ అవార్డు దాదాపు సగం జాతీయ అవార్డు లాంటిది. నాలుగు దక్షణాది భాషలకి, కలిపి ఇచ్చే ఈ అవార్డు నందుకునే వేదిక మీద ఆ సంవత్సరం ఉత్తమ కధరచయితగా కరుణానిధిగారికి అవార్డు అందిండం, బాలచందర్‌గారు, విసుగారు, కూడా అవార్డు  గ్రహీతలు కావడం, వీరూ, వైరముత్తుగారు నా గురించి ప్రశంసాపూర్వకంగా మాట్లాడడం మరిచిపోలేని అనుభూతి.

(కొనసాగింపు వచ్చే సంచికలో)

●●●

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 5

పల్లవి: తెలవారదేమో స్వామి ||2||

నీ తలపుల మునకలో అలసిన దేవేరి అలమేలు మంగకు ||తెల||

చెలువము నేలగ చెంగట లేవని

కలతకు నెలవై నిలిచిన వెలతకు

కలల అలజడికి నిద్దుర కరువై

అలసిన దేవేరి అలమేలు మంగకు || తెలవార||

**మక్కువ మీరగ అక్కున జేరిచి**

**అంగజు కేళిని పొంగుచు తేల్చగా**

**ఆ మత్తునే మది మరి తలచగా**

**అలసిన దేవేరి అలమేలు మంగకు** ‖ తెలవార‖

**** ****

(శృతిలయలు చిత్రానికి కె.వి. మహదేవన్ సంగీత సారథ్యంలో జేసుదాస్ పాడినది)

"శృతిలయలు" చిత్రానికి పాట రాయటానికి శ్రీ కె.వి మహదేవన్‌గారు. శ్రీ కె. విశ్వనాథ్‌గారు హోటల్ సవేరాలో సమావేశమై నన్ను పిలిపించారు. అప్పటికి ఆ చిత్రంలో శ్రీ శారదాంబా నమోస్తుతే అన్న పాట రాసివున్నాను.

నేను వెళ్ళే టప్పటికాలస్యమయ్యింది. విశ్వనాథ్‌గారు భోజనానికెళ్ళారు. వెళ్తూ నందూరి విజయ్ (విశ్వనాథ్‌గారి వద్ద దాదాపు అన్ని సినిమాలకి సహకార దర్శకుడిగా పనిచేశారు) చేతికి ఓ కాగితం అందించి " ఈ లైన్స్‌లో శాస్త్రిగార్ని పాట రాసి వుంచమని చెప్పండి. నేను మూడు గంటలకి వస్తాను" అని చెప్పి వెళ్ళారు.

మరునాడే రికార్డింగ్. వుహళేందిగారు (కె.వి.మహదేవన్‌గారి సహాయ సంగీత దర్శకులు) చెప్పిన మాటల్ని బట్టి ఆ పాట మర్నాడు మంగళంపల్లి బాలమురళీ కృష్ణగారు పాడబోతున్నట్టు, సాయంత్రంలోగా పాట రాయడం, ట్యూన్ చెయ్యడం అయ్యిపోవాలని అర్థం అయ్యింది.

నందూరి విజయ్ ఇచ్చిన కాగితంలో విశ్వనాథ్‌గారు దాదాపు ప్రతీపాటకి ఇతివృత్తమో, శైలో, పల్లవో ఏదో ఒకటి అందిస్తూ తనకు కావల్సిన దాన్ని రాబట్టుకుంటారు.

ఓ సారి ఓ సందర్భంలో అన్నాను. "విశ్వనాథ్ గారి సినిమాల ద్వారా ఎన్ని నందులు వచ్చినా అవి తృప్తి కలిగించవు. ఎందుకంటే, వాటిల్లో అయనక్కూడా భాగం వుంటుంది కనుక. నాకు ఇతర చిత్రాల ద్వారా నందులు అందుకోవాలని ఉంది" అని. ఆ ఆశ ఆ తర్వాత నాలుగు సార్లు తీరింది. అది వేరే సంగతి. పాట పట్ల విశ్వనాథ్ గారికి వున్న క్లారిటీ అలాంటిది.

తెలవారదేమో స్వామీ! అన్న పదాన్ని "అలమేలు మంగకు" అన్న పదాన్ని చూడగానే నాకు చిలిపి ఆశ పుట్టింది.

"ఈ పాటని అన్నమాచార్యుల వారి బాణీలో రాస్తాను. ఎన్నోవేల కీర్తనలు పాడిన బాలమురళికృష్ణగారు రేపు ఈ పాట చూసి "అరెరె నాకు తెలియని అన్నమాచార్య కీర్తన కూడా వుందా?" అనుకోవాలి! "

ఆ చిలిపి అక్షర రూపం తీసుకోవడానికి సరిగ్గ పదినుంచి పదిహేను నిమిషాలు పట్టింది.

విశ్వనాథ్‌గారు రావడం, అవునని భుజం తట్టడం, కె.వి. మహదేవన్‌గారు బాణీ కట్టడం అన్నీ సాయంత్రానికి అయిపోయాయి.

మరునాడు రికార్డింగ్ థియేటర్లో కారణాంతారాన, డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు రాలేకపోవడం, అప్పటికప్పుడు శ్రీ జేసుదాస్‌గారు పాడడం జరిగాయి.

జేసుదాసుగారు అది అన్నమాచార్య కీర్తనే అనుకున్నారని, చాలా కచేరీల్లో అలా అనుకునే ఆ పాట పాడారని విన్నాను.

ఆ చిత్రంలోనే "ఇన్ని రాశుల యునికి" అని ఒక అరుదైన అన్నమాచార్య  కీర్తన వుంది. ఎప్పుడో కొన్ని వందల యేళ్ల క్రిందటి అన్నమాచార్యులవారి ఆ కీర్తనలో ఈ నాటి అధునాతన కవితాశిల్పం కన్పించడం అశ్చర్యం కలిగించే విషయం.

"ఇన్ని రాశుల యునికి " పాటలో వున్న ఈ నాటి నవ్య కవితా రీతులు కన్పించడం వల్ల, అది నేను రాసిన పాట అని, " తెలవారదేమో స్వామి!" పాటలో నేను అన్నమాచార్యులవారి పోకడకు దగ్గరగా వెళ్ళగలగడం మూలాన అది అన్నమాచార్యుల కీర్తన అనీ, చాలా మంది నమ్మడం, ఆ నమ్మకం అధారంగా పందాలు వేసుకోవడం కూడా జరిగింది.

కొసమెఱుపు ఏమిటంటే, 1987 సం.లో నంది అవార్డుల కమిటీలో న్యాయనిర్ణేతగా వున్న శ్రీ సి.యస్.రావుగారు "తెలవారిదేమో స్వామి!" పాట వున్న కాగితంమీద నా పేరు చూసి, "తెలియని వాళ్ళు పొరపాటున రాసివుంటారు. ఇది అన్నమాచార్య కీర్తన" అనుకుని రెండుసార్లు పక్కన పెట్టి, మూడోసారి కూడా ఆ ప్రస్తావన వచ్చేసరికి, అది పొరపాటు కాదు, నేనే రాశానని తెలుసుకొని, ఖరారు చేసుకొని అమితమైన ఆశ్చర్యానందాలతో ఆ పాటకి నాకు వరసగా రెండోసారి, 1987వ సం|| ఉత్తమ గేయరచయితగా నంది అవార్డుకీ ఎంపిక చేశారు.

ఆ సంగతి ఆ తర్వాత వారే నాకు స్వయంగా చెప్పారు. ఈ మధ్య ఈటీవీలో "పాడుతా తీయగా" లో ఆ పాట వచ్చిన ప్రతిసారీ క్రింద రచన: అన్నమాచార్య కీర్తన అని చూసిన ప్రతిసారీ గర్వం కన్నా జన్మ ధన్యమైంది అన్న ఫీలింగ్ కలిగింది!!

*****

**పల్లవి: ఏరాగముంది మేలుకుని వుండి లేవనంటున్న మనసుని పిలువగ**

**ఏ తాళముంది సీసమును పోసి మూసుకొని వున్న చెవులను తెరువగ**

**సంగీతమెంటె ఏమిటో తెలిసి ఉండాలి మనకి ముందుగా- అంత**

**సందేహముంటె తీర్చుకో గురువులున్నారు కనులముందుగా-వెళ్ళి**

**నీలిమేఘాన్ని గాలివేగాన్ని నింగిమౌనాన్ని అడగరా- కడలి**

**ఆలపించేటి ఆ తరంగాల అంతరంగాన్ని అడగరా - మధుర**

**ప్రాణగీతాన్ని పాడుతూ వున్న ఎదసడి నడిగితె**

**శృతిలయ తెలుపదా బ్రతుకును నడిపిన సంగతి తెలియదా**

ఏరాగముంది మేలుకొని వుండి లేవనంటున్న మనసుని పిలువగ

ఏ తాళముంది సీసమును పోసి మూసుకొని వున్న చెవులను తెరువగ

ఏ సుప్రభాత గళముతో నేల స్వాగతిస్తుంది తొలితొలి వెలుగుని

ఏ జోలపాట చలువతో నింగి సేదతీర్చింది అలసిన పగటిని

స్వర్ణతరుణాలు చంద్రకిరణాలు జిలుగులొలికి

బదులు పలుకునెవరికి?

మంచుమౌనాలు పంచమంలోన మధువు చిలుకు

ఎవరి చెలిమి రవళికి?

తోటలోచేరి పాటకచ్చేరి చేయమంటున్న వినోదమెవరికి?

వేల అందాల పూలగంధాల చైత్రగాత్రాన సునాదమెవరిది?

పంచవర్ణాల పింఛమై నేల నాట్యమాడేటి వేళలో మురిసి

వర్షమేఘాల హర్షరాగాలు వాద్యమయ్యేటి లీలలో తడిసి

నీరుగా నీరు ఏరుగా ఏరువాకగా నారు చిగురులు తొడగగ

పైరు పైటేసి పుడమి పాడేటి పసిడి సంక్రాంతి పదగతులెవరివి?

ఆరుకాలాలు ఏడు స్వరములతో అందజేస్తున్న రసమయ మధురిమ

వినగల చెవులను కలిగిన హృదయము

తన ప్రతి పదమున చిలుకగ సుధలను

జోహారు నీకు సంద్రమా ఎంత ఓపికో అసలు అలసట కలగద

ఓహోహో గానగ్రంథమా ఎంత సాధనుంది-

దిశల ఎదలకు తెలియగ

నీ గీతమెంత తడిమినా శిలలు సంగీత కళలు కావనీ- ఎంత

నాదామృతాన్ని తడిసినా ఇసుక రవ్వంత కరగలేదనీ తెలిసి

అస్తమిస్తున్న సూర్యతేజాన్ని కడుపులో మోసి నిత్యమూ- కొత్త

ఆయువిస్తున్న అమృతంలాంటి ఆశతో ఎగసి ఆవిరై - అష్ట

**దిక్కులూ దాటి మబ్బులను మీటి- నిలువున నిమిరితె**

**గగనము కరగద - జలజల చినుకుల సిరులను కురవదా**

**అణువణువణువున తొణికికితే స్వరసుధ**

**అడుఅడుగడుగున మధువని విరియదా**

**** ****

(మనసులో మాట చిత్రానికి యస్వీ కృష్ణారెడ్డి సంగీత సారధ్యంలో బాలు పాడినది)

ఆ మధ్య కాలంలో శంకర మహదేవన్ పాడిన " బ్రెత్‌లెస్ సాంగ్" అనేది టి.వి ద్వారా దేశాన్ని ఊదరగొట్టేసింది.

తెలుగులో అనువాదిస్తే "ఉపిరిలేని పాట" అంటే ఎబ్బెట్టుగా ఉంటుంది గాని, దానర్ధం "గుక్కతిప్పుకోకుండా" ఏకబిగిని పాడే పాట అని వారి భావం.

అంతకు చాలా ఏళ్ళ ముందె "ఓ పాపాలాలీ!" అన్న సినిమాలో అనుకుంటాను, ఇళయరాజాగారి సంగీత దర్శకత్వంలో బాలుగారు, ఓ పాట చరణాల్ని "నిజంగానే" గుక్కతిప్పుకోకుండా పాడేరు.

ఈ "బ్రెత్‌లెస్" ప్రక్రియకి వచ్చిన ప్రజాదరణని బట్టి, చంద్రకిరణ్ ఫిలింస్ "మనసులో మాట" సినిమాలో, దర్శకుడు సంగీత దర్శకుడూ అయిన శ్రీ ఎస్వీ కృష్ణారెడ్డిగారు, ఓ ముఫై ముఫైఅయిదు పంక్తుల పాటు ఏకబిగిని నడిచేలా ఓ ట్యూన్ చేసి, ఆ ట్యున్‌కి నన్ను **'ఏదో'** రాయమన్నారు.

ఆ ప్రక్రియ పట్ల ఆసక్తి సరే. అంతసేపు ఏకబిగిన ఏ భావాన్ని పలికించాలి? ఎలా నడిపించాలి

నిర్మాత, మిత్రుడు రవికిశోర్‌కి ఫోన్ చేశాను. "భావమూ, భాషా, నీయిష్టం సీతారాOవుడూ!" అన్నాడు.

ఇంకా కావలసిందేOవుంది? పాత్రలూ, సన్నివేశాలూ, అన్న నిబంధనలూ, వసుదేవుడికి యమున దారిచ్చినట్టు అడ్డు తప్పుకున్నాయి. బాణీ ఆటంకం అవడానికి బదలు ప్రోత్సాహకరంగా, సరళంగా, సుదీర్ఘంగా తెలుగుతనం పలికేందుకు వీలుగా, అందించారు ఎస్వీ కృష్ణారెడ్డిగారు.

" సంగీతాన్నే" భావంగా పట్టుకున్నాను. ప్రకృతిలోని రంగులు, ఋతువులు, అలలు, మేఘాలు, గాలి, ఆకాశం అన్నిటినీ స్పర్శిస్తూ, అన్నిటిలోనూ ఉన్న సంగీతాన్ని వినలేకపోతే చెవుల్లో సీసం పోసుక్కూచున్నవాడి హృదయాన్ని తెరిచి "తాళం" గాని, వాణ్ని పిలిచే "రాగం"గానీ లేదని చెబుతూ,

ఏ స్థితిలోనూ, నిరాశనీ, చీకటి కోణాలనీ చూడడం యిష్టంలేకపోవడం వల్ల సముద్రాన్ని ప్రతీకగా తీసుకుని, ప్రతి రోజూ పడమర చీకటిలో "అస్తమిస్తున్న" సూర్యుణ్ణి, బడబాగ్ని రగిలె తన కడుపులో దాచుకుని, మరుసటి రోజు కొత్త ఆయువిచ్చి తూర్పు నింగి

మీద నిలిపే సముద్రంలోని ఆశ, అలలుగా ఆకాశాన్నందుకోవడంలో విఫలమైనా, అవిరిగా మేఘమై అంబరాన్ని తాకి, నీలిమను, చినుకులుగా కరిగించి నేలకు తీసుకువచ్చే నిరంతర ఆశాలాపనని చిత్రీకరించాను.

*****

పల్లవి: పూలవెల్లువ సూడె - సిన్నెక్క పిల్ల పాలనవ్వుల్లోన సిన్నెక్క
రేపో మాపో పెళ్ళి నువు అత్తారింటికి వెళ్ళి
చేమంతమ్మా సీమంతానికి రావే మళ్ళి ||పూల||

కన్నుపాపలాగ నన్ను కాపాడేటి తల్లి గోదారమ్మ ప్రేమ
దూరదేశం వెళ్ళి పెళ్ళి సంబంధాన్ని ఏరి కోరి తెచ్చెనమ్మా
చేసే పూజలు చూసి నువు నోచే నోములు పూచి
శుభలగ్నం తానే చేరేనమ్మా ఏ దారమ్మా గోదారమ్మా ||పూల||

ఆగమేఘాలెక్కి మాఘమాసం వచ్చి
ఆటపట్టించింది నిన్ను
లేతబుగ్గల్లోకి వేడిసిగ్గులు పాకి
భారమైపోయింది వెన్ను ||ఆగ||

చాల్లే వేళాకోళం ఆపండే అల్లరిమేళం
నువ్వు వెయ్యాలమ్మా గోదారమ్మ
వీరికి నోటికి తాళం
పిల్లవయ్యారాలు తూగుటుయ్యాలెక్కి
ఊగుతున్నాయమ్మ గారాబంగా ||పూల||

(గౌతమి చిత్రంలో బాలు సంగీత సారథ్యంలో ఎస్.పి. శైలజ పాడినది)

*****

పల్లవి: సిగ్గుపూబంతి ఇసిరే సీతామాలచ్చి
మొగ్గాసింగారం ఇరిసే సుదతి మీనాక్షి
సొగసు సంపెంగ గుత్తులు మెత్తగ తాకంగా
రాముని సిత్తంలో కాముడు సింతలు రేపంగా ||సిగ్గు||

అతడు: విరజాజి పూలబంతి అరసేత మోయలేని సుకుమారి ఈ సిన్నదేనా
శివుని విల్లు మోసిన జాణ ఈ సిన్నదేనా
ఔరా! అని రామయ కన్నులు మేలమాడి నవ్విన సిన్నెలు- సూసి
అలకలొచ్చిన కలికి - ఏసినాది కులుకుల మొలికి ||సిగ్గు||

శిరసొంచి కూరుసున్నా! గురిసూసి సేరుకున్నా!
సిలకమ్మ కొసుసూపు సొరు గొండుమల్లె చెండుల జోరు
తేదే ఆ సూపుల తళుకు ముసురుకున్న రామయరూపు
మెరిసే నల్లమబ్బైనాది - వలపుజల్లు వరదైనాది ||సిగ్గు||

(స్వయంకృషి చిత్రానికి రమేష్ నాయుడు సంగీత సారథ్యంలో బాలు, జానకి పాడినది)

*****

పల్లవి:

అతడు: ఔరా అమ్మకచెల్లా! ఆలకించి నమ్మటమెల్లా

అంత వింత గాధల్లో - ఆనందలాల!

కోరస్: అమ్మలాల! పైడి కోమ్మలాల!- వీడు ఏఁవయాడె

జాడ లేడియాల కోటి తందనాల - ఆనందలాల

గోవులాల పిలంగోవులాల గొల్లభాఁవలాల

ఏడ నుందియ్యాల నాటి నందనాల- ఆనందలీల

అతడు: ఔరా అమ్మకచెల్లా! ఆలకించి నమ్మటమెల్లా

అంత వింతగాధల్లో - ఆనందలాల!

ఆమె: బాపురే బ్రహ్మకు చెల్లా! వైనఁవంత వల్లించవల్లా?

వ్రేపల్లె వాడల్లో - ఆనందలీల!!

అతడు: అయినవాడె అందరికీ

అయినా అందడు ఎవ్వరికీ

ఆమె: బాలుడా గోపాలుడా లోకాల పాలుడా

తెలిసేది ఎలా ఎలా ఛాంగుభళా! ||ఔరా||

ఆమె: నల్లరాతి కండలతో కరుకైనవాడే

వెన్నముద్ద గుండెలతో కరుణించుతోడే

అతడు: నల్లరాతి కండలతో కరుకైనవాడే - ఆనందలాల!

వెన్నముద్ద గుండెలతో కరుణించుతోడే - ఆనందలీల!!

ఆమె: ఆయుధాలు పట్టను అంటూ బావబండి తోలిపెట్టే - ఆనందలాల!

అతడు: జాణ జానపదాలతో జ్ఞానగీత పలుకునటే - ఆనందలీల!! ||బాలుడా||

**ఆమె: ఆలమంద కాపరిలా కనిపించలేదా- ఆనందలాల!**

**అతడు: ఆలమందు కాలునిలా అనిపించుకాదా - ఆనందలీల!!**

**ఆమె: వేలితో కొండను ఎత్తే కొండంత వేలుపట్టే - ఆనందలాల!**

**అతడు: తులసీదళానికే తెలిపోయే తూగునటె - ఆనందలీల!!** ||బాలుడా||

(ఆపద్బాంధవుడు చిత్రానికి కీరవాణి సంగీతదర్శకత్వంలో బాలు, చిత్ర పాడినది)

(కొనసాగింపు వచ్చే సంచికలో)

●●●

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 6

పల్లవి: ఆకాశంలో ఆశల హరివిల్లు  
ఆనందాలే పూసిన పొదరిళ్ళు  
అందమైన ఆ లోకం అందుకోనా  
ఆదమరిచి కలకాలం వుండిపోనా ||ఆకాశం||

మబ్బుల్లో తుళ్ళుతున్న మెరుపైపోనా  
వయ్యారి వానజల్లై దిగిరానా  
సంద్రంలో పొంగుతున్న అలనైపోనా  
సందేళ రంగులెన్నో చిలికేనా

పిల్లగాలే పల్లకీగా దిక్కులన్నీ చుట్టిరానా
నాకోసం నవరాగాలే నాట్యమాడెనుగా ||ఆకాశం||

స్వర్గాల స్వాగతాలు తెలిపే గీతం
స్వప్నాల సాగరాల సంగీతం
ముద్దొచ్చె తారలెన్నో మెరిసే తీరం
ముత్యాల తోరణాల ముఖద్వారం
శోభలూరె సోయగాన చందమామ మందిరాన
నాకోసం సురభోగాలే వేచి నిలిచెనుగా ||ఆకాశం||

**** ****

(స్వర్ణకమలం చిత్రంలో ఇళయరాజా సంగీత సారథ్యంలో ఎస్. జానకి పాడినది)

అతడు: ఘల్లు ఘల్లు ఘల్లుమంటు మెరుపల్లే తుళ్ళు
ఝల్లు ఝల్లు ఝల్లున ఉప్పొంగు నింగి ఒళ్ళు
నల్లమబ్బు చల్లనీ చల్లని చిరుజల్లు
పల్లవంచనీ నేలకు పచ్చని పరవళ్ళు ||ఘల్లు ఘల్లు||
ఆమె: ఘల్లు ఘల్లు ఘల్లుమంటు మెరుపల్లే తుళ్ళు
ఝల్లు ఝల్లు ఝల్లున ఉప్పొంగు నింగి ఒళ్ళు
వెల్లువొచ్చి సాగనీ తొలకరి అల్లర్లు
ఎల్లలన్నవె ఎరగని వేగంతో వెళ్ళు ||ఘల్లు ఘల్లు||

అతడు: లయకే నిలయమై నీ పాదం సాగాలి

మలయానిల గతిలో సమబాలగ తూగాలి

ఆమె: వలలో ఒదుగునా విహరించే చిరుగాలి

సెలయేటికి నటనము నేర్పించే గురువేడి

అతడు: తిరిగే కాలానికీ ||2|| తీరొకటుంది

ఆమె: అది నీ స్వార్థనికి దొరకను అంది

అతడు: నటరాజస్వామి జటాజూటిలోకి చేరకుంటె

విరుచుకుపడు సురుగంగకు విలువేముంది ||2|| ||ఘల్లు||

ఆమె: దూకే అలలకు ఏ తాళం వేస్తారు

కమ్మని కలలపాట ఏ రాగం అంటారు

అతడు: అలలకు అందునా ఆశించిన ఆకాశం

కలలా కరగడమా జీవితాన పరమార్థం

ఆమె: వద్దని ఆపలేరు ||2|| ఉరికే ఊహని

అతడు: హద్దులు దాటరాదు ఆశల వాహిని

ఆమె: అదుపెరుగని ఆటలాడు వసంతాలు వలదంటె

విరివనముల పరిమళముల విలువేముంది ||ఘల్లు||

**** ****

(స్వర్ణకమలం చిత్రంలో ఇళయరాజా సంగీత సారథ్యంలో బాలు, సుశీల పాడినది)

అతడు: శివపూజకు చివురించిన సిరిసిరిమువ్వా ||సిరి|| ||2||

మృదుమంజుల పదమంజరి పూచిన పువ్వా ||సిరి||

యతిరాజుకు జతిస్వరముల పరిమళమివ్వా ||సిరి||

నటనాంజలితో బ్రతుకును తరించనీవా ||సిరి||

ఆమె: పరుగాపక పయనించవె తలపుల నావా

కెరటాలకు తలవంచితె తరగదు త్రోవ

ఎదిరించిన సుడిగాలిని జయించినావా

మదికోరిన మధుసీమలు వరించిరావా ||పరు||

అతడు: పడమర పడగలపై మెరిసే తారలకై

రాత్రిని వరించకే సంధ్యాసుందరీ!

తూరుపు వేదికపై, వేకువ నర్తకివై

ధాత్రిని మురిపించే కాంతులు చిందనీ!

నీ కదలిక చైతన్యపు శ్రీకారం కానీ

నిదురించిన హృదయరవళి ఓంకారం కానీ ||శివ||

ఆమె: తనవేళ్ళే సంకెళ్ళై కదలలేని మొక్కలా

ఆమనికై ఎదురుచూస్తూ ఆగిపోకు ఎక్కడా

అవధిలేని అందముంది అవనికి నలుదిక్కులా

ఆనందపు గాలివాలు నడవనీ నిన్నిలా

ప్రతిరోజొక నవగీతిక స్వాగతించగా

వెన్నెల కిన్నెరగానం నీకు తోడుగా ||పరుగాపక||

అతడు: చలిత చరణ జనితం నీ సహజ విలాసం

జ్వలిత కిరణ కలితం సౌందర్యవికాసం

నీ అభినయ ఉషోదయం తిలకించిన రవినయనం

గగన సరసి హృదయంలో

వికసిత శతదళ శోభిత సువర్ణకమలం ||పరుగాపక||

**** ****

(స్వర్ణకమలం చిత్రంలో ఇళయరాజా సంగీత సారథ్యంలో బాలు, సుశీల పాడినది)

అతడు: కొత్తగా రెక్కలొచ్చెనా! గూటిలోని గువ్వపిల్లకి
మెత్తగా రేకు విచ్చెనా- కొమ్మ చాటునున్న కన్నెమల్లికి ||కొత్తగా||

అతడు: కొండదారి మార్చింది కొంటెవాగు జోరు
ఆమె: కులుకులెన్నొ నేర్చింది కలికి ఏటి నీరు
అతడు: బండరాళ్ళ హోరు మారి పంటచేల పాటలూరి
సిరిచిందులేసింది కనువిందు చేసింది ||కొత్తగా||

అతడు: వెదురులోన ఒదిగింది కుదురులేని గాలి
ఆమె: ఎదురులేక ఎదిగింది మధురగానకేళి
అతడు: భాషలోన రాయలేని రాసలీల రేయిలోని
ఆమె: యమునా తరంగాల కమనీయ శృంగార
కళలెన్నొ చూపింది కలలెన్నొ రేపింది ||కొత్తగా||

(స్వర్ణకమలం చిత్రంలో ఇళయరాజా సంగీత సారథ్యంలో బాలు, ఎస్.జానకి పాడినది)

ఆమె: అందెల రవమిది పదములదా అంబరమంటిన హృదయముదా
అమృతగానమిది పెదవులదా అమితానందపు ఎదసడిదా

అతడు: సాగిన సాధన సార్థకమందగ యోగ బలముగ యాగఫలముగ
బ్రతుకు ప్రణవమై మ్రోగు కదా... ||అందెల||

అతడు: మువ్వలు ఉరుముల సవ్వడులై - మెలికలు మెరుపుల మెలకువలై
మేను హర్షవర్ష మేఘమై- వేణి విసురు వాయువేగమై
అంగభంగిమలు గంగపొంగులై హావభావములు నింగిరంగులై
లాస్యం సాగే వేళ రసఝురులు జాలువారేలా
జంగముమై జాడమాడదా జలపాతగీతముల తోడుగా
పర్వతాలు ప్రసరించిన పచ్చని ప్రకృతి అకృతి పార్వతి కాగా ||అందెల||

నయన తేజమే 'న' కారమై
మనో నిశ్చయం 'మ' కారమై
శ్వాసచలనమే 'శి' కారమై
వాంఛితార్థమే 'వ' కారమై
యోచన సకలము 'య' కారమై
నాదం 'న' కారం, మంత్రం 'మ' కారం
స్తోత్రం 'శి' కారం వేదం 'వ' కారం
యజ్ఞం 'య' కారం ఓం నమశ్శివాయ
భావనే భవునకు భావ్యము కాగా
భరతమే నిరతము భాగ్యము కాగా
తుహిన గిరులు కరిగేలా తాండవమాడేవేళ
ప్రాణపంచకమె పంచాక్షరిగా పరమపదము ప్రకటించగా
ఖగోళాలు పదకింకిణులై పదిదిక్కుల ధూర్జటి ఆర్భటివేగా ||అందెల||

(స్వర్ణకమలం చిత్రంలో ఇళయరాజా సంగీత సారథ్యంలో బాలు, వాణిజయరాం పాడినది)

వరుసగా మూడోసారి నాకు (1988) 'నంది' అవార్డు తెచ్చిపెట్టిన 'స్వర్ణకమలం' పాటలంటే నాకు ప్రత్యేకమన మక్కువ. ఎందుకంటే 'స్వర్ణకమలం' చిత్రకథే ఓ 'పొయట్రీ'. ప్రతివ్యక్తి తనకు పుట్టుకతో వచ్చిన విద్య పట్ల శ్రద్ధ, గౌరవం కన్నా, ఏదో తనకి రానివీ, అందనివి అయినదానిపట్ల ఎక్కువ ఆసక్తి చూపిస్తుండడం మనం చాలా సందర్భాలలో గమనిస్తుంటాం. ఏదో తనకు వచ్చిన విద్యని పనిని చేసుకుపోతూ వుండడమే కాకుండా, "తనకు వచ్చిన ఆ విద్య చాలా మందికి రాదని, ఆ పని చెయ్యడంలో తాను చాలామంది కన్నా 'నిపుణుడ' అనే ఒక చిన్న గర్వాన్నీ, ఆత్మగౌరవాన్నీ కలిగించుకున్న మనిషి ఏ పని చేసినా ఎంతో ఆనందాన్ని పొందగలుగుతాడు. ఆ అనుభూతి కేవలం అనుభవైక వేద్యమే కానీ మాటల్లో చెప్పలేనిది ఇలా మాటలకందని భావాల ఇతివృతమే విశ్వనాధ్‌గారి 'స్వర్ణకమలం' చిత్రం.

మీనాక్షి (భానుప్రియ) పాత్ర, స్వతఃసిద్ధంగానే, తండ్రి వారసత్వం కారణంగా, అడుగువేస్తేనే నెమలి నాట్యమా! అనిపించేంత నాట్యకళానైపుణ్యంతో పుట్టినప్పటికి కూడా, ఆ నాట్యకళానైపుణ్యంతో పుట్టినప్పటికి కూడా, ఆ నాట్యకళ పట్ల ఒక రకమైన 'నిరసన'ను పెంచుకుని, డబ్బు సంపాదించాలనీ, ఉద్యోగాలు చేయాలనీ, ఊళ్ళేలాలనీ, దానికోసం చివరికి ఈ హోటల్లో రిసెప్షనిస్టు ఉద్యోగం చెయ్యడమే నాట్యకళారాధన కంటే మేలని తలచే మనస్తత్వం కలది. తనలోని నాట్యకళను తన కూతురిలో చూసుకోవాలనే తపనగల ఆమె తండ్రి. చిత్రంలో ఇంకో పాత్ర చంద్రం. స్వతఃసిద్ధంగా చిత్రకారుడు, కళాత్మకమైన హృదయం వున్నవాడు. మీనాక్షికి సహజంగా అబ్బిన నాట్యకళను పైకి తీసుకురావాలనుకునేవాడు. దీని పట్టించుకోకుండా, అతన్ని తప్పించుకుని తిరిగే ఆ అమ్మయికి అతనికి మధ్య జరిగిన సంఘర్షణ అనే భావాన్ని 3 పాటలుగా చెప్పవలసివచ్చింది. ఈ పాటలకి మూలం వారిద్దరికీ జీవితం, కళల పట్ల గల అభిప్రాయ వైవిధ్యం.

1. ఆకాశంలో ఆశల హరివిల్లు పాతలో ఆ అమ్మయి నాకు చుక్కల్లో ఎగిరిపోవాలనుంది. మబ్బుల్లో మెరుపైపోవాలనుంది లాంటి భావాల్ని వ్యక్తీకరిస్తుంది. దీన్ని గమనిస్తే, ఆ అమ్మయికి నేల మీద కుదురుగా ఉండి నృత్యం చేయడం కన్న, ఏ అడ్డు ఆపూ లేని చిరుగాలిలా చిందులు వేయడమే ఇష్టం- అన్న భావం తెలుస్తుంది.

2. ఘల్లు ఘల్లు ఘల్లుమంటు అన్నపాటలో వీరిద్దరూ తమతమ అభిప్రాయాలను ప్రకటించడం జరుగుతుంది.

3. 'శివపూజకు చివురించిన' అన్న పాతలో కూడా దాదాపు ఇదే భావం వెల్లడించడం జరుగుతుంది.

పై మూడు పాటల్లోనూ కూడా వీరిద్దరూ తమ అభిప్రాయమే సరైంది. అవతలివాళ్లనుకునేది తప్పు అనుకునే స్థితిలో ఉంటారు. అంచేత ఇలాంటి భావచిత్రీకరణని పాటల్లో పెట్టాల్సి వచ్చినప్పుడు కొన్ని ముఖ్యమైన అంశాలు గుర్తుంచుకోవాల్సుంటుంది. పాటలో ఎవరిపాత్రవైపు ఆలోచించినా వారి వాదనే సరైనది, 'నిజం' అనిపించేలా ఉండాలి. అలా ఈ శిల్పాన్ని ఈ మూడు పాటల్లోనూ ఎలా మలిచాను, అందులో ఎంతవరకు న్యాయం చేకూర్చాను అన్న విషయం నేను ఇంకా వివరించే బదులు పై ఉపోద్ఘాతంలో ఆ పాటల్ని

పరిశీలించి చూస్తే మీకుగా తెలుస్తుంది.

తర్వాత, ఆ అమ్మాయిలో మార్పు వచ్చినప్పుడు 'కొత్తగా రెక్కలొచ్చెనా గూటిలోని గువ్వపిల్లకి' అన్న పాటలో వ్యక్తీకరించడం జరుగుతుంది. ఐతే, ఇందులో ఓ విశేషం ఉంది. ఆ అమ్మయి తప్పు తెలుసుకున్నా, పశ్చత్తాపం వెలిబుచ్చకుండా, అతని వాదననంగీకరిస్తూనే అతనికిష్టమైన మార్పు తనకీ ఇష్టమనే భావనను సూచిస్తుంది. (వెదురులోకి ఒదిగింది కుదురులేని గాలి ). ఇందులో అతను ఆమెను దెప్పుతున్నట్లునో, వెక్కిరిస్తున్నట్టుగానో అనిపించకూడదు. అలాగే ఏ విషయం మీద అతనితో సంఘర్షణ పెట్టుకుందో, అదే విషయంలో రాజీ పడకుండా, ఓటమినంగీకరించకుండా తనదైన శైలిలో అతనితో ఏకాభిప్రాయానికి రావడం అన్న అంశం స్ఫుటంగా కనిపిస్తుంది.

-ఇలా జరిగాక ఒక సందర్భంలో చంద్రం మీనాక్షిని గురుపూర్ణిమ జరుపుకుంటున్న ఓ నాట్యమండలికి తీసుకెళ్తాడు. అక్కడున్న విద్యార్థులందరూ ఆ రోజు పూజిస్తున్నది ఆమె తండ్రినే. ఆయన వంశానుగతంగా ఇచ్చిన ఆ కళని అన్నాళ్ళూ ఈసడించుకోవడం, ఆ భావనే తన తండ్రి చావుకి పరోక్షంగా కారణమవడం ఇవన్నీ ఆమెకి ఒక్కసారి స్ఫురణకి వచ్చి పశ్చత్తాపంతో మెదటిసారిగా మువ్వలు ముట్టుకున్న ఆమెలోని భావోద్రేకం, దర్శకులు విశ్వనాథ్‌గారు వర్ణించి చెప్పిన తీరు, ఆ సన్నివేశానికి 'అందెల రవమిది పదములదా?' అన్న పాట రాయడంలో నేపథ్యం. ఆయన నాకిచ్చిన ప్రోత్సాహం, ప్రోద్బలం ఇవన్నీ మాటల్లో చెప్పలేను. ఎన్నాళ్ళ నుంచో కళ సభ్యసించినా, ఆ రోజు ఆ అమ్మయి మెదటిసారిగా తన కోసం, తన ఆత్మానందం కోసం నృత్యం చేస్తుంది. ఇక్కడ ఓ చిన్న గమ్మత్తైన విషయం జరుగుతుంది. ఆమె ఓ అవర్తం నాట్యం చేసి అలసిపోయి ఆగిపోతుంది. అయినా కూడా మనసు నాట్య ప్రపంచాన్ని కొత్తగా చూస్తున్నట్లు, శివుని పాదాల చెంత ఉంచిన సిరిమువ్వలు, ఆయన జటాజూటిలోని గంగతో తడిసి, పవిత్రమైనట్లు కళలో గల అర్థం పరమార్థం తేటతెల్లమై 'అందెల రవమిది పదములదా, అంబరమంటిన హృదయముదా అమృతగానమిది పెదవులదా, అమితానందపు ఎద సడిదా' అనే ఓ అద్భుతమైన భావనలో లీనమై, తనలో తాననుకుంటూన్న మాట. అదే తీరులో, అతడు ఆమెను ప్రోత్సాహపరుస్తూ, ఆమె మాటలకి లింక్ లేకుండా తనదైన శైలిలో స్వతంత్ర భావాన్ని వ్యక్తీకరించాలి. 'సాగిన సాధనె సార్థకమందగా, యోగఫలముగా, యాగఫలముగా బ్రతుకు ప్రణవమై మ్రోగు కదా! ' అలా ఆమె ఆశ్చర్యానుభూతితో వేసే ప్రశ్నలకి అతడు సమాధానమివ్వడం జరిగింది. ఈ ఆవిష్కరణలో పనిలో నిమగ్నమై, శరీరం ప్రకృతిలో మమేకమై, తానే ప్రకృతి అన్న భావనాచిత్రంతో, కవితాత్మకంగా ఈ పాటనావిష్కరించిన గొప్ప అవకాశాన్ని శ్రీ విశ్వనాథ్‌గారు స్వర్ణకమలం ద్వారా నాకివ్వడం, ఈ చిత్రానికి నంది అవార్డు రావడం, ఎంతో మంది ప్రశంసల్నీ, అన్నింటికీ మించి కొండంత ఆత్మతృప్తినీ పొందేలా చేసింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

### 7

పల్లవి: తెలిమంచు కరిగింది తలుపుతీయనా ప్రభూ!

ఇల గొంతు వణికింది పిలుపునీయనా ప్రభూ!

నీ దోవ పొడువునా కువకువలా స్వాగతం

నీ కాలి అలికిడిని మెలకువల వందనం ||తెలిమంచు||

ఈ పూల రాగాల పులకింత గమకాలు

గారాబు కవనాల గాలి సంగతులు

నీ చరణ కిరణాలు పలుకరించినా చాలు

పల్లవించును ప్రభూ! పవళించు భువనాలు

భానుమూర్తీ! నీ ప్రాణకీర్తన విని

పలుకనీ ప్రణతులనీ ప్రణవశృతినీ

పాడనీ ప్రకృతినీ ప్రథమ కృతినీ ||తెలిమంచు||

★★★★ ★★★★

భూపాల! నీ మ్రోల ఈ బేల గానాలు

నీ రాజసానికవి నీరాజనాలు

పసరు పవనాలలో పసికూన రాగాలు

పసిడి కిరణాల పడి పదును తేలిన చాలు

తలయూచు తలిరాకు బహుపరాకులు విని

దోరలనీ దోరనగవు దొంతరనీ

తరలనీ దారి తొలగి రాతిరిని ||తెలిమంచు||

**** ****

(స్వాతికిరణం చిత్రానికి కె.వి. మహదేవన్ సంగీత సారథ్యంలో వాణిజయరాం పాడినది)

ఆమె : జాలిగా జాబిలమ్మ రేయిరేయంతా

రెప్ప వెయ్యనే లేదు ఎందుచేత ఎందుచేత?

ఆమె2: పదహారు కళలని పదిలంగా పుంచనీ

ఆ కృష్ణ పక్షమే ఎదలో చిచ్చు పెట్టుట చేత ||జాలిగా||

ఆమె: కాటుక కంటినీరు పెదవులనంటనీకు

చిరునవ్వు దీపకళిక చిన్నబోనీకు

నీ బుజ్జి గణపతిని బుజ్జగించి చెబుతున్నా

నీ కుంకుమకెపుడూ ప్రొద్దుగుంకదమ్మ ||జాలిగా||

సున్నిపిండి నలిచి చిన్నారిగా మలిచి

సంతసాన మునిగింది సంతులేని పార్వతి

సుతుడన్న మతిమరచి శూలాన మెడవిరిచి

పెద్దరికం చూపె చిచ్చుకంటి పెనిమిటి

ప్రాణపతినంటుందా బిడ్డగతి కంటుందా

ఆ రెండు కళ్ళల్లో అది కన్నీటి చితి

కాలకుటంకన్నా ఘాటైన గరళమిది

గొంతునులుమే గురుతై వెంటనే వుంటుంది

ఆటు-పోటు ఘటనలివి ఆటవిడుపు నటనలివి

ఆమె2: ఆదిశక్తివి నీవు - అంటవు నిన్నేవి

నీ బుజ్జిగణపతిని బుజ్జగించి చెబుతున్నా

కంచికెళ్ళిపోయేవే కథలన్నీ ||జాలిగా||

(స్వాతికిరణం చిత్రానికి కె.వి. మహదేవన్ సంగీత సారథ్యంలో వాణిజయరాం, చిత్ర పాడినది)

"స్వాతి కిరణం" సినిమా కోసం రాసిన "తెలిమంచు కరిగింది", "జాలిగా జాబిలమ్మ!" అనే రెండు పాటలు, ఈ భావతరంగంలో కనిపిస్తాయి.

దేశం పట్టనంత ఖ్యాతి సంపాదించుకున్న సంగీత సార్వభౌముడు అనంతరామశర్మగారు, అటువైపుగా వెళుతూ ఆ ఊరు వస్తున్నారు. ఆ ఊళ్ళో ఓ చిన్న హోటల్ నడుపుకునే ధర్మవరపు సుబ్రమణ్యానికి శాస్త్రీయ సంగీతం అంటే వల్లమాలిన భక్తి. ఆ భక్తికి సంగీత భారతి కరుణించి వరమిచ్చునట్టుగా, ఆ తల్లి వీణలోంచి ఓ స్వరం జారిపడి, సుబ్రమణ్యంగారి కొడుగ్గా జన్మించడం, ఆ

పసివాడు పుడుతూనే సరిగమల పరిమళాలను పదిదిక్కుల్లోనూ వెదజల్లుతూ ఆ చిన్న ఊరు సరిపోనంత త్రివిక్రముడుగా పెరుగుతున్నాడు. వాడి ప్రతిభని గుర్తించి, దానికి సానబెట్టాలనీ, అమ్మానాన్న వాణ్ణి ఆ ఊళ్ళో ఉన్న ఓ పాటి సంగీత విదుషీమణి పక్షితీర్థం మామ్మగారి దగ్గర పాఠానికి కూర్చోబెట్టారు. ఆవిడకి తెలుసు తన దగ్గరున్న జ్ఞానం ఆ పసివాడి ప్రతిభ కన్నా చిన్నదని. అంతే కాదు గంధర్వ గగన వీధిలో మధ్యందిన మార్తాండుడిలా ప్రకాశిస్తున్న అనంతరామశర్మగారంటే అవిడ దృష్టిలో సాక్షాత్తు పుంభావ సరస్వతీ స్వరూపం. అలాంటి మహానుభావుడి దగ్గర ఈ పసివాడు శిష్యుడిగా చేరితే వాడి ప్రతిభకి పట్టాభిషేకం జరుగుతుంది. అదే ఆవిడ ఆశ. అవిడ కన్న కల నిజమౌతుందనిపించేలా సాక్షాత్తు అనంత రామశర్మగారే ఆ ఊరికి  వస్తున్నారనీ, తన ఇంట్లోనే విడిది చేస్తారని తెలిసింది. ఆవిడ ఆనందానికి అంతులేదు. ఎలాగైనా ఈ గంగాధరం చేత ఆయన సమీక్షంలో ఓ పాట పాడిస్తే అది ఆయన్ని ఆకట్టుకుంటే.... ఆయన వాణ్ణి శిష్యుడిగా స్వీకరిస్తే, ఈ అయితే గియితేలన్నీ సవ్యంగా ఒక కొలిక్కి చేరితే, గంగాధరం జన్మే కాదు తన తపస్సు కూడా పండుతుందని ఆవిడ గంగాధరానికి ఒక పాట నేర్పింది శర్మగారి ముందు పాడించాలని.

"తెలిమంచు..." పాటలో వున్న "ఆత్మ" ని అవిష్కరించటానికి, ఈ పాట కథ చెప్పుకోక తప్పదు. ఎందుకంటే, ఆ పాట రాసేముందు ఎలాంటి పాట రాయలో, నా మనసు కడలిలో ఎగసి పడిన కల్లోల తరంగాలు అలాంటివి.

అనంత రామశర్మగారు విద్వత్తులోనూ, కీర్తిలోనూ మాత్రమే కాదు, స్వభావంలో కూడా మిట్ట మధ్యాహ్నం మండిపడే సూర్యుడిలాంటి వాడే. తన కన్న తక్కువ వాళ్ళ సరసన తనను కూర్చో పెట్టినందుకు అలిగి "పద్మశ్రీ" అవార్డునే కాలదన్నిన చండప్రచండుడైన దురహంకారి. అలాంటివాణ్ణి, ఏ పాటతో, ఆ పాటలోని ఏ మాటతో చల్లబర్చాలి?

సాధరణంగా ఇలాంటి సందర్భాల్లో, గంగాధరం నోట ఏ త్యాగరాజ స్వామి కీర్తనో పలికించేస్తే ఓ పనయిపోతుంది. కాని విశ్వనాథ్‌గారు నన్ను ఆ పాట రాయమన్నారు.

ఒక దారి దొరికింది. నేను రాయాల్సిన పాట గంగాధరం వయసుకి, వాడి భాషకీ, వాడి వయస్సుకి తగిన చిన్న భావానికి కట్టుబడి ఉండక్కర్లేదు. ఎందుకంటే, అది వాడు తనంత తానుగా పాడడం లేదు. పక్షితీర్థం మామ్మగారు నేర్పింది పాడుతున్నాడు.

ఈ దొరికిన చిన్న దారి పట్టుకుని, మూడు ప్రయోజనాలు సాధించ దల్చుకున్నాను.

1. పుట్టి బుద్ధెరిగిన్నాటినుంచి శర్మగారి పట్ల, ఆయన విద్య పట్ల ఎంతో భక్తిని పెంచుకుంటూ వచ్చిన పక్షితీర్థం మామ్మగారు ఆయన పట్ల తనకున్న భక్తి గౌరవాలన్నీ ఈ పాటి ద్వారా వ్యక్తపరచవచ్చు, తద్వారా తన పూజ పూర్తయినట్లవుతుంది. ఆ మహా తేజస్విని ప్రసన్నుణ్ణి చేసుకున్నట్టు అవుతుంది.

2. ఈ పాట గంగాధరం నోట పలుకుతూ వుండాగా, ఆ పాటలో భావం, వాడు ఆయన్ని ప్రార్థిస్తూ ఆయన నీడకి చేరాలని ఆశ పడూతున్నట్టు, తన పసితనాన్ని అల్ప విద్యని చూసి తృణికరించకుండా, కన్నెర్ర చెయ్యకుండా, ముచ్చట పడి, చల్లని చూపుల దీవెన ఇమ్మని అడుగుతున్నట్టు ఉంటే బావుంటుంది.

3. ఈ పాటలో ఆయన ప్రతిభని స్తుతించాలి. అలా కీర్తించేటప్పుడు, ఆ మాటల్లో ఆయన గొప్పతనమే కాకుండా, ఆయన స్వభావం

కూడా కనబడాలి. అదికూడా, ఆయన విద్య సంగీతం కనక సంగీతానికి సంబంధించినదై వుండాలి.

ఈ మూడు ఫలితాలు ఒక్కసారే రాబట్టుకునే ప్రయత్నంలో నేను సూర్యుణ్ణి సంగీత విద్వాంసుడిగా భావించి పాట మెదలుపెట్టాను.

"ప్రపంచానికి ప్రాణకీర్తన వినిపిస్తున్నా ఓ భానుమూర్తీ! నువ్వు భూగోళం మీదకి ఉదయిస్తున్నప్పుడు నీ నులివెచ్చని కిరణాలు పడి దారి తెలియనివ్వని రాత్రి, అది కప్పిన తెలిమంచు పొరలు కరిగిపోతున్నాయి, నీ రాకపట్ల భక్తి వినయాలతో వణుకుతున్న భూమిని నేను. వినమ్రంగా శిరసువంచి నీకు స్వాగతాంజలి ఘటిస్తున్నాను. నీ దారిపొడవునా "మెలుకువలు" వందనం చెస్తున్నాయి. ఆ వందనాల పలుకులే, పిట్టల కువకువలు. అంతేగాని,

ఓ మహా విద్వాంసుడా! నువ్వు వస్తూ ఉంటే, నీ ముందే "భూపాల" రాగాల పాడగలవా ఈ బేల రాగాలు?

ఈ పూలలో రాగాలు(రంగులు) ఈ గాలిలో కూన రాగాలు, ఓ భూపాలా! నీకిరణాలు పడి, మెరిసి, మురిసిపోవాలని చూస్తున్నాయి. అవి నీ ముందు సంగీత కచ్చేరీ చేస్తూ తల పంకిస్తున్నాయని ఆగ్రహించకు. నీ కర (కరము అంటే చెయ్యి) స్పర్శతో ఈ ప్రకృతి అంతా వెలుగుతో ముందుకు వడిచేలా అనుగ్రహించు"

ఇలా ఇంతలా పాడమన్న ఈ పాట, గంగాధరం సవ్యంగా పాడి వుంటే ఏఁవయ్యేదో గానీ, వాడు ఆయన దగ్గర ఇంత శాస్త్రోక్తంగా ప్రవర్తించకుండా, పసితనపు చిలిపితనం ప్రదర్శించాడు. పసరు మావిచిగుళ్ళు తిని కుహు అని కోయిల తీపిగా కూసిన, వైశాఖంలో సూరీడు మరింత మండిపడ్డట్టయింది పరిస్థితి.

తరువాత, కథ కొంత ముందుకు కదిలింది. అందరికీ, వెలుగు పంచే సూర్యుడికి 'వెలుగు' అంటే ఏఁవిటో చెప్పాలా?

తను సూర్యుడైతే, పుడుతునే తనను పట్టుకొని పండులా గుటుక్కున మింగేసేందుకు ఎగిరిన అంజనేయుడంతటివాడని, గంగాధరాన్ని అందరికన్న ముందుగా అనంతరామశర్మగారు గుర్తించాడు. తన పేరుకు వైభవానికీ తొందర్లోనే వాడి వల్ల గ్రహణం పట్టేటట్లుందని ఈ చిరంజీవిని 'చిరంజీవి'గా ఎదగనిస్తే, అందరి దృష్టిలో వామనుళ్ళా కనిపిస్తున్న ఈ బుడతడు మూడే మూడడుగుల్లో త్రివిక్రమంగా ఎదిగిపోయి తనని అణిచేస్తాడని భయపడి, వాడిని శతవిధాలా అణగదొక్కే ప్రయత్నం చేసి, ఆఖరికి వాడి చావుకూడా కోరుకునే అసురసంధ్యలోకి దిగజారేడు.

ఆయన్ని ప్రత్యక్షదైవంగా భావిస్తున్న ఆయన భార్య ఈ పరిణామం తట్టుకోలేకపోయింది. బిడ్డలు లేని తనకి, బిడ్డని దత్తత తెచ్చినట్టుగా భావించింది గాని, ఇన్నాళ్ళు తన భర్త చేతుల్లో ఇంత కుట్ర వుందని గ్రహించలేకపోయింది. ఇన్నాళ్ళీ తన పాలిట దేవుడు అకస్మాత్తుగా తన పేగు చీల్చేసే దెయ్యంగా కనబడేసరికి, ఆ ఉత్పాతానికి ఆవిడ పెనుతుఫానులో చిగురుటాకులా వణికి పోయింది. ఆ ఆవేశంలో ఆయన కూడా, తన కడుపు మంటే గుండెలకెగదన్ని, హార్ట్‌ఎటాక్‌తో కూలబడ్డాడు. తన అయిదోతనం ఏమవుతుందో అన్న బెంగ. తన భర్తలోని కటికతనం పోల్చుకున్న బాధ.

ఈ పరిస్థితిలో గంగాధరం అవిణ్ణే ఓదార్చాలి. ఆ ఓదార్పులో తన బాధ తను దిగమింగుకోవడం కనిపించాలి. తనకు తల్లిప్రేమ

అందించినందుకు ఆవిడ ఋణం తీర్చుకోవడం కోసమో తను గురునిగా భావించినవాడు అడగకుండా అడిగిన గురుదక్షిణగా తన ప్రాణాలిచ్చేస్తున్నట్లు చెప్పాలి.

ఈ పాటలో భావం వాడి సొంతం కనక వాడి వయస్సుకి భాషా, భావంమించకూడదు.

చాలా తర్జన భర్జనలయ్యింతర్వాత ఆ సన్నివేశంలో పాట పెట్టడం సాధ్యం కాదు అని విశ్వనాథ్‌గారు ఒక నిర్ణయానికి వచ్చే సమయంలో,

"జాలిగా జాబిలమ్మ" పాట పుట్టింది.

"ఎప్పుడు నిండుపున్నమిలా చల్లగా నవ్వే నువ్వు ఎందుకేడుస్తున్నావమ్మ!" పదహారు కళలతో ఎదగవలసిన నా పున్నమి వెలుగుని, మింగెయ్యటానికి కృష్ణపక్షం కాటెయాడానికి సిద్ధంగా ఉందని తెలిసి!

ఈ "కృష్ణ" శబ్దంలో ఆమెకు తన భర్త పట్ల దైవత్వాన్ని సూచించాలని.

అతను ఓదార్చాడు. "నీ కుంకుమకి పొద్దు గుంకదు" అని. ఆయన కీర్తి సూర్యుడు. నీ సౌభాగ్య సూర్యుడు అస్తమించకుండా నేను అడ్డుతప్పుకుంటాననే సూచన.

ఆవిడ తన ఆవేదనని చెప్పుకుంది. పార్వతీదేవి సున్నిపిండీ వలిచి, ప్రాణప్రతిష్ఠ చేసుకున్న కొడుకుని సాక్షాత్తు తండ్రే (శివుడే) కుత్తుక నరికేశాడే. దేవుడైన భర్తను నిందించాలా? తెగిపోయిన సంతానబంధాన్ని చూసి దుఃఖంచాలా? శివుడే మింగేదు హాలహలం? శివుడే హాలహాలం అయితే ఆయన అర్ధశరీరం లాంటీ తను నిలువెల్లా దహింపబడుతోందే..." ఇలా సాగిన ఈ పాటలోని శిల్పాన్ని ఇంత కన్నా విస్తరించకుండా, సహృదయుల పరిశీలనకి విడిచిపెడుతున్నాను.

****

**మానసవీణ మౌన స్వరాన**

**ఝుమ్మని పాడే తొలి భూపాలం**

**పచ్చదనాల పానుపుపైన**

**అమ్మై నేల జో కొడుతుంటే**

**మానసవీణ మౌనస్వరాన......**

**పున్నమినదిలో విహరించాలి**

**పువ్వుల ఒళ్ళో పులకించాలి**

**పాపురమల్లే పైకెగరాలి**

తొలకరి జల్లై దిగిరావాలి

తారల పొదరింట రాతిరి మజిలీ

వేకువ వెనువెంట నేలకు తరలి

కొత్త స్వేచ్ఛ నందించాలి నా హృదయాంజలి ||మానస||

దూకే వాగు నా నేస్తం

చెలరేగే వేగమే ఇష్టం

అలలాగే నింగికే నిత్యం ఎదురీదే

పంతమే ఎపుడూ నా సొంతం

ఊహకు నీవే ఊపిరి పోసి

చూపవె దారి ఓ చిరిగాలి

కలలకు సైతం సంకెల వేసి

కలిమి ఎడారి దాటించాలి

తుంటరి తూనీగనై తిరగాలి

దోసెడు ఊసులె తీసుకువెళ్ళి

పేద గరిక పూలకు ఇస్తా నా హృదయాంజలి ||మానస||

దూకే వాగు నా నేస్తం

చెలరేగే వేగమే ఇష్టం

అలలాగే నింగికే నిత్యం ఎదురీదే

పంతమే అపుడూ నా సొంతం!

(స్పెక్ట్రం క్రియేషన్స్ 'హృదయాంజలి ' చిత్రానికి ఎ.ఆర్.రెహమాన్ సంగీత సారధ్యంలో బాలు పాడినది)

ఇది నాకు చాలా నచ్చిన పాట.

నేనుగా చాలాసార్లు పాడుకునే పాట.

ఆశ్చర్యమేమిటంటే ఇది ఒక డబ్బింగ్ సినిమాకి రాసిందే. డబ్బింగ్ సినిమాకి రాసేప్పుడు దానిలో ఉండే కష్టాలు, బాధలు, ఇబ్బందులు సంగతి అలా పక్క పెడితే ఒక సౌలభ్యం కూడ ఉంది. ఏమిటంటే అక్కడ సాహిత్యం గురించి పట్టుపట్టేవాళ్ళు చాలా తక్కువ మంది ఉంటారు. అందుకనే - ఈ పాట ఏ సినిమాలోది, ఏ సందర్భం లోది, ఎవరు పాడారు , ఎందుకు పాడుతారు అనే వివరణలేవీ ఇవ్వనక్కరలేకుండానే ఆ పాట స్వతంత్రంగా కవితగా నిలబడే ఎక్స్ప్రెషన్స్ తో వ్రాయగలిగాను. ఒక బంగారు పంజరంలోని ఓ రామచిలుక హృదయంలోని ఆనందాన్ని ఆవిష్కరించేటువంటి పాట ఎ.ఆర్.రెహమాన్ సంగీతంలో హృదయాంజలి అన్న సినిమాకి రాశాను.

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 8

పల్లవి: మోగుతున్న ఎదలో రాగమేముందో తెలుపనా...

పాట నాకు నేస్తం పాటేగా నా సమస్తం

పాట నాకు ప్రాణం ప్రతిపాట నా ప్రయాణం

జపించాను స్వరవేదమే తపించే ఎదరాగమై

వరించాను స్వరస్నేహమే తరిస్తాను జయగీతినై ||పాట||

అమృతానికై చేసే మథనం ఆగేనా

విలయమై విషవలయమై ఎదురొస్తున్నా

ఏకదీక్షగా సాగే పయనం ఆగేనా
అలసటై అడుగడుగునా ఎదకోస్తున్నా
యుగయుగాలుగా నింగి కౌగిలి అందలేని కడలి
నిలువలేదుగా నిముషమైన అనురాగ రాగరవళి
అలుపులేని ఆ మరణ ఘోష తన ఆదితాళమైంది
అష్టదిశలను అల్లుతున్న నా నాద యోగసరళి ||పాట||

★★★★ ★★★★

తీయతీయని కోయిలగానం అవుతున్నా
స్వరమాధురమై అనిపిస్తున్నా
అణువు అణువునా నిప్పుల గాయం అవుతున్న
తనువునే ఒక మురళిగా మర్చేస్తున్నా
అమ్మలాలితో గొంతుకలిపి మొదలైన బ్రతుకుగానం
వలపు గాలితో మలుపు తిరిగె నవయవ్వనాల గేయం
తల్లి వేలికి చెలియచేతికి అందనంత దూరం
ప్రణవసాగరం కోరుకున్న నా జీవరాగ తీరం **||పాట||**

**** ****

(పాడుతా తీయగా చిత్రానికి మహేష్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

పల్లవి : అతడు, ఆమె:

అహో! ఒక మనసుకు నేడే పుట్టినరోజు
అహో! తన పల్లవిపాడే చల్లని రోజు
ఇదే ఇదే కుహూ స్వరాల కానుక
మరో వసంత గీతిక జనించు రోజు ||అహో||

అతడు: మాటా పలుకు తెలియనిది మాటున వుండే మూగమది

కమ్మని తలపుల కావ్యమయే కవితలు రాసే మౌనమిది

ఆమె: రాగలరోజుల ఊఃఅలకి స్వాగతమిచ్చేరాగమిది

శృతిలయలెరుగని ఊపిరికి స్వరములు కూర్చే గానమిది

అతడు: ఋతువుల రంగులు మార్చేది- కల్పనలల్లిన మది భావం

బతుకును పాటగ మలిచేది మనసుల కదిలిన మృదునాదం

ఆమె: కలవని దిక్కులు కలిపేది- నింగిని నేలకి దింపేది

తనే కదా వారధి క్షణాలకే సారధి మనస్సనేది..... ||అహో||

అతడు: చూపులకెన్నడు దొరకనిది - రంగురూపు లేని మది

రెప్పలు తెరువని కన్నులకు స్వప్నాలెన్నో చూపినది

ఆమె: వెచ్చని చెలిమిని పొందినది వన్నెలకళ గల నిండుమది

కాటుక చీకటి రాతిరికి బాటను చూపే నేస్తమిది

అతడు: చేతికి అందని జాబిలిలా కాంతుల పంచే మణిదీపం

కొమ్మల చాటున కోయిలలా కాలం నిలిపే అనురాగం

ఆమె: అడగని వరములు కురిపించి అమృతవర్షిణి అనిపించే

అమూల్యమైన పెన్నిధి- శుభోదయాల సన్నిధి- మనస్సనేది ||అహో||

(అల్లరిప్రియుడు చిత్రానికి కీరవాణి సంగీత సారథ్యంలో బాలు, చిత్ర పాడినది)

ఈ పాట అల్లరి ప్రియుడు సినిమాలోనిది. దర్శకుడు శ్రీ రాఘవేంద్రరావు గారు సంగీత దర్శకులు ఎమ్.ఎమ్. కీరవాణి. కీరవాణిగారిచ్చిన ట్యూనుకు మనసు మీద ఒక పాట రాయమన్నారు శ్రీ రాఘవేంద్రరావు. నాకు చాలా సంతోషం కలిగింది. మనసు మీద పాటలు రాయటంలో గుత్తాధిపత్యం సాధించి తనదైన ముద్రని తిరుగులేకుండా వేసివున్న ఆత్రేయగారిని ఒకసారి స్మరించి మనసు గురించి రాయడానికి పూనుకున్నాను, మనసు అనేది ఒక ఏబ్‌స్ట్రాక్ట్ సబ్జెక్ట్. దానికొక స్పష్టమైన రూపంకానీ, నిర్వచనం కానీ లేవు.

ఒక మనసున్న మనిషి పుట్టిన రోజును ఆ మనసు యొక్క పుట్టిన రోజుగా భావన చేసి, ఆ మనసు యొక్క లక్షణాలు ఎన్ని రకాలుగా వుండగలవో అన్ని రకాలుగానూ చెప్పడానికి ప్రయత్నం చేసిన పాట ఇది .

పల్లవి: స్వప్నాల వెంట స్వర్గాల వేట
స్వప్నాల వెంట స్వర్గాల వేట
తుదిలేని దోబూచులాట
ప్రతివారి కంట కొలువున్నదంట కోరేటి బంగారు కోట
ఏ దారి వెంట ఏ తీరముందో తెలిపేటి వెలుగేమిటంట
తెలవారితే, కలతీరితే - కరిగేను ఈ దొంగాట

★★★★ ★★★★

కళ్ళారా చూస్తూనే ఉంటారు అంతా హృదయానికే వేస్తారు గంత
నిజమేమొ నీడల్లే ఉంటుంది చెంత మనసేమొ అటు చూడదంట
నాల్గుదిక్కుల్లో ఏదో మన సొంతం అది నాలుగుస్తంభాలాట
మునుముందె రాసుంది రానున్న గమ్యం కనిపిస్తే ఏముంది వింత
మనతో మనం, దొంగాటలు ఆడటమే బ్రతుకంత అర్థం

★★★★ ★★★★

కాలంతో ప్రతివారూ ఏదో ఒకనాడు ఆడాలి ఈ మాయజూదం
గెలిచేమో ఓడేమో అది ముఖ్యం కాదు ఆశలతో వెయ్యాలి పందెం
వరమేదో పొందాము అనుకున్నవారు - పోయింది పోల్చలేరు
పోగొట్టుకున్నాము అనుకున్నవారు - పొందింది చూడలేరు
విధి ఆడిన దొంగాటలో ఫలితాలు తేల్చేది ఎవరు?

**** ****

(దొంగాట చిత్రానికి రమణిభరద్వాజ్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

దొంగాట చిత్రంలో కోడి రామకృష్ణగారి దర్శకత్వంలో రమణీ భరద్వాజ గారు సంగీత దర్శకత్వం వహించారు. ఈ పాట రాయడానికి సిచ్యుయేషన్ గాని, పాత్రగాని ఏమిలేవు. ఇలాంటి 'ఏమి లేవు' పరిస్థితుల్లోనే సృజనాత్మకతను ప్రదర్శించటానికి కవికి వీలుంటుంది. ఒక క్లబ్బులో ఒకరెవరో ఏదో పాట పాడుతున్నారు. అది పతాక సన్నివేశం. సినిమాలోని పాత్రలన్నీ అక్కడ చేరుకుంటాయి. అందులో ఆ పాత్రల తాలూకు మనస్తత్వాలన్నీ ప్రతిబింబించేలా అర్థం రావాలి. ఈ సందర్భంలో ఒక చిన్న మాట చెప్తాను. సినిమా పాటకి ఒక ఉద్దేశ్యం వుంది ఏంటంటే సాధరణంగా సినిమా పాట తెరకే పరిమితమౌతుంది అంటే ఒకవేళ మనం కేసెట్ కొనుక్కుని వింటే అందులో ఈ పాట రాగం మీద అధారపడో, పాట తాలూకు మాధుర్యం మీద ఆధారపడో వుంటుంది. తెరమీద చూస్తే తప్ప దానికి సంపూర్ణమైన అర్థం గోచరించదు. కానీ అదే పాట, సినిమా బైట కూడా ఏ వివరణా వ్యాఖ్యానం సందర్భాలు చెప్పనక్కరలేకుండా స్వతంత్రంగా నిలబడగలిగినట్లయితేనే సార్థకమౌతుంది. ఆ పాటని సన్నివేశం కోసం చిత్రీకరించినప్పుడు అది సరిగ్గా సరిపోవాలని నేననుకుంటాను. అందువల్ల ఇలాంటి అవకాశాలు వచ్చినప్పుడు నేను సాధరణంగా తాత్విక ధోరణికి ఫిలసాఫికల్ ధోరణికి వెళ్తూంటాను. ఈ వెళ్ళే టప్పుడు భాషలో కఠినత్వం, భావంలో సంక్లిష్టత లేకుండా చూసుకుంటాను. అంటే, స్వప్నాల వెంటా స్వర్గాల వేట ఇలా భావం ఎక్కడికక్కడే పూర్తయిపోతుంది. ఇటువంటి ప్రక్రియ చేయడంలో కూడా నేను ముదటివాణ్ణి కాను. ఇంతకు మునుపెప్పుడో దీన్ని ఆత్రేయగారు సాధించారు. చెప్పదల్చుకున్న భావం ఎంత చిన్నదయినా... "అనుకున్నామని జరగవు అన్ని అనుకోలేదని ఆగవు కొన్ని" ఈ నాలుగు మాటలు ఎంత పొడిగా అనిపిస్తాయో గుండెల్ని తడిమి చూస్తే అంత తడిగానూ అనిపిస్తాయి అంత లోతుగానూ అనిపిస్తాయి. అంచేత ఇలాగ ప్రొజాయిక్ సింటెక్స్‌లో వింటూ ఓ భావాన్ని బరువు లేకుండా సరాసరి శ్రోతల హృదయాల్లోకి పంపగలిగితే, బావుంటుందేమో! అలాంటి పాటల్లో ఇదొకటి అనుకోవడం వల్ల దీన్ని భావ తరంగంలో చేర్చడం జరిగింది.

**పల్లవి: ఓ మైనా నీ గానం నే విన్నా**

**ఎటువున్నా ఏటవాలు పాట వెంట రానా**

**కమ్మని గీతాలే పంపి రమ్మని పిలిచావె**

**మరి రావే ఇకనైనా**

**కొమ్మల నడిగానె ప్రతిరెమ్మని వెతికానె**

**కనిపించవు కాస్తయినా**

**నీ కోసం వచ్చానే సావాసం తెచ్చానే**

**ఏది నా మది ఏమూలున్నా ||కమ్మని||**

ఎవరైనా... చూశారా ఎప్పుడైనా

ఉదయాన కురిసే వెన్నెల వానా

కరిమబ్బు లాటి నడిరేయి కరిగి

కురిసింది కిరణాలుగా

ఒక్కొక్కతార చినుకల్లె జారి

వెలిసింది తొలికాంతిగా

నీలాకాశంలో వెండి సముద్రంలా పొంగే ||ఓ||

నన్నేనా... కోరుకుంది ఈ వరాల కోనా

ఏలుకోనా... కళ్ళముందు విందులీక్షణాన

సీతాకోకచిలుకా తీసుకుపో నీ వెనుక

వనమంత చూపించగా

ఆ మొక్క ఈ మొలక అన్నీ తెలుసు కనుకా

వివరించు ఇంచక్కగా

కీకారణ్యంలో నీరెక్కే దిక్కై రానా || ఓ||

**** ****

(అంతం చిత్రానికి ఆర్.డి. బర్మన్ సంగీత సారథ్యంలో చిత్ర పాడినది)

పల్లవి: గుండెల్లో దడదడదడలాడే ఉరుములతో

కళ్ళల్లో భగభగభగ మండే మెరుపులతో

ఊహల్ని ఉప్పొంగించే ఒత్తిడి చిత్తడి

మబ్బుల్ని మత్తెక్కించే సుడిగాలి

కొండల్ని ఢీ కొట్టించే అల్లరి ఆవిరి

దిక్కుల్ని దిమ్మెక్కించే తొలకరి ||గుండెల్లో||

వెన్నెలంటే వెండిమంటే

నిజమిదే నమ్మరేఁ ?

కన్నులుంటే నన్నుకంటే

రుజువులే కోరవు

చీకట్లో జ్వలించినా చుక్కలా చేరునా

ఏకాకి ఏకాంతంలో కలిసేనా ||గుండెల్లో||

నిప్పుచెండై చుట్టుకుంటే

కరగడా సూర్యుడే

మంచుమంటై ముట్టుకుంటే

మరగడా చంద్రుడే

గంగమ్మ ఆయువునే తాకిన భగ్గున

సంద్రాన్ని ఆటాడించే చెడు దాహం ||గుండెల్లో||

(అంతం చిత్రానికి ఆర్.డి. బర్మన్ సంగీత సారథ్యంలో బాలు, చిత్ర పాడినది)

పల్లవి: నీ నవ్వు చెప్పింది నాలో నేనెవ్వరో ఏమిటో

నీ నీడ చూపింది నాలో ఇన్నాళ్ళ లోటేమిటో ||నీ నవ్వు||

నాకై సాచిన నీ చేతిలో చదివాను నా నిన్నని

నాతోసాగిన నీ అడుగులో చూశాను మన రేపుని

పంచేందుకే ఒకరు లేని - బతుకెంత బరువో అని
ఏతోడుకీ నోచుకోని - నడకెంత అలుపో అని

నల్లని నీ కనుపాపలలో - ఉదయాలు కనుపించనీ
వెన్నెల పేరే వినిపించనీ - నడిరేయి కరిగించనీ
నా పెదవిలోనూ ఇలాగ - చిరునవ్వు పుడుతుందనీ
నీ సిగ్గు నా జీవితాన తొలిముగ్గు పెడుతుందనీ ||నీ నవ్వు||

ఏనాడైతే ఈ జీవితం రెట్టింపు బరువెక్కునో
తనువూ మనసూ చెరిసగమని పంచాలి అనిపించునో
సరిగా అదే శుభముహూర్తం సంపూర్ణమయ్యేందుకు
మనమే మరో కొత్త జన్మం పొందేటి బంధాలకు ||నీ నవ్వు||

(అంతం చిత్రానికి ఆర్.డి. బర్మన్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

'నీ నవ్వు చెప్పింది నాతో' ఈ పాట రామ్ గోపాల్‌వర్మ దర్శకత్వం వహించిన అంతం సినిమాలోనిది. రామ్‌గోపాల్‌వర్మ గొప్ప సినీ టెక్నీషియన్‌గా భారతదేశ చలన చిత్ర పరిశ్రమలో పేరొందినప్పటికీ, ఆయనలో ఒక 'భావుకుడు' వున్నాడు అని చెప్పడానికి ఉదాహరణ- 'అంతం' సినిమాలోని రెండు పాటలు.

ఒకటి ... మైనా అని ప్రకృతి గురించి హీరోయిన్ ఊర్మిళ పాడే పాట. ఇంకొకటి : ఆ అమ్మాయి సహచార్యంలో కరకురాయి లాంటి వాడైన మనిషి (హీరో) మొట్టమెదటసారిగా జీవితంలో అనుబంధం మమత, ప్రేమ అనే భావాలకు పరిచయమై తన మనసును ఎలా అవిష్కరించాడు అనే అంశాన్ని ' నీ నవ్వు చెప్పింది నాతో, నేనెవ్వరో ఏమిటో' అనే భావుకతను చెప్పిన పాట.

ఏ పాటైనా రాసినంత మాత్రాన సినిమాలోకి రాదు. సినిమాల్లోకి అక్కణ్ణుంచి ప్రజల్లోకి రావాలంటే దర్శకుడే సోపానమని చెప్పోచ్చు. ఈ సోపానం దాటితే గర్భగుడిలోకి అడుగు పెట్టినట్టే. ఐతే పాటని దర్శకుడు ఓకే చెయ్యలంటే అతని మనస్సులో తడి, భావుకతతో పాట, సిచ్యుయేషన్ పట్ల కన్సెప్షన్ ఉండకపోతే ఇలాంటి పాటల్ని రాయడం, తీయడం జరగవు. రామ్‌గోపాల్‌వర్మ గురించి ప్రస్తావనొచ్చింది గాబట్టి ఒక మాట చెప్పక తప్పదు. నా చలన చిత్ర గీత ప్రయాణంలో ఒక సుస్పష్టమైనట్టి మజిలీ, మార్పుకి

రామ్‌గోపాల్‌వర్మ ముఖ్య కారకుడయ్యాడు. 'శివ' లో బోటనీ పాఠముంది అన్న పాటని రాస్తున్నప్పుడు అంతకు మునుపు కూడా ఎన్నో చిలిపిపాటలు, యుగళగీతాలు రాసినప్పటికీ కూడా ఒక స్ఫుటమైన శైలి ఏంటీ ఆ శైలీ అంటే... పాటలో సంగీతం తీసేసి, వాక్యాన్ని చదివితే అది మామూలుగా మనం మాట్లాడుకునే పరిభాషలోనే ఉండి, వచన వాక్యంలాగ ఉండాలి. దీన్ని ఇంగ్లీష్‌లో 'ప్రోసెక్ సింటాక్స్' అంటారు అంటే ఆ పదాలు మనం ఎలా మాట్లాడుకుంటామో అలాగే వుంటాయి, ఐతే ఈ  అనే మాటలకి సంగీతం లేకుండా, ఓ అందమైన అర్థం తెలుస్తూ, పదాల్ని అందమైన అమరికలో పేర్చడం- దీనిలో ఒక స్పష్టమైన శైలి ఆ పాట నుంచి ప్రవేశపెట్టుకున్నాను. అయితే ఇది నాతోనే ప్రారంభం అని నేను క్లెయిమ్ చేయను. మన చిత్ర రంగంలో ఇలాంటి శైలిలో పాటలు రాసిన నా శైలి సర్వజనామోదమైన మార్పుకి నాంది పలికిన దర్శకుడు - రామ్‌గోపాల్‌వర్మ. ఈయనే నేనెప్పుడో రాసుకున్నటువంటి 'సురాజ్యమవలేని స్వరాజ్యమెందుకని' ఇలాంటి పాటల్ని చూసి, ఇంతమంచి పాటలన్నీ ఎక్కడో అడుగున పెట్టేసుకుంటారేం ; అని అడిగినప్పుడు 'సెంటిమెంటు.. లేకపోతే హైలీ ఇమోషనల్ డ్రామా గల ఇతివృత్తాలు గల సినిమాలు మీరు తీయరుగదా రాము, ఎవరడిగితే వాళ్ళకి రాసిస్తాను. అంశాన్ని బట్టి పాటొస్తుంది తప్ప వీళ్ళకి పనికొస్తుంది వాళ్ళకి పనికి రాదు అని నేననుకోను' అంటే, ఆ తర్వాత ఆయన నాకు ఫోన్ చేసి, 'నేను సీరియస్ ఫిల్మ్స్ తీయను అని మీరనుకుంటున్నారు. మీ పాట నాకెంత నచ్చిందీ అంటే, మీ పాట కోసం నేనో సినిమా తీస్తున్నాను" అని ఆయన చెప్పారు. ఆ చిత్రమే 'గాయం'.  నేను 'సురాజ్యమవలేని' రాస్తున్నప్పుడు పాటని ప్రేరణగా తీసుకుని ఓ దర్శకుడు, అదీ, రామ్‌గోపాల్‌వర్మలాంటి స్థాయిగల దర్శకుడు ఒక చిత్రాన్నినిర్మించడానికి పూనుకోవడం అనేది నా చలన చిత్ర జీవితంలో జరిగిన గొప్ప సన్మానంగా భావిస్తాను. అంతే గాకుండా ఆ పాట నాకు నంది అవార్డు కూడా తెచ్చిపెట్టింది. ఇంతకు ముందెక్కడో చెప్పినట్టుగా విశ్వనాథ్‌గారి సినిమాక్కాకుండా వేరే దర్శకుల చిత్రానికి నంది పురస్కారం రావటం నాకు ఎక్కువ ఆనందంగా వుంటుంది అన్న మాటను మళ్ళీ ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఈ చిత్రంలోనే 'నిగ్గదీసి అడుగు' అన్న పాట కల్లోల తరంగం అనే భాగంలో చేర్చడం జరిగింది. అదే విభాగంలో ఈ సురాజ్యమవలేని స్వరాజ్యమెందుకని అన్న పాటని కూడా చేర్చాం. అంతంలోని ఓ మైనా, నీ నవ్వు చెప్పింది నాతో అన్న పాటలు భావతరంగంలో ఎందుకు చేర్చామో ఆ పాటల శిల్పాన్ని చూస్తే గమనించగలరు.

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

### 9

సెట్టు మీద ఉసిరికి

సంద్రాన ఉప్పుకి

సుట్టరికం పెట్టాడు సిత్తరాల దేవుడు

మబ్బులోని నీరుకి - మట్టిసాటు వేరుకి

వానవంతెనేసాడు జాడలేని దేవుడు

కలవనట్టు అనిపిస్తాది - నేలా ఆకాశం

తెలుసుకొంటే కనిపిస్తాది- తెగిపోని సావాసం

జనములున్నవో లేవో- ఆ బెమ్మదేవుడికి ఎఱుక

ఆ కొమ్మకి నీకు ఋణవేటంటే

సెప్పగలదా చిలకా, సెప్పగలదా చిలక

*** ***

(మహాగణపతి ఫిలింస్ తారకరాముడు చిత్రానికి కోటి సంగీత సారథ్యంలో బాలు పాడినది)

పల్లవి : ఏదో ఒక రాగం పిలిచిందీ ఈవేళ
ఎదలో నిదురించే కథలెన్నో కదిలేలా
నా చూపుల దారులలో చిరుదీపం వెలిగేలా
నా ఊపిరి తీగలలో అనురాగం పలికేలా
జ్ఞాపకాలే మైమరుపు, జ్ఞాపకాలే మేల్కొలుపు
జ్ఞాపకాలే నిట్టూర్పు, జ్ఞాపకాలే ఓదార్పు

వీచే గాలులలో నీ ఊసులు జ్ఞాపకమే
పూచే పువ్వులలో నీ నవ్వులు జ్ఞాపకమే
తూరుపు కాంతుల ప్రతికిరణం నీ కుంకుమ జ్ఞాపకమే
తులసి మొక్కలోని సిరుల జ్ఞాపకం
చిలక ముక్కులా నీ అలక జ్ఞాపకం

మెరిసే తారలలో నీ చూపులు జ్ఞాపకమే
ఎగసే ప్రతి అలలో నీ ఆశలు జ్ఞాపకమే
కోవెలలో దీపంలా నీ రూపం జ్ఞాపకమే
పెదవిపైన నీ పేరే చిలిపి జ్ఞాపకం
మరపురాని నీ ప్రేమే మధుర జ్ఞాపకం

(రాజా చిత్రానికి ఎస్.ఏ. రాజ్‌కుమార్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

పల్లవి: ఏదో ఒక రాగం పిలిచిందీ ఈ వేళ
ఎదలో నిదురించే గతమంతా కదిలేలా
నా చూపుల దారులలో చిరుదివ్వెలు వెలిగేలా
నా ఊపిరి ఊయలలో చిరువవ్వులు చిలికేలా
జ్ఞాపకాలే మైమరుపు, జ్ఞాపకాలే మేల్కొలుపు
జ్ఞాపకాలే నిట్టూర్పు, జ్ఞాపకాలే ఓదార్పు

అమ్మా అని పిలిచే తొలి పలుకులు జ్ఞాపకమే
రా అమ్మా అని అమ్మే లాలించిన జ్ఞాపకమే
అమ్మ కళ్ళలో అపుడపుడు చమరింతలు జ్ఞాపకమే
అమ్మ చీరనే చుట్టే పాప జ్ఞాపకం,
అమ్మ నవ్వితే పుట్టే సిగ్గు జ్ఞాపకం

గుళ్ళో కధ వింటూ నిదురించిన జ్ఞాపకమే
బళ్ళో చదువెంతో బెరించిన జ్ఞాపకమే
గవ్వలు ఎన్నో సంపాదించిన గర్వం జ్ఞాపకమే
నెమలి కళ్ళనే దాచే చోటు జ్ఞాపకం
జామపళ్ళనే దోచే తోట జ్ఞాపకం

(రాజా చిత్రానికి ఎస్.ఏ. రాజ్‌కుమార్ సంగీత సారథ్యంలో చిత్ర పాడినది)

పల్లవి: నేస్తమా ఇద్దరి లోకం ఒకటే లేవమ్మా

అందుకే నా కన్నులతో లోకం చూడమ్మ

నీ గుండెలోన నా ఊపిరుంటే

నా కళ్ళలోన నీ కలలు ఉంటే

ఊహల రెక్కలపైన ఊరేగే దారులు ఒకటే

చూపులు ఎవ్వరివైనా చూపించే లోకం ఒకటే ||నేస్తమా||

బుగ్గమీద వెచ్చని సిగ్గు వచ్చినపుడు దానిని అడుగు

ఎర్రదనం అంటే చెబుతుంది

పెదవికొమ్మ పూసిన పువ్వు అందమైన నీ చిరునవ్వు

తెల్లరంగు అట్టా వుంటుంది

నీలో నిలువున పులకలు రేగినవేళ

నువ్వే పచ్చని పైరువు అవుతావమ్మా

దిగులు రంగే నలుపు అనుకో

ప్రేమ పొంగే పసుపు అనుకో

భావాలను గమనిస్తుంటే ప్రతిరంగును చూస్తున్నట్టే

చూపులు ఎవ్వరివైనా చూపించే లోకం ఒకటే ||నేస్తమా||

మొదటిసారి నీ హృదయంలో

మధురమైన భావానలేవో

మేలుకున్న వైనం గుర్తుందా?

అదుపులేని ఆరాటంలో

ఎదురుచుస్తూ ఎవ్వరి కొరకో

వేచి ఉన్న సమయం గుర్తుందా?

ఎదలో ఆ తొలి కదలికె సుప్రభాతమమ్మా

నీలో ఆ నిరీక్షణమే పడమర సంధ్యమ్మా

ఇలవు నువ్వై రవిని నేనై - కలువ నువ్వై శశిని నేనై

ఒకరి కోసం ఒకరం జీవించే తరుణంలో

చూపులు ఎవ్వరివైనా చూపించే లోకం ఒకటే.... ||నేస్తమా||

(పెళ్ళి పందిరి చిత్రానికి వందేమాతరం శ్రీనివాస్ సంగీత సారథ్యంలో వందేమాతరం, చిత్ర పాడినది)

పల్లవి:

బేబి: డాడీ చూడవుగా నేనున్నా నీ ఎదుట

కావాలని ఓడేందుకు ఆడేవా ఆట

తండ్రి: ఆడక తప్పదురా ఎవరికీ దేవుడి దొంగాట

ఓడక తప్పదురా చివరికి ఏదో ఒక చోట

కళ్ళున్నా కనిపించేనా - కాదన్నా కథ నిలిచేనా

గెలుపే ఇవ్వడు పైవాడు అడిగినా అలసినా.... ||డాడీ||

రోజూ చేసే పనులే కాదా విసుగే రాదా కాస్తైనా

రోజూ తిన్నా ఆకలి బాధ తీరేదేనా ఎప్పుడైనా

ఒకలాగే వుంటే సరదా వుంటుందా

కనుకే ప్రతి రేపూ ఊరిస్తూ రాదా

ఏ తేడా వుండదని తెలిసాక ఏం చేస్తాం

చీకటి చాటున మంచం ఎక్కి కలలను కంటుంటాం ||డాడీ||

తండ్రి: బొమ్మలు ఎన్నో కొనిపెడుతున్నా చాలనుమాటే అనవు కదా

పాడీ ఆడే ఏ బొమ్మైనా పాడవకుండా వుంటుందా

అంతేరా బేటా బ్రతుకాడే ఆట

**ఏదో అనుబంధం వెతికే ఈ వేట**

**ఏ బంధం కడదాకా వుండదురా మనవెంట**

**ఎవరన్నా లేకున్నా నిన్ను వదలక నేనుంటా... ||డాడీ||**

*** ***

(ఛాంపియన్ చిత్రంలో విద్యాసాగర్ సంగీత సారధ్యంలో బాలు, చిత్ర పాడినది)

ఈ పాట వై. నాగేశ్వరరావుగారి దర్శకత్వంలో ఛాంపియన్ అనే సినిమాలోనిది. సంగీతం విద్యాసాగర్. ఈ పాట ఇతివృత్తమేమిటంటే ఓ చిన్న పిల్లవాడు అతని తండ్రి. పసితనంలోనే అనేక కారణాల మూలంగా పిల్లవాడి తల్లితండ్రులు విడిపోతారు. ఇతను తండ్రి దగ్గర వుంటున్నాడు. తండి భార్య దూరమవ్వడంతో ఓ రకమైన నిరాశ నిర్లిప్తతతో జీవితం గడుపుతూ వుంటాడు. వీళ్ళిద్దరూ ఆటాడుకుంటూన్న సందర్భంలో కుర్రాడు ఆడుతూ పాడుతూ తండ్రితో మాటాడుతున్నాడు. కొడుకుతో తన వేదన వెళ్లబోసుకుంటాడు ఆ తండ్రి. అయితే ఈ మాటలు పిల్లవాని భాషకు మించి పైకి రాకూడదు. అలాగని జవాబు పిల్లవాడికి అర్థంకాని పరిస్థితిలోనూ ఉండకూడదు. అవి వుట్టిట్టి పొడిమాటలవ్వకూడదు. తన మనస్సులోని సంఘర్షణంతా అతడు కొడుకుతో చెప్పగలగాలి. ఇటువంటి సిచ్యుయేషన్‌కి రాయడం కత్తిమీద సాము లాంటిది.

**పల్లవి: ఎటో వెళ్ళిపోయింది మనసు**

**ఇలా ఒంటరయ్యింది వయసు**

**ఓ చల్లగాలి ఆచూకి తీసి**

**కబురీయలేవా ఏమయిందో... ||ఎటో||**

**ఏ స్నేహమో కావాలని ఇన్నాళ్ళుగా తెలియలేదు**

**ఇచ్చేందుకే మనసుందని నాకెవ్వరూ చెప్పలేదు**

**చెలిమి చిరునామా తెలుసుకోగానే**

**రెక్కలొచ్చాయో ఏమిటో ||ఎటో||**

**కలలన్నవే కొలువుండని కనులుండి ఏం లాభముంది**

**ఏ కదలిక కనిపించని శిలలాంటి బ్రతుకెందుకంది**

**తోడు ఒకరుంటే జీవితం ఎంతో**

**వేడుకౌతుంది అంటూ...**

**ఎటో వెళ్ళిపోయింది మనసు**

**ఎటెళ్ళిందో అది నీకు తెలుసు**

**ఓ చల్లగాలి ఆచూకి తీసి**

**కబురీయలేవా ఏమయిందో... ||ఎటో||**

(నిన్నె పెళ్ళాడుతా చిత్రానికి సందీప్ చౌతా సంగీత సారధ్యంలో రాజేష్ పాడినది)

నా సినిమా పాటల యాత్రలో మరో ముఖ్యమైన మజిలీ దర్శకుడు కృష్ణవంశీ. కృష్ణవ్ంశీ, రామ్‌గోపాల్‌వర్మ స్కూలునుంచి తయారైన దర్శకుడైనప్పటికీ కూడా రామ్‌గోపాల్‌వర్మ ప్రభావం తన మీద లేకుండా, తనదైన ముద్రతో, శైలితో ముందుకు నడుస్తున్న వ్యక్తి. ఇతను నా చేత అనేకమైన పాటలు చాలా ప్రత్యేకమైన శైలి కలిగేటట్టుగా రాయించుకున్నాడు. కృష్ణవంశీ ఇచ్చిన సందర్భాలకు పాటలు రాయటం ద్వారా, యువతరానికి, ముఖ్యంగా కౌమార దశలోనున్న (టీనేజ్) వారి గుండెలకి బాగా దగ్గరగా వెళ్ళే అవకాశం లభించింది. తను అనుకున్నది, తనకి కావలసింది వచ్చేవరకూ కూడా కృష్ణవంశీ వదిలిపెట్టడు. అతనికి నా మీద ఎంతో గౌరవం. నాకు అతని మీద ఎంతో అభిమానం. అయినప్పటికీ ఈ బంధవ్యం పాట రాసేటప్పుడు వుండదు. ఎక్కడ నుంచో ఓ హిందీ పాట పట్టుకొచ్చి "ఈ హిందీ పాటలో అదుంది, అది కావాలి" అంటాడు. హిందీ పాటలో సంగీతం తాలుకు సౌందర్యం తప్పించి లోతైన భావం ఏదీ లేదని నేను దెబ్బలాడుతూ ఉంటాను. దెబ్బలాడితే, అతను దెబ్బలాడుతూ వుంటాడు. నిజానికి నేను రాసింది ఎక్కువా! అతను నన్ను రాసి రంపాన పెట్టింది ఎక్కువా? అనేది ఇప్పటికీ తేలని ప్రశ్నే. అయితే, అలా అతను పదే పదే అడిగి రప్పించుకోవటం వలన " ఈ వేళలో నీవు ఏం చేస్తు వుంటావు" లాంటి పాటల దగ్గర్నుంచి, ఎన్నో పాటలు పుట్టాయి. ఈ పాటలలోని మాటలు మన నిత్య జీవితంలో మాట్లాడుకునే మాటలే.

ఇక్కడ ఒక ముఖ్య విషయం చెప్పాలి. సినిమా పాటలు, సినిమా భాష చాలాకాలం నుంచి ఒక కృత్రిమ వాతావరణంలో నడుస్తున్నాయి. ఏవో కొన్ని పరిమితమైన పదాలను పట్టుకుని ఆ పదాలనే తిరిగి తిరిగి వాడుతూండడం. అది ఒక విచిత్రమైన భాష.

అటు కావ్యల్లో వాడే భాష కాదు, ఇటు భావకవిత్వంలో వాడిన భాషా కాదు. అలా అని చెప్పి మన నిత్య జీవితంలో వాడే భాష కూడా కాదు. వీటన్నిటి నుంచి, ఏవో కొన్ని మాటలు వచ్చి, ఉదా: వలపు కౌగిళ్ళు వగైరా పదాలు వుండేవి. ఇటువంటి భాషను వదిలి, పరిపూర్ణమైన వాడుక భాషను అంటే బాణీ సంగీతం లేకుండా చూస్తే మనం రోడ్డు మీద వెళ్తూ మాట్లాడుకునే మాటలే అనిపించే మాటలను రామ్‌గోపాల్‌వర్మ బోటనీ పాటతో ఒక మలుపు తిప్పితే, ఆ మలుపుకు మరింత సుస్పష్టమైన అంచు ఏర్పాటు చేశాడు కృష్ణవంశీ. నేను కాబట్టి రాశాను అని ఇప్పటివరకూ ఎప్పుడూ అనుకోలేదు. ఒక వేళ నేను మంచి పాటలు రాసినా, అలా రాసే శక్తి నేను సంపాదించుకున్నది కాదు. నాకు ఇవ్వబడింది. అది ఏదో జన్మవరం. దానంతట అది వచ్చింది కాబట్టి నేనిక్కడ ఏదో సాధించాను అనుకునేందుకు అవకాశం లేదు. అదే విధంగా ఆ శక్తి అవిష్కరింపబడటానికి కూడా నా తాలుకు గొప్పతనం వుంటుందని నేననుకోవటంలేదు. అది అడిగిన వాళ్ళు, నాకాసందర్భాలు ఇచ్చిన వాళ్ళు, దెబ్బలాడి నాతో రాయించుకున్నవాళ్ళు - నూతిలో నీటిని తోడి పైకి తెచ్చిన వాళ్ళలాంటివాళ్ళు. వాళ్ళల్లో "నాలో ఇది వుందా? ఈ రకంగా కూడా నేను ఎక్స్‌ప్రెస్ చెయ్యగలనా?" నేను సరదా పడి, ముచ్చట పడే విధంగా నా చేత పాటలు రాయించిన వంశీకి రాసిన పాట ఇది.

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 10

కుహు కుహుకుహుల

కోరస్: కుహు కుహు కుహుల కోయిలమ్మ కమ్మని కబురే చెప్పవమ్మా
కిలకిలకిలకిల చిలకమ్మ చక్కెర ఊసులు పలుకమ్మా
ఆమె: ఈ గాలి ఈ నేల వీటిని మించిన స్వర్గం వేరే కావాలా
పచ్చదనం పసుపుదనం మాకు సిరులమ్మా
మా పల్లెసీమ భూదేవి కుంకుమ
కోరస్: గిత్తల జోడి కట్టవె ఎంకి
పట్టర మేడి దున్నర దుక్కి

హైలెస్సో హైలెస్సో హైలో హైలెస్సో

ఆమె: కమ్ముకునే చీకటికి కమ్మని జోలల ఊయల పాటలు పాడుతాం
చేరుకునే వేకువకి రమ్మని రంగుల ముగ్గుల బాటలు చూపుతాం
ఏటి ఊయలలూగే పడవల సంగీతం
జానపదముల సాగే పనిపాటల గీతం
చల్లదనం తల్లిగుణం ఉన్న ఊరమ్మా
మా పల్లెసీమ పంచేది ప్రేమ ||ఈ గాలి||

ఆమె: కోవెలలో పావురమే దేవుడు పంపిన దీవెన తానని అన్నది
గుండెలలో నమ్మకమే చెట్టును పుట్టను భక్తిగ పూజిస్తున్నది
నేల తల్లికి చేలే చీరలు నేస్తాయి
మల్లె కొమ్మకి పూలై తారలు వస్తాయి
నల్లదనం కల్లగుణం లేని మనసమ్మా
మా పల్లెసీమ ముత్తైదువమ్మా ||ఈ గాలి||

**** ****

(పెళ్ళి కానుక చిత్రానికి కీరవాణి సంగీత సారథ్యంలో చిత్ర పాడినది)

**కనుగొంటి**

పల్లవి : కనుగొంటి కనుగొంటి తుమ్మెదా... సినుకు
సలవంటి సిరునవ్వు తుమ్మెదా
ఇనుకొంటి ఇనుకొంటి తుమ్మెదా...సెరుకు

తునకంటి పలుకింటి తుమ్మెదా

తోటలో తుమ్మెదలు- పూలకొమ్మలన్నీ వీడి
పువ్వులాటి నీ సుట్టూతా - కమ్ముకుంటవే
ఏటిలో మీనాలన్నీ - సేపకళ్ళ సొంపే సూసి
పట్టలేని ఈసే పుట్టి- సిన్నబోతవే
నుదుటి బొట్టు సూస్తే - మొదటిపొద్దు కాంతి
మొలక నువ్వు సుస్తే - ఎన్నెలంత శాంతి
రేపూ మాపూ రెండూ నీ రూపూ రేకా అయితే
ఎట్టా తేలేనమ్మా - ఇది కలయో నిజమో అంటే ||కను||

పాలుగారు పాపాయికీ - ఆలయాన అమ్మోరికీ
అన్నిటా నీ పోలికే - ఒట్టు పెట్టనా...
కంచిలో కామాక్షినీ - సీతనీ, మాలక్ష్మినీ
అనవాలు సెప్పాలంటే - నిన్ను చూపనా...
కొండపల్లి బొమ్మ - బొండు మల్లె కొమ్మ
ఎంత మంచిదమ్మ - నిన్ను కన్న జన్మ
గుండే నిండదమ్మ - ఈ రెండే కళ్ళు వుంటే
చింతే వుండదమ్మ - కళ్ళారా సూస్తు వుంటే ||కను||

**** ****

(చిలకపచ్చ కాపురం చిత్రానికి విద్యాసాగర్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

**గోదావరిలో ఈతకు**

పల్లవి: గోదావరిలో ఈతకు వచ్చిన నింగి చందమామా

నాకనులు కలువలై విరిసేలా కనిపించు కన్నెమోమా

లేతపోయగాన్ని తడిమి నీటి కడవ పాపం మేను మరచి వుంది

లేని నడుము మీద తాను నిలిచాననుకుంది

నేలకి ఎప్పుడూ తెలియదుగా ఆ లేత పాదాల స్పర్శ

వేల హృదయాలు పరుచుకుంటాయి ఆమె కాలికీ ఇలకీ మధ్య

అలా అలా అలా చెలియ నడిచే వేళ

ఆ లయలకు లయే కదా పడిలేచే ప్రతి అల

ఊరేగే ఊహల కెవరూ సంకెళ్ళను వెయ్యలేరని అంటే అది అసత్యం

ఊగే ఆ కురులకు మధ్య చిక్కుకున్న ఉహలనడుగు తెలుస్తుందిసత్యం

ఆ కోల కళ్ళలో నీలిమను చీసి చీకటికి సిగ్గేసి చిన్నబోయింది

కాటుకై గడపలో ఆగిపోయింది

ఆ నుదుట చెమరించు ప్రతి చెమట ముత్యం

ఎదలోన జడివాన మొదలైన సాక్ష్యం

ముళ్లనైన పువ్వులుగ మార్చే సుకుమారం

ఆ పెదవులు పంచుతాయి తిట్లకైన తియ్యదనం

అతడు: మెల్లగా ఊయలే ఊపే గోదారి

చల్లగా డోలలే పాడే ఈ గాలి

అమ్మ ఒళ్ళో విడిచిన పసితనాన్ని

ఊహకైనా మిగలని జ్ఞాపకాన్ని

ఇవాళ నాకు గురుతు చేయగా...

||మెల్లగా||

**క్షేమమా నాయనా అన్నవి ఈ చేలు**

**నేస్తమా చేరుకో అన్నవి ఈ పూలు**

**సొంతమేమో నాకీ పరిసరాలు**

**పాతవేమో పిలిచే పరిచయాలు**

**ఏనాటి జన్మబంధమో ఇదీ...**

**||క్షేమమా||**

**** ****

(రుక్మిణి చిత్రానికి విద్యాసాగర్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

రుక్మిణి అనే సినిమాలో విద్యాసాగర్ సంగీత దర్శకత్వంలో పినిశెట్టి రవిరాజాగారు నా చేత పాటలు రాయిస్తూ మొదటి సారి హీరో హీరోయిన్‌ని చూసినప్పుడు అతని మనసులో ఒక మృదువైన, దివ్యమైన అనుభూతి కలుగుతుంది. దీన్ని హిందీ షాయిరీల్లాగా రెండేసి లైన్లు - మొదటి లైను ఓ అందమైన భావం ఉంటుంది. ఆ అందమైన భావానికి రంగులద్దుతూ ఓ మెరుపులా మెరుస్తూ వస్తుంది రెండో లైను. ఇది ఉర్దూ సంప్రదాయం. ఉర్దూ, హిందీ భాషల్లోనే స్వతఃసిద్ధంగా ఓ లాలిత్యం సౌందర్యం వున్నాయి. తెలుగు భాష గంభీరమైనది. చాలా డిగ్నిటీతో కూడుకున్నది. ఇందులో చాలా బలమైన భావాలు చాలా చెప్పొచ్చు. హిందీ, ఉర్దూ భాషకి ఫొనెటిక్ సౌందర్యం, లాలిత్యం, మంజులత్వం, మృదుత్వం ఇవి చాలా ఎక్కువగా ఉంటాయి. వాళ్ళ భావాలు సీతాకోక చిలకల్ని చేతుల మీద ఆడిస్తున్నట్టుగానో, ఎగురుతున్న దూది పింజెల మధ్య తిరుగాడుతున్నట్టుగానో లలితమైన అనుభుతిని కలిగిస్తాయి. నాకు చాలా కాలంగా మనసులో ఒక కోరిక వుండేది. ఇంత మృదువుగా తెలుగులో రాయడం సాధ్యపడదా అని. ఎప్పుడైతే ఈ అవకాశం వచ్చిందో, ఆ అమ్మాయిని వర్ణిస్తూ ఆరేడు భావాలు, దాశరథి గారి "గాలిబ్" షాయరీలు అనువాదాల ప్రేరణతో ఓ ప్రయత్నం చేశాను. ఈ ప్రయత్నంలో పరిపూర్ణంగా విజయవంతం అయ్యాను అని నేననుకోవడంలేదు. కాని, ఈ ప్రయత్నం ఎలాంటిదో ఓ సారి పైన చూడండి.

పల్లవి: క్లంగ్ క్లంగ్! క్లంగ్ క్లంగ్! తొలి తొలి చినుకు తొలకరి పలుకు
క్లంగ్ క్లంగ్, క్లంగ్, క్లంగ్, తుళ్ళి తుళ్ళి పడుతూ తుంటరి పరుగు
తరగలై నురగలై ఆటలై పాటలై
ప్రతి పెదవికి, తడి నవ్వులు తొడుగుతూ
ఝున్‌కు ఝున స్వరముల జడివాన వచ్చింది
పల్లవించే ఊహలెన్నో వెంట తెచ్చింది
చక్రవాకమై, పుడమి దేహమే ఈ చక్కరవాగును పిలుచుకొచ్చెనే
మెరుపు తీగలే, వాన వంతెనై మిన్ను మన్ను ఒకటి చేసెనే

కరి మబ్బులనే విడిచి హోరెత్తున వచ్చావా?
కనురెప్పలనే విడిచి, ఉప్పొంగిన కలవేనా?
చిరుచెమటలనే తుడిచి, ఓదార్చిన నెచ్చెలివా
చెమ్మ చెమ్మచెక్క మల్లెమొగ్గ ఆడిన చిత్తడివా
ప్రతి కొండ చినుకు తొడిగి చేసింది తాండవం
ప్రతి కొమ్మ చినుకు పొదిగి పెంచింది తడివరం
హరివిల్లు తనే ఫెళ్ళు మని రంగవల్లుల వెల్లువయ్యింది ||చక్ర||

మది చిలికి సుధల విందు రండి అణువణువుతో విందాం
శ్రుతి కలుపుకునే గాలి కంటుంతుంది గానగంధం
ఈ దివ్యగాన మధువు ఇలకు దింపుతోంది వర్షం
తడవండి తడిసి తొడుక్కోండి పులకింత హర్షం
ఈ భాద్రపదం పడితే అనందభైరవి
నులువెల్ల వెల్లి విరిసే సంపదల పల్లవి
దివిగంగ పొంగి దిగిన పొద్దు మన్ను స్వర్గమైనది ||తొలి||

**** ****

(ప్రేమంటే ప్రాణమిస్తా చిత్రానికి ఎ.ఆర్.రెహమాన్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

**పొద్దేరాని లోకం**

పల్లవి: పొద్దే రాని లోకం నీది
నిద్రే లేని మైకం నీది
పాపం ఏలాలి పాడాలి జాబిలి
అయినా ఏజోల వింటుంది నీ మది
వేకువనైనా వెన్నెలనైనా
చూడని కళ్ళే తెరిచేలా
ఇలా నిను లాలించేదా లేలెమ్మని..
మిత్రమా మిత్రమా మైకమే లోకమా
మెల్లగా చల్లగా మేలుకో నేస్తమా ||పొద్దేరాని ||

ఎన్నో రుచులు గల బ్రతుకుంది
ఎన్నో రుజువులతో పిలిచింది
చేదొక్కటే నీకు తెలిసున్నది
రేయొక్కటే నువ్వు చూస్తున్నది
ఉదయాలనే వెలి వేస్తానంటావా
కలకాలమూ కలలోనే ఉంటావా
నిత్యమూ నిప్పునే తాగినా తీరని
నీ దాహం తీర్చే కన్నీరిది
మిత్రమా మిత్రమా మైకమే లోకమా
మిత్రమా మిత్రమా శున్యమే స్వర్గమా ||పొద్దేరాని ||

**నీలో చూడు మంచి మనసుంది**

**ఏదో నాడు మబ్బు విడుతుంది**

**వాల్మీకిలో ఋషి ఉదయించినా**

**వేమన్నలో భోగి నిదురించినా**

**మదిలో ఇలా రగలాలి ఓజ్వల**

**మలినాలనె మసిచేస్తూ మండేలా**

**అగ్నిలో కాలినా స్వర్ణమై తేలదా**

**నిను తాకిందేమో ఈ వేదన**

**మిత్రమా మిత్రమా మట్టిలో రత్నమా**

**మిత్రమా మిత్రమా మబ్బులో చంద్రమా** ||పొద్దేరాని ||

(గోకులంలో సీత చిత్రంలో కోటి సంగీత సారథ్యంలో చిత్ర పాడినది)

ఈ పాట గోకులంలో సీత అనే చిత్రంలోనిది. దర్శకుడు ముత్యాల సుబ్బయ్యగారు. ఈ పాట చిన్నప్పట్నుంచి ధనమే తప్ప మమత, మమకారం, ప్రేమ, ఆదరణకు నోచుకోక స్వతసిద్ధంగా మంచితనం వున్నా అది ఎక్కడో అంతరాంతరంగాల్లో అణిగివున్న ఓ యువకుడు నిరంతరం మగువా, మధ్యం మధ్య వుంటూ, ఓ అమ్మయి సహచార్యంలో ఎక్కడో నిదురపోతున్న ఆ మానవత్వం మేలుకోవడం, తద్వారా తన మీద తనకే ఓ విధమైన అసహనం, జాలి, చిరాకు పుట్టి అలా ఆ మద్యం మత్తులో ఓ రకమైన నిర్వేదనలో కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ వుండిపోతాడు. సాధరణంగా కళ్ళ నీళ్ళు పెట్టుకున్నవాళ్ళకి ఎవరైనా ఓదార్పు ఎలా ఇస్తారంటే 'ఫర్వాలేదు, నువ్వు పశ్చత్తాపపడుతున్నవు కదా! ఇక మీద అంతా సరైపోతుంది' అంటారు తప్ప 'ఇంకా ఏడు! ఇలా ఏడిస్తే తప్ప నీకు నిజమైన శాంతి దొరకదు' అనరు. ఇదో విచిత్రమైన అప్రోచ్. ఇటువంటి అప్రోచ్ తోనే హీరోని హీరోయిన్ (పల్లవి, రెండు చరణాలు) ఓదారుస్తుంది. తనలోని కన్నీళ్ళే ప్రపంచంలో అన్నిటిని మించిన నేస్తాలవుతాయి అని చెప్తూ" మిత్రమా మిత్రమా మట్టిలో రత్నమా, మిత్రమా మిత్రమా మబ్బులో చంద్రమా' అని సంబోధిస్తుంది. ఎంతో సంఘర్షణకి గురిచేసి సానపెడితేనే తప్ప రాయి రత్నమవదు. ఆ రాపిడి మంచికే కాని, చెడుకి కాదు అని పోజిటివ్ కాన్సెప్ట్ తో చెప్పింది ఈ పాట.

**మనసే మీటనా**

పల్లవి: మనసే మీటనా చెలిమే చాటనా

తొలి చినుకంటి తెలుగింటి పాటతో

త్యాగరాయని భావాలనల్లి తీగసాగిన రాగాలమల్లి

అన్నమాచార్యుని కీర్తనల తేలి దేవదేవుని లాలించు లాలి

తేనెల కాణాచి మన తెలుగును చవిచూచి

అమృతమేమి రుచి అనరేమి మైమరచి

జగమేలే...పరమాత్మ ఎవరితో మొరలిడుదు

తేటి పూలుకిచ్చి పులకించి పాటతో ... ||మనసే||

నన్నయాదుల తొలి తెలుగు మాట

భరతగాధకు బంగారుబాట

కృష్ణరాయని కనుసైగ వెంట

భువనవిజయము సాగించెనంట

పోతన మాగాణి శ్రీనాధుని మారాణి

సాటిలేని బాణి మన జాను తెలుగువాణి

నగరాజ ధర నీదు పరివారమెల్ల

ఒగి బోధలు చెదెడివారలు

జానపదములకీ నెరజాణ జావళికి

తన లయలిచ్చి నడిపించు పాటతో....

||మనసే||

(తోకలేని పిట్ట చిత్రానికి ధర్మవరపు సంగీత సారథ్యంలో చిత్ర పాడినది)

**పాటల పల్లకివై**

పల్లవి : పాటల పల్లకిపై ఊరేగే చిరుగాలి
కంటికి కనపడవేం నిన్నెక్కడ వెతకాలి
నీతోడు లేనిదే శ్వాసకి శ్వాస ఆడదే
నువ్వే చేరుకోనిదే గుండెకి సందడుండదే
నీ కోసమే అన్వేషణ నీ రూపు రేఖలేవో ఎవరినడగాలి

నీలాల కనుపాప లోకాన్ని చూస్తుంది
తన రూప తానెపుడూ చూపించలేనంది
అద్దంలా మెరిసే ఒక హృదయం కావాలి
ఆ మదిలో వెలుగే తన రూపం చూపాలి
రెప్పల వెనక ప్రతి స్వప్నం ఆలకిస్తుంది
రెప్పలు తెరిచే మెలకువలో కల నిదురిస్తుంది
ఆ కలల జాడ కళ్ళు ఎవరినడగాలి

పాదాల్ని నడిపించే ప్రాణాల రూపేది
ఊహల్ని కదిలించే భావాల ఉనికేది
వెన్నెల దారమా జాబిల్లిని చేర్చుమా
కోయిల గానమా నీ గూటిని చూపుమా
ఏ నిమిషంలో నీ రాగం నా మది తాకింది
తనలో నన్నే కరిగించి పయనిస్తూ ఉంది

ఆ రాగమెపుడు నాకు ఎదురుపడుతుంది

**** ****

(నువ్వు వస్తావని చిత్రానికి ఎస్.ఏ. రాజ్‌కుమార్ సంగీత సారథ్యంలో బాలు/ చిత్ర పాడినది )

**రంగురంగురెక్కల**

కోరస్: పొద్దున్నే ఎలిపోతే గోధూళి దాకా
పొద్దెట్టా గడిచేదే బంగారి మావా
ముప్పొద్దులా నీతో ముచ్చెట్లె ఐతే
బువ్వట్టాగొస్తాదె సింగారి భామా

పల్లవి: రంగురంగు రెక్కల సీతాకోకచిలకా - సీతాకోకచిలకా
తోటంతా తిరుగుతావమ్మా నీవు తీరికే లేక
ఈ కన్నె విరి దాకా ఏ గుండే మూగకేక
చేరుస్తున్నావో అది నీకైనా ఎరికా ||రంగు||

ఉరికి ఉరికి ఊహలూరేగి పిల్లగాలి ఊయలూగి
ఉండి ఉండి గుండెలుప్పొంగి కొండవాగులాగ పొంగి
సరసానికనువైన వరసేదొ దొరికి
ఎవరి దరికి చేరాలని ఎవరు రాసినారో
నీ రెక్కలపై ఆ చుక్కల ప్రేమలేఖ ||రంగు||

మూసుకున్న మనసు ముంగిలిలో రంగువల్లులెన్నో వేసి
వెలుగురాని వయసు వాకిలిలో వెండి మొక్కలే వేసి
కనువిందు కలిగించు తిరణాల లిపిలో

**జన్మముడులు చదవమన్న బ్రహ్మరాత ఏమో**

**నీరెక్కలపై ఆ చుక్కల ప్రేమలేఖ**

**||రంగు||**

**** ****

(అల్లుడుగారు వచ్చారు చిత్రంలో కీరవాణి సంగీత సారథ్యంలో కిరవాణి పాడినది)

ఇది అల్లుడు గారొచ్చారు అన్న సినిమాలోనిది. సంగీతం- కీరవాణిగారు. ఈ పాట తెలుగు భావకవిత్వంలో ఒక పాటలాగ సినిమా సన్నివేశం ఏదైనా, ఒక సీతకోకచిలుక రెక్కల మీదున్న ఆ రంగు రంగు చుక్కలు, ఎవరో ఎవరికో రాసినటువంటి ప్రేమలేఖల అన్న భావ చిత్రికరణతో రాసిన గీతమిది.

అలాగే సీతకోక చిలకంటే నాకింకో పాట గుర్తొస్తోంది 'ఓ సీతకోక చిలుకా, నాకో సాయం చేస్తావా' హైదరాబాదు లాంటి మహానగరాన్నుంచి కోనసీమవరకు ఒక వ్యక్తి ప్రయాణం చేస్తున్నడు రైల్లో. మనం రైల్లో ప్రయాణం చెస్తున్నప్పుడు కిటికీలోంచి దృశ్యాలను గమనిస్తూంటే, దూరంగా కొండలు, పచ్చటిపొలాలు, ఎగిరే పిట్టలు, కొండల్ని ముద్దాడుతున్న మబ్బులు - ఈ దృశ్యాలన్నిటినీ కూడా చూడని వ్యక్తంటూ ఎవరూ ఉండరు. ఇలాంటి భావనల్ని మనస్సుకు హత్తుకుపోయేలా రాయడం అనేది, పాటని దృశ్యపరంగా చూపగలగడంలో ఓ రకమైన ఆనందం వుంది. ఆ పాట వచ్చేసంచికలో..!

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 11

ఓ సీతాకోక చిలుకా నాకో సాయం చేస్తావా
నీ రెక్కల్లోని చుక్కల్తో నా గేయం రాస్తావా
చూసే కళ్ళలో నా కలలే పూసేలా
నువ్వాలే కొమ్మల్లో నా విరివాగే పొంగేలా-సాగేలా నా పాటా

చూపులు వెళ్ళి జలపాతం లో ఈది కొత్తకొత్త రంగులు తొడుక్కుంటే
ఊపిరివెళ్ళి చిరుగాలుల్లో తుళ్ళి పూలవాసన మోసుకొస్తూ వుంటే
ఊహలన్నీ ముందుగానే వెళ్ళి ఊసులెన్నో మోసుకొస్తూ వుంటే
ఊరు పూలరథమల్లే మారి వేచి వున్నదనిపిస్తూ వుంటే

నేనే నాకన్నా ముందుగా అప్పుడే అక్కడున్నట్టుగా
మనసా ఎగిరిపోయావా!

గోదారి నీళ్ళాడినట్టుంది బరువోపలేనట్టు గట్టుంది
ఈనాడో మర్నాడో అంటోంది రాదారి పడవల్ని కంటోంది
సాగరమే సంబరమై ఎదురు వచ్చిందేమో
భద్రాద్రి పొత్తిళ్ళలో మా సీతమ్మ పురుడోయగా
నాకేమి లోటుందమ్మా...

నీలాంబరమే ఇంద్రధనువు మగ్గంపై నేల కోసం చీర నేసేనేమో
చేలు పూలూ జిలుగుల మెరుపై అద్దకాల అందమిచ్చేనేమో
కోనసీమ తల్లి కులుకే కులుకూ సంకురాత్రి సిరి పలికేవరకూ
పంట పాప ఇంట వెలిగే వెలుగు భోగిపళ్ళు పోసి మురిసేకళ్ళతో
కరి మబ్బు దీపావళి కరిగివచ్చే ఇల ముందుకే వినిపిస్తోంది చలి జావళి!

(ప్రేమించేది ఎందుకమ్మా చిత్రానికి ఇళయరాజా సంగీత సారధ్యంలో బాలు పాడినది)

నా పాట పంచామృతం!
నా గగన గీర్వాణి స్నానాలు సేయంగ ||నా పాట||

వల్లకి మీటగ, పల్లవ పాణి
అంగుళి సేయనా పల్లవిని...
శారద స్వరముల సంచారానికి
చరణములందించనా ||నా పాట||

గళము కొలను కాగా ప్రతిపాట పద్మమేగా

పదము వెల్లి విరిసి రాదా విధిసతి పాదపీఠి కాగా

శ్రుతిలయలు మంగళహారతులై

స్వరసరళి స్వాగత గీతికలై

ప్రతిక్షణం నివేదనం

సరస్వతి సమర్పణం

గగనము గెలువగ గమన గతులు సాగ...

శిశువుల పశువుల ఫణుల శిరసులూగ... ||నాపాట||

( అల్లరి మొగుడు చిత్రానికి కీరవాణి సంగీత సారథ్యంలో బాలు పాడినది)

అతడు: జాముురాతిరి జాబిలమ్మ జోలపాడనా ఇలా

జోరుగాలిలో జాజికొమ్మ జారనీయకే కలా

వయ్యారి వాలుకళ్ళలోన వరాలమింటి పూలవాన

స్వరాలు ఊయలూగువేళ ||జాము||

అతడు: కుహు కుహు సరాగాలే శృతులుగా

కుశలమా అనే స్నేహం పిలువగా

కిలకిలా సమీపించే సుడులలో

ప్రతి పొద పదాలేవో పలుకగా

కునుకు రాక బుట్టబొమ్మ గుబులుగుందని

వనము లేచి వద్దకొచ్చి నిద్రపుచ్చనీ... ||జాము||

**అతడు: మనసులో భయాలన్నీ మరిచిపో**

**నిదురలో మరో లోకం తెలుసుకో**

**కలలతో ఉషాతీరం వెతుకుతూ**

**నిదురలో నిషారాణి నడిచిపో**

**చిటికలోన చిక్కబడ్డ కటికచీకటి**

**కరిగిపోక తప్పదమ్మ ఉదయకాంతికి ||జాము||**

(క్షణక్షణం చిత్రానికి కీరవాణి సంగీత సారథ్యంలో బాలు పాడినది)

హీరో హీరోయిన్లు పాట పాడుకోవాలంటే, విపరీతమైన వాయిద్యాల హోరులో, అనేకమైన కోరస్‌లను వెంటపెట్టుకుని, వివిధ దేశాలలో చిత్రీకరిస్తే కానీ, ప్రేక్షకులు చూడరు అని సుదృఢంగా నమ్మే ఈ రోజుల్లో ఎప్పుడో 1952-53ల్లో అప్పు చేసి పప్పుకూడు సినిమాలో రామారావుగారు ఒక బాల్కనీలో, సావిత్రిగారు ఒక బాల్కనీలో నులుచుని, "ఎచటనుండి వీచనో ఈ చల్లని గాలి" అని పాడేసి ఎవరి ఇంట్లోకి వాళ్ళు వెళ్ళిపోయినట్లుగా శ్రీదేవి లాంటి హీరోయిన్‌ని వెంకటేష్‌లాంటి హీరోని పెట్టుకుని ఒక అడవిలో చాలా అన్‌గ్లామరస్ వాతావరణంలో హీరో హీరోయిన్లిద్దరూ వున్న చోటినుంచి కదలకుండా, షాట్ మార్చకుండా, పూర్తి పాటని చిత్రీకరించి ప్రేక్షకులు మళ్ళా చూసేలా చేసిన రామ్‌గోపాల్‌వర్మ సాహసానికి, ఆత్మవిశ్వాసానికి, చిత్రికరణ మీద ఆయనకున్న అవగాహనకి, అభినందనలు అర్పించేందుకు ఈ పాటనిక్కడ ఉదహరించాను.

*****

# కల్లోల తరంగం

ఏ కాలంలోనైన, ఏ యుగంలోనైనా, ఏ సమాజంలోనైనా, వర్తమానం అనేది దానికుండే సమస్యలూ, సంఘర్షణలతోనే నిండి ఉంటుంది. పరిపూర్ణమైన శాంతి, ఇంత కంటే కోరదగింది ఇంకేదీ లేదు అనే పరిస్థితి వుండదు. రామాయణ కాలంలో కూడా రావణుడున్నాడు శ్రీకృష్ణుడి కాలంలో కూడా కంసుడూ, కీచకుడు వున్నారు. ఇవి ఎంత సత్యమైనా మనసున్న మనిషికి తన చుట్టు పక్కల వున్న సమాజపు అవ్యవస్థిత, అస్తవ్యస్తతా చూస్తూ ఇది సహజమే ఇలాగే వుంటుంది మరేం ఫర్వలేదు అని నిమ్మకు నీరెత్తినట్లు వుండటం సాధ్యంకాదు. అయ్యో ఏదో అయ్యిపోతోంది ఏదో చేయ్యాలి, ఎవ్వరూ ఏమీ చెయ్యకపోతే పుట్టి మునిగిపోతుంది అని పుట్టెడు దిగులుకు లోనవుతూ వుంటారు. అలా కాకుండా, మెదడు స్పందించకుండా నాపరాయిలా వుండిపోతే సమాజం గతి ప్రగతి లేకుండా

శిలాజంలా మారిపోయి వుండేది. చరిత్ర అంటే నిన్నటి కథే కాదు. ఇవాళ్టి స్థితి రేపటి చరిత్ర అవుతుంది. రేపటి గురించిన కథే వర్తమానం, రేపటి గురించి ఎందుకు కలగనాలంటే ఈ రోజు అసంతృప్తి నుండి తప్పుకోవడానికి. పాత్రలు స్పందించవలసి వచ్చినప్పుడు ఆ స్పందన సమాజంగా నాది కూడా అయి వుంటుంది కనుక, ఈ విభాగంలో కూడా సిరివెన్నెల సీతారామశాస్త్రి కంటే సీతారామశాస్త్రి గొంతే ఎక్కువ వినబడుతూ వుంటుంది.

**సురాజ్యమవలేని స్వరాజ్యమెందుకని**
**సుఖాలమనలేని వికాసమెందుకని**
**సుమాల బలికోరే సమాజమెందుకని**
**అడుగుతోంది అదిగో ఎగిరే భరత పతాకం**
**తెలుసుకోండి ఆ తల్లి తపనలో నేటి కన్నీటి కథనం**
**త్రిశంకు స్వర్గంలో తను త్రివర్ణస్వప్నమని**
**విషాదవర్ణంలో తను వివర్ణచిత్రమని**

**ఆకసాన తన నెగరేసి**
**ఏకాకిగ తననొదిలేసి**
**పాతాళంలో నిలిచిన పౌరుల కరతాళ ధ్వని చూసి**
**విల విలలాడుతు వెల వెలబోయెను మువ్వన్నెల జెండా**
**జలజల కురిసెను తెగి పడిపోయిన ఆశల పువ్వుల దండ**
**త్రిశంకు స్వర్గంలో...**
**విషాద వర్ణంలో...**

**ఆవేశంలో ప్రతి నిముషం ఉరికే నిప్పుల జలపాతం**
**కత్తికొనల ఈ వర్తమానమున బ్రతుకదు శాంతి కపోతం**

బంగరు భవితకు పునాది కాగల యువత ప్రతాపాలు
భస్మాసుర హస్తాలై ప్రగతికి సమాధి కడుతుంటె
శిరసు వంచి అదిగో ఎగిరే భరత పతాకం
చెరుగుతోంది ఆ తల్లి చరితలో విశ్వవిజయాల విభవం ||సురాజ్య||

కులమతాల దావానలానికి కరుగితున్నది మంచుశిఖరం
కలహముల హాలహలానికి మరుగుతున్నది హిందుసంద్రం
దేశమంటే మట్టికాదను మాట మరచెను నేటి విలయం
అమ్మ భారతి బలిని కోరిన రాచకురుపీ రాజకీయం
విషము చిమ్మెను జాతి తనువున ఈ వికృతగాయం ||సురాజ్య||

(గాయం చిత్రంలో శ్రీ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

ఈ పాట నాకు నంది అవార్డు తెచ్చిపెట్టింది. ఈ పాట గురించి భావతరంగంలో రామ్‌గోపాల్‌వర్మ గురించి చెప్పినప్పుడు వివరంగా చెప్పాను.

నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని
అగ్గితోటి కడుగు ఈ సమాజ జీవచ్ఛవాన్ని
మారదు లోకం మారదు లోకం
దేవుడు దిగిరానీ ఎవ్వరు ఏమైపోనీ ||మారదు||

గాలివాటు గమనానికి కాలిబాట దేనికి?
గొర్రెదాటుమందకి నీ జ్ఞానభోధ దేనికి?
ఏ చరిత్ర నేర్చుకుంది పచ్చని పాఠం
ఏ క్షణాన మార్చుకుంది చిచ్చుల మార్గం

**రామబానమార్పిందా రావణకాష్టం**

**కృష్ణగీత ఆపిందా నిత్య కురుక్షేత్రం ||నిగ్గదీసి||**

**పాతరాతి గుహలు పాలరాతి గృహాలైనా**

**అడవినీతి మారిందా ఎన్నియుగాలైనా**

**వేట అదే వేటు అదే నాటికథే అంతా**

**నట్టడవులు నడివీధికి నడొచోస్తే వింత**

**బలవంతులె బ్రతకాలని సూక్తి మరవకుండా**

**శాతాబ్దాలు చదవలేదా ఈ అరణ్యకాండ ||నిగ్గదీసి||**

(గాయం చిత్రానికి శ్రీ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

ఈ పాటలో వున్న ప్రత్యేకత ఏమిటంటే రామ్‌గోపాల్‌వర్మ ఈ పాటను నా మీద చిత్రీకరించారు. 'నేను నటుడ్ని కాను. నా ఆకారం కూడా తెరమీద కనిపించడానికి, ప్రేక్షకులు చూసి ఆనందించడానికి అనువుగా వుండకదా, నన్నెందుకు పెట్టుకున్నారు' అని ఆయన్ని అడిగినప్పుడూ, ఆయన 'నీ ఆకారం, మీ నటన కాదు. మీరు పాడుతున్నప్పుడు మీ కళ్ళల్లో ఆ నిప్పు తునకలూ, విచ్చుకత్తులూ ఏమైతే వున్నయో అవి కావాలి. మీరు సినిమా కోసం రాయని పాటను నేను సినిమా కోసం తీసుకుంటున్నాను కాబట్టి మీరే పాడాలి' అన్నారు. నేను ఆ సినిమాలో నటించిందేమీ లేదు. పైన మామూలుగా ఎలా పాడుకుంటనో అలాగే పాడాను.

ఆ పాటలో నిరాశ కంటే ఒక విధమైన ఉక్రోషంతో పాటు ఒక చురక వుంది. అందులో కొన్ని భావాలు "ఏ చరిత్ర నేర్చుకుంది పచ్చని పాఠం, ఏ క్షణాన మార్చుకుంది చిచ్చుల మార్గం" అని "రామబాణం ఆర్పేనా, రావణకాష్టం, కృష్ణగీత ఆపేనా నిత్య కురుక్షేత్రం" అనే పదాల ద్వారా సమాజాన్ని, ఈ స్థితికి కారణం మరెవరో కాదు తమకి ఏం కావాలో తెలుసుకోని వాళ్ళు ఇంకొకళ్లు తెలియజేసిన సరిగా స్పందించలేని వాళ్ళు అయిన- సామాజికులలో ప్రతి ఒక్కర్ని కూడా నిగ్గదీసి అడగాలి అని భావించాను. సూచించాను. అలా అడగవలసినవాళ్ళు కూడా పై వాళ్ళెవరో కాదు. ప్రతి ఒక్కరూ తనను తాను ప్రశ్నించుకోవాలి.

నిగ్గదీసి అడుగు, ఈ సిగ్గు లేని జనాన్ని అన్నప్పుడు, విపరీతంగా రియాక్ట్ అయి, నువ్వెవడివి ఈ సమాజాన్ని నిందించడానికి? అని నన్ను నిలదీయడానికి బదులుగా అనేకమంది నన్ను అభినందించారు. అప్పుడు నాకనిపించింది. తమ యొక్క అసహాయత, ఉపేక్ష ప్రతి ఒక్కరికి తెలుసు. ప్రతి వ్యక్తిలోనూ, ఎంతో కొంత గిల్టీ ఫీలింగ్ ఉంది. ఈ ఫీలింగ్ వల్లనే ఈ పాటను ప్రేక్షకులు మనస్ఫూర్తిగా అభినందించగలిగారు అని అనుకుంటూ వుంటాను.

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 12

పల్లవి: జరుపుతోంది జరుపుతోంది భారతజాతి
గాంధీ జయంతి ప్రతి ఏడాది
మరువనంది ఎన్నటికీ
బాపూ పుట్టిన తేది-మన బాపూ పుట్టిన తేది
కళ్ళను మూయక-కాళ్ళను కదపక వీధి వీధిన నిలచి
చూడమంటోంది జాతిపితని తను సాధించిన ప్రగతి
మన స్వర్ణస్వతంత్ర భారతి-మన స్వర్ణ స్వతంత్ర భారతి ||జరు||

పడతి ఒంటరిగ కనబడితే పగలే నడిరేయౌతుంది

పశువాంఛలతో బుసకొడుతుంది
నేటి కామదాహాన్ని తీర్చునా కైలాస హిమగిరి కరిగినా
అని కాముని కాల్చిన దేముడికన్ను నీరైపోతుంది
స్త్రీలకి రక్షణనిచ్చే స్వేచ్ఛను కలలో చూసిన గాంధీ
ఈ అత్యాచారపు పచ్చి నిజంలో చెడునెవ్వరితో అనకండి ||మన||

కార్యాలయాల అధికారం-కాంక్షల వలయం అవుతోంది
ఇదేంమిటంటే మన సంఘం ఆలకించనంది
పతి కోరిన సిరి తేకుంటే సతికి చితే పడకౌతుంది
అగ్ని సాక్షిగా అర్ధాంగికి సంసారమె స్మశానమౌతుంది
ఇంతిని పూజించే సంస్కృతి మనదని నమ్మిన గాంధీ
స్త్రీ అత్యాచారపు ఆర్తనాదాల చెడును వినకు అంది
మన స్వర్ణ స్వతంత్ర భారతి- మన స్వర్ణ స్వతంత్ర భారతి ||మన||

కోరి కళ్ళు కప్పేసుకుంది ఈనాటి న్యాయ గాంధారి
ధుర్యోధన సంతానం తరపున మాయ జూదరుల వాదం వింది ఔనంది
నిత్యం తనపై వేసే అసత్య ప్రమాణాల భారం మోసి
అక్షరాలా భగవద్గీత అవతారం చాలించింది
గీతాజ్యోతిని చేత బూని బతుకంతా నడిచిన గాంధీ
ఈ మేధావుల చీకటినడకల చెడునీడ చూడకంది
మన స్వర్ణ స్వతంత్ర్య భారతి-మన స్వర్ణ స్వతంత్ర్య భారతి ||మన||

రాజకీయ రంగస్థలిగా పురాణ సంగ్రామ స్థలిగా
కులాసాల కూడలిగా కళాశాల మారింది
అబలల నవమానించి పెడదారులలో పయనించి

వికటించెను మన యువశక్తి-విద్యాలయాల వికృతలీలల

విలవిలలాడిన సరస్వతి

మన స్వర్ణ స్వతంత్ర భారతి- మన స్వర్ణ స్వతంత్ర్య భారతి

తెల్లదొరల చెఱనుంచి దాస్యపు సంకెల తెంచి

స్వాతంత్ర్యమును తెచ్చి అంధకారానికందించి

తప్పను తెలుసుకునేలోగా తప్పుకున్నావు గాంధీ

రామరాజ్యాన్ని సృష్టించేందుకు పుత్రకామేష్టి జరిపించిన

ఓ వశిష్టుడా- ఓ మహాత్ముడా!

రమణ సంతానంతో భారత మాత కడుపు చించుకుంది

ఆలయాన్ని అంటించిన హారతి అయింది నీ సత్యాగ్రహకాంతి

స్వర్గంలో ఉన్నా కలగదు నీ ఆత్మకు శాంతి

చైతన్యం చల్లారి గాజుగుళ్ళుగా మారిన కళ్ళతో చూడమ్మా- భారతి

ఇక ముందు జరగవలసింది

రావయ్యా బాపూజీ దివినుంచి దిగి రావయ్యా

మళ్లీ జన్మించి మళ్ళీ మళ్ళీ జన్మించి

గరుడవాహనంగా శాంతి కపోతపు రూపం మార్చి

అశోక చక్రాన్నే సుదర్శన చక్రంగా దాల్చి

ముసురుకున్న ఈ అఘాయిత్యాల మొసలి పట్టునుంచి

సమాజ గజేంద్ర మొక్షం కోసం శంఖం పూరించి

హరిగా అవతరించి నరహరిగా విక్రమించి

రావయ్యా బాపూజీ దివినుంచి దిగిరావయ్యా

మళ్ళీ జన్మించి మళ్ళీ మళ్ళీ జన్మించి

(నేటి గాంధీ చిత్రంలో మణిశర్మ సంగీత సారథ్యంలో బాలు, చిత్ర పాడినది)

అర్ధ శతాబ్దపు ఆజ్ఞానాన్ని స్వతంత్రమందామా - స్వర్ణోత్సవాలు చేద్దామా
ఆత్మ వినాశపు అరాచకాన్ని స్వరాజ్యమందామా- దానికి సలాము చేద్దామా
శాంతి కపోతపు కుత్తుక తెంచి ఇచ్చిన బహుమానం-ఈ రక్తపు సిందూరం
నీ పాపిటలో భక్తిగ దిద్దిన ప్రజలని చూడమ్మా- ఓ పవిత్ర భారతమా
అర్ధ శతాబ్దపు ఆజ్ఞానాన్ని స్వతంత్రమందామా - స్వర్ణోత్సవాలు చేద్దామా
నిత్యం కొట్టుకు చచ్చే జనాల స్వేచ్ఛను చూద్దామా-దాన్నే స్వరాజ్యమందామా

★★★★ ★★★★

కులాల కోసం గుంపులు కడుతూ మతాల కోసం మంటలు పెడుతూ
ఎక్కడ లేని తెగువని చూపి తగువుకు లేస్తారే- జనాలు తలలర్పిస్తారే
సమూహ క్షేమం పట్టని స్వార్థపు ఇరుకుతనంలో ముడుచుకుపోతూ
మొత్తం దేశం తగలడుతోందని నిజం తెలుసుకోరేం తెలిసీ భుజం కదిపి రారేం
అలాంటి జనాల తరపున ఎవరో ఎందుకు పోరాడాలి- పోరి ఏమిటి సాధించాలి
ఎవ్వరి కోసం ఎవరు ఎవరితో సాగించే సమరం- ఈ చిచ్చుల సిందూరం
జవాబు చెప్పే బాధ్యత మరచిన జనాల భారతమా!-
ఓ అనాధ భారతమా! ||అర్ధ||

అన్యాయాన్ని సహించని శౌర్యం దౌర్జన్యాన్ని దహించే ధైర్యం
కారడవులలో క్రూర మృగంలా దాక్కుని ఉండాలా? వెలుగుని తప్పుకు తిరగాలా?
శత్రువుతో పోరాడే సైన్యం శాంతిని కాపాడే కర్తవ్యం
స్వజాతి వీరులనణచే విధిలో కవాతు చెయ్యాలా? అన్నల చేరిలో చావాలా?
తనలో ధైర్యం అడవికి ఇచ్చి తన ధైర్యం చట్టానికి ఇచ్చి
ఆ కలహం చూస్తూ సంఘం శిలలా నిలుచుంటే
నడిచే శవాల సిగలో తురిమిన నెత్తుటి మందారం ఈ సంధ్యాసిందూరం
వేకువ వైపా చీకటిలోకా ఎటు నడిపేనమ్మా - గత తోచని భారతమా ||అర్ధ||

★★★★ ★★★★

తన తలరాతను తానే రాయగల అవకాశాన్నే వదులుకుని
తనలో భీతిని తన అవినీతిని తన ప్రతినిధులుగ ఎన్నుకుని

**ప్రజాస్వామ్యమని తలచే జాతిని ప్రశ్నించడమే మానుకొని**

**కళ్ళు ఉన్న ఈ కబోది జాతిని నడిపిస్తుందట ఆవేశం**

**ఆ హక్కేదో తనకే ఉందని శాసిస్తుందట అధికారం**

**కృష్ణుడు లేని కురుక్షేత్రమున సాగే ఈ ఘోరం చితి మంటల సిందూరం**

**చూస్తూ ఇంకా నిదురిస్తావా విశాల భారతమా ఓ విషాద భారతమా**

**** ****

(సిందూరం చిత్రానికి శ్రీ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

1947 అగస్టు 15న స్వతంత్రం వచ్చింది. 1997లో స్వర్ణోత్సవాలు చేసుకున్నాం. ఉత్సవాలు చేసుకోకూడదని కాదు. అనేక వందల సంవత్సరాలు బానిసత్వంలో మగ్గిన మనం స్వతంత్రాన్ని పొందిన ఆ దినాన్ని తప్పనిసరిగా సంస్మరించుకోవాలి. పండుగ చేసుకోవాలి.

కానీ, స్వాతంత్రం రాకముందున్న భారతదేశపు పరిస్థితిని, స్వతంత్రం వచ్చిన తర్వాత దేశపు పరిస్థితిని చూస్తే స్వతంత్రం రాక పూర్వం మనకున్నది ఒకే ఒక్క బాధ- బానిసత్వం- పరాయి పరిపాలన. అయితే స్వతంత్రం వచ్చిన తర్వాత, స్వతంత్ర భారతంలోని ప్రతీపౌరుడు తనకి తానే బానిసైపోయాడు. సమాజంలోని ఏ పరిస్థితులను ప్రశ్నించనూ లేక, మార్చనూ లేక, అంగీకరించనూ లేక, నిస్సహాయుడిగా వున్నాడు. అంటే అభివృద్ధి కానీ, ప్రగతి కానీ లేవా? ఉన్నాయి అని ఆత్మవంచన చేసుకుంటూ వున్న సమస్యల్ని విస్మరిస్తూ, వాటి పట్ల తగినంత దృష్టి సారించకపోతే.... ఆరోగ్యంగా వున్న శరీరానికి ఆభరణాలు లేకపోయినా ఫర్వాలేదు. అనారోగ్యంతో వున్న శరీరానికి చికిత్స తప్పనిసరిగా జరగాలి. అలా జరక్కపోతే, ఆ శరీరం అంతరించేపోయే ప్రమాదం వుంది.

మన స్వాతంత్ర్య ఉత్సవ సంరంభాన్ని జరుపుకునే బదులు, మనకు స్వాతంత్ర్యం వచ్చింది అనే మాటను మరిచిపోకుండా స్మరించడం చాలా ముఖ్యం. స్వాతంత్ర్యం వచ్చింది అంటే అది ఒకప్పుడు పోయింది అని అర్థం. పోయింది అనే దానిలో స్వాతంత్ర్యం నిలబెట్టుకోలేకపోయాం కనక, మన స్వాతంత్ర్యం పోయింది అని అర్థం అవుతుంది. మనం తెచ్చుకున్న స్వాతంత్ర్యం ఇక మీదట పోయే పరిస్థితి రాకుండా వుండాలంటే, మనం సాంఘికంగా, భౌతికంగా, నైతికంగా ఎలా బలపడాలి అని అలోచించాలి. ఈ రోజుకీ మనం చూస్తున్న అంతర్గత కలహాలు, రాజకీయ కక్షలు, మత కలహాలు, కుతంత్రాలు ఉగ్రవాదాలు వీటిని చూస్తూ వుంటే అసలు మనం స్వతంత్రం పొందడానికి అర్హులమా అనే సందేహం కలగక మానదు. ఈ స్వతంత్రాన్ని మనం నిలబెట్టుకోగలమా? అనే ప్రశ్న ఉదయించకా మానదు. కానీ, ఈ ప్రశ్నలను, సందేహాలను ప్రక్కకి పెట్టి దేశం మొత్తం స్వర్ణోత్సవాలు జరుపుకుంటూ వున్న సందర్భంలో, కృష్ణవంశీ తీసిన సిందూరం అనే సినిమా వచ్చింది. ఈ సినిమా మామూలు ఎర్రరంగు సినిమా కాదు. అంటే, విప్లవం కావాలి, విప్లవం రావాలి అని అరిచే సినిమా కాదు, ఈ విప్లవం కోసం సమాజం మీద తిరగబడుతున్నవాళ్ళని అలా తిరగబడడం తప్పు, అలా

తిరగబడితే, మిమ్మల్ని అందర్నీ నేరస్తులుగా పరిగణిస్తాం అనే పాలకవ్యవస్థనీ, దూరం నుంచి పరిశీలిస్తూ, ఈ ఇద్దరిలో వున్న లోటుపాట్లేమిటీ, లోతుపాతులేమిటీ అనేవి నిష్పాక్షికంగా బేరీజు వెయ్యడానికి ప్రయత్నించిన చిత్రం ఇది. అందుకనే ఈ పాటలో అన్నాను. "తనలో ధైర్యం అడవికి ఇచ్చి"- అంటే ఏ పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సాహసించేది నక్సలైట్లయితే, నక్సలైట్లను తమ ప్రతినిధులుగా అనుకుంటున్న ప్రతివ్యక్తి తన ధైర్యాన్ని వాళ్ళకిచ్చినట్లే "తన ధర్మం చట్టానికి ఇచ్చి" చట్టం అనేది మనలో ఉండాలి కానీ, మనల్ని ఇరవైనాలుగ్గంటలూ కనిపెడుతూ ఉండలేదు. ధర్మం, న్యాయం, చట్టం మనంతరంగంలో కొంత ఉంటే బహిరంగంగా వారు కొంత కాపాడుతారు. "ఆ కలహం చూస్తూ సంఘం శిలలా నిల్చుంటే, నడిచే శవాల సిగలో తురిమన నెత్తుటి మందారం ఈ సంధ్యా సిందూరం. వేకువలోకా, చీకటిలోకా ఎటు నడిపేనమ్మా" అని రాస్తూ స్వర్ణోత్సవాలు జరుపుకునే సంరంభంలో మైమరచినటువంటి మైమరపును వదిలించటానికి చేసిన ప్రయత్నం ఆ పాట. ఈ ప్రయత్నానికి 1997 సం||పు నంది అవార్డు ఇవ్వడం జరిగింది.

అలాగే ఈ కల్లోల తరంగంలోనే, స్త్రీల పట్ల జరుగుతున్నటువంటి, వివక్షను అణచివేతను చూసి స్పందించి రాసిన పాటలున్నాయి.

జాతి బేధాలనేవి సృష్టిలో వున్నాయా అంటే వున్నాయి అనిపిస్తుంది. పురుషజాతి, స్త్రీజాతి అనేవి. అయితే, ఈ రెండు జాతులు ఒకరికి ఒకరు వైరుల్లాగా ఎందుకుండాలి? అనే ప్రశ్నకు నాకు జవాబు దొరకలేదు.

నేను సమాజంగా స్త్రీజన పక్షపాతిని. ఎక్కడ ఏమి జరుగుతున్న అణచివేతకు గురౌతున్నది స్త్రీయే. "నిత్యం రగులుతున్న అగ్నిపర్వతం", "యుగాలెన్ని సాగినా ఈ నృత్య కేళి" అనే పాటల్లో అనేక కోణాల్లోంచి స్త్రీ యొక్క పరిస్థితి చిత్రీకరించటానికి ప్రయత్నం చేసాను.

**ఆరని ఆకలికాలం - కలికాలం**
**ఆవనికి ఆఖరికాలం- కలికాలం**
**నీతిని కాల్చే నిప్పుల గోళం నిలువున కూల్చే నిష్ఠుర జాలం**
**కలికాలం ఆకలికాలం... కలికాలం... ఆఖరికాలం**

**ఈ గాలి ఏ జాతి ఎరగదు - ఈ నేల ఏ పూలు విరియదు**
**ఈ మూల ఏకాకి ప్రతిమనిషి - ఈ గోల ఏనాడు అణగదు**
**ఈ జ్వాల ఏవేళ తరగదు - ఈ నింగి పంచేది కటిక నిశి**
**కూటికోసమేనా ఇంత చేటు పోరు**
**సాటివారిపైనా కాటువేయు జోరు**
**మనిషే మృగమై అడివైపోయె నడివీధులు**

కూరిమి కోరని క్రౌర్యం యుగసారం
ఓరిమిచేరని కాటువేయు జోరు
కత్తులు నూరే కర్మాగారం నెత్తురు పారే అత్యాచారం
కసికాలం రక్కసి కాలం కలికాలం ఆకలికాలం...

వాటాల పోటీల నడుమన వేలాడుతుంటారు మనుషులు
వ్యాపారమే వావివరసలుగా
వేలాల పాలౌను విలువలు వేసారిపోతాయి మనసులు
ఏపాటి స్నేహాలు కనబడక
రాగిపైసతోనే పేగుపాశమైనా- ఆస్తి ఆశతోనే అయినవాళ్ళ ప్రేమ
అడిగే వెలనే చెల్లించాలి అడుగడుగునా
అంగడి సరుకై పోయె మమకారం
అమ్ముడు పోమ్మని తరిమే పరివారం
తీరని బేరం ఈ వ్యవహారం తీయని నేరం ఈ సంసారం
కనికారం కానని కాలం కలికాలం... ఆకలికాలం...

బ్రతుకు తెల్లారినాకే వేరొకరి ఆశలకు వేకువ
ఈ ఇరుకులోకాన వాడుకిది
ఓ పాడె లేచేటి తిథికే ఇంకొకరి కళ్యాణవేడుక
ఏ కరకు ధర్మాల నిలయమిది
కాటి కాంతిలోనే బాట చూసుకుంటూ
కాలరాత్రిలోనే చోటు చేసుకుంటూ
బ్రతికే వెతికే ఏ రాకాసి లోకం ఇది
సంతతి సౌఖ్యం కోసం బలిదానం
అల్లిన ఈ యమపాశం బహుమానం
కొందరు చేసే హాహాకారం ఇంకొందరికి అది అహారం

**కలకాలం కలతల గాలం! కలికాలం... ఆకలికాలం**

**ఏనాటికానాడు నిత్యం వేధించు**
**ఆ పేద గాధకు ఈనాడు రేటెంత పెరిగింది**
**జీవించినన్నాళ్ళు ఎన్నడు ఊహించలేనంత పెన్నిధి**
**ఈ వారసత్వానికిచ్చినది**
**చావుకున్న భీమా జీవితానికేది? - ఊపిరున్న ధీమా జ్ఞాపకానికేది**
**కనకే కనకం కన్నీరెందుకంటున్నది**
**నమ్మిన వారికి నష్టం కొనప్రాణం**
**తప్పకతీరును ఛస్తే ఋణభారం**
**అహుతికానీ నిన్నటి రూపం కంచికి పోని నీకథవేగం**
**అనివార్యం ఈ పరిహారం కలికాలం ఆకలి కాలం**

**పైనున్న పున్నామనరకం దాటించు**
**పుణ్యాల బలమని పుత్రుల్ని కన్నాక ఫలితమిది**
**ప్రాణాలు పోయేటి లోపునే వెంటాడి వేటాడి**
**నిలువున అంటించిపోతారు తలకొరివి**
**పాలుపోసి పెంచే కాలనాగు రూపం**
**నోము నోచి పొందే ఘోరమైన శాపం**
**బ్రతుకే బరువై చితినే శరణు వేడే క్షణం**
**కోరలు చాచిన స్వార్థం పరమార్థం**
**తీరని కాంక్షల రాజ్యం ఈ సంఘం**
**కల్లోలం... కమ్మిన కాలం... కలికాలం... ఆకలికాలం**

***** *****

(కలికాలం చిత్రానికి విద్యాసాగర్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

### 13

కలకాలం కలిసుంటానంటే ఔనేమో అనుకున్నానంతే

నిజమా అనిపించే కలలే కన్నా కలగా కనిపించే నిజమై వున్నా

కనుమరుగై నువు కరిగేవేళ - గుడ్‌బై! గుడ్‌బై! గుడ్‌బై! ||కల||

వెలుగంటే విషమంటూ పగలంటే పడదంటూ

నిదురిస్తూ వుంటేనే జతవుంటానన్నావే

తొలికిరణం కనబడితే ఒక నిముషం నిలబడవే

వేయ్యేళ్ళు కనుమూసి బతికేదెలా

చిరువేడి చురకలకే చెదిరే కలా... ||కల||

ఏడేడు జన్మాలు ముడివేసే బంధాలు

చిత్రించే చైత్రాలు వర్ణించే స్వర్గాలు

ఎద చూసే స్వప్నాలు శిథిలమయే సత్యాలా?

హృదయాన నలుపున్న జతజాబిలి

తెలుపంటె తలుపేసే- నీ లోగిలి ||కల||

(అంకురం చితంలో హంసలేఖ సంగీత సారథ్యంలో చిత్ర పాడినది)

పారాహుషారు భాయీ!- భద్రం సుమా సిపాయీ!

పాడురేయి జాడతీయి భగ్గుమను జ్వాలవై

పిడుగులయ్యే అడుగులెయ్యి మృత్యువుకే మృత్యువై

క్రీనీడల కీడును కనిపెట్టాలోయీ ||పారాహుషార్||

ఇంట్లో ఉన్న దొంగ చేతికి తాళాలందించి

సాధించేముంది ఊరిచివర గస్తీ

కంట్లో ఉన్న కారు చీకటిని కనుపాపగ ఎంచి

నువ్వు చీసేదేముంది రాత్రిని గాలించి

కంచెలే చేలని మేస్తుంటే

తోడేళ్ళే మేకల్ని కాస్తుంటే

నేరాలె తీర్పులు చెబుతుంటే

దెయ్యాలె దీవెనెలిస్తుంటే

స్వదేశం కుళ్ళి పోయెరా

అటే నీకళ్ళు తిప్పరా

జవానై కత్తి దూసినా- కిసానై కలుపు తీసినా

స్వదేశీ రక్షణ ఒకటే లక్ష్యం భాయీ ||పారా హుషార్||

నిను కనిపెంచి మాతృభూమికి అందించిన తల్లి

ఏ మూలో పేగు కదిలి తల్లడిల్లెనోయి

నువ్వొస్తావని వేచివున్న ఇల్లాలి పసుపు తాళి

ఏ గాలి వీస్తున్నా ఉలికి పడ్డదోయి

విలువైన అంతటి త్యాగాలు బలిచేసే కొందరి స్వార్థాలు

దేశాన్ని తగలెడుతూ వుంటే

కొంపకే పొగపెడుతూ వుంటే

క్షమిస్తే తప్పుసోదరా

సమాజపు ముప్పు చూడరా

ప్రమాదం ముందులేదురా

తుపాకీ దిశను మార్చరా

లోని శత్రువును పోల్చి చీల్చి పారెయ్యరా ||పారాహుషార్||

(భారతరత్న చిత్రంలో వందేమాతరం శ్రీనివాస్ సంగీతసారథ్యంలో జానకి పాడినది)

నిత్యం రగులుతున్న అగ్నిపర్వతం
ప్రాణం విసిగివున్న మగువ జీవితం
ఓ సమాజమా ఈ మహానలం ఏ క్షణాన పైకి పగులునో
ఆ గడియ నీకు విలయమే సుమా! ||నిత్యం||

పుస్తకాల పుటలలో చెదలు తిన్న ధర్మమా
వర్తమాన చరితలో భవితగతిని చూడుమా
శీలమంటె దేహమా - మచ్చలేని హృదయమా
ఎక్కడుందో తేల్చవా? దిక్కు లేని శాస్త్రమా!
నీతి సూత్రమంతా నారి కోసమేనా?
బదులు పలకవేమే పురుషన్యాయమా?
సాటి మనిషిలాగ స్త్రీని చూడలేక వెంట తరుముతున్న సంఘమా
పాప భారమోపక భూమికున్న ఓపిక నీ పునాది కూల్చివేయగా ||నిత్యం||

రాముడైనా ఇచ్చెనా చితులనుండి రక్షణ?
నీకు నీవె ఇచ్చుకో ఎదురు తిరుగు శిక్షణ
భీముడైన ఆపెనా వలువలొలుచు వంచెనా
నీవు తెగువ చూపితే నరకుడైన నిలుచునా
నరులజాతి అంతా సరిసమానమైనా- ఆడమగల తేడా ఎవరి కల్పన?
స్వేచ్ఛ అన్నదెవరో పరుల ఇవ్వరమ్మా పోరి గెల్చుకోక తప్పదే
అంతరాలు ఎరుగని అణచివేత జరుగని నీ చరిత్ర నీవె రాసుకో! ||నిత్యం||

(శ్రీకారం చిత్రంలో ఇళయరాజా సంగీత సారథ్యంలో జేసుదాస్ పాడినది)

పందిరి వేసిన ఆకాశానికి ఇవ్వమ్మా ఆహ్వానం!

పీటను వేసిన ఈ నేలమ్మకి ఇవ్వమ్మా ఆహ్వానం!

నువ్వూ రామ్మా - ఓ వేదమా!

విడాకుల పత్రిక అందుకొని వెంటనే వేంచేయుమా

దంపతుల విడదీసే మంత్రం - కొత్తగా నేర్చుకోవమ్మా ||పందిరి||

ప్రతిమనువు స్వర్గంలో మునుముందే ముడిపడుతుందా

ఆ మాటే నిజమైతే ఈ చట్టం విడగొడుతుందా

నీరాతకు ఎంత సత్యం ఉందో చూదువు బ్రహ్మయ్యా!

నీ సాక్ష్యం ఎంత విలువైందో ఓ అగ్ని చూడయ్యా!

నువ్వూ రామ్మా ఓ... అరుంధతి!

ఇదే నీ దర్శన ఫలమైతే ఎటైనా దాగిపోవమ్మా

నిజంగా పెళ్ళికి బలముంటే- సూటుగా ఇటు దిగిరావమ్మా ||పందిరి||

చితిమంటల సహగమనం ఒకసారే బలిచేస్తుంది

పతి విడిచిన సతిగమనం ప్రతినిమిషం రగిలిస్తుంది

ఆ జ్వాలలతోనే జీవించేటి ధైర్యం అందిస్తూ

ఓ బంధువులార దీవించండి! దీర్ఘసహనమస్తు!

నువ్వు రామ్మా - మాంగల్యమా

వివాహపు వేదికలో నిన్ను ముడేసిన నిన్నటి వేళ్ళకి

విడాకుల వేడుకలో నేడు - తెంపండం నేర్పడానికి ||పందిరి||

(ఆహ్వానం చిత్రంలో ఎస్వీ కృష్ణారెడ్డి సంగీత సారథ్యంలో బాలు, చిత్ర పాడినది)

ఓ భూమాతా! ఈ బలి అంతా జాలిగా చూస్తూ వుంటావా?

జీవితామంతా ఆరనిమంటా- మొండిగ మోస్తూ వుంటావా?

చితిసెగలే అతివలకు అత్తారిల్లయినా

నరలోకం నరకులకే నట్టిల్లవుతున్నా

నిలువునా చలించిపోవా ||ఓ భూమాతా||

ఒకే ఒక్క రావణుడు ఆనాడు

అయినా నీకు ఆ ఒక్కడే బరువైనాడు

అడుగడుగునా రావణులే ఎక్కడ చూడు

ఎలా భరిస్తున్నావో ఈనాడు

కాపాడే రాముడికే రక్షణ లేక కనబడదే ఏ సీతకు లక్ష్మణరేఖ

సహనం ఎన్నాళ్ళింకా ||ఓ భూమాతా||

చిరుగాలీ! తుఫానులై విరుచుకుపడక

పాపాలకు ఊపిరివై వీస్తున్నావా!

గంగమ్మా! గట్లుతెంచి ముంచుకురాక

గుండెల్లో కన్నీరై కూర్చున్నావా?

కాలుపడిన ప్రపంచాన్ని శపించలేవా!

ధరణిలోని దారుణాన్ని దహించిపోవా!

ప్రళయం పుట్టించ రావా! ||ఓ భూమాతా||

(రక్తతర్పణం చిత్రానికి బప్పిలహరి సంగీత సారథ్యంలో బాలు పాడినది)

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



**దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.**

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

# 14

### రస తరంగం - సరాగపరాగం

రసము అన్నమాటకి, అమృతము, ప్రేమ ఇలా చాలా అర్థాలున్నాయి. నేను ఈ పుస్తకం కోసం పాటలను తరంగాలుగా విభజన చేసినప్పుడు సరాగపరాగం, రసతరంగం అనే విభాగం చేశాను కానీ, వాటికి స్పష్టమైన గీటు అంటూ పెట్టటం అనేది కుదరని పని. ఈ సరాగ పరాగం అనే విభాగంలో డ్యుయెట్లను పెట్టడం జరిగింది. ఈ యుగళగీతాలు అనేవి చాలా కృతకంగా వుండే తప్పనిసరి అలంకారం సినిమాకి. ప్రేమికులు కానీ, భార్యా భర్తలు  కానీ, తమకి ఒకరిపై ఒకరికి ఉన్న ఇష్టాన్నో, వాంఛనో, కామ ప్రకోపాన్నో వ్యక్తపరచుకోవలసిన తీరును, ఎలా వ్యక్తపరచాలి అనే బాధ్యతను, సినీ కవిగా నా నెత్తి మీద ఉంచినప్పుడు, ఇది వరకు వచ్చిన పాటలు గమనించి, మళ్ళా అలాగే వుండకుండా, ఒక కొత్తదనం కోసం, ఒక చమత్కారం కోసం వెంపర్లాడడమే తప్ప, ఈ పాటలలో ఒక ప్రత్యేకమైన ఆశయం కానీ, పరమార్థం కానీ వుండే అవకాశం లేదు. గుడ్డిలో మెల్ల అన్నట్టుగా వీటిలోని ప్రేమ అనే భావాన్ని తీసుకుని ఆ భావాన్ని గురించి విభిన్నమైన రీతుల్లో వ్యక్తపరిచే ప్రయత్నం చేశాను. ప్రేమ అనేది ఒక ఏబ్‌స్ట్రాక్ట్ విషయం. అది ఉహాత్మకమే కానీ వస్తుగతం కాదు.

ప్రేమ అనేది ఇద్దరు స్త్రీ పురుషుల మధ్య వుండే ప్రకృతి ప్రేరేపితమైన, హార్మోన్లవల్ల రెచ్చగొట్టబడ్డ దైహికమైన అభివ్యక్తి మాత్రమే కానక్కర్లేదు, అదొక భావుకమైన సంగతి, మానసికమైన విషయం అనే అభిప్రాయం కలవాణ్ణి నేను. ఈ అభిప్రాయానికి అనుగుణంగా అనేక పాటలు రాశాను.

ప్రేమను ఒక ఫిలసాఫికల్ స్థాయిలో డీల్ చేసి రాసిన ఒక పాట, నాకు బాగా నచ్చిన పాట "శ్రీకారమే ఇది". విరహంలో వున్న ప్రేయసీ ప్రియులకు ప్రేమ అనేది ఒక బలమైన భావన. ఈ భావనకు లోను కాని మనిషి ఎవరూ ఉండరు. ఎంత బలమైన కెరటంలా అది గుండెల్ని తాకుతుందో ఆ ప్రేమికులకే తెలుస్తుంది. జీవితంలో ఏదీ ఊరికే రాదు అని చెపుతూ, జీవితాన్ని, జీవితంలో ఉన్న విలువల్ని పోలుస్తూ, ఈ విరహం అనేది ఈ ప్రేమ పరీక్షలో నెగ్గటానికి ఒక పాఠ్యాంశంగా చిత్రీకరిస్తూ మొదలుపెట్టి, అనేకరకాలుగా ఈ ప్రేమను "ఏమిటో ఈ ప్రేమ" అని రంగేళి సినిమాలోనూ, "గుండెనిండా గుడిగంటలు" లాంటి పాటలలో వ్యక్తపరచడం జరిగింది. ఈ ప్రేమ తత్వాన్ని మృదువుగా చెప్పడానికి ప్రయత్నం చేసిన పాటలన్నిటిని ఈ రసతరంగంలో చేర్చాను. సరాగపరాగంలో ఇంతకు ముందు చెప్పినట్లుగా, డ్యుయెట్లను ఉంచాను. ప్రతీ సినిమాలోనూ ఈ డ్యుయెట్లు దాదాపు తొంభై శాతం వుంటాయి. అన్ని పాటలకంటే ఈ డ్యూయెట్ రాయటం ఎంతో కష్టం. సాధారణంగా, అవే మాటలు, అవే భావాలు రిపీట్ అవుతాయి. ఈ మధ్య బాణీలకు కూడా కొరత ఏర్పడి అవే బాణీలు కొంచెం రంగు మార్చుకుని వస్తున్నాయి. సంగీతం చిత్రీకరణ లాంటి ఆభరణాలను తీసేస్తే అనడానికి, వినడానికీ ఏమీ లేనటువంటి యుగళగీతాల్లో కూడా ఇసుకనుంచి తైలాన్ని పిండటానికి ప్రయత్నంలాగ ప్రయత్నం చేసాను. నిజానికి ఈ డ్యూయెట్ల విషయంలో ఎవరూ ఎవరి మీద కంప్లెయింట్ చెయ్యడానికి అవకాశం లేదు. ఇవి అలవాటు పడిపోయిన ఒక విధానం. ఇది ఇంతే. అందువలన వాళ్ళ మాకు అవకాశం ఇచ్చారు గాదు, అందుకనే రాయలేకపోయాం అని కంప్లెయింట్ చేసే అవకాశంలేదు. అయితే ఆత్మసంతృప్తి కోసం ఇందులో కూడా ఏదైనా ప్రయత్నం చెయ్యగలిగితే, మంచి వస్తువు ఇస్తే దర్శక నిర్మాతలు ఎప్పుడూ కాదనలేదు, కాదనరు.

సంగీతం సహాయం లేకుండా కేవలం చదువుకున్నా అర్ధవంతంగా కనబడే పాటలను నేను ఈ సరాగపరాగం అనే విభాగంలో చేర్చాను.

నా పాటలలోని సొగసులను, సోయగాలను నేనేంత అనందిస్తానో అంతే స్థాయిలో నా పాటలలో వుండే లోటుపాట్లు నాకు స్పష్టంగా తెలుస్తాయి. అందుకనే పెర్ఫెక్ట్ అనే పరిస్థితి వుందని నేను అనుకోవడం లేదు. ఒక వేళ వున్నా దానికి నేను చేరలేదు. కనుక, ఈ యుగళ గీతాల్లో చాలా భాగం పదాలు, భావాలు పునరావృతం అయినా అయి వుండవచ్చు.

**పల్లవి : శ్రీకారమే ఇదీ ప్రణయమా నీ కావ్యంలో**

**నీ గాథలో ప్రతీ క్షణం వర్ధిల్లనీ, జ్వలించే గేయాలతో**

నీ పాట ఈదాలి కన్నీటి ఏటిలో

నీబాట వెలగాలి గాయాల కాంతిలో

అలల హోరె అక్షరాలై వలపుభాష నేర్చుకో

స్మృతుల నీడే నాకు తోడై తీపి చేదు తెలుసుకో

బాధ లేని ఏ బంధమైనా బిగువు లేనిది

పోరులేని ఏ విజయమైన విలువలేనిదీ

నీ శ్వాశ మరగాలి  గ్రీష్మాల సాక్షిగా

నా ఆశ నిలవాలి శిశిరాల కాంక్షగా

చితులు సైతం చిన్నబోయె చెలిమి చిచ్చు రేగనీ

ఋతువులన్నీ సమిధలయ్యే యాగదీప్తి సాగనీ

ఉరుములేని ఏ మేఘమైనా చినుకులేనిదే

మరిగిపోని ఏ లోహమైన పనికి రానిది

(యుగళగీతం చిత్రానికి బి.ఆర్. సురేష్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

పల్లవి: ఏమిటో ఏమో ఈ ప్రేమ - శాపమో వరమో ఈ ప్రేమ

నీతో ఆడుతుందీ ప్రేమ - నిను వేటాడుతుందీ ప్రేమ

విషమో అమృతమో చెప్పేవారే లేరమ్మా.. ||ఏమిటో||

ఏ నిముషం ఇది మొదలౌతుందో తెలియదు

గుండేల్లో చేరేముందు అనుమతి అడగదు

మనసుంటే ప్రేమించక మానదు
ప్రేమిస్తే మనకంటూ మనసే మిగలదు
అక్షరాలు రెండే అయిన లక్షలాది కథలను రాసే
ఈ ప్రేమలో పడి నిలబడతరమా ||ఏమిటో||

ప్రేమకు వేరే భాషేకటున్నది
జగమంటే నువ్వూ నేనే - అంతే అన్నది
కలిసేవరకు క్షణమొక యుగమని
కలిశాక యుగమే క్షణమనుకోమన్నది
లోకానికి అర్థం మార్చి, కాలానికి కొలతలు మార్చి
ఏదో గారడి చేసేస్తుంది

(రంగేళి చిత్రానికి ఎ.ఆర్.రెహమాన్ సంగీత సారథ్యంలో హరిహరన్, కవితాకృష్ణమూర్తి పాడినది)

అతడు: పంచమవేదం ప్రేమనాదం
గంగాసాగర సంగమ సంగీతం
శృంగార మంత్రాల మంగళ సంకేతం - ప్రేమనాదం
ఆమె: పంచమ వేదం ప్రేమనాదం
గంగాసాగర సంగమ సంగీతం
శృంగార మంత్రాల మంగళ సంకేతం - ప్రేమనాదం

అతడు : హృదయగగనమున తొలకరి కదలిక
ఆమె: బ్రతుకు పుటలలో పచ్చని గీతిక
అతడు : కళ్ళలోన విరివనాల పండగ

పల్లవించు పరిమళాల పండగ

ఆమె : పట్టలేని పరవశాలు చిందగ

పట్టపగలు పంచవర్ణ చంద్రిక

అతడు : అవనికి తెలిసిన ఆది కావ్యమిది

ఆమె : అవధులు తెలియని అమర గానమిది ||పంచమ||

ఆమె : మౌనమే శృతిగా మనసు పాడినది

అతడు : మోహమే జతిగా నాట్యమాడినది

ఆమే : తేలుతున్న రాగమాల మాధురి

తూలుతున్న రాసలీల లాహిరి

అతడు : మేలుకున్న మెరుపుకన్నె మాదిరి

మేని వన్నె మొలిక తిరిగె మరిమరి

ఆమె : అలజడి తలపుల మరులకాలమున

అతడు: అలసట తలవని అలల తాళమున ||పంచమ||

(పృధ్వీరాజ్ చిత్రానికి సత్యం సంగీత సారథ్యంలో బాలు పాడినది)

ఆమె: హృదయమనే కోవెల తలుపులు తెరిచే తాళం

ప్రేమా ప్రేమా - ప్రేమా ప్రేమా....

అతడు : ఆ.... త్యాగమనే దేవత సన్నిధి వెలిగే దీపం

ప్రేమా ప్రేమా - ప్రేమా ప్రేమా

ఆమె: అణువణువును చెలిమికి అంకితమిచ్చును ప్రేమ

అతడు: తను నిలువున కరుగుతు కాంతి పంచునది ప్రేమ

ఆమె : గగనానికి నేలకి వంతెన వేసిన వానవిల్లు ఈ ప్రేమ

ప్రేమా ప్రేమా - ప్రేమా ప్రేమా ||హృదయమనే||

ఆమె: ఇవ్వడమే నేర్పగల ఈ ప్రేమ తన కోరకు ఏ సిరిని అడగదు కదా

అతడు: నవ్వడమే చూపగల ఈ ప్రేమ - మంటలనే వెన్నెలగ మార్చును కదా

ఆమె: గాలికి, గంధము పూయడమే పూలకు తెలిసిన ప్రేమ కథ

అతడు: రాలిన పూవుల జ్ఞాపకమే కాలం చదివే ప్రేమ కథ

ఆమె: ప్రియమైన తనవారి సుఖశాంతులే కోరి మురిసేటి గుణమే ప్రేమా

ప్రేమా ప్రేమా - ప్రేమా ప్రేమా ||హృదయమనే||

ఆమె : ఏ జాతినో ఎందుకో విడదీసి వెంటాడి వేటాడు ఆటే ప్రేమా

అతడు: మౌనముతో మనసునే శ్రుతిచేసి రాగాలు పలికించు పాటే ప్రేమ

శాశ్వత చరితల ఈ ప్రేమ మృత్యువు ఎరగని చిరునామా

ఆమె : శ్వాసను మంగళహారతిగ వెలిగించేదీ ఈ ప్రేమా

మరణాన్ని ఎదిరించి మరుజన్మగా వచ్చి కరుణించు వరమే ప్రేమా

ప్రేమా ప్రేమా - ప్రేమా ప్రేమా ||హృదయమనే||

(పెళ్ళి సందడి చిత్రంలో కీరవాణి సంగీత సారథ్యంలో బాలు చిత్ర పాడినది)

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 15

అతడు: ప్రేమంటే నిజంగా ఏమంటే ఇదంటూ ఎట్టా చెప్పగలం
ఆమె : ప్రేమించే ఎదల్లో ఏముందో పదాల్లో ఎట్టా చూపగలం
అతడు: తొలిచినుకుల తడి ఇదని తొలి కిరణపు తళుకిదని
ఆమె : తొలివలపుల తలపిదని ఎట్టాగ పోల్చడం

ఆమె : ఊటీకైనా చెమటలు పట్టే హీటుంది ఈ ప్రేమలో
అతడు: ఉప్పెనకైనా ఒణుకులు పుట్టే ఊపుంది ఈ ప్రేమలో
ఆమె : వెనుతిరగని వేగాలతో తొలి కదలిక ఏనాటిదో
అతడు: మునుపెరుగని రాగాలతో పిలిచిన స్వరమేమంటదో
ఆమె : జతకుదిరిన క్షణమిదని ముడి బిగిసిన గుణమిదని
అతడు: కథ ముదిరిన విధమిదని ఎట్టాగ తేల్చడం

అతడు: శంకరుడైనా కింకరుడైనా లొంగాలి లవ్ ధాటికి

ఆమె : పండితుడైనా పామరుడైనా పసివాడే సయ్యాటకి

అతడు: తుది ఎరుగని ప్రేమాయణం మొదలెపుడని ఊహించడం

ఆమె : గత చరితల పారాయణం గతులెన్నని వివరించడం

అతడు: పరులెరుగని అనుభవమై పదపదమను అవసరమై

ఆమె : పయనించే ప్రణయరథం ఎటు పరుగు తియ్యునో

(గోవింద గోవిందా చిత్రానికి రాజ్‌కోటి సంగీత సారథ్యంలో బాలు చిత్ర పాడినది)

★★★★ ★★★★

ప్రేమంటే తేనలా తీయగ వుంటుందనువారు
తేనెంటే ఏమిటో తెలియకనే అనివుంటారు
మనసును గిల్లే ముల్లే కాదా ప్రేమ
నిదురను చిదిమే అల్లరి కాదా ప్రేమ
తరుముకు వచ్చే తేనటీగ కద ప్రేమ
తెలియక దిగితే తేలరు అయ్యోరామా
ఏమిటో ప్రేమన్నది- ప్రేమకే తెలియాలి మరి ||ప్రేమ||

కోటి చుక్కలంటె ఆమె రెండుకళ్ళే అంటున్న ప్రేమతో
కొత్తలెక్కలేస్తే ఆమె తప్ప వేరే జనులంటూ ఉండరే
ఎండంటే ఆమె కోపం- నీడంటే ఆమె స్నేహం
వానవిల్లు ఆమె రూపం- లోకమంటె ఆమే అంది ప్రేమ
మతి చెడెనేమో అనుకుంటే ఎవరైనా
చిన్న నవ్వు నవ్వి జాలిపడుతుంది ప్రేమ
ఏమిటో ప్రేమన్నది - ప్రేమకే తెలియాలి మరి ||ప్రేమంటే||

రాసుకుంది మనసు సరికొత్త డైరీ- ఈ ప్రేమ భాషతో
లక్షలాది పుటలు నింపుతుంది డైలీ- ఒక చిన్నమాటతో
ఇష్టాలను మార్చమంటూ కష్టాలను కోరమంటూ
నన్ను నేనే పోల్చనట్టు  ఎంత మాయచేసిందో ఈ ప్రేమ
అది చెబుదామని అనుకుంటూనే వున్నా
తను ఎదురైతే ఇంకేదో అంటున్నా
ఏమిటో ప్రేమన్నది- ప్రేమకే తెలియాలి మరి ||ప్రేమంటే||

(హరిశ్చంద్ర చిత్రానికి ఆగోష్ సంగీత సారథ్యంలో మనో పాడినది)

★★★★ ★★★★

గుండెనిండా గుడిగంటలు గువ్వల గొంతులు ఎన్నో మోగుతుంటే
కళ్ళనిండా సంక్రాంతులు సంధ్యాకాంతులు శుభాకాంక్షలంటే....
వెంటనే పోల్చాను నీ చిరునామా- ప్రేమా... ||గుండె||

చూస్తూనే మనసు వెళ్ళి నీ ఒళ్ళో వాలగా
నిలువెల్లా మారిపోయా నేనే నీ నీడగా
నిలువదు నిమిషం-నువు ఎదురుంటే
కదలదు సమయం- కనబడకుంటే..
నువ్వొస్తునే ఇంద్రజాలం చేశావమ్మా
కవ్విస్తూనే చంద్రజాలం వేశావమ్మా
పరిచయమే చేశావే నన్నే నాకు కొత్తగ ఓ ప్రేమ.. ||గుండె||

★★★★ ★★★★

నీ పేరే పలవరించే- నాలోని ఆశలు
మౌనాన్నే ఆశ్రయించే- ఎన్నెన్నో ఊసులు
తెరిచిన కనులే- కలలకు నెలవై
కదలని పెదవే- కవితలు చదివే

ఎన్నెన్నెన్నో గాథలున్న నీ భాషని
ఉన్నట్టుండి నేర్పినావే ఈ రోజుని
నీ జతలో క్షణమైనా బతుకుని చరితగ మార్చేస్తుందమ్మా.. ||గుండె||

(శుభాకాంక్షలు చిత్రంలో కోటి సంగీత సారధ్యం బాలు, రేణుక పాడినది )

★★★★ ★★★★

తమ్ముడు! అరె తమ్ముడూ! ఈ తికమక తెగులే ప్రేమంటే
ఈ తెలియని దిగులే ప్రేమంటే-
నను అడగర చెబుతా డౌటుంటే
నువు బెదరవు కద నా మాటింటే
అమ్మడూ! ఓ అమ్మడూ! నువు మరీ పరాగ్గా వుంటూంటే
నీకు నిదరే సరిగా రాకుంటే- ఏం జరిగిందో తెలియాలంటే
ఆ రహస్యాన్ని చెబుతా వింటే...
కోరస్: మాష్టారు మాష్టారు మంచి లెక్చరు ఇచ్చారు
మాష్టారు మాష్టారు లవ్‌లో మీరు మెగాస్టారు ||తమ్ముడు||

వేల వేల భాషలున్న నేల మీద ఎక్కడైన
ప్రేమగ్రామరొక్కటే లవ్వరూ- ఆ లాంగ్వేజ్ తెలియనిదెవరు
మూగసైగలైన చాలు వేడి వూపిరైన చాలు
గుర్తు పట్టలేరా ప్రేమికులు- అవి అచ్చుతప్పులేని ప్రేమలేఖలు
అమెరికాలో ఇంగ్లీష్ ప్రేమ- ఆఫ్రికాలో జంగిల్ ప్రేమ
ఏకమయ్యే ఏకాంతంలో ఎక్కడైనా ఒకటే ప్రేమ
తమ్ముడు! అరె తమ్ముడూ!
గుడ్డివాడు కుంటివాడు నల్లవాడు తెల్లవాడు
ప్రేమదేశమెళ్ళగానే మానవుడిగ మిగులుతాడు ||తమ్ముడు||

లక్షలాది లక్షణాలు చూపుతున్న ప్రేమకున్న

అక్షరాలు మాత్రం రెండు - అది మహా సముద్రం ఫ్రెండు

సెంచరీల తోటి పెద్ద సీరియల్‌గా సాగుతున్న

మహానవలరా ప్యారు

ఆ స్టోరీ కొట్టదు బోరు

'క' గుణింతం తెలియని వారు - కాళిదాసులు ఐపోతారు

అమ్మడూ! ఓ అమ్మడూ! లబ్‌డబ్ హార్టుబీటు

లవ్ లవ్ అన్నదంటె

హైక్లాస్ లోక్లాసు చూసుకోదు ప్రేమ కేసు ||తమ్ముడు||

(మాస్టర్ చిత్రానికి దేవా సంగీత సారథ్యంలో చిరంజీవి పాడినది)

★★★★ ★★★★

ఆమె: నాలో ఏదేదో ఐపోతున్నది

అతడు: అంతే ఈ ప్రేమ వరసా- దాని అంతే చూడాలి వయసా

ఆమె : నీ తోడు కోరింది నా ఊపిరి

అతడు: అంతే ఈ ప్రేమ వరసా- దాని అంతే చూడాలి వయసా

ఆమె : ఈవేళ ఈ సూర్యోదయం- ఇన్నాళ్ళలాగ లేదు కాదా

అతడు: నీలోన ఈ ప్రేమోత్సవం - ఈ రోజె పుట్టినట్టు ఉందా లేదా ||నాలో||

ఆమె : భాష మొత్తమూ మాయమైనదా- గుండెమాట గొంతు దాటిరాదే

కోరస్: అంతే ఈ ప్రేమ వరసా- దాని అంతే చూడాలి వయసా

శ్వాసమాత్రమూ గేయమైనదా- హాయి పాటనన్ను మీటుతోందే

కోరస్: అంతే ఈ ప్రేమ వరసా- దాని అంతే చూడాలి వయసా

నీలో ఏదో కొత్తకోణం చూసా నువ్వు నువ్వేనా కాళిదాసా!

అతడు: నీవే కదా నిండు ప్రాణం పోసి దాన్ని పెంచావు కన్నె హంసా

ఆమె : ఒక్క మాటే అని కోటి భావాలని

అందజేయాలనే కొత్త పాఠం ఇదే తెలుసా ||నాలో||

అతడు: కన్ను బొత్తిగా చిన్నదైనదా నిన్ను తప్ప ఏమీ చూడలేదే

కోరస్: అంతే ఈ ప్రేమ వరసా- దాని అంతే చూడాలి వయసా

అతడు: కొన్ని ఏళ్ళగా ముందుకెళ్ళక కాలమంత ఆగిపోయి వుందే

కోరస్: అంతే ఈ ప్రేమ వరసా- దాని అంతే చూడాలి వయసా

అతడు: ఏతా వాతా దీని వాటం చూస్తే తీయగా వున్న కత్తి కోత

ఆమె : ఇంటా బయటా మొగమాటం పెట్టే తప్పుకోలేని వింత వేట

అతడు: మంచుమంటై ఇలా అంటూకుంటే ఎలా- పంచుకుంటే తనే తగ్గుతుందో ఏమో బహుశా

||నాలో||

(మనసిచ్చిచూడు చిత్రానికి మణిశర్మ సారథ్యంలో బాలు, సుజాత పాడినది)

★★★★ ★★★★

పల్లవి : ఆలయాన హారతిలో- ఆఖరి చితిమంటలలో

రెండింటిలో నిజానికున్నది ఒక్కటే అగ్నిగుణం

ప్రేమ అనే పదాన వున్నదు ఆరని అగ్నికణం

దీపాన్ని చూపెడుతుందో- శాపాన బలిపెడుతుందో

అమృతమో హాలహలమో ఏమో ఈ ప్రేమగుణం

ఏ క్షణాన ఎలాగ మారునో ప్రేమించే హృదయం

ఎండమావిలో ఎంత వెదికినా నీటిచెమ్మ దొరికేనా

గుండెబావిలో ఉన్న ఆశ తడి ఆవిరి అవుతున్నా

ప్రపంచాన్ని మరిపించేలా మంత్రించే ఓప్రేమా

ఎలా నిన్ను కనిపెట్టాలో ఆచూకీ ఇవ్వమ్మా

నీజాడ తెలియని ప్రాణం- చేస్తోంది గగన ప్రయాణం

ఎదర వుంది నడిరేయన్నది ఈ సంధ్యాసమయం ||ఏక్షణాన||

సూర్యబింబమే అస్తమించనిదే మేలుకొని కలకోసం
కళ్ళు  మూసుకొని కలవరించెనే కంటిపాప పాపం
ఆయువిచ్చి పెంచిన బంధం మౌనంలో మసి అయినా
రేయి చాటు స్వప్నం కోసం అలాపన ఆగేనా
పోదేది ఏదేమయినా పోయింది తిరిగొచ్చేనా
కంటిపాప కల అడిగిందని నిదురించెను నయనం ||ఏ క్షణాన||

(సుస్వాగతం చిత్రంలో ఎస్.ఎ. రాజ్ కుమార్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

★★★★ ★★★★

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 16

యవ్వనవీణా! పువ్వులవానా!
నువ్వెవరే నా మదిలో చేరిన మైనా
నవ్వులతో తుళ్ళిపడే తుంటరి థిల్లానా
నీ పేరు ప్రేమ అవునా? ఇవాళే నిన్ను పోల్చుకున్నా! ||యవ్వన||

నువ్వంటు పుట్టినట్టు నాకొరకు
ఆచూకి అందలేదు ఇంతవరకు
వచ్చింది కాని ఈడు ఒంటి వరకు
వేధించలేదు నన్ను జంట కొరకు
చూశాక ఒక్కసారి ఇంత వెలుగు

నా వంక రాను అంది కంటికునుకు

ఈ అల్లరీ ఈ గారడీ నీ లీల అనుకోనా

నీ పేరు ప్రేమ అవునా? ఇవాళే నిన్ను పోల్చుకున్నా! ||యవ్వన||

ఏ పూల తీగ కాస్త ఊగుతున్నా

నీ లేత నడుమే అనుకున్నా!

ఏ గువ్వ కిలకిల వినపడినా

నీ నవ్వులేనని వెళుతున్నా!

మేఘాల మెరుపులు కనపడినా

ఏ వాగు పరుగులు ఎదురైనా

ఆ రంగులో ఆ పొంగులో నీ రూపె చూస్తున్నా

నీ పేరు ప్రేమ అవునా? ఇవాళే నిన్ను పోల్చుకున్నా! ||యవ్వన||

(పెళ్ళి చిత్రానికి ఎస్.ఏ.రాజ్‌కుమార్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

**** ****

ప్రియురాలి అడ్రస్సేమిటో చెప్పమ్మా — కాస్త చెప్పమ్మా

జవరాలి చిరునామా ఏమిటో చెప్పమ్మా — కాస్త చెప్పమ్మా

ఆమె సిగను విరిసె మల్లీ! ఆమెనుంచి వీచే గాలీ!

ఆమె నిదురపోయే వేళ జోలపాడు జాబిల్లీ!

చెప్పమ్మా — కాస్త చెప్పమ్మా ||ప్రియురాలి||

నిదురనదిలో ఆమె కోసం నడిరేయి చాటున మాటు వేశా

కలల వలలో ఆమె రూపం పడగానే వెంటనే లేచి చూశా

ఎరను కొరికే చిలిపి చేప కునుకు వెనకే కరిగిపోగా

తెల్లారింది ఇట్టే — నేనేమో తెలబోతుంటే

మళ్ళీ మళ్ళీ ఇంతే ప్రతిరాత్రీ జరిగే తంతే

మసకతెరలు తెరిచేదెవరమ్మా ||ప్రియురాలి||

కనులు వెతికే కన్నె ఎవరో వివరాలు తేలని మనసు నాది
తనను ఎవరో పలకరిస్తే నువ్వు కాదు పొమ్మని అంటున్నది
జంటలెన్నో కంటపడితే వయసు నన్ను కసురుతోందే
భూమ్మీదింకా తాను పుట్టిందో లేదో భామా
ఏమో తెలియదు కానీ మది ప్రేమించేసిందమ్మా
దీని గొడవ ఆపేదెవరమ్మా ||ప్రియురాలి||

(ఆహా! చిత్రానికి స్వీయ సంగీత సారథ్యంలో వందేమాతరం శ్రీనివాస్ పాడినది)

**** ****

ఆమె: నిన్న చూసిన ఉదయం కాదిది
కొత్తగా వుంది — సరికొత్తగా వుంది
ఇంతవరకు ఇన్ని వింతలు - ఎక్కడ దాచింది
కొత్తగా వుంది సరికొత్తగా వుంది... ||నిన్న||

ఆమె: చురుకుమంటూ పొడిచి లేపే సూర్యకిరణం ఈవేళ
కలువ విరిసే చలువకురిసే ఎదను సోకెనులే
వేడిగాలె వెంట తరిమే ఎండాకాలం ఈవేళ
ఏడురంగుల ఇంద్రధనువై ఎదుట నిలిచెనులే
అతడు: ఈ మాయమర్మం నాదందువా — నీలోని భావమే కాదందువా
ఈనాడు కలిగిన నీ మెలకువ — చూపించెనేమో తొలివేకువ
ఈ సుప్రభాతం వినిపించు గీతం — నీ గుండెలోనే లేదందువా ||నిన్న||

ఆమె: మంత్రమెవరో వేసినట్టు మట్టిబొమ్మే ఈవేళ
నమ్మలేని నాట్యకళతో నడచివచ్చింది
మాయ ఏదో జరిగినట్టు మంచు ఋతువే ఈవేళ
వేలవన్నెల పూలు తొడిగి పలకరించింది

అతడు: నీ కంటిముందర ఈ రంగులు — నీలోన దాగిన శ్రీకాంతులు

నీ గుండె ముంగిట ఈ ముగ్గులు — నీ ఊహలోని సంక్రాంతులు

ఏదో విచిత్రం — ఈ నవ్వే చైత్రం — సత్యం శివం సుందరం ||నిన్న||

(చిన్నబ్బాయ్ చిత్రంలో ఇళయరాజా సంగీత సారథ్యంలో బాలు, సుజాత పాడినది)

**** ****

ఎక్కడ ఉన్నా పక్కన నువ్వే ఉన్నట్టుంటోంది — చెలీ! ఇదేం అల్లరి

నానీడైనా అచ్చం నీలా కనిపిస్తూ ఉంది — అరే ఇదేం గారడి

నేను కూడా నువ్వయానా — పేరుకైనా నేను లేనా

దీనిపేరేనా ప్రేమ అనే ప్రియభావన ||ఎక్కడ||

నిద్దుర తుంచే మల్లెల గాలి — వద్దకు వచ్చి తానెవరంది

నువ్వే కదా చెప్పు ఆ పరిమళం

వెన్నెలకన్నా చల్లగ ఉన్న చిరునవ్వేదో తాకుతు ఉంది

నీదే కాదా చెప్పు ఆ సంబరం

కనుల ఎదుట నువులేకున్నా — మనసు నమ్మదే చెబుతున్నా

ఇది హాయో — ఇది మాయో నీకైనా తెలుసునా

ఎవరు ఎవరితో ఏమన్నా నన్ను పిలిచినట్టనుకున్నా

ఏమిటౌతుందో ఇలా నా ఎదమాటునా

దీనిపేరేనా ప్రేమ అనే ప్రియభావనా ||ఎక్కడ||

కొండలనుంచి కిందికి దూకే తుంటరి వాగు నాతో అందీ

నువ్వూ అలా వస్తూ ఉంటావని

గుండెలనుంచి గుప్పున ఎగసే — ఊపిరి నీకో కబురంపింది

చెలీ నీకై చూస్తూ వుంటానని

మనసు మునుపు ఎపుడూ ఇంత — ఉలికి ఉలికి పడలేదు కదా

మనకు తెలియనిది ఈ వింత — ఎవరి చలవ ఈ గిలిగింత
నాలాగే నీక్కూడా అనిపిస్తూ ఉన్నదా
ఏమి చేస్తున్నా పరాకే — అడుగడుగునా
దీని పేరేనా — ప్రేమ — అనే ప్రియభావనా ||ఎక్కడ||

(నువ్వేకావాలి చిత్రానికి కోటి సంగీత సారథ్యంలో శ్రీరామ్ పాడినది)

**** ****

ఈ వేళలో నీవు ఏం చేస్తు ఉంటావో
అనుకుంటు ఉంటాను ప్రతినిముషమూ నేను
నా గుండె ఏనాడో చేజారి పోయింది
నీ నీడగా మారి నావైపు రానంది
దూరాన ఉంటూనే ఏం మాయచేశావో... ||ఈ వేళలో||

నడిరేయిలో నీవు — నిదురైన రానీవు — గడిపేదెలా కాలమూ
పగలైన కాసేపు పనిచేసుకోనీవు — నీ మీదనే ధ్యానమూ
ఏవైపు చూస్తున్నా నీరూపె తోచింది
నువు కాక వేరేది కనిపించనంటుంది
ఈ ఇంద్రజాలాన్ని నీవేగా చేసింది
నీ పేరులో ఏదో ప్రియమైన కైపుంది
నీ మాట వింటూనే ఏం తోచనీకుంది
నీ మీద ఆశేదో నను నిలవనీకుంది
మతిపోయి నేనుంటే నువ్వు నవ్వుకుంటావు... ||ఈ వేళలో||

(గులాబి చిత్రంలో శశిప్రీతమ్ సంగీత సారథ్యంలో సునీత పాడినది)

**** ****

ఏ రోజైతే చూశానో నిన్ను

ఆ రోజే నువ్వైపోయా నేను

కాలం కాదన్నా ఏ దూరం అడ్డున్నా

నీ ఊపిరినై నే జీవిస్తున్నాను

నీ స్పర్శే నే పీల్చే గాలుల్లో

నీ రూపే నా వేచె గుండెల్లో

నిన్నటి నీ స్మృతులే నన్ను నడిపిస్తూ ఉంటే

నీ నీడై వస్తాను ఎటువైపున్నా

నీ కష్టంలో నేనూ ఉన్నానూ

కరిగే నీ కన్నీరవుతానూ

చెంపల్లో జారి నీ గుండెల్లో చేరి

నీ ఏకాంతం లో ఓదార్పవుతానూ ||ఏ రోజైతే||

కాలం ఏదో గాయం చేసిందీ

నిన్నే మాయం చేస్తానంటుందీ

లోకం నమ్మి అయ్యో అంటోంది

శోకం కమ్మి జోకొడతానంది

గాయం కోస్తున్నా నే జీవించే ఉన్నా

ఆ జీవం నీవని సాక్ష్యం ఇస్తున్నా

నీతో గడిపిన ఆ నిమిషాలన్నీ

నాలో మోగే గుండెల సవ్వడులే

అవి చెరిగాయంటే నే నమ్మేదెట్టాగా

నువ్ లేకుంటే నేనంటూ ఉండనుగా ||నీ కష్టంలో||

(గులాబి చిత్రంలో స్వీయ సంగీత సారథ్యంలో శశిప్రీతమ్ పాడినది)

**** ****

చేరుకో ఇలా — కోయిలా పూలవానలా తేనెలా
ఎదలో హాయిగా కదిలే కోరికా
మనసార నీకు ఘనస్వాగతాలు పలికేటి ఈ ఉగాదిలో ||చేరుకో||

శ్వాసలపైన చిగురాశల వీణ
అనురాగ రాగమే తీయగా
ఏ ఋతువైనా మన ఈ జతలోన
పులకింత పూవులే పూయగా
సమయమే మాయమై — ప్రణయమే ప్రాణమై
శతకోటి దీపికల సాటి తీపికలలే కనే క్షణాలలో ||చేరుకో||

ఈ అనుబంధం పెనవేసిన బంధం
గతజన్మ గంధమై చేరగా
ప్రేమ ప్రబంధం కవిరాయని గ్రంధం
ప్రియకావ్య గానమే చేయగా
ప్రతిదినం చైత్రమై — ప్రతిక్షణం అమృతమై
తుదిలేని ప్రీతిగల తేనె గీతికల సాగు ఈ స్వరాలలో ||చేరుకో||

(శుభముహూర్తం చిత్రానికి కీరవాణి సంగీత సారథ్యంలో కీరవాణి, అనురాధ పాడినది)

**** ****

అతడు: వయసా నీకు తెలుసా అధరాల అరుణోదయాలు
ఆమె: మనసా నీకు తెలుసా నయనాల సూర్యోదయాలు
అతడు: జలతారు జలపాతమై నిను తాకే — తొలిప్రేమ కిరణాలలో ||మనసా||

ఆమె: తలపే రాగనళిని — మోవి మోహాల కోనేటి ఒడిని
అతడు: జతనై — తేటి జతినై — తేనె తానాల తేలేటి రవిని
ఆమె: ఆలపించనీ

అతడు: ఆలకించనీ

ఇద్దరు: గాలి గొంతుతో తావి గీతిలో సుప్రభాత భూపాలం ||మనసా||

అతడు: పరువం — పూత బరువై తూగిపోతోంది లావణ్యవల్లి

ఆమె: ప్రణయం — తాను తరువై తోడు చేరింది లేవన్నెలల్లి

అతడు: తీగమల్లికి

ఆమె: నీడపల్లికి

ఇద్దరు: రాగపల్లకి మోగు పెళ్ళికి — నాగ నర్తకి కాలం ||వయసా||

(భలేమొగుడు చిత్రానికి సత్యం సంగీత సారథ్యంలో బాలు, సుశీల పాడినది)

**** ****

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 17

ఏ స్వప్నలోకాల సౌందర్యరాశి
నా ముందుకొచ్చింది కనువిందు చేసి
ఏ నీలిమేఘాల సౌధాలు విడిచి
ఈ నేల నడిచింది ఆ మెరుపు వచ్చి
తళ తళ తారక- మెలికల మేనక
మనసున చేరెగా- కళగల కానుక
కొత్తగా కోరిక - చిగురులు వేయగా ||ఏ స్వప్న||

తొలిచూపు చాలంట- చిత్తాన చిత్రంగ ప్రేమనేది పుట్టగా
పదిమంది అంటుంటే విన్నాను ఇన్నాళ్ళు- నమ్మలేదు బొత్తిగా

ఆ కళ్ళలో - ఆ నవ్వులో మహిమ ఏమిటో

ఆ కాంతిలో ఆ నాడే నా ఉదయమైనదో

మది సీమలో ఎన్ని మరుమల్లె గంధాలు

మునుపెన్నడూ లేని మృదువైన బంధాలు

మొదటి వలపు కథలు తెలుపు

గేయమై తీయగా- స్వరములు పాడగా ||ఏ స్వప్న||

**** ****

మహరాణి పారాణి పాదాలకేనాడు మన్ను నంటనీయకా

నడిచేటి దారుల్లో నా గుండె పూబాట- పరచుకుంది మెత్తగా

శాంతికే ఆలయం ఆమె నెమ్మది

అందుకే అంకితం అయినదీ మది

సుకుమారమే అమె చెలికత్తె కాబోలు

సుగుణాలకే ఆమె తలకట్టు కాబోలు

చెలియ చలువ చెలిమి కొరకు

ఆయువే ఆశగా తపమును చేయగా ||ఏ స్వప్న||

(సుస్వాగతం చిత్రానికి ఎస్.ఏ.రాజ్‌కుమార్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

*****

గుండెలో సందడి పదాలకే అందెగా

యుగాలపై సాగిపోనీ నడిచే నా కలని

కళ్ళలో కాంతినీ పెదాలకందివ్వగా

ప్రభాతమై నవ్వుకోనీ వెలిగే నా చెలినీ

వలపుల శృతి ఆమె ప్రతి అడుగు

కళలొలికించె నాట్యమైపోనీ

తన ప్రాణవాయువుగా అయ్యేటి నా ఆయువే

ప్రకటించనీ జగానికి - నేనే తానని

ఊయలే ఊపనీ - ఇవేళ నీ ఊహనీ
హుషారుగా అందుకోనీ దివిలో జాబిలిని
రేపునే చూపనీ నిషాల నీ చూపునీ
ఉషస్సుగా చేరుకోనీ మెరిసే ఆశలనీ
అణువణువున నీ శ్వాసలో తడిసి
విరిసిన వయసే నందనం కానీ
మనలోని అనురాగమే స్వరాలు అందించగా
మధుగీతమై తరించనీ వీచే గాలిని ||గుండెలో||

ఓ ప్రియా! ఓ ప్రియా! ఇదేగా ఎదలో లయ
నువ్వేమి చేశావో మాయ - ప్రణయాలయమయా
వింత ఏముందయా- ఇదంతా నీ లీలయా
వరించి పూమాల వేయ వలచా రావయా
విడవని జతగా జంటపడమంటూ
కలిసిన బ్రతుకే ధన్యమైపోగా
మన ప్రేమ వేదికగా ఉగాదులే చేరగా
కరగని కలై మనం ఇలా వుంటే చాలుగా ||గుండెలో||

(అల్లుడుగారువచ్చారు చిత్రంలో కీరవాణి సంగీత సారథ్యంలో శశిప్రీతమ్, చిత్ర పాడినది)

**** ****

కాటుక పిట్టల మాదిరి ఎగిరే కన్నులు రెండు
అవి నీపైనే వాలెనేమో కొంచెం గమనించు

ఇప్పటిదాకా పరిచయమైనా లేకపోవచ్చు
అవి ఎప్పటినుంచో నీ కోసమనే చూస్తూ ఉండొచ్చు
నువు రాగానే రెప్పల రెక్కలు చాచి ఎగరవచ్చు

**హల్లో అంటూ అల్లరిగా నిను పలకరించవచ్చు**

**నువు తీరా అటు చూసేసరికి బిడియం రావచ్చు**

**నల్లని కన్నుల వెన్నెల వల నిను అల్లుకోవచ్చు**

**మాటలకందని మూగసైగలతో మంత్రం వేయొచ్చు**

**ఆ తొలిచూపు సంకెళ్ళకు నువు బందీ కావచ్చు**

(ఉగాది చిత్రం యస్వీ కృష్ణారెడ్డి సంగీత సారథ్యంలో ఉన్నికృష్ణన్, సునీత పాడినది)

**** ****

**అలుపన్నది వుందా ఎగిరే అలకు - ఎదలోని లయకు**

**అదుపన్నది వుందా కలిగే కలకు- కరిగేవరకు**

**మెలికలు తిరిగే నది నడకలకు**

**మరి మరి ఉరికే మది తలపులకూ ||అలుపన్నది||**

**నాకోసమే చినుకై కరిగి- ఆకాశమే దిగదా ఇలకు**

**నా సేవకై సిరులే చిలికి - దాసోహమే అనదా వెలుగు**

**అరారు కాలాల అందాలు- బహుమతి కావా నా ఊహలకు**

**కలలను తేవా నా కన్నులకు ||అలుపన్నది||**

**నీ చూపులే తడిపేవరకు- ఏమైనదో నాలో వయసు**

**నీ ఊపిరే తగిలే వరకూ- ఎటువున్నదో మెరిసే సొగసు**

**ఏడేడు లోకాల ద్వారాలు- తలుపులు తెరిచే తరుణం కొరకు**

**ఎదురుగ నడిచే తొలి ఆశలకు ||అలుపన్నది||**

(గాయం చిత్రంలో శ్రీ సంగీత సారథ్యంలో చిత్ర పాడినది)

**** ****

కోయిలాలా! ఓ కమ్మటి కబురినవేల
సల్లటేల ఆ సంగతి సెవినెయ్యాల
అలకిస్తే నమ్మలేవులే! అమ్మతోడు కల్లకాదులే!
గుండెలో నిండే ఇంత సంతోషం
ఉండలేనందే ఇనిపో కొంచెం

ఉడుకునీల్లు కాసాను సలవపంచ తీసాను
ఎప్పుడొచ్చి తానఁవాడునో...
ఇష్టమైన కూడొండి ఏడి మీద వుంచాను
ఎప్పుడొచ్చి అరగించునో...
యీపు రుద్దమంటాడో యేవిటో
పాడు సిగ్గు అడిమాట ఆలకిస్తదా!
గోరు ముద్దలంటాడొ యేవిటో
కంటిరెప్ప ఆడి సైగ సూడనిస్తదా
ఇట్టా ఎల్లకాలం ఆడి జతగా బతకనా
వచ్చే ఏళ కోసం ఈది గడపై సూడనా

మాటలోనె పెలుసంట మనసు ఎన్నపూసంట
మావ అచ్చు రావులోరటే
దేవుడల్లె ఆడొస్తే దెయ్యవెమొ అన్నట్టు
దడుసుకోని దూరవైతినే
ఎంత కష్టపెట్టానె మాఁవని-
ఎన్ని జన్మలెత్తి ఋణవు తీర్చుకొందునే
కడుపులోన ఉన్న ఆడి ప్రేఁవని -
కాలసేత అంతకంత తన్నమందునే
ఏడో మిగిలి ఉన్న పున్నెం పండెనే
ఎంతో ఒదులుకున్నా ఇంత భాగ్యం అందేనే

(మొరుటోడు నా మొగుడు చిత్రంలో ఇళయరాజా సంగీత సారథ్యంలో ఎస్. జానకి పాడినది)

**** ****

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



**దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.**

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 18

# ఆశాంతరంగం

అంతా బావుంటే, సంతోషం అనే మాటకు అర్ధంలేదు. దీపానికి విలువ చీకటి పడినప్పుడే. సంతోషానికి, చిరునవ్వుకి ఉనికి ఎప్పుడంటే చుట్టూ సమస్యలు చీకటి వలయంలా అల్లుకున్నప్పుడు ఆ చీకటి వలయాన్ని ఛేదించడానికి దీపంలా వినియోగించుకోవడానికి అని నమ్ముతాను నేను.

ప్రపంచంలో ఏ ఒక్కరికి ఆత్మహత్య చేసుకునే అవసరం లేదని గట్టిగా విశ్వసిస్తాను నేను. అయితే దేశంలోనూ, ప్రపంచంలోనూ ఈ ఆత్మహత్యా ప్రవృత్తి ఎందుకు పెరిగిపోతోంది?

అనుకున్నది సాధించలేకపోతే, పరీక్షలో ఫెయిలయితే ఆ నిరాశలో, ఉక్రోషంలో మనిషి ఆత్మహత్యకు సిద్ధపడుతున్నాడు. తనకి అపజయం కలిగినందుకో, పరీక్ష ఫెయిలయినందుకో కాదు. అలా జరిగినందుకు సమాజం సంఘం తనని అవమానిస్తుందనే భయం ఈ ఆత్మహత్యా ప్రవృత్తికి మూలం. జీవితం నుంచీ, సమాజం నుంచీ తను ఏదో ఆశించడం ఆ ఆశించిన మేరకు జీవితం సహకరించకపోతే, సమాజం స్పందించకపోతే నీరసించడం అనేది అందరికీ సహజ లక్షణం.

అయితే ఈ రకమైన అవమాన భయమ్ అనేది అహంకారానికి మరొక రూపం. ఈ అవమాన భయాన్ని వ్యతిరేక పరిస్థితుల్ని ఎదుర్కోలేని మనస్థితిని నిరసిస్తూ, వ్యక్తిలోని ఆత్మ విశ్వాసం పెంపొందించే లక్ష్యంతోనూ జీవితంలోని వాస్తవ పరిస్థితులను స్వీకరించడం ఎలాగ అనేది చెప్పడానికి రాసిన పాటలు ఈ ఆశాంతరంగంలో ఉంటాయి. వాటిలోని ప్రతీపాటను వ్యాఖ్యానించవలసిన అవసరం లేదు.

ముఖ్యంగా "ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి" అనే పాట నాకు తెలిసి కనీసం పది పదిహేను మందిని ఆత్మహత్యా ప్రయత్నం నుంచి వెనక్కు మరల్చింది. అలా అని వాళ్ళే తర్వాత నాకు చెప్పారు. అనేకమందిని అనేక విధాలుగా ఉత్తేజపరిచింది. నేను ఏ సాహితీ సభలో పాల్గొన్నా ఈ పాట తప్పని సరిగా పాడతాను.

ఈ ఆశాంతరంగంలో వచ్చే పాటలలో నా జీవిత ధృక్పధం స్పష్టంగా తెలుస్తుంది. భావ తరంగంలో నేనొక కవ్ ఇని. కల్లోల తరంగం నా చుట్టూ ఉండే పరిస్థితుల్తో నా మనసు యొక్క రియాక్షన్. ఈ ఆశాంతరంగం నా తాలూకు ఫిలసాఫికల్ అవుట్ లుక్ ఆఫ్ లైఫ్ అని చెప్పవచ్చు.

**పల్లవి:** **ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి**
**ఎప్పుడూ వదులుకోవద్దురా ఓరిమి ...**
**విశ్రమించవద్దు ఏ క్షణం - విస్మరించవద్దు నిర్ణయం**
**అప్పుడే నీ జయం నిశ్చయంరా ...** ||ఎప్పుడూ||

**నింగి ఎంత గొప్పదైనా రివ్వుమన్న గువ్వపిల్ల**
**రెక్కముందు తక్కువేనురా**
**సంద్రమెంత పెద్దదైన ఈదుతున్న చేపపిల్ల**
**మొప్ప ముందు చిన్నదేనురా**
**పశ్చిమాన పొంచి ఉండి రవిని మింగు అసురసంధ్య**
**ఒక్కనాడు నెగ్గలేదురా**
**గుటకపడని అగ్గిఉండ సాగరాలనీదుకుంటు**
**తూరుపింట తేలుతుందిరా**
**నిశా విలాసమెంత సేపురా**
**ఉషోదయాన్ని ఎవ్వడాపురా**
**రగులుతున్న గుండెకూడా సూర్యగోళమంటిదేనురా** ||ఎప్పుడూ||

నొప్పి లేని నిముషమేది జననమైనా మరణమైనా

జీవితాన అడుగడుగునా...

నీరసించి నిలిచిపోతే నిముషమైనా నీది కాదు

బ్రతుకు అంటే నిత్య ఘర్షణ

దేహముంది ప్రాణముంది నెత్తురుంది సత్తువుంది

అంతకన్న సైన్యముండునా

ఆశ నీకు అస్త్రమౌను శ్వాస నీకు శస్త్రమౌను

ఆశయమ్ము సారధౌనురా

నిరంతర ప్రయత్నమున్నదా నిరాశకే నిరాశ పుట్టదా

ఆయువంటు ఉన్నవరకు చావు కూడ నెగ్గలేక

శవము పైనె గెలుపు చాటురా

||ఎప్పుడూ||

(పట్టుదల చిత్రానికి ఇళయరాజా సంగీత సారథ్యంలో జేసుదాసు పాడినది.)

**** ****

ఆమె: ఒంటరైన గుండెలో తీగలేని వీణలో -

మోగుతున్న మూగరాగమేమో

అతడు: నిద్రలేని నిన్నని మేలుకోని రేపుని - చూపుతున్న నేటి రాతిరేమో

ఆమె: సుదూర తీరాల జ్ఞాపకాలే సమీపమౌతున్న జాడలా

అతడు: ఉండుండి వీచేటి ఈ గాలిలో

ఆమె: కంటి చాటు సాగరాలు ఇంతకాలమేడ దాగెనో

అతడు: అనురాగ సంగమం ఈ క్షణమే

ఆమె: రెప్పదాటు ఉప్పునీటి చెప్పలేని తీపి ఏమిటో

అతడు: కరిగించు ఈ క్షణం అమృతమే

ఆమె: సుమాలు తుంచిన గతాల మంచునే క్షమించి

చేరువైన తేనె జల్లిది

అతడు: చినుకు వంతెనెంట చేరుకుంది నీలినింగి నేలకి

చిగురు తొడుగు తడిని తెలపదా

ఆమె: ఏడేడు జన్మాల స్నేహాలతో ||ఒంటరైన||

ఆమె: వేడి శ్వాస వేణువైన నాడిలోని నాదమేవిటో

అతడు: తెలవారు వేళకై స్వాగతమే

ఆమె: ఓడి గెలుచు ఆశలోన భాషలేని భావమేమిటో

అతడు: ఒడిచేరు ఊసులో సంబరమే

ఆమె: తనంత తానుగా వసంత వాకిట ఎడారి దారి చేరి పూల పూయగా

అతడు: కలల కోకిలమ్మ పాడుతోంది మనసు మావితోటలో

చెలిమి చిలుకు చైత్ర గీతిక

ఆమె: తియ్యంగా తీరేటి దాహాలతో ||ఒంటరైన||

(మౌనం చిత్రానికి ఎమ్.ఎమ్.కీరవాణి సంగీత సారధ్యంలో బాలు పాడినది)

**** ****

పల్లవి: ఓ అమావాస్య రేయి అలా ఆగిపోయి

ఉషాకాంతినే నిషేధించునా - నిషా నిదురలో సదా నిలుచునా

ప్రపంచాన నీకన్నా దీనులెవరు లేరా

ప్రతీవారు నీకన్నా ప్రతిభ వున్నవారా

ఉలిని మలచి రాళ్ళైనా కలను తెలుసుకోవా

ఉనికి మరిచి ఈ రత్నం వెలుగు విడిచెనేలా

వసంతాలు రావా సుగంధాలు తేవా

నిజం నిదురపోదా నిషా ఒదులుకోవా ||అమావాస్య||

జగాలేలు జాబిల్లి మహా ఒంటివాడు
తన అనే తోడేది సమీపాన లేదు
ఎదను రగులు వేడున్నా వెలికి తెలియనీడు
జనులు నిదురపోతున్నా అలిగి తొలగిపోడు
సుధాకాంతి పంచే విధే మానుకోడు
యథాశక్తి చూపే కళను దాచుకోడు ||అమావాస్య||

(పట్టుదల చిత్రంలో ఇళయరాజా సంగీత సారథ్యంలో జానకి పాడినది)

**** ****

పల్లవి: నవ్వులే ఎటు చూసినా పువ్వులే నా అడుగెటు పడినా
అంతులేని సంతోషం నా సంతకమై
చిరుగాలులపై వూరేగుతూ వెళుతూ వుంటే ||నవ్వులే||

చీకటంటూ రానే రాదు నేనుండే లోగిలిలో
శోకమంటూ లేనేలేదు నా గుండెల ముంగిలిలో
ఆటపాటగా కాలమంతా
సంబరంతో సాగిపోతుంటే ||నవ్వులే||

ఆశలన్నీ తీరేకాలం నా కోసం వేచేనటా
అందరాని చందురుడైన అరచేత వాలునట
నాకు నేస్తమై అందమైన జీవితం
నా సొంతమై వుంటే ||నవ్వులే||

(అమ్మాయి కాపురం చిత్రానికి వందేమాతరం సంగీత సారథ్యంలో సుజాత పాడినది)

**** ****

పల్లవి: తరలిరాద తనే వసంతం - తన దరికి రాని వనాలకోసం
గగనాలదాక అలసాగకుంటె - మేఘాల రాగం ఇలచేరుకోదా

వెన్నెల దీపం కొందరిదా - అడవిని సైతం వెలుగు కదా
ఎల్లలులేని చల్లని గాలి - అందరికోసం అందునుకాదా
ప్రతీమదిని లేపే ప్రభాత రాగం
పదే పదే చూపే ప్రధాన మార్గం
ఏదీ సొంతం కోసం కాదను సందేశం
పంచే గుణమే పోతే - ప్రపంచమే శూన్యం
ఇది తెలియని మనుగడ కథ దిశనెరుగని గమనము కద ||తరలి||

బ్రతుకున లేని శృతి కలదా - ఎదసడిలోనే లయలేదా
ఏ కళకైన ఏ కలకైన జీవితరంగం వేదిక కాదా
ప్రజాధనం కాని కళావిలాసం - ఏ ప్రయోజనం లేని వృధా వికాసం
కూసే కోయిల పోతే కాలం ఆగిందా
పారే ఏరే పాడే మరో పదం రాదా
మురళికి గల స్వరమున కళ
పెదవిని విడి పలకదు గద ||తరలి||

(రుద్రవీణ చిత్రానికి ఇళయరాజా సంగీత సారథ్యంలో బాలు పాడినది)

**** ****

పల్లవి: ఎన్నో ఎన్నో రాగాలుండే సంగీతం కాదా
చలాకీ నవ్వుల కేరింత
ఎన్నో ఎన్నో రంగులు చిందే సంబరమే రాదా
ఇలాగే నిత్యం మన వెంట

సంద్రంలో సందడంతా చంద్రుళ్ళో వెన్నెలంతా

చిన్నారి సంతానంగా చేరే మన ఇంట ||ఎన్నో ||

ఏ పూటైనా హాపీ గా ఉందాం - మనకొద్దు అంతకు మించి

వేరే వేదాంతం

ఏ బాటైనా ఫరవాలేదంటాం - సమయంతో సాగటమే మన

సింపుల్ సిద్ధాంతం

చిరుగాలికి పరిమళమిచ్చే సిరిమల్లెల వనమై ఉందాం

గగనాన్ని నేలను కలిపే హరివిల్లుల వంతెన ఔదాం

ఆనందం అంటే అర్థం మనమందాం

ప్రతిపూట పాటై సాగే హుషారు సరిగమలో.... ||ఎన్నో||

మమకారాలే పూవుల సంకెళ్ళై - గత జన్మల ఋణ బంధాలను

గుర్తుకు తెస్తాయి

అనురాగాలే గుండెల సవ్వళ్ళై - బ్రతుకంటే ఎంతో తీపని

చెబుతూ ఉన్నాయి

వరమల్లే దొరికినదేమో అరుదైన ఈ అనుబంధం

సిరులున్నా దొరకనిదేమో సరదాలతో ఈ సావాసం

చిరకాలం చిగురులు వేస్తూ ఎదగాలి

ఏ చింతా చెంతకు రాని అందాల ఈ సందడి ||ఎన్నో||

(పెళ్ళి చేసుకుందాం చిత్రంలో కోటి సంగీత సారథ్యంలో బాలు, చిత్ర పాడినది)

**** ****

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



**దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.**

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 19

పల్లవి: పారాహుషారైన పాట చిటికేసి రమ్మందిరోయ్

పైలాపచ్చీసైన ఆట చిందేసి లెమ్మందిరోయ్

ఓరోరి బైరాగి ఈ పొద్దు ఈ జోరు ఆపద్దు తనివితీరా దరువెయ్యరోయ్

ఊరూరా ఊరేగి ఈ డప్పు హోరెత్తిపోయేట్టు ఊపెక్కి పోనీయరోయ్

కష్టాలు కన్నీళ్ళకే వస్తూనే ఉంటాయిరోయ్

నవ్వంటు తోడుంటే చాల్లె ఏమైనా చెయ్యచ్చులే

మందిలో కొందరు రాబందులై అందిందంతా కాజేసి జైహింద్ అంటారా

మందలై పందలై పసికందులై జనమంతా తలలొంచేసి ఖర్మనుకుంటారా

బతకడం బరువయ్యేలా తెగ పీడిస్తుంటే

దారుణం దారులు మూసి వేటాడుతు ఉంటే
ప్రాణం విసిగి పిల్లే అయినా బెబ్బులి అయిపోదా
చీమంత ఓ చిన్ని చినుకే తుఫాను అవుతుందిలే
ఈనాటి ఈ నిప్పు తునకే కార్చిచ్చు అవుతుందిలే

చిక్కగా చీకటే కమ్మిందని – లోకం వెళ్ళి సూర్యుణ్ణి రారమ్మని పిలవాలా
కొండలా పాపమే పెరిగిందని – కాపాడంటూ ఈ సంఘం మన సాయం అడగాలా
కళ్ళలో కత్తులు దూసే కసి కలిగిందంటే
గుండెలో భగ్గున రేగే అగ్గి రగులుకుంటే
నెత్తురు మండే ప్రతివాడు సూరీడే అయిపోడా
ఏ కొంప కొల్లేరు కానీ – నాకేమి పట్టిందని
నిద్దర్లో మునిగున్న వాణ్ణి – కదిలించడం నీ పని!!
చావైతే ఈ పూట కాకుంటే రేపైనా వస్తుంది తప్పించుకోలేవులే
బ్రతుకంటే మన చేతిలో ఉంది – భయమంటు వదిలేస్తే మనమాట వింటుందిలే!

(సిందూరం చిత్రంలో శ్రీ సంగీత సారథ్యంలో మలేషియా వాసుదేవన్, మోహన్ దాస్, శ్రీనివాస చక్రవర్తి పాడినది)

★★★

నువ్వేమి చేశావు నేరం – నిన్నెక్కడంటింది పాపం... చినబోకుమా
చేయూతనందించు సాయం – ఏనాడు చేసింది సంఘం గమనించుమా
కన్నీటి వర్షానికి కష్టాలు చల్లారునా
మార్గం చూపే దీపం కాదా ధైర్యం ||నువ్వేమి||

జరిగింది ఓ ప్రమాదం – ఏముంది నీ ప్రమేయం
దేహానికయిన గాయం – ఏ మందుతోనో మాయం
విలువైన నిండు ప్రాణం – మిగిలుండటం ప్రధానం
అది నిలిచినంత కాలం – సాగాలి నీ ప్రయాణం
స్త్రీల తనువులోనే శీలమున్నదంటే
పురుష స్పర్శతోనే తొలగిపోవునంటే
ఇల్లాలి దేహాలలో శీలమే ఉండదనా
భర్తన్న వాడెవడూ పురుషుడే కాదు అనా
శీలం అంటే గుణం అనే అర్థం ||నువ్వేమి||

గురివింద ఈ సమాజం – పరనింద దాని నైజం
తన కింద నలుపు తత్వం – కనిపెట్టలేదు సహజం
తన కళ్ళ ముందు ఘోరం – కాదనదు పిరికి లోకం
అన్యాయమన్న నీపై – మోపింది పాప భారం
పడతి పరువు కాచే చేవలేని సంఘం
సిగ్గు పడకపోగా నవ్వుతోంది చిత్రం
ఆనాటి ద్రౌపదికి – ఈనాటి నీ గతికి
అసలైన అవమానము చూస్తున్న ఆ కళ్ళది
అంతేగాని నీలో లేదే దోషం ||నువ్వేమి ||

(పెళ్ళి చేసుకుందాం చిత్రానికి కోటి సంగీత సారథ్యంలో జేసుదాస్ పాడినది)

చలెక్కి వుందనుకో ఏ చలాకి రాచిలకో
చిటుక్కుమందనుకో ఏ చిటారు కొమ్మెనకో
చురుగ్గా చూస్తావో – పరాగ్గా పోతావో
వలేస్తానంటావో – ఇలాగే ఉంటావో ||చలెక్కి||

చీకటుందని చింతతో నడిరాతిరి నిదరోలేదుగా
కోటి చుక్కల కాంతితో తన తూరుపు వెతుకునుగా
నలుదిక్కులలో నలుపుందనుకో – చిరునవ్వులకేం పాపం
వెలుగివ్వనని ముసుగేసుకొని మసిబారదు ఏ దీపం ||చలెక్కి||

కారునల్లని దారిలో ఏ కలల కోసమో యాతన
కాలు సాగని నింగిలో ఏకాకి యాత్రలోన
కలలన్నింటిని పిలిపించుకొని నిలవేసినా కళ్ళని
వెలివేసుకొని వెళ్ళిపోకు మరి విలువైన విలాసాన్ని ||చలెక్కి||
(అంతం చిత్రంలో ఆర్. డి. బర్మన్ సంగీత సారథ్యంలో చిత్ర, జోజో పాడినది)

★★★

పల్లవి: మనసు కాస్త కలతపడితె – మందు ఇమ్మని మరణాన్ని అడగకు
కనులనీరు తుడుచువారు ఎవరూ లేరని చితిఒడికి చేరకు
ప్రాణమన్నది బంగారు పెన్నిధి – నూరేళ్లు నిండుగా జీవించమన్నది
వేటాడువేళలో పోరాడమన్నది.... ||మనసు కాస్త||

కలసిరాని కాలమెంత కాటేస్తున్నా – చలి చిదిమేస్తున్నా
కూలిపోదు వేరు ఉన్న తరువేదైనా – తనువే మోడైనా

మాను జన్మకన్న – మనిషి ఎంత మిన్న
ఊపిరిని పోసే ఆడదానివమ్మా
బేలవై నువు కూలితే – నేలపై ప్రాణముండదమ్మ ||మనసు కాస్త||

ఆయువంతా ఆయుధంగా మార్చవే నేడు – పరిమార్చవే కీడు
కాళివైతే కాలికింద అణుగును చూడు – నిను అణిచేవాడు
మృత్యువును మించే హాని ఎక్కడుంది
ఎంత గాయమైనా మాని తీరుతుంది
అందుకే పద ముందుకే – లోకమే రాదా నీ వెనకే ||మనసు కాస్త ||

(శ్రీకారం చిత్రంలో ఇళయరాజా సంగీత సారథ్యంలో జేసుదాస్ పాడినది)

★★★

బెదిరితే భయపెడుతుంది వెనుకనే, లోకము
తరిమితే పరుగెడుతుంది తెలుసుకో నైజము
హడిలిపోతే అణిచివేసే అశ్వమీ కాలము
ఎగిరిదూకే తెగువ ఉంటే వెయ్యనీ కళ్ళెము

బలి కావాలి అంటూ అడిగే దేవతలైనా
పులినో కాలనాగునో తింటారా ఏమైనా
ఎపుడూ సాధుజీవులే ఎర అవుతారు నాయనా
బ్రతికే చేవ పోయెనా కాయడు దేవుడైనా
బలమే గుణము
అడగకెపుడూ ఎవరినైనా సాయమూ, న్యాయము

ఎవడున్నాడు క్రూరుడు యముడిని మించినవాడు

ఏవుంటుంది చూడు చావుని మించిన కీడు

తలవంచేసి దాగినా వదిలేనా ఒకనాడు

కలకాలము బ్రతికుందునా రోజూ చచ్చేవాడు

భయమే బరువు

కంటి ఎరుపే కాగడాగా నిశిని తరిమెయ్యరా!

(హలో డార్లింగ్ చిత్రానికి కీరవాణి సంగీత సారథ్యంలో బాలు పాడినది)

★★★

తెల్లారింది లెగండోయ్ – కొక్కొరోకో!

మంచాలింక దిగండోయ్ – కొక్కొరోకో!

పాములాంటి సీకటి పడగ దించిపోయింది

భయం లేదు భయం లేదు – నిదర ముసుగు తీయండి

సావులాటి రాతిరి సూరు దాటిపోయింది

భయం లేదు భయం లేదు – సాపలు సుట్టేయండి

ముడుసుకున్న రెక్కలిడిసి పిట్ట చెట్టు ఇడిసింది

మూసుకున్న రెప్పలిరిసి సూపులెగరనీయండి ||తెల్లారింది||

చురుకు తగ్గిపోయింది సెందురూడి కంటికి

చులకనైపోయింది – లోకం సీకట్లకి

కునుకు వచ్చి తూగింది – సల్లబడ్డ దీపం

ఎనక రెచ్చిపోయింది – అల్లుకున్న పాపం

మసకబారిపోయిందా సూసేకన్ను

ముసురుకోదా మైకం మన్నూమిన్ను

కాలం కట్టిన గంతలు తీసి – కాంతుల ఎల్లువ గంతులు వేసి ||తెల్లారింది||

ఎక్కిరించు రేయిని సూసి ఎర్రబడ్డ ఆకాశం

ఎక్కుబెట్టి ఇసిరిందా సూరీడి సూపుల బాణం

కాలి బూడిదైపోదా కమ్ముకున్న నీడ

ఊపిరితో నిలబడుతుందా చిక్కని పాపాల సీడ

సెవట బొట్టు సవురుతో సూరీణ్ణి ఎలిగిద్దాం

ఎలుగుసెట్టు కొమ్మల్లో అగ్గిపూలు పూయిద్దాం

వేకువ శక్తుల కత్తులు దూసి – రేతిరి మత్తును ముక్కలు సేసి

(కళ్ళు చిత్రానికి బాలు సంగీత సారథ్యంలో సిరివెన్నెల సీతారామశాస్త్రి పాడినది)

★★★

అతడు: సరేలే ఊరుకో – పరేషానెందుకో

చలేసే ఊరిలో జనాలె ఉండరా

ఎడారి దారిలో ఒయాసిస్సుండదా

అదోలా మూడు కాస్త మారిపోతె మూతి ముడుచుకునుంటారా

ఆటలోనో పాటలోనో మూడు మళ్ళీ మార్చుకోరా

మేరా నామ్ జోకరు మేరా కామ్ – నౌకరు

ఇదో నా చేతిలో అలాడిన్ లాంతరు

ఎనీథింగ్ కోరుకో క్షణాల్లో హాజరు

ఖరీదేం లేదు కాని – ఊరికేలే ఊపు రాదే ఓ మైనా

క్లాప్స్ కొట్టి ఈల వేస్తే చూపుతాలే నా నమూనా

అతడు: పిల్లి పిల్లదెపుడు ఒకే మాటగద – మియామియావ్!

కోడిపిల్లదెపుడు ఒకే కూత కద – కొక్కొ కొక్కొరకో!

కోకిలమ్మ ఆకలైనా ట్యూను మాత్రం మార్చదే

రామచిలక రాతిరైనా కీచురాయై కూయదే
అలాగే నీ పెదాల్లో నవ్వునెపుడు మారనీయకే ఏమైనా
కష్టమొస్తె కేరు చెయ్యక నవ్వుతో తరివేయవమ్మా!

అతడు: గూటి బిళ్ళ ఆడుదాం – సిక్సరు కొడదాం
పాప: క్రికెట్ కాదు గాని ఫన్నీగానే ఉంది
అతడు: ఏటిలోన దిగుదాం – ఈతలు కొడదాం
పాప: బఫెల్లోస్ కది – బాత్రూం కాదా మరి
అతడు: రాణిగారి ఫోజులో నువు కూర్చోమా ఠీవిగా
గేదెగారి వీపు మీద షైరుకెళదాం – స్టైలుగా
జురాసిక్ పార్కు కన్నా బెస్టుప్లేసీ పల్లెటూరే బుల్లెమ్మా!
బోలెడన్ని వింతలున్నాయ్ బోరులేక చూడమ్మా!

అతడు: వేడి వేడి పాలను ఎట్టా తాగుతావు?
పాప: ఉఫ్ ఉఫ్ మని ఊదేస్తాను కద
అతడు: రైసులోని రాయిని ఏం చేస్తావు మరి?
పాప: తుప్పు తుప్పుమని ఊసేస్తాను కద
అతడు: వేడిపాలలాంటివమ్మ ఏడిపించే రోజులు
పంటికింది రాళ్ళు అనుకో బాధపెట్టే బెంగలు
అలాగని పాలుకాస్తా పారబోసి పారిపోం గద చిన్నారి
ఆపదొస్తే తప్పుకుందికి చూసుకోమా చిన్నదారి
(లిటిల్ సోల్జర్స్ చిత్రానికి శ్రీ సంగీత సారథ్యంలో శ్రీ పాడినది)

★★★

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



**దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.**

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 20

విత్తు ముందా చెట్టు ముందా చెప్పర గురుడా
గుప్పెట్లో గుట్టు కాస్త విప్పర నరుడా!
పచ్చకాగితాల జులుం గొప్పదంటావా
వాటిని అచ్చుకొట్టు బుద్ధిబలం మెచ్చుకుంటావా
మనిషికున్న మూలధనం శక్తీ-యుక్తీ
ఈ తోబుట్టువులిద్దరికీ సరితూగే సిరివుందా

చేల పచ్చదనమంతా చెమటబొట్ల చలవేగా!
చేతి సత్తువను నడిపిన తెలివితేట్ల ఫలమేగా!
తెగబలిసిన గాదె ముందు చెయ్యి బిచ్చమెత్తాలా!
ఇనప్పెట్ల ఇరుకుల్లో తెలివి నలిగిపోవాలా

నేలకు జానెడు నరుడే హిమాలయం గెలిచాడు!

మూడడుగుల వామనుడే ముజ్జగాలు కొలిచాడు!
ధైర్యానికి జ్ఞానానికి ధరకట్టే ధనముందా!
విర్రవీగు వెర్రివాగు కడలిలోతు చెబుతుందా!

బలుపు కాదు వాపేరా డబ్బుకున్న అధికారం
కీలెరిగిన వాత పెడితే దిగదా దురహంకారం
రూకముందు లేకితనం చూపి లోకువైపోకు
పేనుకు పెత్తనమిస్తే లేనిపోని చికాకు

గడ్డి తినే విజ్ఞానం – విత్తానికి వెట్టి చేస్తే
గుడ్డిగవ్వ జేబుల్లో చట్టం తాకట్టు పడితే
చెదపట్టని మెదడొక్కటి ఎదురొస్తే చాలదా!
మదగజాన్ని మొనతేలిన అంకుశమే ఏలదా!

నల్లమబ్బు కమ్మితే చల్లబడునా సూర్యుడు?
ఎదురుదెబ్బ తగిలిందని బెదురుతాడా వీరుడు?
వెన్నుపొడిచి వెక్కిరించు విషపన్నాగాలన్నీ
వెలుగులోకి రాగానే తెల్లమొగం వేయవా!

చాణుక్యుడి జిత్తు ముందు సామ్రాజ్యం చిత్తు కదా!
చంద్రగుప్త శౌర్యాగ్నికి దుర్మార్గం మండిపోదా!
వివేకమూ వీరత్వం విజయయాత్ర సాగిస్తే
దుష్టశక్తులెన్నున్నా మట్టి కొట్టుకొని పోవా!

(తోబుట్టువులు చిత్రానికి చక్రవర్తి సంగీత సారథ్యంలో శ్రీ పాడినది)

★★★

కన్నుల లోగిలిలో వెన్నెల విరిసింది
చల్లని జాబిలితో స్నేహం కుదిరింది

చెలిమి తోడుంటే చాలమ్మ లేనిది ఏముంది
ఆశ చిటికేస్తే చాలమ్మ అందనిదేముంది

అతడు: గున్నమావి గొంతులో తేనెతీపి నింపుతూ కోయిలమ్మ చేరుకున్నది
ఆమె: ఎండమావి దారిలో పంచదార వాగులా కొత్తపాట సాగుతున్నది
అతడు: ఒంటరైన గుండెల్లో ఆనందాల అందెలతో ఆడే సందడిది
ఆమె: అల్లిబిల్లి కాంతులతో ఏకాంతాల చీకటిని తరిమే బంధమిది
అతడు: కలతెరగని కలలను చూడు – కంటికి కావలి నేనుంటా
ఆమె: కళతరగని వెలుగులు నేడు – ఇంటికి తోరణమనుకుంటా

అతడు: పంచుకున్న ఊసులు పెంచుకున్న ఆశలు తుళ్ళి తుళ్ళి ఆడుతున్నవి
ఆమె: కంచె లేని ఊహలే పంచవన్నె గువ్వలై నింగి అంచు తాకుతున్నవి
అతడు: కొత్తజల్లు కురిసిందీ బతుకే చిగురు తొడిగేలా – వరమై ఈ వేళ
ఆమె: వానవిల్లు విరిసింది మిన్ను మన్ను కలిసేలా – ఎగసే ఈ వేళ
అతడు: అణువణువును తడిపిన ఈ తడి అమృతవర్షిణి అనుకోనా
ఆమె: అడుగడుగున పచ్చని బాటలు పరిచిన వనములు చూస్తున్నా

(రాజా చిత్రానికి ఎస్.ఏ.రాజ్ కుమార్ సంగీత సారథ్యంలో ఉన్నికృష్ణన్, చిత్ర పాడినది)

★★★

చుట్టూపక్కల చూడరా చిన్నవాడా!
చుక్కల్లో చూపు చిక్కుకున్నవాడా!
కళ్ళ ముందు కటిక నిజం – కానలేని గుడ్డి జపం
సాధించదు ఏ పరమార్థం – బ్రతుకును కానీయకు వ్యర్థం ||చుట్టూ||

స్వర్గాలను అందుకొనాలని వడిగా గుడి మెట్లెక్కేవు
సాటి మనిషి వేదన చూస్తూ జాలి లేని శిలవైనావు
కరుణను మరిపించేదా చదువూ సంస్కారం అంటే
గుండె బండగా మార్చేదా సాంప్రదాయమంటే ||చుట్టూ||

నువ్వు తినే ప్రతి ఒక మెతుకు ఈ సంఘం పండించింది
గర్వించే ఈ నీ బ్రతుకు ఈ సమాజమే మలచింది
ఋణం తీర్చు తరుణం వస్తే – తప్పించుకుపోతున్నావా
తెప్ప తగలబెట్టేస్తావా – యేరు దాటగానే ||చుట్టూ||

(రుద్రవీణ చిత్రానికి ఇళయరాజా సంగీత సారథ్యంలో బాలు పాడినది)

★★★

ఆమె: సువ్వి సువ్వమ్మ సువ్వి సువ్వి
ఆమె: నవ్వులైన ఏడుపైన తడిసేను కన్నులు
నవ్వి నవ్వి తడికానీ నీ కంటి పాపలు
అతడు: ఎక్కెక్కి ఏడ్చే కన్నీళ్ళు ఉప్పనా
ఫక్కుమన్న నవ్వే ఒక తేనె ఉప్పెన
చిక్కులెన్ని రానీ కరిగిస్తుంది చప్పున

ఆమె: మావి పళ్ళు ఇవ్వదా మండువేసవి
పైరు పాట పాడదా పాట పల్లవి
అతడు: మంచు బాటలో సంకురాత్రిని తెస్తుంది కాదా చలి!
కాళరాత్రిలో కాంతిరవ్వలై వస్తుంది దీపావళీ
పండుగలన్నీ కనువిందుగ అల్లి
ఋతువుల హారం అందించే కాలం
దేవుడు పంపిన దీవెన అనుకొంటే
ఈ జీవితమన్నది నవ్వుల జేగంటే

అతడు: నీ ఉల్లాసమే ఈ ప్రపంచమై ఉయ్యాలలూగాలిగా
నీ సంతోషమే ఓ సందేశమై తారల్ని తాకాలిగా
ఆమె: రేకులు వాడని పున్నమి పువ్వులు
రేపటి ఆశల ఊపిరి గువ్వలు
ఆలపించే సంగీతంలో
సంగతులే గుండెలలో హాయి కచేరీ చెయ్యాలి

(ఆహా చిత్రానికి దేవా సంగీత సారథ్యంలో మలేషియా వాసుదేవన్, ఉన్నికృష్ణన్, సుజాత పాడినది)

★★★

సిరిసిరి మువ్వలు ఆ విరిసిన నవ్వులు
చిరుచిరు ఆశలు ఈ గలగల ఊసులు
కలబోసి చేసినవి ఈ కిలకిల నవ్వులు
వెలబోసి ఈ సిరులు కొనలేరెవ్వరు
దేవుడే ఆ దివి నుండి పంపిన దీవెనలు
ఎప్పుడూ ఈ కోవెలలో వెలిగే దీపాలు ||సిరిసిరి||

అల్లరంతా సిరిమువ్వలై ఘల్లుఘల్లుమంటే
నిలువలేక నిశ్శబ్ధమే విసుగు పుట్టిపోదా
సంతోషం కూడా తనకి చిరునామా అవ్వాలని
కన్నీరు చేరుకుంది తెగ నవ్వే మన కళ్ళని
ఈ మణికాంతి వెలుగుతూ వుంటే
చీకటి రాదే కన్నులకెదురుగా ||సిరిసిరి||

(గణేష్ చిత్రానికి మణిశర్మ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

★★★

పల్లవి: పగలు రాతిరి కలిసి అవుతుంది ఒక దినము
సుఖము దుఃఖము కలిసి అవుతుంది జీవితము
నిశిలోనె నిలవదు కాలం – వేకువ రాదా చీకటి వెనుక ||పగలు||

వెలుగు విలువ తెలిసేది నడిచీకటిలోనె
బతుకు తీపి తెలిసేది బాధలలోనే
గమ్యం ఎదురవుతుందా – కొనసాగని పయనంలోన
చావు బదులీయగలదా – మన ప్రశ్నలకేనాడైనా
ఆశే శ్వాసై పడనీ అడుగు
సుఖము దుఃఖము కలిసి అవుతుందీ జీవితము ||పగలు||

అడవి పాలు అవలేదా శ్రీరాముడు అయినా
పోరు ఎదురు కాలేదా శ్రీకృష్ణుడికైనా
దేవుడికైనా గాని నరలోకం నిప్పుల పడక
సులువుగా దొరకదు ఏదీ – ప్రతి నిముషం ఘర్షణ పడక
కానీ సమరం గెలిచే వరకూ ||పగలు||

(కుటుంబ గౌరవం చిత్రానికి మాధవపెద్ది సురేష్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

★★★

చినుకులే ఒక్కటై వరదగా మారితే
శిలలు ఆగలేవు దాని ధాటికి
నలుగురూ ఒక్కటై కలిసి పోరాడితే
ఎదురు ఏది – ఆ సమూహ శక్తికి
భయపడే లక్షణం వదులుకో తక్షణం
బెదురుతూ బ్రతకటం ప్రతిక్షణం చావడం
మనిషి భయపడాలి తప్పు పనులకి
భయము భయపడాలి మనిషి మంచికి

ఎవరో బలైతే, మనకేం అనొద్దు! చెడునే సహించవద్దు
జడిసే జనాలే, తన బలమౌతుంటే, పెరగద పాపాల పద్దు
పదిమందితో మన క్షేమము కలిసుందని మరవొద్దు
జ్ఞానమే అన్యాయమునణిచేందుకు తొలిపొద్దు
మనమే ధర్మాన్ని కాపాడితే
మననా ధర్మం కాపాడుతుందిరా
ఇది వేదవాక్కు సోదరా!
మనిషి భయపడాలి తప్పు పనులకి
భయము భయపడాలి మనిషి మంచికి

నిదరే తగ్గించి, నివురే తప్పించి, నిప్పై జ్వలించిపోరా
శ్రమనే వరించి, చెమటే చిందించి, కలనే నిజం చెయ్యరా
నడిరాత్రిలో పడి ఉండదు ఎద రగిలే సూరీడు
పడగెత్తిన గ్రహణానికి శిరాసొంచదు ఏనాడు
మనలో అజ్ఞానం తప్పు చేసినా

తెలిసి చిచ్చులో మండాలిరా
ఆ మంటే జ్యోతి చూపగా
మనిషి భయపడాలి తప్పు పనులకి
భయము భయపడాలి మనిషి మంచికి

(పవిత్ర ప్రేమ చిత్రానికి కోటి సంగీత సారథ్యంలో బాలు పాడినది)

★★★

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



**దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.**

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 21

మామూలుగా కోపం వస్తే తిడతాం. గట్టిగా తిడితే అవతలివాడు కొడతాడు అని భయం వున్నప్పుడు, లేకపోతే, అవతలివాణ్ని తిట్టడం కంటే కూడా హ్యుమిలియేట్ చెయ్యడం వల్ల ఎక్కువ అవమానం చెయ్యడం సాధ్యమవుతుందని అనిపించినప్పుడు ఈ వ్యంగ్యం అనేది చోటు చేసుకుంటుంది. ఈ వ్యంగ్యంతో నేను చాలా పాటలు రాశాను. ముఖ్యంగా, మనీ సినిమాలోని "చక్రవర్తికీ, వీధి బిచ్చగత్తెకీ" అనే పాట, "భద్రం బీ కేర్ఫుల్ బ్రదరూ" ఇత్యాదులు.

ఒకరకంగా చూస్తే, వ్యంగ్యం కూడా దైవపరంగా అయితే నిందాస్తుతి. పైకి నిందిస్తున్నట్లుంటుంది. లోపల పొగడ్త ఉంటుంది. ఐతే ఈ వ్యంగ్యం పాటల్లో పైకి కొంచెం పొగుడుతున్నట్లనిపించినా, తేలిగ్గా తీసుకున్నట్లనిపించినా అంతరంగంలో చూస్తే ఒక రకమైన కన్సెర్న్ తో ఆయా పరిస్థితుల పట్ల వ్యతిరేకతను తెలియపరుస్తున్నట్లు ఉంటుంది.

రసాలన్నిట్లోకి, హాస్యం, వ్యంగ్యం ఎక్కువగా ఆకట్టుకుంటాయి. ఆకట్టుకోవాలని చేసే ప్రయత్నం కంటే, అలా ఆకట్టుకోవడం ద్వారా ఆయా పాటల్లోని ఇతివృత్తం వైపు, శ్రోతల, పఠితల దృష్టిని ఆకర్షించడం అనే ప్రయత్నం నేనెక్కువగా చేసాను.

**పల్లవి: చక్రవర్తికీ, వీధి బిచ్చగత్తెకీ బంధువౌతానని అంది మనీ మనీ!**

**అమ్మ చుట్టమూ కాదు అయ్య చుట్టమూ కాదు అయినా అన్నీ అంది మనీ మనీ!**

**పచ్చనోటుతో లైఫు లక్ష లింకులు పెట్టుకుంటుందనీ అంది మనీ మనీ!**

పుట్టడానికీ పాడె కట్టడానికి మధ్య అంతా తనే అంది మనీ మనీ!

కాలం ఖరీదు చేద్దాం పదండి అంది మనీ మనీ!

తైలం తమాష చూద్దాం పదండి అంది మనీ మనీ!

డబ్బుని లబ్ డబ్బని గుండెల్లో పెట్టుకోరా

దీక్షగా ధనలక్ష్మిని లవ్వాడి కట్టుకోరా... ||చక్రవర్తికీ ||

ఇంటద్దె కట్టావా నా తండ్రి - నో ఎంట్రీ వీధి వాకిట్లో

దొంగల్లే దూరాలి సైలెంట్లీ నీ ఇంట్లో - చిమ్మచీకట్లో

అందుకే పద బ్రదర్ మనీ వేటకి - అప్పుకే పదా బ్రదర్ ప్రతీ పూటకి

రోటి కపడా రూము అన్నీ రూపీ రూపాలే

సొమ్ముని శరణమ్మని చరణమ్ము నమ్ముకోరా

దీక్షగా ధనలక్ష్మిని లవ్వాడి కట్టుకోరా... ||చక్రవర్తికీ||

ప్రేమించుకోవచ్చు దర్జాగా - పిక్చర్లో పేద హీరోలా

డ్రీమించుకోవచ్చు ధీమాగా - డ్రామాలో ప్రేమ స్టోరీలా

పార్కులో కనే కలే ఖరీదైనది

బ్లాకులో కొనే వెలే సినీ ప్రేమది

చూపించరుగా ఫ్రీ షో వేసి ప్రేమికులెవ్వరికి

జీవితం ప్రతి నిమిషము సొమ్మిచ్చి పుచ్చుకోరా

దీక్షగా ధనలక్ష్మిని లవ్వాడి కట్టుకోరా... ||చక్రవర్తికీ||

(మనీ చిత్రానికి శ్రీ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

పల్లవి: భద్రం బీ కేర్ఫుల్ బ్రదరూ, భర్తగ మారకు బ్యాచిలరూ!

షాదీ మాటే వద్దు గురూ, సోలో బతుకే సో బెటరూ

ఆలికి మెళ్ళో ముళ్ళేశావని ఆనందించే మగవారు

ఆ తాడే తమ ఉరితాడన్నది ఆలోచించక చెడతారు

మొగుడయ్యే ముహూర్తమే మగాడి సుఖాల ముగింపు ఛాప్టరు

వంటకని వైఫెందుకురా హోటళ్ళే చాలు

వంటికని ఒకటా రెండా అంగడి అందాలు

కోతికి ఉందా, కోడికి ఉందా ఈ పెళ్ళాచారం

జంటలు కట్టే జంతువులెరగవు వెడ్డింగ్ విడ్డూరం

ఎందుకు మనకీ గ్రహచారం!

చచ్చి చెడి డే అండ్ నైటూ చాకిరి చేస్తావు

తెచ్చినది డార్లింగ్ దయ్యం చేతిలో పోస్తావు

బీడీ కోసం బీబీ ముందు దేహీ అంటావు

గాడిని దాటని గానుగ ఎద్దై బతికేం చేస్తావు

బాండెడ్ బానిసవౌతావు!

(మనీ చిత్రానికి స్వీయ సంగీత సారథ్యంలో శ్రీనివాసమూర్తి పాడినది)

పల్లవి: బోడి చదువులు వేస్టు - నీ బుర్రంతా భోంచేస్తూ

ఆడి చూడు క్రికెట్టు టెండుల్కర్ అయ్యేటట్టూ!

ఒక్క ఫోజు కొట్టు లక్షలు వచ్చిపడేటట్టు

అడిడాస్ బూట్లు తొడగవ - నీకు ఆరు కోట్లు

ఎంత చదివితే సంపాదిస్తావ్ అంత పెద్ద అంతస్తూ

ఓరి ఇన్నోసెంటు స్టూడెంటూ!

చిరపుంజిలోని చినుకెంతైనా తడుస్తుందా నీ జుట్టు

థార్ ఎడారి గోలెందుకురా - గోదారి ఒడ్డునుంటూ

వీరప్పన్ కొట్టేసుంటాడు అశోకుడెపుడో నాటిన చెట్లు

పాత డేట్లు బట్టీ వేస్తూ అసలేంటీ కుస్తీ పట్లు

ఐక్యూ అంటే అర్థం తెలుసా - అతి తెలివికి తొలి మెట్టు

ఆడే పాడే ఈడుని దానికి పెట్టకు తాకట్టు

పనికిరాని చెత్తంతా నింపకు మెదడు చెదలు పట్టు
ఓరి ఇన్నోసెంటు స్టూడెంటూ!

ఇదిగో! లీకు వీరులకు ముందే తెలుసు క్వశ్చన్ పేపర్ గుట్టు
లోకజ్ఞానం కలిగిన వాడే కోచింగ్ సెంటర్ పెట్టు
బాబూ!మార్కుల కోసం ఏడవలేదురా ఎదిగిన ఏ సైంటిస్టూ
గుర్తుపట్టరా ఏ రంగంలో ఉందో నీ ఇంట్రస్టు
నీక్కూడా ఉండే ఉంటుంది ఏదో ఒక టాలెంటు
నీకు నువ్వు బాసవ్వాలంటే దాన్ని బయటపెట్టు
రేసు హార్సువై లైఫును గెలిచే పరుగు మొదలుపెట్టు
ఓరి ఇన్నోసెంటు స్టూడెంటూ!

రెండో ఎక్కం రాకపోయినా నీకేమిట్రా లోటు - కాలిక్యులేటర్ చేపట్టు
డోంట్ వర్రీ! బిల్లు కడితే నీ బెడ్రూంలో వేస్తాడు బాసింపట్టు - సాక్షాత్తూ బిల్ గేట్సు
పిచ్చోడెవరో జుట్టుని పీక్కుని ఎన్నో కనిపెట్టు
పైసా ఉంటే అదే నీకు అవి అన్నీ కొనిపెట్టు
చదువు సంధ్యా వదిలిపెట్టి సన్నాసివి కమ్మంటూ
సలహా ఇస్తున్నాననుకుంటే అదే రాంగు రూటు
బతుకు బాటలో ముందుకు నడపని బరువు మొయ్యవద్దు
ఓరి ఇన్నోసెంటు స్టూడెంటూ!

(మనసిచ్చి చూడు చిత్రంలో మణిశర్మ సంగీతసారథ్యంలో మనో, మురళి, తేజ, మోహన్ పాడినది)

పల్లవి: గొప్పకథే అనుకో బ్రదరు - చెప్పినదే ఎవరో ఒకరు
ఇప్పటికే బాగా ముదురు - విప్పకురా ఇపుడా రీలు
ఏడు చేపల కథా ఇది కజిన్స్ రా
ఎంత కొత్తదో వినండిహ అనొద్దురా....
అంతలేదురో సీను జస్టింతేను...

ఎందుచేత - అదొక్క మొండిచేప
ఆనాడు ఎండలేదో - జవాబు తెలిసిందా
రాజు నుంచి - చిటుక్కు చీమ దాకా
వెతుక్కు వెళ్ళినాక - కొలిక్కి చేరింది
కథలన్నిటినీ కంచికి చేర్చే గైడువు నువ్వా.... నహీ గురూ
అంతలేదురో సీను జస్టింతేను...

కోటి కథలు - ఒక్కోటి ఈటె మొదలు
అదాటునొచ్చి తగులు - సిటీ సొసైటీలో....
ఏటి పొడుగు - దివాళినాటి వెలుగు
మరేడ చూడగలవు - నడీథి మంటల్లో....
కత్తుల గదిలో కాపురముంటూ నెత్తురు బాబోయ్ అనద్దురా
అంతలేదురో సీను జస్టింతేను...

మొట్టమొదటి - ఆదాము కాదు మనము
ముత్తాతలెంతమంది - ఇవన్నీ చూసారో
ఏటి పొడుగు - దివాళినాటి వెలుగు
నాటి నుంచి - మొహంజుదార్ల వెంట
ఇట్టాంటి హిస్టరీలు ఎన్నెన్ని రాసారో
ఆటంబాంబో - దానికి బాబోభూగోళాన్నే భుజించెనా
అంతలేదురోయ్ బ్రదరూ.... జస్టింతేరో....

(లారీ చిత్రంలో కీరవాణి సంగీత సారథ్యంలో బాలు, కోరస్ పాడినది)

★★★

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS




# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 22

మోసాలు మతలబులు కానీరోయ్ దేశానికి రాజై పోతావ్ రోయ్
ఈ చీటింగనబడు ఘనవిద్య కడుకష్టం కదరా బచ్చా
ప్రతి కుంకా ఎగబడి ఈమధ్య తెగ మిస్ యూజ్ చేసెర శిష్యా
గోలుమాలెలా చేస్తారో నన్ను చూసి చక్కగా ఫాలో అయిపోరో..
పైకొస్తావురోయ్.... ..||మోసాలు మతలబులు||

మేకల మూకల మాదిరి ఇందరు లోకులు లేరా లోకువగా
శ్రద్ధగ చక్కని గోతులు తీసి ఉంచరా సిద్ధంగా
కాకుల కేకలే కోకిల కూతలు అంటే కాదని అనగలరా
అందుకు కొద్దిగ ఆర్కెస్ట్రా... ఉంటే చాలునురా
బోయవాడిలా పెద్ద బాణమేయక చిన్న కోయవానిలా
వెళ్ళి మూలికివ్వరా - అది చాలురా... ||మోసాలు మతలబులు||

రంగులు పూసి హంగులు చేస్తే బొమ్మను కూడా భామనరా

మేకప్ అన్నా మేజిక్ అన్నా మీనింగొకటేరా

కంత్రీ పనులకు స్కీములు వేస్తూ ఎంట్రెన్స్ ఎక్జామ్ పాసయితే

కంట్రీనేలే స్కాములలో ప్రొఫెసరువవుతావౌతావురా

కొత్తకొత్తగా కాస్త మెత్తమెత్తగా గొంతు కోయడం ఎలా

గోల్ కొట్టడం ఎలా తెలియాలిరా ||మోసాలు మతలబులు||

(w/o వి.వరప్రసాద్ చిత్రంలో కీరవాణి సంగీత సారథ్యంలో బాలు పాడినది)

★★★

ఛూమంతర్ కాళీ! ఇది జంతర్ మంతర్ మోళీ!

మాయాలేదు మంత్రం లేదు

యంత్రం లేదు తంత్రం లేదు

మోసం గీసం మొదలే లేదు

మస్కా కొట్టే సిట్కా ఏదో - భైటెట్టేస్తే సరదాపోదూ....

ఢమాఢం డోలు కొట్టి, మోళి గట్టే ఆట సూడండి!

తమాసా ఓరు పుట్టే గాలిపాటే ఆలకించండి!

ఇలాకా ఓలు మొత్తం ఇలాటి సిత్రం యేడా లేదండి!

సెలాకీ సేతివాటం సూడకుండా ఎళ్ళిపోకండి!

ఇందరి ముందర ఇందరజాలం

సిందర వందర సిందుల మేళం

గలాటా గారడి గందరగోళం

తెగించి ఆడే తలాంగు తాళం

వరెవ్వా ఏమీ ఛాన్సని తేరగ చూసి జారిపోకండి

శభాషని తోచినంత ధర్మం సేస్తే ఊరికె పోదండీ

ఇనామిచ్చే నవాబుంటే సలామంటాం

ఇదల్చని బాబుంటే, డబుల్ దండాలంటాం

మనిద్దరి మధ్యలో ఏ జన్మలో ఏ తీరని ఋణముందో

మరెందుకు ఇంతలో ఈ బంధనం ఇన్నింతలు పెరిగిందో

అమాయకమైన నీ చిన్నారి నవ్వుని ఏ తల్లి కందో

ఇటే నీ దారి ఉందని ఏ సుడిగాలి పంపిందో

పాపం పుణ్యం దేవుడికెరుక - పేదకు దొరికిన బంగరు కణిక

పాలూ వెన్న లేవని అనక - ప్రేమను త్రాగి పెరగవే చిలకా

వలేసే పాడులోకం కంట పడక ఉండు నా యెనక

ఇలా నా గుండెలోనే గువ్వలా కొలువుండిపో ఇంక

ఇటేపొస్తే యముణ్ణయినా నిలేస్తానే

మరింకా ఏ కీడూ నీ వంక రాలేదు ||ఢమాఢం||

జాగోరే బేతాళా! నీ జాదూ సూపెట్టాలా!

కళ్ళకు చుట్టూ గంతలు కట్టు

అయినా అంతా చూస్తున్నట్టు

అసలూ నకిలీ కనిపెట్టాలా!

దగాలు చేసే మగానుబావుల

ముసుగూ లొసుగూ పసికట్టాలా! ||ఢమాఢం||

జనంలో జెంటిల్మెన్లా చలామణయ్యే సెలామణయ్యే సిల్లర నాయాళ్ళూ

క్షణంలో కళ్ళు మూసి జెల్ల కొట్టి సల్లగ పోతారు

మహా మహా బేతాళుడికే బేజారెత్తే మాయ మరాలీలు

పరాగ్గా ఉన్నారంటే పంగనామం బెట్టి పోతారు

డబ్బు దస్కం జాగ్రత్తండి! జగత్కిలాడీలు ఉన్నారండీ!

మాకన్నా మహ పనోళ్ళు లెండి! కొమ్ములు తిరిగిన కంత్రీల్లెండి!

మాదంతా పాడు పొట్టకు కూడు పెట్టే పాత విద్యండీ!

దగాలూ దారుణాలూ సేతకాని కోతులాటండీ!

కులాసాగా ఖూనీ చేసే కసాయోళ్ళు దగుల్బాజీగాళ్ళు

చుట్టూరా వున్నారు

జాగ్రత్తండీ బాబూ.... ||ఢమాఢం||

(మాయలోడు చిత్రానికి యస్వీకృష్ణారెడ్డి సంగీత సారథ్యంలో  పాడినది)

★★★

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS



# సిరివెన్నెల తరంగాలు

## సిరివెన్నెల సీతారామశాస్త్రి



దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

**23**

అతడు: లలిత ప్రియకమలం విరిసినది కన్నుల కొలనిని
ఆమె: ఉదయ రవికిరణం మెరిసినది ఊహల జగతిని
అతడు: అమృతకలశముగ ప్రతి నిముషం
కలిమికి దొరకని చెలిమిని కురిసిన అరుదగు వరమిది

అతడు: రేయీ పవలూ కలిపే సూత్రం సాంధ్యరాగం
కాదా నీలో నాలో పొంగే ప్రణయం
ఆమె: నేలా నింగీ కలిపే బంధం ఇంద్రచాపం
కాదా మన స్నేహం ముడివేసే పరువం
అతడు: కలల విరుల వనం మన హృదయం
వలచిన ఆమని కూరిమి మీరగ చేరిన తరుణం
ఆమె: కోటి తలపుల చివురులు తొడిగెను
తేటి స్వరముల మధువులు చిలికెను
అతడు: తీపి పలుకుల చిలుకల కిల కిల
తీగ సొగసుల తొణికిన మిలమిల
ఆమె: పాడుతున్నది ఎదమురళి
రాగఝరి తరగల మృదురవళి
అతడు: తూగుతున్నది మరులవని
లేత విరి కులుకుల నటనగని
ఆమె: వేల మధుమాసముల పూల దరహాసముల
మనసులు మురిసెను

ఆమె: కోరే కోవెల ద్వారం నీవై చేరుకోగా
కాదా నీకై మ్రోగే ప్రాణం ప్రణవం
అతడు: తీసే శ్వాసే ధూపం చూసే చూపే దీపం
కాదా మమకారం నీ పూజా కుసుమం
ఆమె: మనసు హిమగిరిగ మారినది
కలసిన మమతల స్వరజతి పశుపతి పదగతి కాగా

అతడు: మేని మలుపుల చెలువపు గమనము
వీణపలికిన జిలిబిలి గమకము
ఆమె: కాలి మువ్వగ నిలిచెను కాలము
పూల పవనము వేసెను తాళము
అతడు: గేయమైనది తొలిప్రాయం
రాయమని మాయని మధుకావ్యం
ఆమె: స్వాగతించెను ప్రేమపథం
సాగినది ఇరువురి బ్రతుకురథం
అతడు: కోరికల తారకల సీమలకు
చేరుకొనె వడి వడి పరుగిడి

(రుద్రవీణ చిత్రానికి ఇళయరాజా సంగీత సారథ్యంలో జేసుదాస్, చిత్ర పాడినది)

★★★

పల్లవి: శ్రీనాథుళ్ళో శృంగారం నువ్వై పుట్టిందో
ప్రాణం ఉంటే బంగారం నీలా ఉంటుందో
ఒంపుల్లో ఉందే ఒయ్యారి నెమలి
చంపేస్తూ ఉందే నా గుండె నమిలి
నువ్వే సరేనంటే సమస్తాన్ని సమర్పిస్తానే నారీ
శిల్పం ఎలా చెక్కాలో చెప్పే పాఠం నీ రూపం కాదా
నాట్యం ఎలా ఉండాలో నేర్పే శాస్త్రం నీ నడకే కాదా
నీ దేహంతో స్నేహం చేసే చీరా రైకా ఐతే గానీ
సంపూర్ణంగా నీ సౌందర్యం వర్ణించే మార్గమే తెలిసేనా జాణా
నిన్నే ప్రతినిత్యం ప్రబంధంలా పఠిస్తున్నా చిన్నారీ
కనుచూపే విరితూపై తనువున ఆవిరి రేపే
కలిగిన ఈ మైమరపే తొలివలపై జత కలిపే

లేలే అనే పొద్దుంది – నీరెండల్లే! నవ్వే పెదవుల్లో
లాలీ అనే రేయుంది – నీలాలే జీరాడే నీ జళ్ళో
పాపం నీ నడుమే లేకుంటే – నాజూకుండే చోటేదంట
జన్మం పండి నీ చర్మంపై ముత్యాల జల్లయిందే చెమట –
వనితా నిన్నే స్మరిస్తున్నా వరిస్తున్నా – తరిస్తా ఒళ్ళో చేరి

(సుబ్బరాజు గారి కుటుంబం చిత్రానికి కీరవాణి సంగీత సారథ్యంలో కీరవాణి పాడినది)

★★★

పల్లవి: సౌందర్యలహరి సౌందర్యలహరి

సౌందర్యలహరి స్వప్నసుందరి – నువ్వే నా ఊపిరి
శృంగారనగరి స్వర్ణమంజరి – రావే రసమాధురి

వన్నెచిన్నెల చిన్నారి నీ జంట కోరి
ఎన్ని జన్మలు ఎత్తాలే ఈ బ్రహ్మచారి
కల నుంచి ఇల చేరి కనిపించు ఓ సారి...

పాలచెక్కిళ్ళు దీపాల పుట్టిళ్ళు
అదిరేటి అధరాలు హరివిల్లులు
ఫక్కున చిందిన నవ్వులలో లెక్కకు అందని రతనాలు
యతికైన మతిపోయే ప్రతి భంగిమ
ఎదలోనే పురివిప్పి ఆడింది వయ్యారి

నీలికన్నుల్లు – నాపాలి సంకెళ్ళు
నను చూసి వలవేసి మెలివెయ్యగా
ఊసులు చెప్పిన గుసగుసలు శ్వాసకు నేర్పెను సరిగమలు
కలగంటి తెలుగింటి కలకంఠిని
కొలువుంటె చాలంట నాకంట సుకుమారి

(పెళ్ళిసందడి చిత్రానికి కీరవాణి సంగీత సారథ్యంలో బాలు, చిత్ర, కోరస్ పాడినది)

★★★

పల్లవి: ఎవరూ చూడని ఏకాంతంలో
ఎవరూ చేరని ఈ సమయంలో
రసవేగమై రవళించనీ ఎదలో లయ
జతలీలలో శృతిమించనీ కరిగే ప్రియా
ప్రియా ప్రియా ప్రియా ప్రియా

విడువకు విడిగా అనే కదా నిను వేడుతోంది ప్రాయం
నీ ఎదసడిగా అయ్యా కదా అని పాడుతోంది ప్రాణం
ఒట్టేసి మళ్ళీ ఆ మాటే చెప్పనా
నువ్వే లేక నేనిన్నాళ్ళు వున్నానన్న మాటే
నాకు నమ్మాలంటే కష్టంగా ఉంది
నువ్వంటూ నాక్కనిపించాక నాలో నేనే లేనే – అన్న
సాక్ష్యం ఎంతో ఇష్టంగా ఉంది

కరగని శిలలా అవ్వాలిగా మనవైపు చూస్తే లోకం
కరగని కలగా అయ్యిందిగా మనమేలుతున్న కాలం
ఇలా ఇద్దరం అయిపోదాం ఒక్కరం

ఎండాకాలం వానాకాలం శీతాకాలం ఏమోగాని
కారాగారం కానీ కౌగిలి
నవ్వేవాళ్ళు ఏడ్చేవాళ్ళు వాళ్ళు, వీళ్ళు అంతా చేరి
నువ్వూ నేనే అవుదాం నెచ్చెలీ

(శ్రీ సీతారాముల కళ్యాణం చూతము రారండి చిత్రానికి కీరవాణి సంగీత సారథ్యంలో కీరవాణి, చిత్ర పాడినది)

★★★★

అతడు: కన్నుల్లో నీ రూపమే – గుండెల్లో నీ ధ్యానమే
నా ఆశ నీ స్నేహమే – నా శ్వాస నీ కోసమే
ఆ ఊసుని తెలిపేందుకు నా భాష ఈ మౌనమే

ఆమె: మది దాచుకున్న రహస్యాన్ని వెతికేటి నీ చూపునాపేదెలా
అతడు: నీ నీలి కన్నుల్లో పడి మునకలేస్తున్న నా మనసు తేలేదెలా
ఆమె: గిలిగింత పెడుతున్న నీ చిలిపి చూపులతో
ఏమో ఎలా వేగడం

అతడు: అదిరేటి పెదవుల్ని బ్రతిమాలుకున్నాను
మదిలోని మాటేదని
ఆమె: తల వంచుకుని నేను తెగ ఎదురు చూసాను
నీ తెగువ చూడాలని
అతడు: చూస్తూనే రేయంతా తెలవారి పోతుందో
ఏమో ఎలా ఆపడం
( నిన్నే పెళ్ళాడతా చిత్రానికి సందీప్ చౌతాలా సంగీతసారధ్యంలో హరిహరన్ , చిత్ర పాడినది)

★★★★

ఆమె: చినుకుతడి స్పృశించే లీలలా
చిలిపి చలి సృజించే జ్వాలలా
మధుమురళి రమించే గాలిలా
మొదటి విరి సుమించే వేళలా
మోయలేని హాయిలో మేలుకున్న రేయిలో
మౌనరాగం మధుపరాగం సాగనీ ఇలా

అతడు: కనబడకుంటే ఓ క్షణమైనా కునుకుండదే
ఆమె: ఎదురుగ ఉంటే నా మదిలోన కుదురుండదే
అతడు: చూస్తూనే ఉండాలి నిను కనుమూసి ఉన్నా
ఆమె: రెప్పల్లో కట్టేయి నన్ను కాదందునా
అతడు: నిదరేదో నిజమేదో తేలీతేలని లాలనలో

ఆమె: మౌనరాగం మధుపరాగం సాగనీ ఇలా

ఆమె: ప్రతి నడిరాత్రి సూర్యుడు రాడా నీ శ్వాసతో
అతడు: జతపడగానే చంద్రుడు కాడా నీ సేవతో
ఆమె: ఆవిర్లు చిమ్మింది చూడు పొగమంచు పాపం
అతడు: వేడెక్కి చల్లారుతుంది కలిపే క్షణం
ఆమె: పగలేదో రేయేదో తెలిసీతెలియని లాహిరిలో
అతడు: మౌనరాగం మధుపరాగం సాగనీ ఇలా

(ప్రియరాగాలు చిత్రానికి కీరవాణి సంగీత సారథ్యంలో హరిహరన్, చిత్ర పాడినది)

★★★★

అతడు: ఎద నట్టింటను మెట్టిందొక మధుకథ
నర్తించెను మత్తిల్లిన సుమసుధ – రూపెత్తిన ఆనందం ఆగేనా?

ఆమె: దివి లక్షింతల అక్షింతలు కురియగ
నిద్రించని విద్యుల్లత విరియగ – చేపట్టిన వాసంతం వాడేనా?
అతడు: శుభమూర్తం పిలిచింది సురద్వారం తెరిచింది నవరాగం రాగా

అతడు: నీలివనిలో తారకా – ఈ అవనికే జారగా
గాలి అలలే గానకళలై రేయి హృదయం పాడదా
ఆమె: వాలుకనులే కోరగా – పూల కలలే చేరగా
తేనె తడిపే వేళ తలపే హాయి లయలో ఆడదా
అతడు: వెలుగు నిజమైనా – వలపు ఋజువైనా
కళ్ళు మూసే చూడనీ వరాన్ని రెప్ప విడితె కల ఔనో

ఆమె: మల్లె మురిసే వేళగా – వెల్లివిరిసే వేడుకా
ప్రాణలతకు ప్రణయ శృతిలో మేలు కొలుపై చేరదా
అతడు: ఇంద్రధనువే మాలగా – పేద ఎదపై వాలగా
భావి బ్రతుకు దేవి కొరకు పూజ గదిగా మారదా
ఆమె: ఇలకు ఇకపైనా విరుల జడివానా
మౌనమైన రాగమాలపించు మరుల ఝురుల మురిపాన

(ప్రార్థన చిత్రానికి దేవేంద్రన్ సంగీత సారథ్యంలో బాలు, జానకి పాడినది)

(కొనసాగింపు వచ్చేసంచికలో)




దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

**24**

అతడుః అమ్మాయి ముద్దు ఇవ్వందే ఈ రేయి తెల్లవారనివ్వనంతే
ఆమెః అబ్బాయీ నీ ముద్దు చెల్లించితే అమ్మమ్మమ్మో గొడవలే
అతడుః ముద్దిమ్మంది బుగ్గ - వద్దంటూ అడ్డం రాకే నువ్వు
సిగ్గేలేని సిగ్గా
ఆమెః ముద్దిమ్మంటే బుగ్గ అగ్గల్లే వస్తే ఆపేదెట్ట
హద్దూ పద్దు లేదా..
అతడుః మోజు లేదనకు
ఆమెః ఉందనుకో ఇందరిలో యెలా మనకు ..తూగిపొమ్మనకూ
అతడుః చీకటిలో ఇద్దరమే ఉన్నమనుకో
ఆమెః చూడదా సహించని వెన్నెల ఊరించినా కన్నులా
అతడుః కళ్ళు మూసేసుకో హాయిగా ॥అమ్మాయి॥
ఆమెః పారిపోను కదా
అతడుః అది సరే అసలు కథ అవ్వాలి కదా..యేది ఆ సరదా
ఆమెః అన్నిటికీ సిద్ధపడే వచ్చాను కదా
అతడుః అందుకే అటు ఇటు చూడకు సుఖాలను వీడకు
ఆమెః తొందరేముందిలే విందుకు ॥అమ్మాయి॥

(క్షణక్షణం చిత్రానికి కీరవాణి సంగీత సారధ్యంలో బాలు, చిత్ర పాడినది)

***

జాబిలమ్మ నీకు అంత కోపమా

జాజిపూల మీద జాలి చూపుమా

నీ వెండి వెన్నెల్లే ఎండల్లె మండితె
అల్లాడిపోదా రేయి ఆపుమా ॥జాబిలమ్మ॥

చిగురు పెదవి పైన చిరునవ్వై చేరాలనుకున్నా
చెలియ మనసులోన సిరిమువ్వై ఆడాలనుకున్నా
ఉన్న మాట చెప్పలేని గుండెలో విన్నపాలు వినపడలేదా
హారతిచ్చి స్వాగతించు కళ్ళలో ప్రేమ కాంతి కనపడలేదా
మరి అంత దూరమా కలలుకన్న తీరమా ॥జాబిలమ్మ॥

మనసు చూడవమ్మా కొలువుందో లేదో నీ బొమ్మా
మనవి ఆలకించి మన్నిస్తే చాలే చిలకమ్మా
ప్రాణమున్న పాలరాతి శిల్పమా మా ప్రేమ నీడ చేరుకోని పంతమా
తోడు కోరి దగ్గరైతే దోషమా తియ్యనైన స్నేహమంటె ద్వేషమా
ఒక్కసారి నవ్వుమా నమ్ముకున్న నేస్తమా ॥జాబిలమ్మ॥

(పెళ్ళి చిత్రానికి ఎస్.ఎ.రాజ్ కుమార్ సంగీత సారధ్యంలో బాలు పాడింది)

***

అతడుః మేఘాలు తాకింది హాయ్ హైలెస్సా
నవరాగంలా నవ్వింది నా మోనాలిసా!
ఈగాలి రేపింది నాలో నిషా
చెలరేగాలి రమ్మంది 'హల్లో' అంటూ
ఒళ్ళో వాలే అందాల అప్సరస

ఆమెః మేఘాలె తాకింది హాయ్ హైలెస్సా
నవరాగంలా నవ్వింది నీ మోనాలిసా
ఈ గాలిరేపింది నాలో నిషా
అది నా శ్వాసలో చేరి హల్లో అంటూ
అల్లేసింది నీమీద నా ఆశ ॥ ॥

అతడుః తొలిసారి నిను చూసి మనసాగక –
పిలిచానె చిలకమ్మ మెల్ల మెల్లగ
తెలుగంత తియ్యంగ – నువు కలిశావె స్నేహంగా

ఆమె: చెలిమన్న వలవేసి నను లాగగా –
చేరాను నీ నీడ చలచల్లగా
గిలిగింత కలిగేలా తొలి వలపంటె తెలిసేలా

అతడు: కునుకన్న మాటే నను చేరకా
తిరిగాను తెలుసా ఏం తోచకా ॥మేఘాలె॥

ఆమె: తొలిపొద్దు వెలుగంత చిరువేడిగా
నిలువెల్ల పులకింత చిగురించగా
దిగులేదో హాయేదో గుట్టు చెరిపింది ఈ వింత

అతడు: ఒక మత్తు కలిగింది గమ్మత్తుగా –
నిజమేదో కలయేదో మరిపించగా
పగలేదో రేయేదో రెండు కలిసాయి నీ చెంత

ఆమె: ప్రేమంటె ఇంతేనేమో మరి
దానంతు ఏదో చూస్తే సరి! ॥మేఘాలె॥

(ప్రేమించుకుందాం రా చిత్రానికి మహేష్ సంగీత సారథ్యంలో బాలు, చిత్ర పాడినది)

(కొనసాగింపు వచ్చేసంచికలో)









**23 Comments** Sort by Newest

Add a comment...


**Santhosh Sharma Choppalli**
సిరివెన్నెల రాత్రిలా ఉంటుంది సీతారామశాస్త్రి గారి సాహిత్యం.ప్రతి పాటలోను మాటలు కాదు మీ మనసును నింపుతారు గురువుగారూ. పాట మీ మనసులో ప్రాణం పోసుకుని కలం నుండి పురుడు పోసుకుని మా మనసు పొరల్లో కొలువై ఉంటుంది.వాక్యం రసాత్మకం కావ్యం అన్నది మీ పాటల్లో అక్షర సత్యం.మీ సంతోష్ .......

Like · Reply · 1 · 3y


**Ramesh Punna**
siri veneela garu super ga undi

Like · Reply · 1 · 3y




దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

**25**

## కుర్ర తరంగం

సాధారణంగా సినిమాలలో టీజింగ్ సాంగ్స్ ఉంటాయి. నిజానికి ఈ టీజింగ్ అనేది సినిమాల్లోనే కాదు, నిజ జీవితంలో కూడా ఉంటుంది. ఆ వయసులో అల్లరి సహజం అయితే నిజ జీవితంలో కుర్రాళ్ళు సినిమాల్లోని పాటలను ఎరువు తెచ్చుకుని టీజింగ్ చేస్తే, ఆ కుర్రాళ్ళకి సరఫరా చెయ్యడానికా  అన్నట్టు సినిమాల వాళ్ళం పాటలు రాస్తూ ఉంటాం.

అమ్మాయిల వెంట పడే అబ్బాయిలు, తమ సంఖ్య ఎక్కువైతే అమ్మాయిలే అబ్బాయిల్ని అల్లరి చెయ్యటం జరుగుతూ ఉంటుంది. ఈ రోజే కాదు అనాది నుంచీ ఈ వయసులో ఒకరినొకరు ఆట పట్టించుకోవడం అన్నది ఉంటూనే ఉంది. అయితే ఈ టీజింగ్లో భాషగానీ, భావ వ్యక్తీకరణ కానీ మోతాదు మించితే అవతలి వ్యక్తి హృదయం బాధ పడుతుంది. ఇది చిన్న ముల్లులా ఒంటిని గుచ్చితే బాగుంటుంది కానీ పెద్ద గునపంలా గుండెల్లో పొడిస్తే బాగోదు. ఈ వార చూసుకుంటూ మేము పాట రాయవలసి ఉంటుంది. ఈ టీజింగ్ సాంగ్స్ అనే కోవలో ఈ తూకాన్ని నేనెంత వరకు సాధించగలిగాను అనేది మీలాంటి రసహృదయులు తేల్చడానికి కొన్ని పాటల్ని చేర్చాను.

★★★

పల్లవి: గోదారి రేవులోన రాదారి నావలోన నామాటె చెప్పుకుంటు ఉంటారంట
నా నోట చెప్పుకుంటె బాగోదో ఏమో గాని నాలాంటి అందగత్తె నేనేనంట
పూసంత నవ్వగానే పున్నాగ పువ్వులాగ పున్నాలు పూయునంట కన్నుల్లో
కాసింత కోపమొస్తె ఊరంత ఉప్పెనొచ్చి ఎందుకో ఏమిటో చెప్పమంటు సందడంట ‖ గోదారి‖

పాట అంటె నాదెగాని కోయిలమ్మదా – ఒట్టి కారుకూతలే
ఆట అంటె నాదే కాని లేడిపిల్లదా – పిచ్చి కుప్పిగంతులే
పొలాల వెంట చెంగుమంటు సాగుతూ పదాలు పాడితే
జిగేలుమంటు కళ్ళు చెదిరి ఆగవా జులాయి గాలులే
ఏ చిన్న మచ్చలేని నా వన్నె చిన్నె చూసి చంద్రుడే
సిగ్గుతో మబ్బుచాటు చేరుకోడ

నాకు పెళ్ళీ ఈడు వచ్చి పెద్దవాళ్ళకి ఎంత చిక్కు తెచ్చెనే
రాకుమారి లాంటి నాకు జోడు వెతకడం వాళ్ళకెంత కష్టమే
ఫలాని దాని మొగుడు గొప్పవాడని అనాలి అందరూ
అలాని నాకు ఎదురు చెప్పకూడదు ఏ మహానుభావుడు
నాకు తగ్గ చక్కనోడు నేను మెచ్చు ఆ మగాడు
ఇప్పుడే ఎక్కడో తపస్సు చేస్తువుంటాడు

(రుక్మిణి చిత్రానికి విద్యాసాగర్ సంగీత సారధ్యంలో సుజాత పాడినది)

★★★

అతడుఃలేచిందే లేడికి పరుగు కూచుంటే ఏమిటి జరుగు
తోచిందే వేసేయ్ అడుగు దౌటెందుకు
ఆమెః లేడల్లే ఎందుకు ఉరుకు పడిపోతే పళ్ళు విరుగు
చూడందే వెయ్యకు అడుగు జోరెందుకు
మనకన్నా చిన్నవాళ్ళు
మంజ్రేకర్ టెండుల్కర్లు లేరా మనకెగ్జాంపులు
అతడుః తుటాల ఫాస్టు బాలు చూస్తేనే గుండె గుభేలు
మనసత్తా సో సింపులు సో సింపులూ
ఆమెః ఎవరి జాతకం వారిది సారు రేఖలేనిదే నెగ్గరు ఎవరూ
రాసివున్నదా చూసుకో గురూ నేటి స్వీపరే నెక్స్ట్ స్పీకరు
లక్కుంటే లకీరుతో లక్ పతిలౌతారు
లైఫంటే నసీబులో స్టారే మాస్టారు

తాపీ తాబేలు తీరు ఆపేసే హాల్ట్ బోరు
టేకాఫే టాపు గేరు నా నేచరు

కుందేలై గెంతువారు కుదేలయేతీరుతారు
లాకప్ కో హాస్పిటల్కో గెస్టవుదురు

ట్రైలెద్దాం కొండకొనకు పోయేదేముంది మనకు
ఆఫ్టాలో వెంట్రుక మన స్టేకు
ఏదో ఒకటుంది తలకు అది కాస్తా తెంచుకోకు
టోటల్ గా సున్నా అయిపోకు గోవిందా గోవిందా

ఇంటలెక్చువల్ లెక్చర్లేల అడుగు అడుగునా మేధావుల్లా
మైథాలాజికల్ పిక్చర్లోలా పొడుగు పొడుగునా పద్యాలేల
చర్చలతో చెడామడా తర్జన బర్జనలా
జంక్షన్లో ఎడాపెడా అర్జున గర్జనలా
(మనీ చిత్రానికి శ్రీ సంగీత సారధ్యంలో బాలు పాడినది)

★★★

ఆదివారమొక సెంటర్లో సోమవారమొక షాపింగ్ లో

ఎదురుపడ్డ నాడనుకున్న ఎవరా మైనా
యానివర్సిరీ ఫంక్షన్ లో యూనివర్శిటీ జంక్షన్ లో
అనూపానూ తెలియాలన్నా ఏదేమైనా
ఫైనలియర్ బిపిసి , ఫాదరేమో పరదేశీ
పెద్దదిక్కు ఎవరూ లేరయా
ప్రేమనగరు వాణిశ్రీ లేతఫిగరు భాగ్యశ్రీ
అంది బ్రదరు మైనే ప్యార్ కియా
ఓ మైనా నా మైనా నా వన్నెల జాణా, నా మానస వీణా, పరువాల కోనా

అటు మొన్నే పైటవేసి లవ్ లో అడుగేసి ఏనాడో వచ్చునంది ఏబిసి
ఎల్ కె జి ఏజి నుంచే రీసెర్చి చేసి పిహెచ్ డి పుచ్చుకుంది బీటేసి
నాకు లైనేసి లవ్ లీ గా లాగేసి సోకులిచ్చింది వాటేసి
లైను చెరిపేసి లేలెమ్మని ఎగదోసి లేచిపోదాం రారమ్మంది
ఆ ఫిగరు ఆ వగరు ఏం పొగరు ఏ ఫికరు ఎరుగదు చూడు గురూ!

నన్నేరా ఎంచుకుంది విన్నారా అంతా వీనస్ పై ఆశవద్దు కామ్రేడ్స్
వందేలో క్యూలు కట్టి ఉన్నారా ఇంకా వేకెన్సీ లేదు కాదా నా ఫ్రెండ్సు
ఘొల్లుమనకండి , చెల్లెల్లా చూడండీ, చూపు మార్చండీ ఇకనుండి
బాధపడకండీ బ్రదరిన్ లా అనుకోండీ, కట్నమేదైనా ఇవ్వండీ
ఈ జగమే మాయ గురూ, లేరెవరు, రారెవరు అనుకో ఓ లవరూ..!!
(ప్రయత్నం చిత్రానికి విద్యాసాగర్ సంగీత సారధ్యంలో బాలు పాడినది)
★★★
వెయ్యిన్నొక్క జిల్లాల వరకు వింటున్నాము నీ కీర్తినే
ముల్లోకాల ఏ మూల విన్నా నీ అందాల సంకీర్తనే
హంపి లోని శిల్పాలకి ఎల్లోరాల నాట్యాలకి
నువ్వే మోడలయ్యావో ఏమో వయ్యారి

ఖర్మ కాలి రావణుండు నిన్ను చూడలేదు గాని
సీత ఊసునే తలచునా పొరబడి
భీష్ముడున్న కాలమందు నువ్వు పుట్టలేదు గాని
బ్రహ్మచారి గా బతుకునా పొరబడి
ఇంత గొప్ప అందగత్తె ముందుగానే పుట్టి వుంటే
పాత యుద్ధ గాధలన్నీ మారి ఉండేవే
పొరపాటు బ్రహ్మది గాని సరి లేనిదీ అలివేణి

అల్లసాని వారిదంతా అవకతవక టేస్టు గనక
వెళ్ళిపొయెనే చల్లగా ప్రవరుడు
వరూధినిని కాక నిన్నే వలేసుంటే కళ్ళు చెదిరి
విడిచి పెట్టునా భామని బ్రాహ్మడు
ఒక్కసారి నిన్ను చూస్తే రెప్ప వెయ్యలేరు ఎవరూ
కాపురాలు గంగకొదిలి వెంట పడతారే
ముసలాడి ముడతలకైనా కసి రేపగలదీ కూన

(సూర్య ఐ.పి.యస్ చిత్రానికి ఇళయరాజా సంగీత సారధ్యంలో బాలు పాడినది)

(కొనసాగింపు వచ్చే సంచికలో)








దాదాపు 12 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

**26**

## క్షుద్ర తరంగం

పేకల్లో జోకర్లా ఎవడే ఈ షోకిల్లా
మ్యాజిక్కుల సర్కారల్లే మేకప్పేదో కొట్టాడే
చుట్టాడే తలపాగ పెట్టాడే నెమలీక
బుడబుక్కల బూచాడల్లే దసరావేషం కట్టాడే
పదిమంది చూస్తే పకపకా నవ్వేలా!

ఎల్.కె.జీ లెక్కలకి కాలేజి కొలతలకి
ఎన్నెన్నో తేడాలుంటాయ్ చూడాలె కులుకమ్మా
ఎలిమెంటరీ బట్టల్లో నలుదిక్కులు చుట్టొస్తే
జనమంతా గగ్గోలెట్టి చస్తారే చిలకమ్మా
అవతారం చూస్తే అదోరకం అదమ్మా!

అల్ల త్రేతాయుగం నుంచి దూసుకువచ్చారా
విల్లు బాణాలు ఏవండి తీసుకు వచ్చారా
గిల్లిపోతానె వళ్ళంతా పుల్లని నారింజ
గొల్లుమంటావె నాతోనె అల్లరి ఛాలెంజా

తోక చుక్కల్లె దొరవారు ధీమాగా దిగినారు
ఏ దేశం ఏలేవారో ఆదేశం ఇస్తారు
పంతాల కుందేల పంజా రుచి చూస్తావా

మంచి ఉమ్మస్సు మీదుంది అమ్మడి వయస్సు
కొత్త సిలబస్సు చెపుతుంది సొంపుల ఛందస్సు
వచ్చి అక్కను మీదుంది గుంటడి వర్చస్సు
ఖడ్గతిక్కన్నకేదుంది ఇంతటి తేజస్సు

ఉత్తి ఆకారం ఏముందే – అసలంతా లోనుందే
సందేశం కావాలంటే సావాసం చెయ్యండే
పల్నాటి పుంజల్లే రోషం రెచ్చాదే!

(అసెంబ్లీ రౌడి చిత్రానికి కె.వి.మహదేవన్ సంగీత సారధ్యంలో బాలు, చిత్ర పాడినది)

★★★

హిందీ మే తూ చార్ సౌ బీస్
ఇంగ్లీష్ నేమీజ్ 420
తెలుగులో ముచ్చటగా పచ్చి దగా అందురుగా
తగువులు తెచ్చుకునే పిచ్చిపనే మానవుగా
అయ్యో అయ్యో అయ్యయ్యో

ట్రంకు రోడ్డు బండి టీనేజి లోడ్ నిండి ఈ డొంక రోడ్డు పట్టిందండి
జోరు తగ్గకుంటే పై గేరు దించకుంటే ఈ చోటు దాటిపోలేదండీ
ఇంజనులో హీటెక్కిందే అబ్బ చెయ్యేస్తే చుర్రంటుందే
జాగర్త వెళ్ళకలా వెల్లికిలా పడతావే
అయ్యో అయ్యో అయ్యయ్యో
అరె అయ్యో అయ్యో అయ్యయ్యో

ఎంత గుబాళింపు నువ్వంటుకునే షాంపూ
నా సొమ్ముకన్న చవకా చెప్పు
లిప్‌స్టిక్ కన్నా – మేకప్ ఖర్చుకన్నా – ఏమెక్కువమ్మ ఈ నా అప్పు
ఎంతమ్మా ట్వంటీ రూపీస్ – అంతేగా ఇచ్చెయ్యి ప్లీజ్
ఎర్రని ఏకానీ వదలనుగా నేనసలు
ఇరవైకి పైసైనా ఇవ్వనుగా కన్సెషను
అయ్యో అయ్యో అయ్యయ్యో
అరె అయ్యో అయ్యో అయ్యయ్యో

(బొబ్బిలిరాజా చిత్రానికి ఇళయరాజా సంగీత సారధ్యంలో బాలు పాడినది)

★★★

కోకో కోపమా కొత్త సిగ్గు దీపమా ఎర్రగా కందెనమ్మా
పైపై పంతమా పట్టు నెగ్గు పందెమా వెర్రిగా తూగెనమ్మా
ఈ గయ్యాళి గంగమ్మ కోపం ఏ కొంప ముంచేందుకో
ఈ వయ్యారి వాగమ్మ వేగం కింద మీద చూడకుండ పొంగుతోంది ఎందుకో

పాలపొంగు చేలలో నీటిమీద కోపము
నేలపాలు కాకముందె ఆపినందుకా
నీలిమబ్బు కేలనో నేలమీద కోపము
గుండెలోని భారమంత దించినందుకా
పాపమ్మో ఇక ఆపమ్మో కవ్వించే పోరాటం
పోనీలే అని చూస్తుంటే శృతి మించిందే నీ వాటం
కొద్దిగా బుద్ధిగా ఆడపిల్ల తీరుగా
హద్దులో ఉండకుండ ఇంత అల్లరెందుకో

రాసనిమ్మ పండులో ఎంత రోషముందిరో
పళ్ళు రాలిపోవునంత పుల్లగుందిరో
ఉల్లిపాయ గుండెలో ఎంత ఘాటు ఉందిరో
కళ్ళనీరు ఊరుదాక ఊరుకోదురో
ఉడతమ్మా నువు ఊపేస్తే పడిపోవాలా పళ్ళన్ని
జింకమ్మా నువు జడిపిస్తే జంకాలా పులులన్నీ
పిచ్చుకా ఊరుకో పిచ్చిపనులు మానుకో
నవ్వుకుంటె గోడపెచ్చులూడవమ్మా ఒప్పుకో

(పండుగ చిత్రంలో కీరవాణి సంగీత సారథ్యంలో బాలు పాడినది)

★★★

అంతా నా ఇష్టం అంతా నా ఇష్టం
ఎడా పెడా ఏమి చేసినా అడిగేదెవడ్రా నా ఇష్టం
చెడామెడా చెలరేగినా చెప్పేదెవడ్రా నా ఇష్టం
మీ ఇళ్ళలో గబ్బిలాలనే పెంచండి అంటా నా ఇష్టం
కూకూ అని గుడ్లగూబనే కూయించమంటా నా ఇష్టం
బజారులో పుట్టగోచితో పచారు చేస్తా నా ఇష్టం
నడీధిలో నవాబునై నచ్చింది చేస్తా నా ఇష్టం
దుబాయికి పెట్రోలుని ఎక్స్‌పోర్టు చేస్తా నా ఇష్టం
అంతా నా ఇష్టం, అంతా నా ఇష్టం

హిస్టరీ కొత్తగా రాయమంటా – హిట్లర్‌ని దేవుడిగ చేయమంట
మారుతీ కారునే తోలుకొస్తా – చేలల్ని దానితో దున్నమంటా
షటిల్‌కాకుతో బౌలు చేస్తా – చేసి సచిన్ టెండుల్కర్ని అవుట్ చేస్తా
టైగర్ని పచ్చగడ్డి మేయమంటా – పావురానికి బాంబులు ఇచ్చి వేయమంటా
అంతా నా ఇష్టం, అంతా నా ఇష్టం

బ్యూటిఫుల్ భామనే పట్టుకొస్తా – అటల్‌బిహారి కిచ్చి పెళ్ళి చేస్తా
తీహారు జైలు ఎంత గొప్పదంట – దేశరాజధాని అని చెప్పమంట

అసెంబ్లీకి నేను పోటీ చేస్తా – చేసి ఎక్స్‌పార్టీ ఓడికి ఓటు వేస్తా
కంప్యూటర్‌లో పత్తిపంట వేస్తా – దాంతో చంద్రబాబునాయుడికి షర్టు నేస్తా
అంతా నా ఇష్టం అంతా నా ఇష్టం

(కౌరవుడు చిత్రానికి మణిశర్మ సంగీత సారథ్యంలో మురళీధర్, ధర్మతేజ పాడినది)

(కొనసాగింపు వచ్చేసంచికలో)

కౌముది www.koumudi.net ఫిబ్రవరి 2015






**23 Comments** Sort by Newest

Add a comment...

**Santhosh Sharma Choppalli**
సిరివెన్నెల రాత్రిలా ఉంటుంది సీతారామశాస్త్రి గారి సాహిత్యం.ప్రతి పాటలోను మాటలు కాదు మీ మనసును నింపుతారు గురువుగారూ. పాట మీ మనసులో ప్రాణం పోసుకుని కలం నుండి పురుడు పోసుకుని మా మనసు పొరల్లో కొలువై ఉంటుంది.వాక్యం రసాత్మకం కావ్యం అన్నది మీ పాటల్లో అక్షర సత్యం.మీ సంతోష్ .......
Like · Reply · 1 · 3y

**Ramesh Punna**
siri veneela garu super ga undi
Like · Reply · 1 · 3y

**Sravan Thotakuri**
పైన పడే ఈడు కూడ పండుగ.. దండుగ అని అచ్చు వేసారు..
Like · Reply · 1 · 3y

**Subhash Mantha**
Puli laage pelliki kooda letters rendera
paruvaledani pakkaki velithe palaaramayiporaa
idi aminu saddam husseinu dictarlatra
anthati dictatorlatra ...
This charanam was missing from th epublication
Like · Reply · 1 · 4y

**Sitarama Rao Kodali**
sirivennela patala samdramlo marikonni mutyaalu dorikayi eenela.
Like · Reply · 4y

**Sitarama Rao Kodali**
PAATALA NEPADHYAM KOODAA VIVARISTUMTE BAAGUMTUMDI.
Like · Reply · 1 · 4y

**Sai Sandilya**




దాదాపు 13 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

27

## హాస్యతరంగం

ఇది వ్యంగ్యంకాదు. పూర్తిగా నవ్వుకోవడానికి. మంచి మంచి సందర్భాలు వచ్చాయి. కొసరాజుగారు చాలా మంచి హాస్యం రాశారు. ఎంత బాగా రాశారంటే ఆయనలాగ హాస్యాన్ని మళ్ళా పండించగలమా అనిపిస్తుంది. నాకు వచ్చిన అదృష్టం ఏమిటంటే కొసరాజుగారు డీల్ చేసిన ఎన్నో సిచ్యుయేషన్స్ నాకు మళ్ళా వచ్చాయి. పొరుగింటి మీనాక్షమ్మ లాంటి పాటని నేను మళ్ళీ రాయటం, అరెరె జేబులో డబ్బులు పోయాయి లాంటి పాట, దోషి – నిర్దోషి సినిమాలో విద్యాసాగర్ సంగీత దర్శకత్వంలో పేకాట మీద రాయటం జరిగింది. అటువంటి నాలుగైదు హాస్యగీతాలు ఈ విభాగంలో పొందు పరిచాను.

ఏయ్ మూర్తి డబ్బులు కరెక్ట్‌గా పెట్టి టేబుల్ దగ్గర కూర్చో
లేకపోతే చేతులు ఇరిగిపోతాయ్ – కట్ ఫర్ సిక్స్
వాడి పేక చూస్తావేంట్రా
మన పేక ఎప్పుడైనా చూసుకోవచ్చు కదోయ్!
ఆకార్డు నాక్కావాలి మిడిల్ డ్రాప్ చేస్కో లేకపోతే కేసు పెడతా
ఒరేయ్ నీ డ్రాప్‌రా
షో! షో! షో!

అమ్మ దీని తస్సాదియ్యా గుమ్మం దాకా వచ్చిందయ్యా షో! షో! షో!
నమ్ముకున్న ముక్క రాక సొమ్ము కాస్త దోచిందయ్యా షో! షో! షో!

కోసే దాక ఆశే పోక చూసేశాక ఎ.సి. పేక భేషో! శహభాషో!
వేసై బాసు ఇస్పేటాసు నొక్కేసావో, లెక్కేసావో షో! షో!
చూసెయ్ బోసు ఏదీ పర్సు డీలే నాది
డీలా నీది షో! షో!
జోకర్ వాటము పట్టానమ్మా చేతుల తీటకు చెడ్డానమ్మా! రమ్మీ నిన్ను నమ్మి

లెక్కెట్రా! లెక్కెట్రా!
కొట్టక కొట్టక ఆట కొడితే గాత్రం అంటావ్, ఒరేయ్

ఏం బాస్! కౌంటా
జీవితమే పెద్ద కౌంటు బ్రదర్ – ఏమీ చెయ్యలేము

ఆఠీన్ రాణి అందిందహో! బ్యూటీ బోణి అయ్యిందహో షో! షో
డైమండ్ జాకీ తన్నిందయ్యో ఆటకి బాకీ అంటానయ్యా షో! షో!
అపుడే చెయ్యకు బాబు డ్రాపు ముంచుకు వస్తే యం.డి. సేఫ్ ఆదు, వేటాదు

ఒరేయ్ వాడు విపరీతంగా ఒణికిపోతున్నాడు
డీల్ అనుకుంటా డ్రాప్ అయిపోరా
చెప్పటాల్లేవబ్బాయ్

పార్టై లేక పీకే పేక ముంచిందయ్యా పీకల్దాకా
ఆఖరుదాకా జోకరు రాక షేకొచ్చింది లైఫే లేక షో! షో!
బొమ్మల కొలువే ముక్కలు మొత్తం తగ్గదు గురువా లెక్కకు మాత్రం
ఈ షో! ఏమి దశో!
భజగోవిందం, భజగోవిందం, గోవిందం భజగోవిందం
గోవిందా! గోవిందా!
(దో షి నిర్దోషి చిత్రానికి విద్యాసాగర్ సంగీత సారధ్యంలో బాలు, ఎస్.పి.శైలజ పాడినది)

****

బావా బావా పన్నీరు! బాసికమెప్పుడు కడతారు
మనవలనెత్తే మన్మధరావుకి మనుగుడుపులకై కంగారు
తాంబూలాలిచ్చే సారండీ!
తాతాశ్రీ పెళ్ళికి ఆహ్వానాలిచ్చేశారండీ!
తన్నుకు చావండి – తాంబూలాలిచ్చేసారండీ!

పళ్ళూడిన పెళ్ళికొడుక్కి బొడ్డూడని పెళ్ళికూతురు
కళ్ళారా చూసి అందరూ కడుపారా నవ్విపోదురు
అయం ముహూర్తస్సుముహూర్తోస్తు అనందరా నాలుగక్షింతలేస్తూ
ఖళ్ళూ ఖళ్ళూ దగ్గులే తాళాలు మేళాలు
హాచ్చ్!
తుమ్మేది పెళ్ళికొడుకే కనక దోషం అట్టే ఉండదు కానీ పంతులూ
కాటికి పొయ్యే వృద్ద జంబూకం కాశీయాత్రకి తయ్యారు
పాడెకు బదులుగ పల్లకి తెమ్మని కాశీ యాత్రకి కబురంపాదు
ఒహోం ఒహోం ఛీం అని మోద్దాం రారండి
తాతశ్రీ పెళ్ళికి తరలి రారండీ
వీధీ వీధీ తిప్పేరు వీసెడు గంధ పూసేరు.

బావా బావా పన్నీరు! బా సికమెప్పుడు కడతారు
మనవలనెత్తే మన్మధరావుకి మనుగుడుపులకై కంగారు
తాంబూలాలిచ్చేసారండీ! ఆహ్వానాల (వి)చ్చేశారండి

తాతాశ్రీ పెళ్ళికి లగ్గాలు పెట్టేశారండీ – తన్నుకు చావండి

(బావాబావా పన్నీరు చిత్రానికి చక్రవర్తి సంగీత సారధ్యంలో బాలు, కోరస్ పాడినది)

****

రావుడు మెచ్చిన ఉడతా నీకు
మావిడి పిందెలు పెడతా
కొమ్మెక్కి కూకున్న ఉడతా దిగి
రానంటె నీ ఎంట పడతా
నువు ఊ కొట్టి ఆలకిస్తే నిన్ను జోకొట్టి కతలు సెబుతా
నువు సెవ్వులు అప్పగిస్తే కొత్త రామాయణాలు ఇప్పుతా
నోరావలిస్తావు ఔరా అంటావు వింటే ఆ వింత!

కోనేటి పక్కుంది ఓ పాత కోట
పల్నాటి కాలంది ఆ కోట గోడ
ఎన్నెన్ని యుద్ధాలు సూసిందో అయినా
ఇన్నాళ్ళు కాస్తైన సెక్కు సెదిరేనా
ఉన్నట్టుండి కుప్పకూలిది నిన్న
ఉప్పెనేం రాలేదు సెప్పేందుకైనా

భూకంపవూ లేదు పిడుగులూ పళ్ళేదు
మరేటయిందనుకుటున్నవూ?
నీలాటిరేవుకి అమ్మలక్కలు సేరి
నీలాపనిందల మీటింగులెడితే
ఇన్లేక ఇన్లేక పానాలు సాలిచ్చి ఇరిగిపోయేనంట

పొలిమేరలో ఉన్న పోలేరమ్మ పుంత
పొద్దుపోతెసాలు భూతాల సంత
అద్దరాత్రిపూట దెయ్యాలపాట
గుండెలవిసి పొయ్యె గజ్జెల మోత
తెలిసినోళ్ళు ఆ సాయికె పోరు
తెలియకుండ పోతే తెల్లారి రారు

అట్టాటి సోటికి నిన్న రాతిరి పొరుగూర్నించి ఓ పోరగాడు వస్తా వస్తా..
సిమ్మ సీకట్లోని సందళ్ళు ఇంటా, సంగతేంటో సూడబొయ్యాడంట
పెశిడెంటు పేరయ్య, పెద్దింటి పోలమ్మరసపట్టులో ఉంటె సూశాడంట
ఇన్నాళ్ళుగా ఆ దెయ్యాల భాగోతం అందుకోసవంట

(మామా బాగున్నావా చిత్రానికి విద్యాసాగర్ సంగీత సారధ్యంలో ఎస్.జానకి పాడినది)

(కొనసాగింపు వచ్చేసంచికలో)








దాదాపు 13 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

**27**

## హాస్యతరంగం

గుళ్ళో రామయ్యో ఇల్లా రావయ్యో!
గువ్వల చెన్నయ్యో.. బస్తీ చూడయో
అబ్బో బెమ్మాండం.. అనుకుంటారయ్యో!
మళ్ళీ మనూరికి పోనీ పోరయ్యా!
అలా హంగామా చెయ్యకు దేవయ్యో
తీరిగ్గా ఊరంతా చూద్దాం రావయ్యో!
రైరో బుల్లెమ్మా.. పోదాం పదవమ్మో!
భేషో బ్రమ్మయ్యో.. అంటా చూడమ్మో!

ఇదిగో డబ్బు .. ఆ బాబుల కివ్వు
చిరిగిన లాగులు వేసుకు తిరిగితె ఎట్టా అని చెప్పు...
చాల్లే ఆపు.. అవి జీన్సోయ్ బాబు
పట్నాల్లో ఇది ఫాషన్లే నువ్వు తప్పంటే తప్పు
అయితే నే కూడా .. నా బట్టలు చింపుకునేదా
అంత పనొద్దయ్యో జనమంతా భయపడిపోరా
పక్కకి పోవయ్యో పోలీసాయనా
పెళ్ళాం పిల్లలే లేరా నాయనా
ఆయనకేం ఆపదరాదు.. ఆపకు రావయ్యా
నువ్వట్టా రాస్తారోకో ..చెయ్యకు దేవయ్యా..

ఊరికి మధ్య ఈ అడివేంటమ్మా?
లేళ్ళూ పుల్లూ కుందేళ్ళూ ఓ చోటే ఉన్నాయి
అడివేం కాదు.. ఇది జూ అంటారు
మనుషులనిక్కడ జంతువులకి చూపిస్తూ ఉంటారు

బొమ్మల కొలువల్లె నిలబెట్టారే ఈళ్ళెవరు?
గతకాలంలోని మన ఘనతను చాటెవాళ్ళు
మన ఎన్.టి.ఆరే వీళ్ళను పిలిపించారు

బద్రం బాబయ్యో! అసలే పెద్దోళ్ళు
జాగర్తండయో.. చెర్లో పడతారు
రంగుల రాట్నం. రంజుగ ఉందమ్మో
ఇందరున్నారు.. ఈ సందడి ఏందమ్మో..
మీ ఊళ్ళో జాతరలాంటిదె ఫ్రెండు
టవునోళ్ళ తిరనాళ్ళ ట్రెజర్ అయిలాండూ..
(దేవుడు చిత్రానికి శిర్పి సంగీత సారధ్యంలో బాలు, చిత్ర పాడినది)

***

## అమృతాంతరంగం

పేరు పెట్టడం వరకూ బాగానే వుంది కానీ ఇది మిసిలీనియస్ కేటగిరి అనుకోవచ్చు. ఎందుకంటే ఈ పైన ఉన్న ఎనిమిది తరంగాలకు ఉన్నటువంటి నిర్దిష్టమైన షేపూ, అంచులు దీనికి లేవు. మనుషుల మధ్య ఉన్నటువంటి అనేక రకమైన బాంధవ్యాలూ, చుట్టరికాలూ, మమతలూ, తల్లికొడుకుల అనుబంధం, తండ్రీ కొడుకుల అనుబంధం, అన్నాచెల్లెళ్ళ మధ్య ప్రేమ ఇలా ఏదైతే రెండు శరీరాల కలియక అని పరిధిని దాటి విస్తరించిన మమత, ప్రేమ, అనురాగం, సరాగం – ఏవిధమైన ఎమోషన్ ఉన్నా అన్నీ ఈ అమృతాంతరంగంలో చేర్చడం జరిగింది.
"ఎవరూ రాయగలరు అమ్మ అను మాట కన్న కమ్మని పాట" అన్న పాటలో అమ్మ మమకారం గురించి రాశాను. అలాగే వివిధ బాంధవ్యాల మీద నాలుగైదు పాటలు ఇందులో చేర్చాను.
ఈ విభాగంలో చేరిన చిలుకా ఏతోడు లేకా అనే పాటకి నాకు 1994 సంవత్సరపు నంది అవార్డు లభించింది. ఇది శుభలగ్నం చిత్రంలోనిది. అది నా అయిదో నంది. ఇలాగే శాంతరస ప్రధానంగా, కరుణరస ప్రధానంగా ఉన్న పాటలనికూడా ఈ విభాగంలో చేర్చడం జరిగింది.

ఎవరు రాయగలరూ.. అమ్మ అన్న మాటకన్నా కమ్మని కావ్యం
ఎవరు పాడగలరూ.. అమ్మ అనురాగం కన్న తియ్యని రాగం
అమ్మేగా.. అమ్మేగా తొలిపలుకు నేర్చుకున్న భాషకి
అమ్మేగా ఆదిస్వరం ప్రాణమనే పాటకి

అవతారమూర్తి అయినా అణువంతే పడుతాడు
అమ్మపేగు పంచుకునే అంతవాడు అవుతాడు
అమ్మేగా చిరునామా ఎంతటి ఘనచరితకి
అమ్మేగా కనగలదు అంత గొప్ప అమ్మని

శ్రీరామ రక్ష! అంటూ నీరు పోసి పెంచింది
దీర్ఘాయురస్తు! అంటూ నిత్యం దీవించింది
నూరేళ్ళు ఎదిగే బ్రతుకు అమ్మ చేతి నీళ్ళతో
నడక నేర్చుకుంది బ్రతుకు అమ్మ చేతి వేళ్ళతో

(అమ్మ రాజీనామా చిత్రానికి చక్రవర్తి సంగీత సారధ్యంలో చిత్ర పాడింది)

★★★

నోరార పిలిచినా పలకనివాడినా
మనసున మమతలున్న మనిషిని కానా
నేలమీద మనలాగె ప్రాణులెన్ని ఉన్నా
పిలిచేందుకు పలికేందుకు
చుట్టరికాలతోచుట్టుకునేందుకు
ఎన్నెన్నో అందమైన వరసలు మనవేలే కన్నా

ఎవ్వరికి ఏమీ కాని ఏకాకినై ఉన్నా
నా పేరు ఇన్నాళ్ళు ఒంటరి సున్నా
అంకుల్ అంటు నాకు దగ్గరైంది
లేత అంకెలాంటి చిన్ని బంధం
అల్లుడంటు నన్ను అల్లుకుంది
పూల సంకెలంటి అనుబంధం
బావనయ్యాను, మరిదినయ్యాను – మావయ్యనయ్యాను, మనవణ్ణి అయ్యాను
ఎంత మంది చెంతకొచ్చారో ఎన్ని పేర్ల కొత్త జన్మనిచ్చారో
తీరిపోని ఋణమందుకున్న ఇంతకన్న ధనముండదన్నా
మునుపెరుగని అనుభవమని మైమరుపున ఉన్నా

పదుగురు పంచుకోని ఆనందమేదైనా
పచ్చికైన పెంచలేని ఎడారివాన
ఆడమగ జంట ఆలుమగలుగ మారి
అంతే చాలు అని అంటారా
అమ్మానాన్నలుగ, అత్తామామలుగ
పేరుపొందాలనుకోరా
తాతయ్యనవ్వాలి మీసాలు దువ్వాలి
అవ్వ నేనవ్వాలి గవ్వలా నవ్వాలి
అనే ఆశ తోడు ఉండగా
పైనపడే ఈడుకూడా పండగ
అయినవాళ్ళు ఉన్న లోగిళ్ళలో
ఆయువాగిపోదు నూరేళ్ళతో
తరతరముల తరగని కథ
చెబుతుందిరా చిన్నా

(అల్లుడుగారు వచ్చారు చిత్రంలో కీరవాణి సంగీత సారథ్యంలో ఎస్.పి.బాలు పాడినది)




దాదాపు 13 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

**28**

చిన్ని తండ్రీ. నిను చూడగా వేయి కళ్ళైన సరిపోవురా
అన్ని కళ్ళు చూస్తుండగా నీకు దిష్టెంత తగిలేను రా
అందుకే అమ్మ ఒడిలోనే దాగుండిపోరా

ఏ చోట నిమిషం కూడా ఉండలేదు
చిన్నారి సిసింద్రిలా చిందు చూడు
పిలిచినా పలకడు వెతికినా దొరకడు
మా మధ్య వెలిసాడు ఆ జాబిలి
ముంగిట్లో నిలిపాడు దీపావళి
నిలిచుండాలి కలకాలము ఈ సంబరాలు

ఆ మువ్వగోపాలుడిలా తిరుగుతుంటే
ఆ నవ్వే పిల్లంగ్రోవై మోగుతుంటే
మనసులో నందనం విరియగా ప్రతి క్షణం
మా కంటి వెలుగులే హరివిల్లుగా
మా ఇంటి గడపలే రేపల్లెగా
మా ఈ చిన్ని రాజ్యానికి యువరాజు వీడు

చందమామా చూశావటోయ్ అచ్చం నీలాంటి మా బాబుని
నేల అద్దాన నీ బింబమై పారాడుతుంటే

(సిసింద్రీ చిత్రంలో రాజ్ సంగీత సారధ్యంలో స్వర్ణలత పాడినది)

★★★

రాముడు మంచి బాలుడు అని అంతా అంటారు
నన్నుజూసి అంతా అంటారు
క్షేమమేనా అబ్బీ అంటే నా వాళ్ళవుతారు
పాదమాగిన చోటే సొంతూరు
ఆదరించిన వాళ్ళే అయినోళ్ళు
కాదు పోరా అంటే రారా అంటది రేపింకో ఊరు

గాలి లాలిపాడే నేలతల్లి ఒళ్ళో – ఆదమరచి నేను నిద్దరోతాను
వెన్నుతట్టి లేపే పిట్టపాట వింటూ – మేలుకొని నేను సూర్యుడౌతాను
అష్టదిక్కుల మధ్యన నేను దిక్కులేనివాడినికాను

చుట్టుపక్కల ఉండేవాళ్ళే చుట్టపక్కాలనుకుంటాను
గడ్డిపువ్వులు కూడా నాకు నవ్వులెన్నో నేర్పించాయి
గుడ్డి గవ్వలు కూడా నాకు ఆడుకొందుకు పనికొచ్చాయి
దుఃఖమంటే మాత్రం అర్ధం నాకు చెప్పలేదు ఎవరూ..

ఆయి! ఆయి! అంటూ ఊయలుపుతాను చిన్నితల్లి నీకు అమ్మనౌతాను
అమ్మలాగ నాకు అన్నంపెట్టు చాలు ఆయువున్నదాక అమ్మాడౌతాను

నువు వరస కలుపుకుంటే నీ కొడుకునవకపోను
నాకు చేతనైన సేవ నీకు చేయలేకపోను
మన సొంతం అంటూ వేరే ఏ బంధం లేదంటారు
మనమంతా మానవులమే ఆ బంధం చాలంటారు
అనుకోడంలోనే అంతా ఉందని పెద్దలు అంటారు

(తారకరాముడు చిత్రానికి కోటి సంగీత సారధ్యంలో బాలు పాడినది)

★★★

సీతాకోక చిలకాలమ్మా లేలేత చిగురాకులమ్మా!
పారాడు పాపాయిలమ్మా పొంగి పారేటి సెలయేరులమ్మా!
పొత్తిళ్ళల్లో చిట్టి పుత్తడిబొమ్మను పొదుపుకున్న ముద్దుగుమ్మ అమ్మ..
పొందేటి ఆనందమేదో తెలియాలంటె
ఎత్తాలి తను ఆడజన్మ – బ్రహ్మ...

కుహూ కుహూ కూసే కోయిలా – ఏదీ పలకవే ఈ చిన్నారిలా
మిల మిలా మెరిసే వెన్నెలా – ఏదీ నవ్వనే ఈ బుజ్జాయిలా
అందాల పూదోటకన్నా చిందాడు పసివాడె మిన్న
బుడత అడుగులే నడిచేటి వేళలో
పుడమి తల్లి కెన్ని పులకలో

గలగలా వీచే గాలిలా సాగే పసితనం తీయని ఒక వరం
ఎదిగిన ఎదలో ఎప్పుడూ నిధిలా దాచుకో ఈ చిరుజ్ఞాపకం
చిరునవ్వుతో చెయ్యి నేస్తం – చీమంత అయిపోదా కష్టం
పరుగు ఆపునా పడిపోయి లేచినా
అలుపు సొలుపు లేని ఏ అలా

(సొగసు చూడతరమా చిత్రంలో రమణీ భరద్వాజ్ సంగీత సారధ్యంలో అనురాధా శ్రీరామ్ పాడినది)

★★★★

లాలిజో లాలిజో ఊరుకో పాపాయీ
పారిపోనీకుండా పట్టుకో నా చేయి
తెలుసా ఈ ఊసు – చెబుతా తల ఊపు
కాపురం చేస్తున్న పావురం ఒకటుంది
ఆలినే కాదంది కాకితో కూడింది

అంతలో ఏవైంది అడగవే పాపాయి
పారిపోనీకుండా పట్టుకో నా చేయి

మాయనే నమ్మింది బోయతో పోయింది
దెయ్యమే పూనిందో రాయిలా మారింది
వెళ్ళే పెడదారిలో ముళ్ళే పొడిచాకనే
తప్పిదం తెలిసింది – ముప్పునే చూసింది
కన్నులే విప్పింది – గండమే తప్పింది
ఇంట్లో చోటుందా చెప్పవే పాపాయి
పారిపోనీకుండా పట్టుకో నా చేయి

పిల్లలూ ఇల్లాలూ ఎంతగా ఏడ్చారో
గుండెలో ఇన్నాళ్ళూ కొండలే మోశారో
నేరం నాదైనా భారం మీపైనా
తండ్రినే నేనైనా దండమే పెడుతున్నా
తల్లిలా మన్నించు – మెల్లగా దండించు
కాళిలా మారమ్మా – కాలితో తన్నమ్మా
బుద్ధిలో లోపాలూ దిద్దుకోనీవమ్మా

(ఇంద్రుడు చంద్రుడు చిత్రానికి ఇళయరాజా సంగీత సారధ్యంలో బాలు పాడినది)

★★★

(కొనసాగింపు వచ్చేసంచికలో)










దాదాపు 13 సంవత్సరాల క్రిందట విడుదలైన సిరివెన్నెల సీతారామ శాస్త్రిగారి 'సిరివెన్నెల తరంగాలు' పుస్తకం మార్కెట్లో లభ్యం కానందున, అశేష అభిమానుల కోరిక మీద ఆ పుస్తకాన్ని సీరియల్ గా ప్రచురించడం జరుగుతోంది. ఇందుకు ప్రత్యేక అనుమతి నిచ్చిన 'కౌముది'కి ఆత్మీయ మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రిగారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

**29**

నేలమ్మా.. నింగమ్మా
నీరమ్మా.. నిప్పమ్మా
గాలమ్మా.. కనరమ్మా సంబరం..
మీ అందరి అందాలు
ఒక్కటయిన సుందరిలో
చూడరండి సోయగాల సంగమం.. సంగమం.. ||నేల||

అవని అందము కుదురు లేనిది
ఏడాది కొక్కటే వసంతమన్నది
ఋతువు మారినా చెదిరిపోనిది
అమ్మాయి మేనిలో అందాల పెన్నిధి
తుళ్ళకే అలా గంగవెల్లువా!
సొగసు పొంగులో ఈమె సాటివా?
వయ్యారి వంపులు నీ వంటికున్నవా? ||నేల||

కలికి కళ్ళలో కలల మెరుపుతో
నువ్వు తెల్లబోదువే నీలాల గగనమా
చిలక సొంపులో అంత మైకమా?
చిరుగాలీ నువ్వలా స్థంభించిపోకుమా!
చెలియతనువులో ఉడుకు తాకితే
చలికి వణకవా సూర్యబింబమా!
ఆ మంచు మంటతో జాబిలిగ మారవా ||నేల||
(ఆడదే ఆధారం చిత్రానికి శంకర్ గణేష్ సంగీత సారథ్యంలో బాలు పాడినది)

------------------------------

నేలమ్మా.. నింగమ్మా
నీరమ్మా.. నిప్పమ్మా
గాలమ్మా.. ఎవరమ్మా కారణం..

మీరంతా సాక్షులుగా
ఒక్కటయిన దాంపత్యం భగ్గుమంది – ఎవరు దీనికి కారణం ||నేల||

పూటపూటకి అగ్ని పరీక్షా
ముగించు ఇకనైనా ఓ నిప్పమ్మా!

ఇన్ని నాళ్ళ తరుణి ఓర్పుని
ఒళ్ళోన సేద తీర్చు ఓ నేలమ్మా!
గంగవెల్లువా! కౌగిలించుకో
పొంగుతున్న ఈ కన్నీరు తీసుకో
ఇల్లాళ్ళ ఘోషవై ఇల్లిల్లు ముంచిపో

చోటు ఉన్నదా ఆకాశమా
ఈ గుండె శూన్యమంత నింపడానికి
శ్వాస తీసుకో చిరుగాలమ్మా
తుఫాను గాలిగ చెలరేగడానికి
అబలవై ఇలా అణిగి ఉండక
ఆదిశక్తివై అవతరించంగా
ఇంకెన్ని ఉసురులు కావాలి చెప్పమ్మా? ||నేల||

(ఆడదె ఆధారం చిత్రానికి శంకర్ గణేష్ సంగీత సారధ్యంలో వాణీ జయరాం పాడినది)

-------------
ఊరుకో ఊరుకో బంగారు కొండా!
నల్లకలువ కళ్ళు ఎర్రబారనీకుండా
దాయి! దాయి! దాయి! దమ్మనీ
చేయి జారిపోయిన జాబిల్లినీ
తేలేని తల్లినీ ఏడిపించకుండా!

ఇంకిపోని గంగలా కంటి నీరు పొంగినా చల్లబడకుందే ఎడారి
ఎదలో జ్ఞాపకాల జ్వాలలో రేపులన్ని కాలినా మొండి ఊపిరింకా మిగిలుంది

చల్లనీ నీ కళ్ళలో కమ్మని కల నేను
చెమ్మగిల్లనీకుమా కరిగిపోతాను ||దాయి||

గుక్కపట్టి ఏడ్చినా ఉగ్గు పట్టవేమని
తప్పు పట్టి తిట్టే వారేరీ తండ్రీ!
అమ్మ వట్టి మొద్దురా జట్టు ఉండద్దురా
అంటు ఊరడించే నాన్నేరీ?

చెప్పరా ఆ గుండెలో చప్పుడే నేనని
జన్మలెన్ని దాటైనా చేరుకుంటానని!
(ఆత్మబంధం చిత్రానికి కీరవాణి సంగీత సారధ్యంలో బాలు, చిత్ర పాడినది)
-------------------

చిన్నా! చిరు చిరు నవ్వుల చిన్నా!
కన్నా! చిట్టిపొట్టి చిందుల కన్నా
నీ ప్రేమపోత పోసి కన్నానురా!
నిను శ్రీరామరక్షలాగ కాపాడగా
నీలో ఉన్నా.. నీతో ఉన్నా... ॥ చిన్నా॥

అటు చూడు అందాల రామచిలకని
చూస్తోంది నిన్నేదొ అడుగుదామని – నీ పలుకు తనకు నేర్పవా అని
ఇటు చూడు చిన్నారి లేడిపిల్లని
పడుతోంది లేస్తోంది ఎందుకో మరి – నీలాగ పరుగు చూపుదామని
కరిగిపోని నా తీపికలలని
తిరిగిరాని నా చిన్నతనముని – నీ రూపములో చూస్తూ ఉన్నా.. ॥ చిన్నా॥

తూనీగ నీలాగ ఎగరలేదురా
ఆ తువ్వాయి నీలాగ గెంతలేదురా – ఈ పరుగులింక ఎంతసేపురా
నీ ఆట ఈ పూట ఇంక చాలురా
నా గారాల మారాజ కాస్త ఆగరా – నీ వెంట నేను సాగలేనురా
ఎంత వెతికినా దొరకనంతగా
ఎంత పిలిచినా పలకనంతగా – వెళ్ళిపోకమ్మా రారా కన్నా.. ॥
(ప్రియరాగాలు చిత్రానికి కీరవాణి సంగీత సారధ్యంలో చిత్ర పాడినది)
-------------------------

చిలకా! ఏ తోడు లేక ఎటేపమ్మా ఒంటరి నడక
తెలిసి అడుగేసినావే ఎడారంటి ఆశల వెనక
మంగళ సూత్రం అంగడి సరుకా కొనగలవా చెయిజారాక
లాభం ఎంతొచ్చిందమ్మా సౌభాగ్యం అమ్మేశాక ||చిలకా||

బతుకంతా బలి చేసే పేరాశను ప్రేమించావే
వెలుగుల్నే వెలివేసే కలలోనే జీవించావే
అమృతమే చెల్లించి ఆ విలువతో
హలాహలం కొన్నావే అతితెలివితో
కురిసే ఈ కాసుల జడిలో తడిసి నిరుపేదైనావే ||చిలకా||

అనురాగం కొనగలిగే ధనముందా ఈ లోకంలో
మమకారం విలువెంతో మరిచావా సిరిమైకంలో
ఆనందం కొనలేని ధనరాశితో

అనాథగా మిగిలావే అమవాసలో
తీరా నువు కనుతెరిచాక తీరం కనపడదే ఇంక ||చిలకా||

(శుభలగ్నం చిత్రానికి యస్వీ కృష్ణారెడ్డి సంగీత సారథ్యంలో బాలు పాడినది)

★★★

(సమాప్తం)









**23 Comments** Sort by **Newest**

Add a comment...



**Santhosh Sharma Choppalli**

సిరివెన్నెల రాత్రిలా ఉంటుంది సీతారామశాస్త్రి గారి సాహిత్యం.ప్రతి పాటలోను మాటలు కాదు మీ మనసును నింపుతారు గురువుగారూ. పాట మీ మనసులో ప్రాణం పోసుకుని కలం నుండి పురుడు పోసుకుని మా మనసు పొరల్లో కొలువై ఉంటుంది.వాక్యం రసాత్మకం కావ్యం అన్నది మీ పాటల్లో అక్షర సత్యం.మీ సంతోష్ .......

Like · Reply · 1 · 3y



**Ramesh Punna**

siri veneela garu super ga undi


Like · Reply · 1 · 3y



**Sravan Thotakuri**

పైన పడే ఈడు కూడ పండుగ.. దండుగ అని అచ్చు వేసారు..

Like · Reply · 1 · 3y



**Subhash Mantha**

Puli laage pelliki kooda letters rendera
paruvaledani pakkaki velithe palaaramayiporaa
idi aminu saddam husseinu dictarlatra
anthati dictatorlatra ...
This charanam was missing from th epublication

Like · Reply · 1 · 4y



**Sitarama Rao Kodali**

sirivennela patala samdramlo marikonni mutyaalu dorikayi eenela.

Like · Reply · 4y



**Sitarama Rao Kodali**

PAATALA NEPADHYAM KOODAA VIVARISTUMTE BAAGUMTUMDI.

Like · Reply · 1 · 4y

**Sai Sandilya**

sirivennala garu mee burra ki shata koti dandalu.. mee talent oka 1% ayyina naku next [illegible]
aasa. hatsoff living legend